శ్రీ

# సాలంకార కృష్ణదేవరాయులు



సహస్రావధాని

## జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి

విరచితము

శ్రీ

# సాలంకార కృష్ణదేవరాయలు



పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం వారి
ఆర్థిక సహాయంతో ముద్రితము


సహస్రావధాని

**జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి**

విరచితము

శ్రీ

# సాలంకార కృష్ణదేవరాయులు

తొలి ముద్రణ : 1962

పునర్ముద్రణ : 2009

ప్రతులు : 200

వెల : రూ.150/-

డి.టి.పి. & ప్రింటింగ్ :

**ఈజీ లైన్ క్రియేషన్స్**

కె.బి. కాంప్లెక్స్, ఓ.యు. రోడ్,
విద్యానగర్, హైదరాబాద్-44.
సెల్ : 9133 498 429

ప్రతులకు :

**జంధ్యాల కుసుమ కుమారి**

ప్లాట్ నెం.102, కుసుమప్రియ మ్యాన్షన్,
ఇ.నెం. 2-1-275, నల్లకుంట,
హైదరాబాద్ - 500 044.
సెల్ : 7382006600

**డా॥ హరి శివకుమార్**
**విశ్రాంత ఆచార్యులు**
కాకతీయ విశ్వవిద్యాలయము
వరంగల్.

8-4-24
శ్రీ విహార్
శ్రీకృష్ణ కాలని,
వరంగల్ - 506 002.

# సాలంకార కృష్ణదేవరాయులు

## కైమోడ్పు

"శ్రీమదుభయ భాషా కవితా ప్రవీణ, సహస్రావధాన చతురానన, సహస్రావధాన పంచానన, పంచ సహస్రావధాని ఇత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ పయఃపారావార రాకాసుధాకర" శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి పెద్దనాన్న గారు వ్రాసిన ప్రౌఢ ప్రబంధం ఇది. ఇందు 6 ఆశ్వాసములలో సాహితీ సమరాంగణ చక్రవర్తి, ఆంధ్ర సాహిత్య క్షేత్రమున ప్రబంధ వాఙ్మయమనే బంగారు పంట పండించిన శ్రీకృష్ణదేవరాయల జీవితము సాహిత్య శిల్పకళాసేవ అభివర్ణింపబడినది. ఆనాడే కాదు, ఈనాడు కూడా అలాంటి ప్రతిభావంతులైన కవులకు ఆంధ్రదేశంలో కరువులేదనటానికి నిలువెత్తు నిదర్శనము శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. అలాంటి విద్వత్కవులైన మా పెద్దనాన్న గారి ప్రౌఢవాక్యావానికి ముందుమాట వ్రాయమని మా చెల్లెలు చి॥ల॥సౌ॥ కుసుమకుమారి అడిగితే, ఆమె కోరిక కాదనలేక ఈ సాహసానికి ఒడిగట్టాను కాని, దానికి తగిన అర్హత కలవాడనని కాదు. ఇది ఒక పెద్ద సాహసమని నాకు తెలుసు. ఈ సందర్భంలో కాళిదాస మహాకవి తన రఘువంశ మహాకావ్య ప్రారంభంలో చెప్పుకొన్న –

> "క్వ సూర్య ప్రభవో వంశః, క్వ చాలవిషయా మతిః ।
> తితీర్షు ర్దుస్తరం మోహాత్, ఉడుపేనాస్మి సాగరమ్" ॥

అన్న శ్లోకం జ్ఞాపకం వచ్చి భయపడిపోతున్నాను. ఈ నా సాహసం కూడా అల్పజ్ఞానమనే చిన్న నాటుపడవలో శాస్త్రిగారి కవితా సముద్రాన్ని దాటడానికి ప్రయత్నించడం వంటిదే అని నాకు తెలుసు. బహుశ – అందుకేనేమో 1962లో దీనిని మొదటిసారి ముద్రించినపుడు, ఎవరి 'ముందుమాట'లు లేకుండా ప్రచురించబడింది. అందుకే 'కైమోడ్పు' అనే పేరుతో వారికి నమస్కారపూర్వకంగా ఈ నాలుగు మాటలు వ్రాస్తున్నాను.

ఈ కావ్యానికి **'సాలంకార కృష్ణదేవరాయలు'** అనే పేరు పెట్టడానికి ఇది వివిధ అలంకారముల లక్షణములకు లక్ష్యగ్రంథంగా వ్రాయబడిన గ్రంథం కావటమే ! ఈ కావ్యంలోని 878 పద్యాలలో ఏయే పద్యాలలో ఏయే అలంకారములు నిక్షిప్తమై ఉన్నాయో శ్రీ శాస్త్రిగారే గ్రంథాంతమున ఉన్న "అలంకార సూచిక"లో చెప్పారు. ఇక్కడ శాస్త్రిగారి వైదుష్యాన్ని గురించి ఒకమాట చెప్పాలి. ఆయన పాండిత్యం – "పుస్తకేషుచ యా విద్యా, కోశేషుచయద్ధనం" – వంటిది కాదు. మనకు ఉపయోగపడకుండా వడ్డీ వచ్చి పెరుగుతుంది కదా అన్న ఆశతో బ్యాంకులో దాచిపెట్టిన ధనం ఎలాంటిదో, మనకు ఒంటపట్టకుండా పుస్తకాల వరకే పరిమితమైన విద్య కూడా అలాంటిదే! కానీ, శాస్త్రిగారి పాండిత్యం అలాంటిది కాదు కదా! వారికి – పాణినీయము, ధ్వన్యాలోకము, రసగంగాధరము, అప్పకవీయము, సర్వలక్షణ సార సంగ్రహము, చంద్రాలోకము – వంటి లక్షణ గ్రంథములు కంఠస్థములు. అంతటి ధారణాశక్తికి తోడైనది వారి కవితాశక్తి. వారు 'ఘంటాశత గ్రంథకలన దక్షులు'. తమ ఆశుకవితాధారతో ఉపన్యాసాలను అలవోకగా చెప్పగల ప్రతిభాశాలి. అలాంటి పాండిత్యంతోనే విద్వద్గద్వాల వంటి అనేక సంస్థానాలలో పరీక్షాధికారి వంటి మహోన్నత సత్కారముల నందినవారు. అందువలన ఈ కావ్యంలో వారి కవితాశక్తి – అలంకార పాండిత్యము – రెండూ అనూహ్యంగా కలిసిపోయినాయి. కావ్యం చదువుతూ ఉంటే గంగా ప్రవాహం లాంటి కవితాధార ఇతివృత్తాన్ని కుంటుపడనీయకుండా నడిపిస్తూ ఉంటుంది. నిశితంగా పరిశీలిస్తే, కథాగమనంలో మనకు తెలియకుండా ఇన్ని అలంకారములు ఇందులో ఉన్నాయా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ఆ విధంగా ఈ కావ్యాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన మా పెద్దనాన్న గారి ప్రతిభ అసాధారణము. సామాన్యంగా అలంకార శాస్త్రగ్రంథాలలో కథ ఉండదు; అట్లాగే – కథా ప్రవాహంలో అలంకారాలు అక్కడక్కడ కన్పిస్తాయి కాని, ఇంత ఎక్కువగా కన్పించవు. ఈ రెండింటి అద్భుత సమ్మేళనమే ఈ 'సాలంకార కృష్ణదేవరాయలు'.

అలంకారాలు కావ్యసౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాయి. "అలంక్రియతే అనేన ఇత్యలంకారః" – అని వ్యుత్పత్తి. శరీరం మీద ధరించిన అలంకారములు శరీర సౌందర్యాన్ని ఇనుమడింపజేసినట్లుగా, కావ్య సౌందర్యాన్ని అలంకారాలు ద్విగుణీకరిస్తాయి. అలంకారాలను విశ్లేషించటంలో మన అలంకారికులలో భిన్నాభిప్రాయాలు గోచరిస్తాయి. దీనివలన తొలుత

పదుల సంఖ్యలో ఉండినవి క్రమక్రమంగా పెరిగి చివరకు 'సెంచరీ'ని దాటిపోయాయి. అట్లా చూచినపుడు ప్రతిదీ అలంకారంగానే కనిపిస్తుంది. ఆమె రంభలాగా చాలా అందమైనది – అంటే పూర్ణోపమ; ఆమె రంభలాగా ఉన్నది – అంటే అది లుప్తోపమ. ఆమె రంభయే – అంటే రూపకము. ఆమెను చూస్తూ వుంటే రంభే భూమికి దిగివచ్చినదా అనిపిస్తుంది – అంటే ఉత్ప్రేక్ష. ఆమె సుశీలేనా? లేక రంభా – అంటే సందేహము; ఆమెను చూస్తూ ఉంటే రంభ జ్ఞాపకం వస్తున్నది – అంటే స్మరణం. అందంలో ఆమెకు ఆమెయే సాటి – అంటే అనన్వయము – ఇట్లా చెప్పుకుంటూ పోతే ప్రతిపద్యము ఏదో ఒక అలంకారమే అవుతుంది. ఉన్నది ఉన్నట్లు చెబితే స్వభావోక్తి అవుతుందంటారు. కాని అట్లాకాదు. ఎందుకంటే – "పైరు పచ్చగ నుండు పాలు తెల్లగ నుండు, ఆవునకును రెండు కొమ్ములుండు" – అంటే స్వభావోక్తి కాదు. అసలది కవిత్వమే కాదు. కవిత్వమన్నాక అందులో కొంత వక్రోక్తి, చమత్కారము, రసము ఉండాలి. అవి లేకపోతే అది రసవంతము కాక, నీరసపడిపోతుంది. కనుక అలంకారములను సమయోచితంగా కూర్చుతూ, రసవత్తరంగా ఇతివృత్తాన్ని నడపటం సామాన్యులు చేయలేని పని. అది సత్కవులు మాత్రమే చేయగల పని. అన్నింటిని కూర్చి నిర్మించిన ఈ కావ్యము శ్రీ శాస్త్రిగారి ప్రతిభకు చక్కని నిదర్శనం. ఈ కావ్యంలో దాదాపు 170 అలంకారాలు పొందుపరచబడినట్లు 'అలంకార సూచిక'లో కనిపిస్తుంది. తెలుగులో ఇలాంటి కావ్యాలు అరుదు. విద్యానాథ మహాకవి వ్రాసిన 'ప్రతాప రుద్రీయము' అలాంటిదే. అయినా అది సంస్కృతంలో ఉన్నది. కనుక తెలుగులో ఇలాంటి గ్రంథం వ్రాయటం ఒక గొప్ప ప్రయోగమే అనవచ్చును.

6 ఆశ్వాసాలతో, 878 పద్యాలతో కూర్పబడిన ఈ కావ్యము డా॥ అడుసుమిల్లి నారాయణరావు గారికి అంకితమియ్యబడింది. నారాయణరావు గారు వృత్తిరీత్యా వైద్యులు. ప్రవృత్తి సాహిత్యాభిలాష. ఆయన సాహిత్యాభిమాని మాత్రమే కాదు; స్వయంగా కవి. ఆయన రాజవాహన విజయము, రుద్రమదేవి చరితము, విజయనాటకము, పెనుమత్స యోగిని మహిమ, (నారాయణరావు) స్వీయ చరిత్ర – వంటి బహుగ్రంథ రచయిత. అటు శారీరక రుగ్మతలను పోగొట్టగల వైద్య శిఖామణియే గాక, ఇటు మానసిక రుగ్మతలను పోగొట్టగల సరస కావ్యములను రచింపగల కవిశిఖామణి. పోకూరి కాశీపతి గారు, పూతల పట్టు శ్రీరాములు గారు, షేక్ దావూద్ కవి వంటి కవులను సత్కరించిన ఉదార

హృదయులు. అదే విధంగా – బ్రహ్మీభూదత్తవరప్రసాదులు, గద్వాల – కొల్లాపురము – దైవము దిన్నె – గోపాలపేట వంటి సంస్థానములలోను, ఆంధ్రనలందా పీఠములోను పెక్కు అవధానములను చేసి కీర్తిగడించిన శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని ఆహ్వానించి, (60 సం॥ల క్రితమే) 1600 రూపాయలతో ఘనంగా సత్కరించారు. శ్రీ శాస్త్రిగారి 'శతావధాన' గ్రంథమును ముద్రించినది కూడా నారాయణరావు గారే! ఆ అభిమానంతోనే ఈ గ్రంథం నారాయణరావు గారికి అంకితం చేశారు శాస్త్రిగారు. ఇక్కడ మరొక విశేషమేమిటంటే – సాధారణంగా శిష్యులు తమ గ్రంథాలను గురువులకు అంకితం చేస్తారు. కాని ఇక్కడ శిష్యప్రాయులైన నారాయణరావు గారికి అంకిత చేయటం శాస్త్రిగారి వాత్సల్యానికి, అభిమానానికి నిదర్శనము !

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము ఈ మూడును పుష్కలంగా ఉన్న కవులే కవులనీ, ఇవి లేని కవిబ్రువులు 'కపు'లనీ లాక్షణికుల అభిప్రాయము. 'సాలంకార కృష్ణదేవరాయలు' వంటి చక్కని రసవత్ప్రౌఢ ప్రబంధమును వ్రాయటంలోనే వారి ప్రతిభ ప్రసన్నమవుతున్నది. ఇక ఆయనలోని వ్యుత్పత్తి ఇందులో ప్రతి పద్యంలోనూ కనిపిస్తుంది. ఆశుకవితా ధురీణులైన శాస్త్రిగారు ఆంధ్ర సాహిత్యములోని ప్రసిద్ధ కవుల రచనలలోని చక్కని ఎత్తుగడలను, పోకడలను సంపూర్ణంగా గ్రహించినవారు.

అందువలననే వారి పద్యాలు మహాప్రవాహంలాగా ధారాశుద్ధిఇతో శోభిల్లటమే కాక, ప్రాచీనాంధ్ర కవులలోని చక్కని భావనలకు అనుకరణాల వంటి పద్యాలతో ఆనందమును కూరుస్తాయి –

"క్షీరములేని గోవు, తినిసేద్యము చేయని యుక్షరాజు..." (864),
"భీముడు పైరులందు, రిపువీరుల పాలిట నుగ్రుడున్..." (676),

వంటి ధారాశుద్ధితో శోభిల్లే పద్యరచన ఈ గ్రంథంలో ఎక్కడపడితే అక్కడే గోచరిస్తుంది.

తెలుగు పద్యాలలో సీసపద్యానికి ఒక విశిష్టతను కూర్చారు ఆంధ్రకవులు. శ్రీనాథాది కావ్యకవులు, ప్రబంధ కవులు సీస పద్యాన్ని తూగుటుయ్యాలలాగా ఊగించారు. శాస్త్రిగారి రచనలో కూడా –

"దవ్వు దవ్వుల దుర్గధామాల విభులతో

సయ్యాటలాడిన సరసురాలు...” (596),

“మనుచరిత్రము వ్రాసి మాన్యత నెలకొల్పె

నలసాని పెద్దనాహ్వయుండు....” (842) –

వంటి సీస పద్యాలు కోకొల్లలు.

భావుకత: “పక్షపాతంబు ధర్మంబు వంకఁ దిరిగె

కుటిల గతి చేరె నంగనాకుంతలముల

చలన మది హరిణేక్షణాక్షముల జేరె

గృష్ణదేవరాయలు భూతలమ్మేలు వేళ” (399) –

శ్రీ కృష్ణదేవరాయల పాలనాకాలంలో – పక్షపాత బుద్ధి ధర్మం పట్లనే కాని ఇతరుల పట్లకాదని, కుటిలత్వము స్త్రీల ముంగురులలోనే కాని మనుష్యులలో లేదని, చంచలత్వము జింకల చూపులలోనే కాని మానవ స్వభావములలో కన్పించదని అభివర్ణించే పద్యాలు శాస్త్రిగారి భావుకతకు నిదర్శనాలేకాక, బాణుని కాదంబరీ శైలిని తలపిస్తాయి. అట్లాగే –

“సరస ప్రసంగమా? సత్సభనేగాని

ప్రౌఢకాంతారాజి తోడగాదు....” (124)

అనే పద్యం కూడా బాణుని కాదంబరీ రచనకు అనుగుణమే! “నాగమాంతర్భణితాచ్ఛ ధర్మనియమానీకానుగామ్యాశయా!...” (656) – వంటి పద్యాలు శాస్త్రిగారి సమాసభూయిష్టమైన ప్రౌఢరచనకు చక్కని నిదర్శనాలు.

“చనుబాలీయక తల్లిజాగుసలుపన్....” (84) అన్న పద్యంలో కృష్ణరాయల ఏడుపు వీణమీద పంచమ స్వరంలో కాంభోజిరాగం వాయించినట్లు ఉన్నదని వర్ణించారు శాస్త్రిగారు. అది రామరాజ భూషణుని వసుచరిత్రలో గిరికాదేవి విరహ వర్ణనలో – “ఆ రాజీవానన యేడ్చెఁ, గిన్నరవధూరాజత్కరాంభోజ కాంభోజీ మేళ విపంచికారవ సుధాపూరంబు తోరంబుగాన్” (వసు. 4–52) అన్న పద్యమునకు అనుకరణమే!

“కృష్ణక్ష్మావర సైన్యబాహుబల మక్షీణంబుగా నిల్చె...” (305) వంటి పద్యాలు దుష్కరప్రాసతో కూడా నిరాఘాటంగా సాగిపోయినాయి.

కృష్ణరాయలు తిరుపతికి వెళ్ళి శ్రీ వేంకటేశ్వరస్వామిని 24-10-1651న దర్శించారట.

ఆ తేది -

> "అతడు పదియాఱవదగు శతాబ్దమందు
> నేబదియునొక్క వత్సరం బేగఁ బదవ
> నెలను నిర్వదినాల్గహంబులు గతింప
> తిరుపతికి బోయి వేంకటేశ్వరున కెఱగె-" (527)

అన్న పద్యంలో చక్కగా కూర్చారు శాస్త్రిగారు.

కృష్ణరాయలు రాయలసీమను రతనాల సీమగా మార్చిన తీరు - "క్షీరములేని గోవు, తిని సేద్యము సేయని యుక్షరాజు..." (864) అన్న పద్యములో చక్కగా వర్ణించారు.

ఇక శ్రీ శాస్త్రిగారి అభ్యాసమునకు - అంటే పద్యరచనా విధానానికి ఈ గ్రంథంలోని ప్రతిపద్యమూ నిదర్శనమే ! వారి ధారాశుద్ధి ఈ కావ్యంలో సర్వేసర్వత్ర గోచరిస్తుంది.

ఈ విధంగా - ప్రతిభావ్యుత్పత్తి అభ్యాసములు మూడును మూర్తీభవించిన విద్వత్కవులు మా పెద్దనాన్నగారు.

శ్రీ కృష్ణదేవరాయలు పట్టాభిషక్తుడై నేటికి సరిగ్గా 500 సంవత్సరాలు! ఆ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రదేశం రాయల పంచశతాబ్ధి మహోత్సవాలను ఈనాడు ఘనంగా జరుపుతున్నది. ఈ శుభసమయంలో ఈ 'సాలంకార కృష్ణదేవరాయలు' పునర్ముద్రణ భాగ్యాన్ని పొందటం ఎంతో సముచితంగా ఉన్నది. మా సోదరి చి॥ల॥సౌ॥ జంధ్యాల కుసుమకుమారి తన తండ్రిగారి గ్రంథాలను వెలుగులోకి తీసుకొని వస్తూ, పితృ ఋణము తీర్చుకొంటున్నందుకు పరమానందముగా ఉన్నది. ఆమెకు, బావగారు శ్రీ గుడిపాటి కోటేశ్వర శర్మగారికి వారి చిరంజీవులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ఇతోధికంగా ప్రసాదించాలని ఆ 'పరాశక్తి'ని ప్రార్థిస్తున్నాను.

**// శుభంభూయాత్ //**

వరంగల్ **హరి శివకుమార్**

**డా॥ హరి సనత్కుమార్**
**ప్రిన్సిపాల్ (రిటైర్డు)**
ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల
వరంగల్.

2-7-401
శ్రీనివాస్, ఎక్సైజ్ కాలనీ,
సుబేదారి, హన్మకొండ,
వరంగల్ - 506 001.

# సాలంకార కృష్ణదేవరాయలు

## ఆముఖము

సాలంకార కృష్ణదేవరాయలు ఒక చారిత్రక కావ్యము. కృతికర్త మా పెద్దనాయన గారు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. హరి వంశోద్భవులు. జంధ్యాల వారికి దత్తులు. మా వంశములకు కీర్తి తెచ్చిన పంచ సహస్ర అవధానులు.

ప్రపంచ సాహిత్యమున అవధాన ప్రక్రియ ఆంధ్ర సాహిత్యముననే కలదు. అట్టి ప్రపంచమున పంచ సహస్రావధాని మా పెద్దనాయన గారు మాత్రమే.

శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు. వారి జీవితమును, విజయములను చారిత్రక కావ్యముగ వ్రాసిన ఘనత శాస్త్రి గారిదే. తిమ్మన పారిజాతాపహరణమందలి అంశములు విస్తృతములై, అలంకార శోభితములై 'స అలంకార కృష్ణ దేవరాయల' కావ్యమైనది. సాహిత్య ప్రపంచమున లక్ష్య లక్షణ సమన్వయ అపురూప గ్రంథరాజము.

కథాంశము షష్ఠాశ్వాస సమన్వితమై ఒప్పినది. ప్రథమాశ్వాసము రాయల బాల్యము, విద్యాభ్యాసము, ప్రజాదరణలతో ఒప్పి, రాయల సవతి తల్లి నాగాంబ కారణముగా మృత్యు ముఖమును చూచి బయల్పడుట కథాంశము.

ద్వితీయాశ్వాసములో రాయలను తిమ్మరుసు రక్షించిన వైనము, రాయల యుద్ధములు, వ్యూహరచన, ఉమ్మత్తూరు, గండికోట, శివసముద్ర విజయములు, రాయల కీర్తి ప్రతిష్ఠలు ఆంధ్ర, కర్ణాటక దేశముల వ్యాప్తి ప్రస్తావించబడినవి.

తృతీశ్వాసమున 1509 నాటి రాయల పట్టాభిషేకము, ప్రజానురంజక పాలన, విరూపాక్షాలయ నిర్మాణము, రాజనీతి శాస్త్ర అధ్యయనము, శ్రీరంగపట్న, మళయాళ, చోళ రాజ్యవశము ప్రస్తావించబడినవి.

చతుర్థాశ్వాసము ఓఢ్ర విజయము, గజపతులతో యుద్ధము, కొండవీటి దుర్గాక్రమణ, రాయల తిరుమల దర్శనము, విజయస్తంభ స్థాపన, అహోబిల నరసింహ దర్శనము, కటక విజయము, గజపతుల కుమార్తె తుక్కాంబతో వివాహముతో ముగిసినది.

పంచమాశ్వాసము గోదావరి స్నానము, ముప్వురు భార్యలతో ప్రయాణము, తిరుపతి గోపురమునకు బంగారుపూత, స్వామికి నవరత్నాభరణాల కానుక, అక్కడినుండి రామేశ్వరము యాత్ర తర్వాత విజయనగరమును చేరుట, విజయనగరమున సుభిక్షమైన సుఖశాంతులతో పాలన.

షష్ఠాశ్వాసము సాహిత్య గోష్ఠులు, లలిత కళల పోషణ, భువన విజయము, ఆముక్తమాల్యద రచన, శిల్ప సంపద, వర్ణింపబడినవి. కావ్యాంతమున కాలగర్భములో కలిసిన వాటిని స్మరిస్తూ మిగిలిన వాటిని ప్రశంసిస్తూ కావ్యం ముగుస్తుంది.

ఆంధ్రదేశమున ఆంధ్రపాలకులను గూర్చి ఉద్భవించిన చారిత్రక కావ్యం సాలంకార కృష్ణదేవరాయలు. కృష్ణదేవరాయల పంచశతాబ్ది ఉత్సవాల సందర్భంగా మా సోదరి కుసుమకుమారి సకాలంలో స్పందించి ఈ ముద్రణకు పూనుకోవటం ప్రశంసనీయం.

**// శుభం భూయాత్ //**

వరంగల్ **హరి సనత్కుమార్**

# పునర్విలోకనం

**"తెలుగదేల యన్న దేశంబు తెలుగేను**
**తెలుగు వల్ల భుండ తెలుకొండ**
**యెల్ల నృపులు గొలువ నెఱుగవే బాసాడి**
**దేశ భాషలందు తెలుగులెస్స"**

అని తెలుగు భాషాభిమానాన్ని ఎలుగెత్తి చాటిన ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ చక్రవర్తియైన శ్రీ కృష్ణదేవరాయలు అజరామర యశస్సంపన్నుడు. సారస్వత పోషకాగ్రణియైన రాయలు, కవిపండిత లోకారాధ్యుడు. ఆయన పరిపాలించిన కాలం ఆంధ్ర సాహిత్య చరిత్రలో స్వర్ణయుగమై భాసిల్లింది. ఆయన తెలుగు భాషామతల్లిని అందలమెక్కించిన తీరు లోకవిదితం.

**శ్రీకృష్ణదేవరాయలపై గల గౌరవాభిమానాలతో మా పితృపాదులు పంచ సహస్రావధాని కీ॥శే॥ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు "సాలంకార కృష్ణదేవరాయలు" అనే ప్రబంధ రచన 1962లో చేశారు. ఆరు ఆశ్వాసాలలో 878 పద్యాలతో రాయల చరిత్రను కావ్యబద్ధం చేశారు.**

కీ॥శే॥ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు క్రీ॥శ॥ 1892వ సం॥లో అంటే నందననామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ విదియనాడు **(1-3-1892)** కృష్ణాజిల్లా కలువపాముల గ్రామంలో జన్మించారు. **"కలువపాముల"**ను **"కైరవాహి పురము"** అని శాస్త్రిగారు పేర్కొంటూ కొల్లాపుర అవధాన సభలో-

**"కృష్ణానదీ ప్రాంత కృష్ణ పురోపాంత**

**కైరవాహిపురము కాపురమ్ము"** అని చెప్పి ఉన్నారు. వీరి జననీ జనకులు సావిత్రమ్మ, హరి కామేశ్వర సోమయాజులుగారు, అన్నగారు లింగమూర్తిగారు కవి, తమ్ముడు రామలింగశాస్త్రి ప్రసిద్ధ శతావధాని, నలుగురు చెల్లెళ్లు. చిన్నతనంలోనే హరి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు - జంధ్యాల వారికి దత్తుడుగా వెళ్ళడం వలన వారానాటి నుండి జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారయ్యారు.

చిన్నప్పుడు అల్లారుముద్దుగా పెరగడం వల్ల 12వ ఏటి వరకు విద్యాభ్యాసం ప్రారంభించలేదు. 1904 సం॥లో విద్యారంభం చేశారు. శాస్త్రిగారు ప్రాథమిక విద్య స్వగ్రామంలో పూర్తిచేసి, ఉన్నత విద్యాభ్యాసానికి బందరు వెళ్ళి అక్కడ 1912లో స్కూలు ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. 1912-14ల మధ్య బందరు నోబుల్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. శాస్త్రిగారు సంస్కృత కావ్యాలు, బాలమనోరమలను శ్రీ గొల్లపూడి లక్ష్మణశాస్త్రి గారి వద్ద పఠించారు.

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం తాలూకా వద్ద పఱ్ఱు గ్రామం (పాలకొల్లు సమీపంలోనిది)లోని శ్రీ దువ్వూరి నాగేశ్వరశాస్త్రి గారి వద్ద వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారి వద్ద నుంచి అవధానాలు చేయడంలో మెలకువలు, రహస్యాలు గ్రహించారు. అంతేకాకుండా **'లఘు సిద్ధాంతకౌముది'**ని కూడా వారి దగ్గరే పఠించారు. ఫలితంగా తరువాతి కాలంలో వారనేక శతావధానాలు, సహస్రావధానాలు గావించారు. ఉర్దూ భాషలో న్యాయశాస్త్రం చదివారు.

శాస్త్రిగారు సంపూర్ణ సహస్రావధానాలు - యాదగిరిగుట్ట (1930 డిసెంబరు), నల్లగొండ (1932 డిసెంబరు), సింగవరం (1933 జనవరి), దైవముదిన్నె (24-4-1935), ఇల్లెందుపురము (1935 నవంబరు), గురజాల (5-10-1936), హనుమకొండ - వరంగల్లు (1937 జనవరి), మంథెన (1931), కొల్లాపురము, గద్వాల, నూజివీడు, మిర్యాలగూడెము, నారాయణపేట, బళ్ళారి, జగిత్యాల, గోపాల్‌పేట, శ్రీశైలము, చల్లపల్లి, కరీంనగరము, కూనవరము, భీమవరము మొదలైన ప్రదేశాల్లో గావించారు.

**"విద్వద్గద్వాల"** అన్న సార్థక నామధేయంతో విరాజల్లిన గద్వాల సంస్థానంలో పరీక్షాధికారి పదవి నిర్వహించి, అర్హసత్కారములు పొందినారు. అటువంటి విద్వత్సభలలో పాల్గొనినప్పుడు ఆయనకు, శ్రీకృష్ణదేవరాయల భువన విజయ సభయే స్ఫురణకు వచ్చేది. 1962లో సాలంకార కృష్ణదేవరాయల కృతి సమర్పణ సందర్భంగా ఆంధ్రనలంద సంస్థ (గుడివాడ) శాస్త్రిగారికి కనకాభిషేకం గావించింది.

**సాలంకార కృష్ణదేవరాయలు :**

వీరరస ప్రధానమైన ఈ కావ్యం ప్రధమాశ్వాసంలో పద్య సంఖ్య **1-29** వరకు కృష్ణదేవరాయల వంశం చంద్రవంశంగా అభివర్ణించారు. **'పారిజాతాపహరణం'**లో తిమ్మన వర్ణించిన వంశావళిని అనుసరించి శాస్త్రిగారు అదే క్రమంలో రాయల వంశాన్ని వర్ణించాడు. చంద్రునికి బుధుడు, బుధునికి పురూరవుడు, పురూరవ ఊర్వశులకు యయాతి, యయాతికి యదు తుర్వసులను ఇద్దరు కుమారులు జన్మించారు. తుర్వసుని తరువాత ఆ వంశానికి తుళువ వంశమని పేరు వచ్చిందని వంశానుక్రమణికను తెలియపరిచినారు.

ఇమ్మడి (సాళువ) నరసింహరాలయ పతనానంతరం సాళ్వ భూవలయ మంతయు తుళువ నరసింహ రాయలకు హస్తగతమైన విధానం ఇలా వర్ణించబడింది.

సీ॥ ''తుంగభద్రానదీ రంగత్తరంగోత్థ
వాత్థ సంస్పర్మా ప్రపూతమేయది
సురుచిర నవరత్న శోభా విభూషిత
కాంచన శిల్ప సంఘటితమేయది
సేనా వినమ్రారి భూవర సామంత
మకుట మాణిక్యాంశు మహితమేయది
ఉభయ పార్శ్వస్థ భృత్యాచిత కరగత
చామర చాలన స్తగితమేయది

ఆద్యసాళు భూవరో పార్జితమ్ము
నగు విజయనగరస్థ సింహాసనమ్ము
తుళువ వంశజులను జేరి వెలుఁగ దలచి
దండనాథ నృసింహు నేస్తంబుసేసె

తుళువ వంశస్థుడైన నరసింహరాజుకు నాగాంబ, తిప్పాంబయని ఇరువురు భార్యలు. తిప్పాంబ కుమారుడు పెద్దవాడు నరసింహరాయలు. నాగాంబ కుమారుడు కృష్ణదేవరాయలు.

సీ॥ ఆమని దొర సోకునంతనె క్రొమ్మావి
కొమ్మకు నొదవు ఫలమ్ము వోలె
సుప్రభాత తమ్మంటి స్రుక్కఁబ్రాచీదేవి
ప్రసవించు భాను బింబంబువోలె
శుద్ధాంబుకణమొంది శుక్తికాంతలలా
మంచీను ముక్తాఫలంబు వోలె
కలశాంబు నిధి వీచికా మంగళాంగన
ప్రసవించు చంద్రబిబము వోలె
దండనాథ నృసింహ భూధవుని సాధ్వి
నాగరూంబిక పూర్వపుణ్య ప్రభూత
ఫలమునన్ గృష్ణదేవరాయలు జనించె
ఆంధ్ర కర్ణాటక భూజనాహ్లాద మొసగె.

పై విధంగా (మాలోపమ)

## రాయల సౌందర్య వర్ణన :

చతురాస్యుండల మించుటద్దమున మించన్ బోలు స్నిగ్ధత్వమున్
స్మిత నిత్యాసవసౌరభా భ్యుదయ రాజీవైక శిల్పోన్నతిన్
బ్రతతోర్వీజన భావరంజన చణ ప్రాలేయరుగ్దీప్తి మి
శ్రితమున్ జేసి సృజించె రాయల ముఖశ్రీ పూర్ణ సౌందర్యమున్.

మ॥ నెల క్రొందళ్కుల వెన్నెలల్ దిగిచి చూర్ణింపగ నౌ చూర్ణమో
కలశాంభోనిధి వీచికా కణములో కల్పద్రుమోద్భూత ని
ర్మల పుష్పంబొకొ, వేల్పు టావొసగు క్షీరవ్రాతమోతయంచు రా
యల లేనవ్వుల గాంచి సంజనిత శంకాయత్తులైలెల్లరున్.

బల పరాక్రమాలు, క్షమా దార్ఢ్యములు కార్యదీక్ష మొదలగు గుణాలు రాయల ప్రవర్తనలో మూర్తీభవించినందువల్ల అపారమైన ప్రజాదరాన్ని పొందాడు. అది చూచి అతని సవతి తల్లి యైన తిప్పాంబ తన కుమారునికి

సంహాసనం దక్కదను భయంతో రాయలకు విషమిచ్చి చంపించాలని ప్రయత్నించింది. ఆ పనికి నియమించబడిన దాసి హృదయవేదన **"కేళీవన చిత్రనర్తన మయూరారావము గాను, కాంభోజిరాగ నిబద్ధ వీణాలాపముగాను, అత్యుగ్రాపదావేగవద్ధృయాం భోజముఖీ ప్రరోదనము"** గాను వర్ణించబడింది.

విషాహార మిచ్చి అంతమొనరించే ప్రయత్నం విఫలమైన తరువాత, తిప్పాంబ రాయల ప్రవర్తన దుర్మదముతో కూడి యున్నదని రాజుతో నమ్మబలికింది, రాయల కనుగుడ్లు పెకిలించి చూపమని తిమ్మరుసుకు ఆజ్ఞనివ్వగా, అతడు రాయలను రహస్య స్థావరంలో ఉంచి మేక కనుగుడ్లను రాజుకు తెచ్చి చూపించి ఆ విపత్తునుండి రక్షించాడు. రాయలకు, విధించిన శిక్షకోర్వలేక ప్రజావళి శోకించింది.

ద్వితీయాశ్వాసంలోని వీరనృసింహరాయలును తీర్థయాత్రలకు, కృష్ణ రాయలును జైత్రయాత్రలకు పంపుటకు వృద్ధుడైన నరసింహరాయలు సంకల్పించాడు. అష్టాదశ వర్ణనలలో ప్రయాణమనే వర్ణన సూచితమైనది. పుర వర్ణనగా ఉమ్మత్తూరు పురవర్ణన ఇలా వర్ణించబడింది.

ప్రతత చూడాకలాప విహారి జాహ్నవిన్
 పరిఖాస్వరూపాన వరలజేసి
రమ్యాంగ భూషణప్రాయభుజగాళి
 రక్షక వీర శస్త్రములజేసి
వ్యోమప్రదేశ వాతోద్ధూత పృథుజటా
 భరము దుర్గధ్వజ వ్రజము జేసి
సంతత వాహదీక్షాభాసు నందీశు
 రాజవాహన హస్తిరాజుఁజేసి

భవుని బహువిధ లింగ రూపముల దుర్గ
గోపురముల గాపుంచి గోము నెఱపి
యవని వెలసిన హర నివాసాద్రియనగ
నొప్పగా జేయ పెనుసౌరు నుమ్మతూరు.

శివ సముద్ర జైత్రయాత్ర సందర్భంలో శివసముద్ర దుర్గము, దానిని చుట్టుకొని యున్న ఆర్ణవము వర్ణింపబడినవి. వర్ణనలన్ని దాదాపు సీస పద్యాలతోనే నడిచినవి. వచనము / గద్యము కనిపించదు.

వీర రస ప్రధానమైన ఈ రచనలో నాయకుడు ధీరోదాత్తుడు. శివసముద్రం ఉమ్మత్తూరు, కొండవీడు, ఓఢ్ర మొదలగు దేశాలను వశపరచుకొన్న తీరులో వీరరస పోషణ ప్రస్ఫుటంగా ద్యోతకమవుతుంది.

ప్రబంధ నియమాలైన అష్టాదశ వర్ణనలలో పురవర్ణన. కుమారోదయం, ఆజి, యాత్ర, వివాహాది వర్ణనలు సమయోచితంగా చోటు చేసుకొన్నాయి.

ఉద్యానవన వర్ణనలో కోమల భావాలకు మంజుపద వినిర్మితి శోభకూర్చగా, **'శివసముద్రము'**లోని ఆరామ వర్ణనలో పరిఢవిల్లిన ప్రౌఢపద సంపద శాస్త్రిగారి ధారాశుద్ధికి తార్కాణం.

> "పురహ ర్మ్యాగ్రతతీ విహార విసరత్పుణ్యాంగనా సుందరాం
> బర భర్మాంచల బాలనోదిత సమీరాంకూర సంవీజన్
> త్స్ఫురితాకాశ తరంగిణీ ప్రచలితాంభోవీచికా వ్యగ్రశ్రీ
> కర జాలంబుల నప్రయత్నకృత శృంగారంబులా రామముల్"

ఆంధ్రదేశాభిమానియైన రాయలు విజయవాడ పురమును సందర్శించిన సందర్భములో ఇలా వర్ణించారు.

సీ. వాసవాశావధి భాస్వరాభ్రంకష
ప్రోత్తుంగ భూమిభృద్భూషితంబు
దక్షిణ దిక్తటీస్థగిత సేతు విరాజ
మానశైవాలినీ మానితంబు
ప్రాగుదగ్దిక్పరివ్యాప్త రత్న వితర్ధి
కాంచిత భర్మహర్మ్యాంగణమ్ము

ఉభయ పార్శ్వస్థ భూజోత్కరచ్ఛాయాభి
శోభిత శీతాధ్వ సుఖపదమ్ము.

గీ. దూరగమన సమాగమోద్యోగ జనిత
ఘర్మ జలకణ హరసుమ కాయమాన
బంధురారామము విజయవాడ పురము
నరసె భూజాని యాంధ్ర దేశాభిమాని. 533

**రాయల సైన్యధాటిని పేర్కొంటూ .....**

సీ. నిశితకంటకముల నేల రాల్పించెడు
తరులున్న దుర్గ మాధ్వమునసైన
నిట్టనిల్వుగ నింగి ముట్టునట్లుగ నిల్చు
పర్వతావళి యడ్డు పడఁగనైన
ఇరువంకలన్ భయంకరరూప శార్దూల
రావముల్ శృతి దుర్భరంబులైన
బలి సముత్ప్రేరిత పాతాళవాహినుల్
త్రోవ కడ్డంబుగాఁ దొరలనైన.

గీ. వికటకాలానలోదగ్రవిపుల ధూమ
రేఖ లెల్లెడఁ దమముఁ బర్వింపనైన
నసదృశాహవ కౌశలావ్యగ్ర కృష్ణ
రాయ బలధాటి తరలు సర్వంబు దాటి. 553
అని వర్ణించారు.

కళాభిమానియైన రాయలు తుక్కమాంబ వీణానాదమాధురిని ఆస్వాదించటాన్ని ఇలా వర్ణించారు.

మ. అదిగో! వీనుల సోకెడిఁ మధుకరీ హారి స్వరాలాపమో
మదనోజ్జృంభణ కారణప్రియ పికీ మంజు స్వరాలాపమో
ఉదయద్ యౌవన మోహినీ చతుర వాద్యోద్యోగవద్వల్లకీ

మృదునిధ్వానమొ గుండె తల్లడమొనర్చెన్ మాధురీధుర్యమై. 633

చందమామను, చల్లగాలిని సంజతఱి 'ఱిక్క'ను చక్కగా పలుకరించిన తీరు చతుర్థాశ్వాసంలో పరికించవచ్చు. (పద్యము 637-640)

'విలస్కృత్కావ్య విలేఖనా చతురులోను, విద్వత్కవిశ్రేణులతోను, లలిత స్వానమనోజ్ఞ గాయన కలాలాపానుపజ్ఞులతో' రాయల సభ శోభలీనెడిది. (పద్యము 701)

శ్రీ కృష్ణదేవరాయల పంచ శతాబ్ద్యుత్సవాలు జరుపుకొన్న ఈ సంవత్సరంలోనే ఈ గ్రంథం పునర్ముద్రణకు నోచుకోవడం మహద్భాగ్యం. ఈ నిమిత్తం ఆర్థిక సహాయం అందించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికార వర్గానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎప్పటికపుడు నన్ను ప్రోత్సహించి మార్గనిర్దేశం చేసిన మా సోదరులు డా॥ హరిశివకుమార్, డా॥ హరి సనత్‌కుమార్‌లకు అండగా నిలిచిన శ్రీవారు శ్రీ గుడిపాటి కోటేశ్వర శర్మగారికి నా ప్రత్యేక కృతజ్ఞతాంజలులు.

★ ★ ★



గ్రంథకర్త :


పంచసహస్రావధాని

**కీ॥శే॥ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి**

**1892 - 1980**

# కృతి సమర్పణము

ఉ. శ్రీయలరార నానుడులఁ
జిన్నతనంబున నుండి నేర్చి యాం
ధ్రాయత వాఙ్మయంబునకు
నాదరమిచ్చుచు రాయకీర్తిన
చ్ఛాయలదేలు శిష్యున కొసంగుదుఁ
బ్రేముడి నడ్డుమల్లి నా
రాయణరాయ ధీమణికి
రాయచరిత్రము నంకితంబుగన్.



కృతిపతి :

**కీ॥శే॥ అడుసుమల్లి నారాయణ రావు**

M.B.B.S.

# కృతి స్వీకారము

శా. బ్రాహ్మీదత్త వరప్రసాదమున విభ్రాజిల్లు జంధ్యాల సు
బ్రహ్మణ్యాఖ్యుఁడు దేశికుండగుటయే భాగ్యమ్ముగానెంచ న
బ్రాహ్మణ్యంబు తలంప కీ సరసకావ్యం బంకితంబిచ్చె నన్
బ్రహ్మానందమునందుఁ దేల్చె భవసార్థక్యమ్ము నాదేగదా!

ఉ. అష్టశతావధానయుగ మందఱి సాధ్యము; దాన నేటి, కు
త్కృష్టము, కష్టసాధ్యము సృజించితి పంచ సహస్రధారణన్
గష్టములేకయే సలుపఁగల్గితి వద్ది, త్వదీయశక్తి సు
స్పష్టము, సేసె నీగరిమ సర్వకవీంద్రుల దేశికోత్తమా!

క. తిరుపతి వేంకట కవ్యం
తరిక్ష శిష్యప్రశిష్య నక్షత్రతతిన్
గురుడ హిమాంశుడఁద త్కృ
ష్ణరాయ కావ్యమ్ము శోభ, సంధితమగుటన్.

ఉ. తిక్కన కంకితంబిడి మతింగనెఁ గేతన, వాని మార్గమే
త్రొక్కిరి నీ సుహృన్మణులు తొల్లిట సౌందరనంద కావ్యమున్
మక్కువ దేశికాంకిత మొనర్చిననాడు. విచిత్రమేమి లే
దక్కడ; నీవొ; శిష్యునకు, నంకితమిచ్చితి వెంతధన్యుఁడన్.

ఉ. రాయలు రాజెకాఁడు, కవిరాజును బండితరాజు, తచ్చరి
త్రాయత కావ్యముల్ జలుపనాయెను ధూర్జటి; నీదు కావ్య మా
మ్నాయముసేసె దాని, నది యంకితమిచ్చుచు నడ్సుమల్లి నా
రాయణరావు నామము స్థిరమ్మొనరించితి వయ్య, దేశికా!

ఉ. రాయలగాను నేను గవిరాజువు నీకొక యగ్రహార మే
నీయఁగలేను లక్ష లసలే కనుపింవు, పండితాగ్రణిన్
జేయఁ గళాలయమ్మయినఁ జెంగటలే దెటుతీర్తు మీ ఋణ
మ్మీయిడు సత్కృతిన్ దనియుమీ, కొనుమీ, కనకాభిషేకతన్.

గీ. సప్త సంతానములయందు సమసిపోని
దొక్క కావ్యంబ; యద్దానిఁ జక్కదిద్ది
వంశయుగ్మమ్ము కీర్తి శాశ్వతమొనర్చి
తద్దిరే; నీదు సంకల్ప మఘహరమ్ము.

# ప్రస్తావన

సీ. స్థాపించినావు సద్యశము గద్వాలసంస్థాన విద్వత్సభాంతరములందు
ఎత్తించినావు సత్కృతిభాజనంబు గొల్లాపురాస్థాన సల్లాపమందు
పరగించినావు దైవముదిన్నె రామారాయోర్వీశ ఘటితపురోత్సవంబు
తనరించినావు యాదగిరీంద్రబుధ పరీక్షాధికార యశస్సమార్జనంబు.

గీ. ఎటుల గూర్పింతొ యభినవ కృష్ణదేవ
రాయ బిరుద నారాయణ రాయ విహిత
కనదలంకార కృష్ణరా ట్కావ్యరచన
సకల సుకవి జనాలంబ - శారదాంబ!

మ. వర సాహస్రకృతావధాన సరణిన్ బ్రాజ్యాంధ్రసామ్రాజ్య బం
ధుర చారిత్రిక కావ్యనిర్మితిఁ గృతార్థున్ జేసినట్లే ; యలం
కరణ శ్రీమయ కృష్ణరాయ గుణవత్కావ్యాదృతిన్ గూర్పనిన్
స్మరియింతున్ మదభీష్ట మీయవె; గజాస్యా! సర్వసిద్ధిప్రదా!

మ. ఇది ప్రాగ్వృత్తము పూజ్యమం చభినవం బీ కావ్య మగ్రాహ్యమం
చెద భావింపక మంచిచెడ్డల సుహృద్ వృత్తిన్ విచారించి సద్
హృదయుల్ మేలు భజింతురం చనిరి ప్రాగ్ధీరుల్, తదుక్తిస్మృతిన్
సదసద్వస్తువిదుల్ తొఱంగవలె దోసంబెల్ల నీ నాకృతిన్.

# సమయాంతర ప్రసంగము

మ. అగుదున్ దిర్పతి వేంకటేశకవి శిష్య గ్రామణిన్ బ్రేమమీ
అగ జంధ్యాల కులాబ్ధి శీతకర సుబ్రహ్మణ్యశాస్త్రీ యనన్
జగముల్ బిల్తురు నన్ను వాఙ్మయమహాశాస్త్ర ప్రవిష్టుండ విం
తగఁ జూపింతు సహస్రపత్ర కవితాంతశ్చాతురీ సంపదన్.

సీ. చిన్ని తామరలోనఁ జెన్నొందు దొర చాన కూరిమి గారాబు కూనమాకు
లేనివారల పంటయైన దేవర యింట మెట్టిన లచ్చి తోబుట్టు మాకు
శతవత్రములమించు, శాసనమ్మొనరించుపని యుగ్గుపాలఁబోసినది మాకు
మాన్యవర్ధనచేత, మనుచు జీవనదాత భవనంబు కేళికాపదము మాకు.

గీ. రాజవిబుధానుభోగ్య ధారాప్రసక్తి
తనువునన్ దాచిపెట్టిన ధనము మాకు
అమల కువలయభోగి భోగ్యాలయంబు
నిలయమగు మాకు, సుకవి రాజులము మేము.

సీ. అతిరయంబున గల్గు నహితంబులాపు వ్యాకరణంపుగళ్లెంబు గై నమర్చి
ఒఱపించుకొలఁది పైకుబుకు నలంకార సమభిఖ్య చిత్రపీఠమున నిమిడి
సహజసంగత గీత సాహిత్యరూపమ్ములగు రికాబుల నంఘ్రు లలవరించి
పంచభాషాభావ భాసుర కవితాఖ్య పంచకళ్యాణి నశ్వంబు నెక్కి.

గీ. ఆశుధారాభిధాన మహాయుధంబు
నొంది సుబ్బన్న రౌతు ఉయ్యూరు రాజు
ననుచు మీ కోటపైఁ బడె నరయుమయ్య!
అరిజయామేయ; వేంకటాద్ర్యప్పరాయ.

# పండితాభిప్రాయము

**శేషాద్రిరమణకవులు**
శతావధానులు

మ. తెలుగుందేశము సర్వరీతులఁ బ్రశ
స్తిన్ గాంచె విద్వద్వ్రతం
సుల కెందేని కొఱంతలేదు సుకవి
స్తోమం బనల్పంబు నీ
వలె నెందైన సహస్రపత్ర కవితా
వ్యాపార పారంగతుల్
కలరే యిందని యాంధ్రమాత మదిలో
గర్వించు విద్వన్మణీ!

# సాలంకార కృష్ణదేవరాయలు

## ప్రథమాశ్వాసము

శా. శ్రీనిర్వ్యాజ సుఖోపభోగము జగత్ క్షేమార్థమేపారఁ బ
ద్మానిర్ణిద్ర మనోనురాగము ప్రజాధర్మార్థ మొప్పార ని
త్యానందంబున వెల్గు తిర్మల పదోద్యత్ శ్రీనివాసుండిటన్
శ్రీ నారాయణరాయ ధీమణికిఁ గూర్మిన్ గూర్చు నిష్టార్థముల్. 1

మ. నిరతంబున్ హిమవన్మహీధరదరిన్ నిష్ఠాపరస్వాంతయై
వరగన్ బార్వతి నాత్మ సేవనము తాత్పర్యంబునన్ బిల్వఁగా
నరయన్ రామి నిజార్ధదేహమున నిత్యావాసినిన్ జేయు సుం
దరుఁడీశుండు శుభంబులన్ మనుచుతన్ నారాయణార్యాగ్రణిన్. 2

ఉ. న్యాయపథంబుగాఁదలఁచి నాతివచస్పతిఁజేర్చి నీరజా
తాయత పీఠిపైనెగడి, యన్నిజగంబులు నాలకించి యౌఁ
రా! యన, నాల్గు వేదముల నాలపనం బొనరించు ధాత, నా
రాయణరాయ ధీమణికి నాయువు వైభవమిచ్చు గావుతన్. 3

మ. జనకుండున్ గిరిజాత, తల్లి ప్రణయస్వాంతాన నంకస్థలం
బునఁజేర్పన్ నిజగండభాగములపై మూకొన్న భృంగావళిన్
ఘనకర్ణాంచల చాలనంబునఁ దొలంగన్‌దోలు దంతావళా
నను నర్థింతు నభీష్టసిద్ధిఁ గృతిసంధానైక సంరంభినై. 4

సీ. చతురాస్య నిగమసుస్వరలీలఁదనచేయు
    వీణాస్వరంబుల విస్తరింప
పీఠపంకజపత్ర విసరమ్ముచెలరేగి
    పొలతెమ్మెరలకు దావులుఘటింప
మధురగాయనమధ్య మందహాసమ్మది.

తనమేని ధవళిమన్ దట్టపఱుప
నిజపాణితలమున నెగడుకావ్యసుమమ్ము
సాహితీప్రియుల కుత్సాహమొసఁగ.

గీ. నిలువుచెందిరపుంబొట్టు నివ్వటిల్లి
మోముదమ్మికి నిద్దంపు గోముగూర్చి
తనదు దీర్ఘసుమంగలీత్వంబు దెలుప
నెసగు పల్కునెలంత నన్నేలుగాత. 5

## కృతిపతి వంశావతరణము

మ. వర కృష్ణాతటినీ తటాంచలములన్ భాసిల్లు సంపూర్ణస
స్య రమాభూషిత భూమిభాగమును గృష్ణామండలాభిఖ్యచే
సరసుల్ బిల్తురు తత్పదాంతరమునన్ జంద్రాల సంజ్ఞావహత్
పురమొప్పున్ గమనీయ నాకసుఖ వైభోగాలవాలాకృతిన్. 1

శా. ఆ చంద్రాల పురంబునందలరు నిత్యానల్ప భూకర్షణ
ప్రాచుర్యోద్గత భోగభాగ్యము సుదూర క్ష్మాతలాయాత మే
ధా చాతుర్య నిధాన పూజననిబద్ధస్వాంత, మశ్రాంత పూ
తాచారార్చిత దైవతం బడుసుమిల్ల్యాఖ్యాన్వయం బున్నతిన్. 2

శా. స్ఫుట శోభాంచితమౌ తదన్వయమునన్ శుద్ధాత్ముఁడున్ దోర్ద్వయో
ద్భట తేజోనిధి సుందరాకృతియునై భాసిల్లు మాన్యుండు వెం
కట రామాహ్వయుఁడుద్భవించె భవనక్షత్ర స్వభావ క్రియా
పటిమన్ బ్రాజ్ఞులు బల్కి రీతనికి స్త్రీవాసాంతరావాసమున్. 3

ఉ. ఆనగరంబుపొంత గురజాహ్వయ పత్తనముండు, నందు నె
ర్నేని సదన్వయం బలరు శ్రీనిధి వెంకటరామయాఖ్యుఁడం
దైనయశాలియయ్యె నత డాత్మతనూజలయందుఁ బెద్ద స్వ
స్థాన నివాసమొప్ప గుణసాంద్రుని కీయఁదలంచె నింతిగన్. 4

ఉ. వెంకటరామయార్యుడు వివేచనపైఁ దన పెద్దబిడ్డయౌ
వెంకటరామమాహ్వయను విశ్రుత సద్గుణుఁడడ్డుమిల్లి శ్రీ
వెంకటరామయాఖ్యునకుఁ బ్రీతి నొసంగి వివాహవైభవం
బుంకువఁ గూరిచెన్ గురజనుండి సుఖించిరి తద్వధూవరుల్. 5

సీ. ఏ క్షమాశీలి దుర్భిక్షాంతకంబగు
కృషి సేఁత దన నిత్యవృత్తిఁ జేసె
ఏ సత్వశాలి మహేశవాహనములఁ
జెలువంబు మీఱఁ బోషించుచుండె
ఏ దయానిరతుండు పేద లర్థింపఁగా
బ్రతుకు మార్గమ్ములఁ బనులఁజూపె
ఏ గుణాన్వితుఁడు వేదాగమజ్ఞులకుఁగే
లోమ్డ్చియాశీస్సులన్ బొందుచుండె.

గీ. ఏ యశస్వికి నేటేట నేఱువాక
పున్నమి దినంబు నిరుపమా మోద మొసఁగె
అడుసుమిల్లి కులోద్ధర్త కతని కొదవి
రాత్మజులు మువ్వు రర్వగుణైక నిధులు. 6

శా. ఆ సంతానమునందు నగ్రజుఁడు శేషార్యుండు పెంజెంద్ర సం
వాసంబుండిన బొప్పనాన్వయ విభాస్వత్ సీతమన్ గైకొనెన్
దా సౌఖ్యంపడి యేడ్వురన్ సుతుల భద్రస్వాంతయౌ పుత్రి ను
ల్లాసంబారఁ గనెన్ బ్రజానుమతలీలన్ బుచ్చెఁ గాలంబటన్. 7

ఉ. అతనివెన్క బుట్టె సమయజ్ఞుడు వెంకటరాయనామ వి
భ్యాతుఁడతండు లక్ష్మమసమాఖ్య గుణాన్వితఁ బెండ్లియాడె ధై
ర్యాతతమూర్తియై గురజయందున నీతఁడు లబ్ధలక్ష్మితోఁ
జేతము తృప్తిజెంద నివసించుచు నుండెను సజ్జనాప్తుఁడై. 8

గీ. ఆర్య వెంకటరాయల కనుజుఁ డగుచు
నాగయజనించి విమలసౌందర్యధామ
పొన్నమ కరంబు గైకొని పుత్రుఁబడసె
నాతఁడలరారె సుబ్బరాయాహ్వాయమున. 9

చ. గురుజపురాన నద్భుమిలిగోత్రవివర్ధన మొప్పమీఱ శ్రీ
ధరపద సేవనాభిరత తజ్జనకశ్వశురాలయాన సు
స్థిరముగ నిల్లటంబెనయు ధీరుఁడుగావసియింప, వృద్ధిత
త్పరుడగు సుబ్బరావెలమిఁ దాగ్కొనె వల్లురిపాలెమన్ బురిన్. 10

మ. గురజన్ వెంకటరాయ లుత్తమసుహృద్గోష్ఠీ పరస్వాంతుఁడై
సరసశ్రేణికి మాన్యుఁడై పటు కళాసంపద్ధురుల్ పొందు బం
ధుర మర్యాదలఁజూచి యాత్మకులమందున్ భాస్వరత్ సత్కళా
స్ఫురితోదంతులుగల్గు టుత్తమమటంచున్ జిత్తమందెంచెడున్. 11

మ. అరసెన్ వెంకటరాయ లాత్మసతిలక్ష్మమ్మాఖ్యయందున్ శుభ
స్థిర సాముద్రిక లక్ష్మణప్రతతితో స్వీయక్షమా సేవనా
దరు నారాయణరావు; నా కొమరుడుద్యద్బాల కేళీమనో
హర సంచారములందుఁ జూపఱకు నాహ్లాదంబుఁ జేకూరిచెన్. 12

చ. పెరిమదలిర్పఁదత్సుతుఁడు పెద్దయి శ్రీ ధనకోటి సూర్యభా
స్కరయనుపేరఁ బిల్వఁబడు సాధ్వినిఁగై కొనె మాననీయధ
ర్మరతిఁబెనంగి యొక్కనిఁగుమారునిఁ ముప్పురఁగూఁతులన్ మనో
హర చరితాఢ్యలన్ గని, నిజాన్వయ కీర్తికిఁబెట్టె వన్నియన్. 13

గీ. తనయునకు హేమచంద్ర ప్రతాపసింహ
చక్రవర్త్యభిధాన మొసంగె నతఁడు;
యం.డి, బీయస్‌సి, డీటియ మంకములను
దనరి యా చక్రవర్తి వైద్యమున నెగడె. 14

సీ. బీయస్‌సి నామకబిరుబందు గొనుదన్క
బాల్యంబునన్ గలాభ్యాసమందె
యౌవనో దయమైనయపుడు యండీ యనన్
బిరుదంబుగైకొను వేడ్కనలరె
యం యస్ సి. బీయలైయలరు నోబులపతి
చౌదరికిన్ ధర్మసాధ్వియయ్యె
ఆంధ్రప్రభుత్వ వైద్యాలయ నియతయై
సవిజయాభ్యాస యశంబుగాంచె.

గీ. ధీర; చల్లా ప్రభావతీదేవి చౌధు
రాణి, భిషగ్రగణ్య, నారాయణునకు
ప్రథమపుత్రిక, యుభయాన్వవాయములకు
వితతకీర్తి ప్రదాత్రియై వృద్ధిఁగాంచె. 15

మ. వరనారాయణరా డ్ద్వితీయసుత దీవ్యద్జ్ఞాన సంపద్విభా
స్వర; లావణ్యలతాఖ్యయయై; బి.యె.బియీ. పట్టాంకుఁడై యింజనీర్
సరణిఙ్ విశ్వకలాలయానుమతిఁ బాశ్చాత్యోర్విలో శిక్షణఙ్
స్థిరతఙ్ గైకొనుచున్న ధీమణి, శివాజీరాయుకేలుఙ్ గొనెఁ. 16

మ. వరుసఙ్ రాయు తృతీయపుత్రిక జగద్వైభోగ సంవర్ధనా
దరయైస్వర్ణకుమారి యుక్తచలనోద్యన్నృత్న చిత్రోదయా
కరధీమజ్జయరావు కేలుగొని సౌఖ్యప్రేరితానందయై
పరగుఙ్ జెన్నపురంబునఙ్ బతిపదాబ్జాతాధి సేవారతిఙ్. 17

మ. కృతి సంపోషకు తల్లిపుట్టినిలు సుశ్రీరమ్యమౌఁ దత్సము
ద్ధృతి సంస్థాపకులైన తాతల సుచారిత్రంబు శ్రావ్యంబగుఙ్
తతకృష్ణాతటినీ జలప్రసరణోద్యత్ సస్యజాలాభిషం
గత వైభోగసముజ్జ్వలత్ తమరిశగ్రామస్థులా శ్రీనిధుల్. 18.

చ. తమరిశ నిమ్మగడ్డ కులధామము తత్పురిజన్నయాభిదా
ర్యమణి వసించు నా సుమతి యార్జనసేసెను శాలి సస్యపా
త్రములొక యైదుఊఱు లెకరాలకు మించిన క్షేత్రరాజముల్
సుమహిత హాలికోత్తముని చొప్పున నందె మహేంద్రభోగముల్. 19

శా. శ్రీరమ్యుండగు జన్నయార్యమణికిన్ జేతో భవాభ్యంచితా
కారుల్ రామయ సుబ్బనాఖ్యుడు మఱొక్కండీశ సద్భక్తి న
క్రూరుల్ వెంకటరత్న యాహ్వయుడునున్ గోపాలకృష్ణాఖ్యుడున్
ధీరస్వాంతులుపుట్టి రన్వయ సముత్తేజోబిసంధాయకుల్. 20

ఉ. వారిత దుర్విచారులు నవశ్య పరస్పర వృద్ధితత్పరుల్
వీరలయందు నుత్తముడు వెంకటరత్నయ పెండ్లియాడెఁ గౌ
మారమునందె యల్ల, పసుమర్త్యెలమంచిలివంశజాత గం
భీర మృదుస్వభావఖని; పిచ్చమనామక కన్యకామణిన్. 21

ఉ. ఆ రమణీయదంపతులయందు జనించిరి ముప్వురాత్మజల్
వీరలయందు లక్ష్మమయె పెద్దతనూభవ, రాయనంబ; యా
వీరజనప్రకాండునకు వెంకటరత్నయకౌరి సద్యశ
శ్శ్రీరమణీయులాత్మజు లరిందమ సత్వులు నల్వురుత్తముల్. 22

ఉ. ఈ యలఘు స్వభావులను జ్యేష్ఠుఁడు వెంకటసుబ్బయయ్యె నా
రాయణరాయ ధీమణికి నాత్మజనిచ్చిన మేనమామ; సౌ
మ్యాయత నాగరత్నమయు నాతని రెండవపుత్రియయ్యె నా
రాయణుసాధ్వి చెల్లెలయి యాతనికిన్ హొఱఁగున్ మఱందలై. 23

గీ. అట్లగుటఁజేసి నారాయణార్యమణికి
అడుసుమిలి తన పితృవంశమైన యట్లు
విమ్మగడ్డాఖ్యవంశమే నెలఁతనీయు
నైన సుపవిత్ర మాతామహాన్వయంబు. 24

సీ. ప్రాచీదిశన్ గుడ్లవల్లేర్వనుక జనం
బే రాయునౌషధసారమానె
పామర్తిప్రాంత మెవ్వాని యంత్రరథంబు
విహరించె రోగనివృత్తిఁజేయ
తమరిశప్రాంత భూతలముదన్క నెవాని
వైద్యశస్త్రము బరాబరుల సేసె
పడమర గుడివాడప్రాంత మేరాయని
యలఘు మేధాశక్తి చెలిమిసేసె.

గీ. అడుసుమి ల్ల్యన్వయోద్ధర్త; వ్యాధిహర్త
విమల ధన్వంతరి క్రియావృత్తిఁబోలి
యాదినారాయణ స్వరూపాంశశాలి
ప్రణుతశీలి; నారాయణరాయమౌళి. 25.

సీ. అర్వాకృష్ణామండలాంతర గురజాఖ్య
పురలక్ష్మి కెవ్వాడు ముద్దుబిడ్డ
అష్టాదశాబ్ద పర్యంతమౌ ప్రాయ మె
వ్వనికైత సాముచేసిన దినంబు
అష్టావధాన విద్యాతన్వి యెవ్వాని
కరచాలనము గొన్న సరసురాలు
శతవధాన శ్రీ విశాలక్ష్మి యెవ్వాని
కౌగిలింతలదేలు గణ్యురాలు.

గీ. పరువ మెచ్చిన కొలదియే సరసుపలుకు
వెలది ఘటికాశతగ్రంథ కలనమూనె,
అతడు గణనీయమూర్తి సర్వాంధ్ర సుకవి
గేయ కీర్తి;నారాయణరాయ సుమతి. 26

మ. తెలుగుంబల్కు వెలంది యెంటరిగ సందీపింప లేదంచు, నాం
గలవాక్కామినికై కరంబిడి పరీక్షల్ గెల్చునందాక ని
శ్చలరీతిꣳ గుడివాడబృందపురిలో సంరంభముల్ సేయనై
వెలసెꣳ సద్విజయాంక సంగ్రథితుడై పృథ్వీప్రశంసార్హుడై. 27

గీ. ఆంగలేయ కలా పరీక్షాభిజయము
మెలగ నాంగ్లాన నింటరుమీడియేటు
నాఁ బరీక్షను జయమందు నాటి కతడు
బంచ వింశతి వర్షాల ప్రాయమందె. 28

మ. అట నాంగ్లేయవిధానవైద్య నిగమాభ్యాసంబు గావింపఁగా
బటువాంఛన్ గనుచున్ విశాఖనగరావాసంబు గావించి యు
ద్భట శస్త్రైక చికిత్సచేతనె రుజాభంగ్యంతము న్నేర్చి య
చ్చటనే భూరివిశారదత్వము గొనెన్ శస్త్రోపయోగక్రియన్. 29

గీ. అంతట విశాఖ పట్టణాభ్యంతరమున
భాసిలెడు జార్జి రాజేంద్ర వైద్యశాల
వేశ్మ శస్త్రచికిత్సా ప్రవీణ ఫణితి
బంధురోద్యోగియై పేరు వడయనాయె. 30

గీ. భవ్యవింశతితమ శతాబ్దంబునందు
మూడు పదులును మూడబ్దములు చనంగ
నపుడు గుడివాడపురికి దా నరుగుదెంచె
తళుకుదేలిన వైద్య శస్త్రంబుతోడ. 31

సీ. అంభోధిఁ జిలికించి యమృతంబు పంచిన
మోహిని యెందుండఁ బోయెనొక్కొ
సముచితాయుర్వేద సంధాత దేవ ధ
న్వంతరి యేకోనఁ బట్టినాడొ
సురనాయకుని గెల్చి సుధగొన్న విహగేంద్రు
డే సీమలో నున్కి జేసినాఁడొ
అమృతాకరుండయి అమరుల బ్రదికించు
జాబిల్లి యెందుండి క్షయము గొనెనొ.

గీ. రమ్య భిషగంశభవుఁడు నారాయణుండు
ప్రతత వైద్యాబ్ధిఁ ద్రచ్చి సారంబువడసి
యమృతమయ హ స్త దీప్తుడై యశముగాంచె
అవిరళాం ధ్రోపకారైకభవము నడపె. 32

క. పలునాళ్ళ నుండి వ్యాధులఁ
గళవళ పడుచున్న రోగి గణముల తనువుల్
నిలుపఁ బ్రభుత్వము నిలిపెన్
దలకొని గౌరవ భిషక్పదంబున రావున్. 33

గీ. ముప్పదియుఁ దొమ్మిదవ యేడు మొదలుగాగ
ఇతఁడు నలుబది రెండవ యేటిదన్క
మూడు వర్షంబు లప్పదంబున రహించె
నిఖిల సుజనులకున్ వందనీయుఁడయ్యె. 34

సీ. అధికారివర్గమ్ము లఖ్సుమిల్ల్యన్వయు
పేరువిన్నంత జోహారులనిరి
అస్వస్థతా పీడితాత్ములు నారాయ
ణార్యునిజేర నాహ్లాదపడిరి
బ్రతుకుమార్గమ్ము గోరఁగనైన పేదలీ
రావు సాయమున కారాటపడిరి
తత్పుర స్థాపితతజ్ఞసంఘంబులీ
నారాయణునకు స్థానంబులిడిరి.

గీ అల్లనల్లన నతని సౌమ్యాతిశయము
వలన మండలపరిషత్తు వారలందు
సభ్యునిగఁజేసి యుపకారసరణిఁగొనిరి
రాయఁడిటు సర్వసజ్జనారాధ్యుఁడయ్యె. 35

మ. కవివర్యుండు భిషగ్వరేణ్యుఁడయి లోకజ్ఞాన సంపన్నుఁడై
భవనీయాంధ్ర కళాభివర్ధన విధావ్యాలోలుడై వెల్గు మా
న్యవరుం డాత్మసభాసమర్హుడ యగున్ నాన్ విశ్వవిద్యాలయా
ర్యవరుల్ పిల్చియొసంగిరీతనికి సభ్యత్వంబు తన్మండలిన్. 36

గీ. ఈ శతాబ్దాన నేబదియేడవదగు
నబ్దమునఁ దత్కలాసంఘమందుఁ జొచ్చి
లలితవిద్యా ప్రదానరీతుల వచింప
నేటిదన్కను సభ్యుఁడై నివ్వటిల్లు. 37

చ. అరుసముమీఱ నేబదియునైదుసమల్ ప్రవహత్ శతాబ్దిలో
జరుగగ విశ్వనాథ కవిసత్తమునిన్ బిలిపించి యుత్తమా
దరమున వేయియార్ల మెయి దక్షులమండలి కాధిపత్యమున్
దొరకొని సత్కృతిన్ జలుపదూగి గడించె జనానుమోదమున్. 38

మ. అటుపై నేబదిపైన నారవసమన్ బ్రార్వాంధ్రసాహిత్య స
త్పటలిన్ స్థాపనచేసి దానిని "నలందాపీఠ" సంకేత వి
స్ఫుటమున్‌జేయుచు, నాంధ్రవాఙ్మయ జగత్ప్రోత్సాహమున్ జేసెని
ప్పటికా యాంధ్రనలంద వర్ధిలు షడబ్దప్రాయ సంభావ్యయై. 39

మ. పరదేశీయుల పాలనక్రియ నిజప్రాశ స్త్యమున్ బాసి భా
స్వరరూపంబున నోటుగొన్న తెలుగున్ బాసన్ యథాపూర్వ సుం
దరమున్ జేయుటయేప్రతిష్ఠిత నలందాపీఠ భావంబునాన్
జరపించెన్ గృతిముద్రణంబులు సుధీసందోహ సత్కారముల్. 40

గీ. ఆతఁడేబదియేడవ యబ్దమందు
సత్కవీశ్వర వితతి నుత్సాహపఱచఁ
త్రిపురనేని రామస్వామి సత్కృతికి గొల్పు
సరణి వర్ధంతి జేయించె జనులు మెచ్చ. 41

సీ. అభినవతిక్కనాంకాఢ్య సీతారామ
కవికి వేయార్లు సత్కార మొసఁగె
వర వడ్లమూడి గోపాలకృష్ణకవిని
గండపెండెరముతో గౌరవించె
ఏబదెన్మిదియవయేట దేవులపల్లి
కృష్ణ సత్కవిని సత్కృతినిజేసె
సరస కాటూరివంశజ వెంకటేశ్వర
కవికి సభ్యర్హ సత్కారమొసఁగె.

గీ. అమలతరకీర్తి శ్రీ పింగళాన్వవాయు
సత్కవీశు లక్ష్మీకాంతు సత్కరించె
స్తవ్య వేలూరి శివరామశాస్త్రి మణికి
సత్కృతిం గూర్చె భూరియశంబుగాంచె. 42

గీ. ఏబదియుఁదొమ్మిదవ యబ్ద మేగుదేర
నేదునూరి గంగాధరునాదరించె
ప్రాజ్ఞమల్లాది సూర్యనారాయణాఖ్య
శాస్త్రి సత్తము నర్హతన్ సత్కరించె. 43

గీ. హృద్య సుస్వరగోపాలకృష్ణయాహ్వా
యార్యునకుఁ బెనుమత్సాన్వయాభిజాత
సత్యనారాయణాభిఖ్య సరసకవికి
షష్టిపూర్త్యుత్సవంబుల జరుపనాయె. 44

సీ. గద్వాల సంస్థాన విద్వత్సభాంతర
ఘటిత సన్మానవైఖరిని మించి
కొల్లాపురీ సభాగోష్ఠ్యంత విహిత స
న్మాన సంతుష్టికి మఱపుగూర్చి
దైవముదిన్నెవిద్వత్సభానంతర
కృతపురోత్సవము విస్మృతికిఁ గొల్పి
గోపాలపేట సభాపూర్ణ సత్కార
సంప్రీతి మఱపించుసరణి గూర్చి.

గీ. విద్వదాంధ్రనలందాధిపీఠ శతవ
ధాన సత్కృతి హర్షదంబైన దనఁగ
జంధియాల సుబ్రహ్మణ్యశాస్త్రి దనిపి
వేయినూరారులిడి గౌరవింపనాయె. 45

మ. త్వరలో నర్వదవబ్ద మందుకొన నాహ్వానించి శ్రీరామ ధీ
వరునిన్ బూతలపట్టువంశజుని సంభావించెఁ బల్నాటి ను
స్థిరమేథావి శతావధానమునకున్ జేసెన్ బహూకార మ
త్తరుణంబందున బోయి భీమనకు నందన్ జేసె సత్కారమున్. 46

గీ. అరువదొకటవవత్సరం బవతరింప
కాశిపతికవి నవధాని గౌరవించె
గందనూల్ షేకు దావూదుకవివరునకు
నర్ఘసత్కార మొనరించె, నాదరమున. 47

గీ. ప్రాంచితాంధ్ర నలందాధిపత్యమందె
గ్రంథరత్నాకరాహ్వాయ గ్రంథనిలయ
మొండు స్థాపించి యద్ధాన నొప్పుగూర్చె
రెండువేలైదువందల కృతులఁజేసె. 48

గీ. సాంస్కృతికపాఠశాలను చంద్ర మదన
మోహనునిపేర నాతఁడు పొందుపఱచె
మాన్యవిద్యాధిశాఖికామంత్రియైన
బులుసు పట్టాభిరామరాణ్ మూర్తి తెఱచె. 49

సీ. ప్రథితాడ్డుమిల్లి గోపాలకృష్ణయపేరు
సంస్థాపనామమై సౌరుగూర్ప
భవ్యసంస్థాధి నిర్వాహకాధ్యక్షతన్
ముక్త్యాలభూజాని పూనుకొనఁగ
ఆర్థికమంత్రిగా నలరారు బెజవాడ
గోపాలరెడ్డి తాఁగోర్కెఁ దెఱువ
సంస్కృతవాక్కళాశాల మా గుడివాడ
నలరారెనని ప్రజల్ హర్షమంద.

గీ. ప్రాంచితాంధ్ర నలందాధిపత్యపదవి
గ్రాలువాఁడు నారాయణ రాడ్బుధుండు
సరస సంస్కృతవాక్కళాశాల నొకటి
పాదుకొల్పించె గుడివాడపత్తనమున. 50

## *నలందా ముద్రణములు :*

సీ    ముద్రింపజేసె దుర్ముఖివర్ష మకరసం
        క్రాంతి సన్మానప్రకారమెల్ల
ప్రకటించెఁ బెనుమత్సవంశజ సత్యనా
        రాయణీయ వ్యాకరణవిధంబు
ప్రచురించె వెంకటరాయకవీంద్రుని
        యాంధ్ర నలందాహ్వాయ శతకమ్ము
గణనీయ రాఘవకర్ణ ప్రభాభిఖ్య
        హృద్యకావ్యమ్ము ముద్రింపఁజేసె.

గీ.    జంధియాల సుబ్రహ్మణ్యశాస్త్రి రచిత
శతవధానమ్ము ముద్రణసరణిఁ దేల్చె
శ్రీమదాంధ్ర నలందాచరిత్రమెల్ల
రావు నధ్యక్షతన్ పృధుప్రధిమ గాంచె. 51

## *నారాయణరాయ కవితారచన :*

సీ.    వ్రాయనయ్యెను రాజవాహన విజయమ్ము
        భవనీయరస పరివ్యాపృతముగ
సమకూర్చనాయె రుద్రమదేవిచరితంబు
        నాంధ్రసాధ్వులకు లక్ష్యంబుగాగ
విలిఖింపఁగానాయె విజయవిజయ దృశ్య
        కావ్యమ్ము నటన రంగమ్ము లలర
ప్రచురింపఁగానాయెఁ బద్య కావ్యమ్ముగ
        బెనుమత్సయోగిని విమల మహిమ.

గీ.    లసదలంకార పుష్పాంజలి సమభిఖ్య
పద్య కృతిజేసె, గీతార్థ ఫణితి వ్రాయ
దనరి నారాయణీయాఖ్య దానికొసఁగె
రమ్యశీలి నారాయణరాయ మౌళి. 52

మ. తగము న్వేయియు నైదు నూరులగు పద్య శ్రేణిలో జెల్వుమీ
ర(గ నారాయణరావు స్వీయచరిత గ్రంథంబు వ్రాసెన్ సుహృ
జ్జగ మద్దాని( బఠించి ముద్రణకు( బ్రోత్సాహంబు గావించు నా
సొగసుం గబ్బము నల్పకాలముననే జూచున్ సభారంగమున్. 53

## షష్ఠ్యంతములు

క. నవ్యతమ మృదులభావ
స్తవనీయావృతికి( బ్రచిత సత్సంగతికిన్
భవనీయ శస్త్రవైద్య
వ్యవహృతికిన్ శ్రితరుజా నివారణకృతిన్. 54

క. కాకవిసింధుర సృణికిన్
మూకీకృత దుర్వివాద ముఖరాగ్రణికిన్
స్వీకృతగురుధోరణికిన్
శ్రీ కవితాచతురకోటి చింతామణికిన్. 55

క. విరచిత సరసోన్నతికిన్
స్థిరసంధిత కీర్తివిజిత శీతద్యుతికిన్
సురుచిర కవికృతనుతికిన్
పరమేధాధిక్కృతార్య వాచస్పతికిన్. 56

క. శ్రితజన రక్షాతత్పర
మతికి నలందాశుభాభిమం తనదత్తా
దృతి కభినుత కృతిపతికి
బితృమాతృపదార్చనా ప్తనిధి విస్తృతికిన్. 57

క. నారాయణరాయాహ్వయ
ధీరునకున్ గృష్ణరాయ ధీరోదంతో
ద్ధారునకున్ జయమాంధ్రో
ర్వ్యారంభాభ్యుదయ తత్పరాచారునకున్. 58

**శ్రీ శ్రీ శ్రీ**

# కృష్ణదేవరాయ వంశావతరణము

సీ. శ్రీమానినీ జన్మధామమై దైవాఖు
తమ్మికొమ్మకుసిగ్గు దార్చు బావ
మృదుసుమాస్త్రములతో నెడబాపు విడిపించు
మీనకేతనునకు మేనమామ
గగనేందిరాంబకు గైసేతలందించు
చుక్కకన్నెలనేలు సొబగురేడు
బలవన్నిశాటదర్పము బాపు వెన్నుని
యంగనామణికి ననుంగునన్న.

గీ. వరువమోడని జేజేల పాలిబువ్వ
కందువారని జలరాశి కడుపుపంట
ధర్మరాణ్ముఖ్య భూవరోత్తములతాత
చను జనానందరససీమ; చందమామ. 1

ఉ. ఆ మహనీయషోడశ కలాంచితమూర్తికి, శుద్ధధర్మమే
ధామహితస్వరూపుఁడు సుతప్రవరుండు బుధుండుపుట్టె: నా
రామ గృహాంబుజాకర విరామ పదాభ్యుదయైక హేతుమ
ద్ధాముడు, నిర్మలాత్మపద తామరసాశ్రిత లోకబంధువై. 2

ఉ. ఆ నయశాలి కభ్యుదితుడయ్యెఁ బురూరవ భూవిభుండు, స
ర్వానత శత్రుశాసన సమర్ధనితాంత భుజప్రతాప శో
భానిధి, దిక్తటాంతర నృపాల వినిర్ణయ విస్తృతాచలా
ప్రీణనదక్ష భూరిబలవిక్రమమూర్తియుఁ జక్రవర్తియై. 3

గీ. అతని సద్గుణగణ మసంఖ్యాకమగుట
హైహయాధిపుడే వ్రాయ నర్హుడయ్యె
దశశతాక్షుండె వీక్షింప దక్షుడయ్యె
అహికులేంద్రుడె నుడువ సమర్థుడయ్యె. 4

సీ. ఉదధులున్ గులగిరు లెదురైనఁ బ్రోక్తవాక్
సరణిఁదప్పని నిత్యసత్యవాది
కరువుపైఁ గరువైనఁ గలఁతఁజెందక పూత
యజనంబు గావించు యజ్ఞశీలి
తనమహాధనమైనఁ దనువైన నర్థికి
దడయకర్పించెడి దానశీలి
సౌందర్యమునఁజేసి స్వర్విలాసినినైన
తన్పఁగాజాలు సుందరవిభుండు.

గీ. బాహుసత్వప్రభావ సంపత్తిఁజేసి
తూగి గంధర్వపతిఁ బాఱదోలునేత
అతడు శీతమయూఖ మహాన్వవాయ
జాత మూర్తి; పురూరవ చక్రవర్తి. 5

మ. మదనారాధన సేసి పుట్టెనొ మరేమాన్యక్రియా సత్ఫలా
భ్యుదయంబో తెలియంగరాదతఁడు; తద్వ్యోమాంగణ స్థాంగనా
స్పదలీలాజలరాశి యూర్వశి, మనస్సంజాతకేళీసుఖ
ప్రదయై యావిభుఁదన్పి తాఁదనిసి గర్భంబూనె నబ్రంబుగన్. 6

చ. అమితరసజ్ఞ యూర్వశికి నార్యపురూరవ చక్రవర్తికిన్
నమదరిరక్షణప్రియ మనస్విగ నాయువుపుట్టి దోఃప్రభా
వము మెయిఁజక్రవాళనగ బాహ్యరిపుక్షితిపాంగనాలకా
భ్రమదసితాంధకారహరపాటవ భాస్కరుడై విరాజిలెన్. 7

శా. ఆ వీర క్షితిపాలమౌళికి సమీరానల్ప సత్వాఢ్యుడుఙ్
దేవాధీశ పదాపహారక తపస్తేజో నిధానుండు మే
ధావైశద్యవినిర్జితామరగురూత్తంసుండు గాంభీర్యవద్
భావవ్యాప్తి యయాతి పుట్టి; పుడమిఙ్ బాలించెఁ బెన్గాలముఙ్. 8

సీ. అఖిలాహి గర్వాపహారి గారుడ మంత్ర
సరణి పుట్టనినాటి సర్పరాజు
రాహు సంగ్రహణ కర్మంబు పైఁబడఁజేయు
నింద గుందనినాటి చందమామ
సంగ్రామ పదరథ చక్రావనతి శాప
మాలకింపనినాటి యంగరాజు
ప్రియరమాశీతాంశు బింబాపనయనంబు
నంది కందనినాటి యంబురాశి.

గీ. వాక్కలాశౌర్య గాంభీర్య వైభవముల
ననఁగ జనములు తన కీర్తి నభినుతింప
నవనిఁబాలించె నింద్ర భాగ్యాతిశాయి
యధిప సముచిత నీతి యయాతి నృపతి. 9

చ. అనుపమ కీర్తిశాలికి యయాతికి ధర్మ కలా విలాసితా
త్మునకు ముదమ్మెలర్ప యదుతుర్వసులన్ దనయుల్ జనించిరా
తనయులలోని తుర్వసు నుదార గుణాకర వంశరాజ మొ
య్యనఁదుళువాన్వవాయమయి యందె జగన్నుతకీర్తివిస్తృతిన్. 10

మ. తుళువశ్రీ మహదన్వవాయమున యందున్ నాకకల్లోలినీ
లలితాలింగన రంగదూర్మికర లీలాపూర వారాశి సం
వలనోల్లంఘన దక్షవాయుసుత సత్వశ్రీక తిమ్మావనీ
తలనాథుం డుదయించె ధీరజన సంస్తవ్యప్రభా శోభియై. 11

సీ. విమల గీతికల విన్పించు నిజాంగనా
వళిఁదన్నుదల నూపి పాఁపరాజు
కెలఁకున నున్న లక్ష్మీదేవి నురము గ
న్గొనఁజేసి తనియించు గూర్మరాజు
ఆటాడఁగని పెద్ద యదనౌట దుఱపిల్లు
కరిణులం దన్ను దిగ్గజచయంబు
బరువు మోయుచు నిజ ప్రాభవం బోడిన
కులగిరుల్ క్రొంగ్రొత్త చెలువమూను.

గీ. విమలతరవారిధారా విభిన్నదేహ
వైరి వీరాంగ రక్తప్రవాహ మజ్జ
నారుణ తనుప్రభామండనార్క నిభుడు
తిమ్మభూపతి ధాత్రీధరమ్ము దాల్చె. 12

గీ. తిమ్మ దేవరాయ వసుధాధీశ్వరునకు
నధిపు డీశ్వర దేవరాయలు జనించె
పితృసమర్థ పరాక్రమాన్వితు డితండు
అజకిశోరంబు పుట్టునే వ్యాఘ్రమునకు? 13

క. అతఁడఖిల రాజ్యధర్మా
న్వితుఁడై శ్రీ బుక్కమాంబఁ బెండిలియాడెన్
నుతగుణశీల సమంచిత
రతిసుందరి సర్వసుజనరాజీవినుతన్. 14

సీ. దినకర స్యందనంబనుదినంబిగ్గెడు
తురగముల్ హేషలఁదూగువేళ
శీతల మందప్రభాత వాతంబులు
నిశ్శబ్దరోదసిన్ వీచువేళ
తల్లి ఱెక్కలలోన దనులుంచి నిదురించు
పక్కి కూనలు తెల్విపడయువేళ
నగరాజ గహ్వరాంతర తపోనియతులు
తపసులు నీరాడఁదరలువేళ.

గీ. అహరహము మేలుకాంచి శయ్యాతలంబు
వదలి హృదయేశ్వరుని పదాబ్జములఁదనదు
హస్తములనంటి కన్నుల నద్దుచుండు
భద్ర గుణధామ బుక్కమాంబాలలామ. 15

మ. స్తవనీయాలఘు విక్రమ భుజ స్తంభాభిసంరంభియై
యువకుం డీశ్వరరాజు దక్షిణదిశా ప్రోద్యద్ధరాశాసి సా
ళువ భూజాని నృసింహరాజు రిపురాడ్లోకోద్గతాయోధనో
త్సవమున్ దీర్పగ( బిల్వనంప(; జనియెన్ సైన్యాధిపోద్యోగియై. 16

గీ. సాళువ నృసింహరాజు పక్షమున నిల్చి
దండనాథాధికారాభిమండితుడయి
జయము లార్జించు కతన నీశ్వర విభునకు
వంశజ ప్రాప్యమయ్యె( దత్పదవినునికి. 17

మ. బలవత్సాళువ నారసింహబల తీవ్రవ్యాప్తి నయ్యీశ్వరో
జ్జ్వల దోర్దండ కృపాణచండిమ, వెస(న్ సాళ్వక్షమారక్షణ(న్
జలుప(న్ జాలుటెగాక యాత్మధరణీసంవ్యాపనారంభము(న్
జలిపె(న్ వైరిగణంబు తల్లడిలుచు(న్ సంధింప సేనాంజలుల్. 18

మ. తన సైన్యేశ్వరుడైన యీశ్వరుడట(న్ దత్పద్మజోద్దిష్టజీ
వనకాలంబు సమాప్తమౌట దివికి(న్ బైనించె భూజాని, యా
యన సూను(న్ నరసింగరాయని(దదీయ స్థానమందుంచె నా
తని సైన్యాధిపతిత్వ మభ్యుచితమైతన్పె(న్ క్షమావల్లభు(న్. 19

చ. అవని నొకింతకాలము సమగ్రజనావన రాజనీతివై
భవముననేలి రాజ్య సరివర్ధనమున్ రచియింపనాయె సా
ళువ నరసింహు డట్టియెడ లోకులు హర్షము నెంద; నందనో
ద్భవ మలరారె నక్కొమరు బార్థివుజేసెను; దిమ్మనాహ్వయున్. 20

మ. వరసాళ్వక్షితిపాలకుండు దివి సంవాసంబు గావింప నీ
శ్వర కారుణ్యమునంది సాళువ మహాసామ్రాజ్య సర్వస్వమున్
గరమందున్ గొని బాలుపక్షమున భూకాంతుండుగానిల్చి యీ
శ్వర పుత్త్రుండగు నారసింహవిభుడే పాలించె నర్హంబుగన్. 21

మ. నరసింహక్షితిపాలుఁడున్ బ్రబల సేనానాథుడై సర్వసం
గర నైపుణ్యవిభూషితుండయి నిజక్ష్మాభాగమున్ సాళ్వ భూ
వర సామ్రాజ్యమునున్ దిశాంతరములన్ వ్యాపింపఁగాఁజేసి యీ
శ్వరపుత్రుండన శౌర్యసాహసములన్ సాధించెఁగీర్త్యున్నతిన్. 22

గీ. సాళ్వ సామ్రాజ్యసంచిత సైన్యరాజి
కెల్ల నరసింహరాయ లధీశుఁడగుచు
దండనాయకపదవి నత్యధిక శౌర్య
గరిమ మెప్పించెఁదిమ్మభూవరవరేణ్య. 23

సీ. ఆయత గర్తపుర్యాఖ్యమండలగత
కొండవీడ్సీమకు మండనంబు
అలఘు కౌండిన్యగోత్రాంచితాభరణ మా
పస్తంబసూత్ర దీవ్యత్ప్రభూష
సద్రాజ్యతంత్ర విజ్ఞాననిధాన మా
ర్వేలనియోగి ధీరాళితొడవు
ప్రజ్ఞానిలయ వేమరాట్పౌత్ర తిలకంబు
తిమ్మర్సునామక ధీరమూర్తి.

గీ. అయిన విబుధుని స్వామిభక్త్యాలవాలు
భూరి సాళువ సామ్రాజ్యమునకు మంత్రి
సత్తమునిగాగ నియమించె సాళ్వరాజు
విజయయాత్రల సాగించె వెంట వెంట. 24

గీ. నరససైన్యేశ్వరుడు బలోన్నతినిజేసి
తిమ్మరుసు రాజ్యతంత్రమార్గమ్ముజేసి
ప్రవితత విజయనగర సామ్రాజ్యలక్ష్మి
స్వవశమున్ జేసికొనె; హెచ్చెఁబాటవంబు. 25

మ. గరిమన్ శాత్రవసైన్యముఙ్ జదిపి లంకారాజ్య సాకేత భూ
పరిరక్షాకరుఁడయ్యె రాముడొకడే; వైర్యుర్విభృత్సైన్య సం
హరణంబుఙ్ రచియించి సాళ్వనృపరాజ్య ప్రాజ్యవిద్యాపురీ
పరిరక్షాకరుఁడయ్యె నీ నరసభూపాలో త్తముం డొక్కడే. 26

ఉ. సైనికశాసనమ్ము విలసన్నవరాజ్య సమార్జనమ్మటుల్
సైనిక శాసనమ్మటు, లసన్నవరాజ్య సమార్జనమ్ము భూ
జానినృసింహరాయుకడ సంగత; మవ్వి జనాదరంబులా
గైనెగడుఁ జనాదరము నాగుణముల్ బలె వానియందగుఁ. 27

చ. జననుత బుక్కమాంబిక రసాతల నాయక దాన లీలమిం
చిన ఘన దానశీల నరసింహ సమాఖ్యుని నంతఁదిమ్మదేవరా
యని గననయ్యెఁదత్కుశలవార్భక విక్రమధాము లిర్వురుఁ
జనమితుడై నృసింహ నరనాథుడు తాలిచె రాజ్యభారముఁ. 28

మ. నరసింహాఖ్యుడు యౌవనోదయమునఁ నాగాంబఁ దిప్పాంబ వి
ర్వురఁ బెండ్లాడి యనల్పకాలమున సద్భోగంబులఁ గాంచెఁద
న్నరపాల క్షితిపాలనంబునకు నానందించి నానాదిగీ
శ్వరులుఁ దద్ఘనకీర్తిలక్ష్మికిడి రాహ్వానంబు లశ్రాంతముఁ. 29

మ. అరిరాజేంద్ర గజాంకుశంబు నరసింహాధీశు డుద్యద్గుణా
కర తిప్పాంబిక యందు వీర నరసింహాధీశునందెన్ మనో
హరరూపస్మరు విక్రమక్రమ జితాశాధీశ్వరున్ నమ్ర భూ
వర రక్షాపరు భద్రలక్షణధురున్ బ్రత్యర్థిహృద్భీకరున్. 30

మ. నరసింహ క్షితిశాసి తిమ్మరుసు మంత్రప్రౌఢి సర్వక్షమా
దర పాత్రుండయి యేలుచో నొకడు మాత్సర్యంబునఁ సాళ్వరా
జ్య రమాధీశునిఁదిమ్మనన్ జదిపెఁదత్సైన్యేశ్వరుండైన యా
నరసింహుండె వధైకమూలమనుచుఁ శంకించి రుర్వీజనుల్. 31

మ. తన కార్యంబుల నిర్వహించుటకు నాతంకంబు వాటిల్లెనా
బెను సంతాపము నొందె నా నరస పృథ్వీజాని; నిందావరో
పణమున్ మాపఁగ రాజసోదరునకున్ బట్టంబు గట్టించె నా
యనయే యిమ్మడి నారసింహుడను ఢేడై నిల్పె సాళ్వాంకమున్. 32

గీ. బాల భూపాలు నొక దళవాయి చదిపె
నను చు గ్రహియించి నరసింహజనవరుండు
కపటి దళవాయితో మైత్రి గరిమదేలు
నిమ్మడి నృసింహ విభు మానసమ్ము ద్రిప్పె. 33

క. హంతకుడగు దళవాయిని
నంతము నొందింపవలయు నంచు వచించెన్
బంతమ్మున నిమ్మడి భూ
కాంతుడు దళవాయి మడియఁ గారకుఁడయ్యెఁ. 34

మ. పెనువైషమ్యము లంతరంగముల నావిర్భావమున్ జెంద నూ
తన రాజార్భకునందు నుంచుటఁ బ్రమాదంబంచు నా నేత, యా
తనిఁబెన్గొండపురంబుఁ జేర్చి నచటన్ దద్రక్షణార్థంబుగా
బనిచెన్ విశ్వసనీయ రక్షకభట వ్రాతంబు తోరంబుగన్. 35

గీ. పదియునైదు శతంబుల పైన నైదు
వత్సరంబు లొగిన్ గ్రీస్తుభవము వెనుకఁ
బఱగఁ బెనుగొండకోట సాళ్వక్షితీంద్రు
డిమ్మడి నృసింహరాజు ప్రాణమ్ము లుడిపె. 36

ఉ. ఇమ్మడి నారసింహ ధరణీశ్వరు డీల్గుట తోడనే యవ
శ్యమ్ముగ సాళ్వ భూవలయమంతయు నీ తుళువాన్వయుండు యు
ద్ధమ్ముల సైన్యశాసన విదగ్ధుడు శ్రీ నరసింహరాజు శౌ
ర్యమ్మున శాంతిధర్మములు రాజిలఁబాలన సేయఁజొచ్చెఁబై
నమ్మహి రాజ్యలక్ష్మి తుళువాన్వయ పాలనఁజేసి వర్ధిలెన్. 37

సీ. తుంగభద్రానదీ రంగత్తరంగోత్థ
వాత సంస్పర్శా ప్రపూత మెయదది
సురుచిర నవరత్న శోభా విభూషిత

కాంచన శిల్ప సంఘటిత మెయది
సేవా వినమ్రారిభూవరసామంత
మకుట మాణిక్యాంశు మహిత మెయది
ఉభయ పార్శ్వస్థ భృత్యోచిత కరగత
చామర చాలన స్థగిత మెయది.

గీ. ఆద్య సాళువ భూవరోపార్జితమ్ము
నగు విజయనగరస్థ సింహాసనమ్ము
తుళువ వంశజులనుజేరి వెలుగఁదలఁచి
దండనాథ నృసింహు నేస్తంబు సేసె. 38

మ. కలకార్యంబులయందుఁ దిమ్మరుసు రాట్క ర్తవ్యముఁ బల్కభూ
స్థలిఁబాలించె నతండె సాళువ మహాసామ్రాజ్యమున్ దత్సము
జ్జ్వల విద్యానగరైకరాజ్యమును దోస్సారమ్మునన్‌జేసి తా
వెలయించెన్ జనభూమి నిర్జనవనోర్విన్ శాంతిసౌఖ్యంబుగాన్. 39

మ. భట సంశ్రేణి పరాక్రమోన్నతిననిన్ వర్తింప మత్తేభరా
ట్పటలిన్ దుర్గకవాటపాటన విధిన్ బర్వింప నాయోధనో
త్కటరంగ ప్రతిధావనంబులఁదురంగ వ్రాతమున్ జోప వి
స్ఫుటనైపుణ్యము జూపనేర్చె నరసక్షోణీశ్వరుం డర్వతన్. 40

మ. నరసక్ష్మాపతి సైన్యశాసనవిధిన్ దక్షుండు శత్రుక్షమా
హరణేచ్ఛన్ యవనాధినాథవశమై వర్థిల్లు శ్రీమద్బిజా
పురదుర్గంబు పయిన్ బడెన్ యవన భూపున్ జుట్టి యోడించె సం
గరభూమిన్ నరసింహుడీ నరసభూకాంతుండనన్ బేర్వడెన్. 41

చ. అతడొక పర్వమందు నిజహస్త సరోరుహమందు వారిపూ
రితమగు పాత్రబూని నగరీనికటోపవనీ విహార సం
గతి నలరారువేళ ఘనకాంతినికాయమొకండు నిస్స్వనాం
చితగతిఁ బాత్రవారిఁబడెఁ జిత్రవిచిత్ర వికాసమేర్పడెన్. 42

క. నరసింహ దేవరాయలు
పరమాశ్చర్యంబునొంది పటుతేజోవి
స్ఫురిత పదార్థ నిపాతము
సరణికి ఫలితార్థ మరయసాగెన్ మదిలోన్. 43

క. పెనుప్రొద్దు చింతసేయుచు
దన సచివున్ దిమ్మరుసును దత్ఫలమడుగన్
దనయొద్దికి రాఁబిలువన్
బనిచెను భటు నతఁడు మంత్రివర్యునిఁ దెచ్చెన్. 44

క. అనుపమధిషణాభూషితు
డనఁదగు తిమ్మరుసుమంత్రి యప్పుడ తెలిపెన్
జనవరునకు రుచిరాంబువు
లను ద్రావఁగఁ జెప్పె దత్ఫలం బిటులనుచున్. 45

చ. "జనవర! కాంతిపుంజ పరిసారితపూతజలంబు ద్రావిత్వ
ద్వనితను గూడుకొన్నయెడఁ ద్వాదృశకాంతిమయాత్మజాత సం
జననముగల్గుగాన నిముసంబును వ్యర్థము సేయ కేగు మీ
పని నెఱవేర్చుకొమ్ము పయిఁబర్యవసానము జూడగానగున్". 46

మ. అని వాక్రుచ్చిన నాలకించి హృదయవ్యాసక్త హర్షంబునన్
ఘనవిజ్ఞానపయోధి, తిమ్మరుసు వాక్ప్రౌఢిన్ మనంబుంచి మే
లని తత్పాత్రజలంబు ద్రావి యట నాగాంబాసతీరత్నమున్
గన గేళీవనిఁజేరి యందు వెదుకంగా జొచ్చె సంభ్రాంతిచే. 47

మ. పవలందున్ నలుజాములన్ విరహతాపంబంది కన్నీటిబిం
దువులఁ గార్చిన కల్వచెల్వకయి చేతుల్ సాచి గిల్గింతలఁ
సవరింపఁ బొల చందమామ యొదవఁ క్ష్మాజాని వీక్షించి కై
రవ దృజ్ మంజుల భావజార్తి కడతేర్పఁజేసె సంకల్పముఁ. 48

మ. అపు డా రాజు వినోదముఁ గొనఁగ లోకాంతర్గతిఁ వీడి చొ
క్కపు జాబిల్లి పయిఁ బయిఁ జనునటుల్ గన్పట్టెఁ గ్రొమ్మబ్బులే
త్రపమై వెన్కకుఁబోవు నొక్కొ యతడే తారాసమాలింగన
వ్యపదేశంబున దూగునో తతవియద్వారాశి నౌకాగతిఁ. 49

మ. నును కెంజాయల కప్పు దప్పికొని మున్ముందేగు జాబిల్లిపైఁ
దన బింబంబును గాంచి సిగ్గుపడి కాంతారత్నముల్ చేరువఁ
బ్రణయ స్వాంతులతో విహార సుఖ సౌభాగ్యంబు గోల్పోవువా
రని క్రొమ్మబ్బుల డాగి వెల్వడుచుఁజాటై యాడు దోబూచులఁ. 50

మ. తళుకుం బూత హెుఱంగు పుప్పొడుల నేస్తంబాడు మందానిలం
బుల సయ్యాటలు పూవువిల్తు చలనంబుల్ వేగిరం బూనఁగా
జలుపఁ లే జిగురాకు జొంపముల నాపాదించు పూరేకులు
య్యెల లూగఁ దమినూగసాగె ధరణీభృన్మౌళి భావాబ్జముఁ. 51

మ. మది విశ్రాంతి వరింపఁ జెంగట నవాంభస్సారణీదత్తదో
హద సంవర్ధిత చందనాది లతికాళ్యాచ్ఛాదితంబైన పూ
పొదరింటఁ నరసింహరాయలు పదంబుఁ బెట్టి తోడ్తో గళన్
మృదు పుష్పొఘరజోమయా స్తర వితర్దిఁ జేరె శోభానిధిఁ. 52

శా. ఆకుంబ్రోవుల యంతరాంతరములం దాలోక్యమానంబు ల
స్తోకప్రాభవదర్పకాప్తతుహినాంశు శ్రీ ప్రసారంబు లా
భూ కాంతున్ గలగించె విస్మయ గతాత్ముండైన రారాజుగా
నాకర్ణించె ససంభ్రమాంఘ్రియుగ విన్యాసంబు లప్పట్టునన్. 53

గీ. నాగమాదేవికై ధరా నాయకుండు
నెమకుచుండుటగని సుదూరమున నిలిచి
ప్రియసఖి యొకర్తు కనుసైగరీతిఁదెల్పె
నంబ యుపవనతులసీసమర్చ నునికి. 54

శా. తేజఃపుంజనిపాతకాలమును నద్దేవేరి బృందావనా
వ్యాజారాధన కాలమున్ గలియుటన్ బాటించి బృందావనీ
పూజాతత్పర నాగమార్థిత వరంబుల్ జెంద సార్థక్యమున్
దేజోరాశి సుతోద్భవం బగుట నిర్దేశించె రేడాత్మలోఁ. 55

క. ధరణీంద్రుడు క్షణకాలము
జరుపక తులసీవనమ్ము చాయఁ బోయెన్
దరుణిన్ నాగమ నరసెఁ
వర బృందార్చనము దీర్చివచ్చెడి వేళన్ 56

సీ. కర్పూర నీరాజనార్పణకై కొన్న
పైడి పళ్యెర మొక్కవంకఁ బెట్టి
దేవీ సమర్చనోద్దిష్ట పానీయ పా
త్రము నొక్కవంక న్యస్తమ్ముసేసి.
విమల సౌరభ సమావిర్భావదివ్య ప్ర
సూన పాత్రము వేదిపైన నుంచి
అంబికా నిత్యసేవాభ్యర్హ చామర
ద్వంద్వమ్ము నొక్కచో బదిలపఱచి.

గీ. దైవభక్తిని సుంత గుప్తమ్ము సేసి
పతిపదాంబుజభక్తి భావమున నిల్పి
అడుగడుగునందు మరులొల్క నాత్మవిభుని
జేరె నాగమ, లలిత శృంగారసీమ. 57

మ. ధరణీపాలుడు తన్వితో నుపవనీ తారుణ్య మీక్షించుచు
సరసన్ బర్వు లతాంతసౌరభము పెల్చ మూరుకొంచున్ మనో
హర కుంజమ్ముల సౌరు జూచుచు నట వ్యాపించు క్రొంబుప్పొడిన్
బరమామోదముతో స్పృశించుచు జరింపన్ సాగె నొక్కించుకన్. 58

మ. ఘనసామ్రాజ్య ధురంధరుండయిన భూకాంతుండు డాయంగ సద్
వినమద్ భావము జూపనోపునని భక్తిన్ బూపొదల్ పొంగి వి
చ్చిన పూజొంపములన్ గరాంజలుల గూర్చె శీర్షసంచారి కో
కిల రావంబులతో వచించె విజయోక్తి భావి సౌభాగ్యమున్. 59

మ. లలితోద్యానవనాంతరస్థమగు కేళాకూళి మ్రోలన్ విభా
సిలు పూవుం బొదరిల్లు, నీకిచట బూసెజ్జల్ విరాజిల్లు నీ
కలుముల్ నీయవి విశ్రమంబుగొని యేగన్ వచ్చు విచ్చేయు మం
చలిఝుంకార శుకప్రసంగముల నాహ్వానించు భూనాయకున్. 60

గీ. చక్కదనమున కిక్కయౌ చందమామ
మ్రాను వెడలించు ధవళాంశు మండలముల
కొమ్మలున్ రెమ్మ లాచ్ఛాదనమ్ము సేయ
తన్నికుంజమ్ము రజితసౌధమ్మెయయ్యె. 61

గీ. రాజ వనితాంగ భూషణ రత్నరుచులు
వరనికుంజ దళాంతర వలయితావ
కాశముల వేల చంద్రుల గలుగజేయ
శీతకరు డేటి కుదయించు సిగ్గుమాలి. 62

మ. చెలి కన్నుంగవ విప్పి నాథుని గనన్ సిగ్గోట గ్రీగంటి చూ
పుల నొయ్యారముమీఱ జూడగ స్మర ప్రోద్దామ సామ్రాజ్య సం
చలనం బేర్పడి సర్వకాముక జగత్సంక్షోభ దక్షాశుగా
వళి యెక్కుమ్మడి గ్రుమ్మెనో యనగ దాపంబయ్యె భూజానికిన్. 63

సీ. కొదమ నెమ్మి కొలంబు కులుకు జిల్కోడు నడల్
ఱేని గుండియ దద్దఱిల్లజేయ
మదనుని ములుకులై పొదరింట నరవిచ్చు

విరుల గాడుపుమెయిన్ వెత ఘటింప
తెలిపిలేకాడెడు మరువారువమ్ముల
పలుకుల చెవుల ముల్కులుగ బొడువ
చిగురులన్ గొఱికి రెచ్చిన గోరువంకల
చిందులు దొర ధృతిన్ గ్రిందుసేయ.

గీ. త్రిజగదానందకర హిమదీప్తి ధవళ
కిరణజాల ప్రసారణ సరణి నిండి
ధూర్త మన్మథ వృత్తికి దోడుసేయ
నేమి తోచనివాడయ్యె భూమిజాని. 64

సీ. పసుపు బూయుదును నీ పదములన్ రమ్మని
పచ్చగన్నేరు కొమ్మ హెచ్చరింప
పారాణి దీర్తు నీ పదములందని కర్ణి
కారమ్ము గారాబమార బిలువ
తిలకమ్ము మోమున దీర్తు రమ్మంచు ర
క్తాశోక కుట్మలం బాలపింప
కంఠమ్ము గైసేతు గదియుమీ యని మల్లి
కా నవ్య సుమము లాహ్వానమొసగ.

గీ. మేన గంధమ్ము గొనగ రమ్మీ యటంచు
చందన మహీరుహ మ్మది సైగసేయ
రాజసాధ్విని బిల్చె బేరంటమునకు
బహుళ శుభపేటి యుద్యానవనవధూటి. 65

మ. జలయంత్రమ్ముల నాలవాలములతో సంబంధముల్ గాంచి ని
ర్మల ధారా పరిపూరితమ్ములయి పాఱన్ జాలు పెన్బోదెల
బలు భూజమ్ముల కొప్పు శాఖలకు సంబద్ధంబులౌ తూగు టు
య్యలల దూగి నికుంజగర్భసుమశయ్య దోసె ఊడయ్యెడన్. 66

గీ. నాగమాంబిక ప్రియుని సన్నాహమరసి
అప్రదర్శిత లజ్జానుభావ సరణి
పూవు పొదరింట నుపచారమునకు దగిన
యెల్ల సామగ్రిగొని కొల్వ నిచ్చగించె. 67

గీ. సాధ్వి యొనరించు ఘనసారచర్చ లంది
వీవనల జోపు పొలగాడ్పు తీవి కలరి
మనుజనాథుడు మృదులసుమప్రభాస్వ
దతను శయ్యాతలంబున నధివసించె. 68

సీ. చిన్నారి క్రొమ్మావి చివురు జొంపములలో
నొడలుంచి కోయిల పడయుసుఖము
చిలుకల రారాజు లలిత బింబఫలంబు
ముక్కుతో సవరించి పొందుసుఖము
వలపు బెంపునజేసి బలుకూజితమ్ముల
పారావతమ్ములు పడయుసుఖము
అనువగువేళ గేకారవములు సేసి
నెమ్మికొమ్మ గడించు నృత్యసుఖము.

గీ. తుంగనగ మెక్కి మలగు పాంథుని సుఖంబు
తొలుత దొలకరి మొయిలిచ్చు జలకణమున
గర్భవతియగు చాతకాంగన సుఖంబు
నన్ని సుఖములు పువుసెజ్జ నవఘళించె. 69

క. కడచిన విరుమాసంబులు
పడతికి రుచిదప్పె భోజ్యవస్తువులందు
తడబడె నడుగుల్ ప్రొద్దులు
గడచెన్ రాట్సతికి బ్రసవకాలము వచ్చె. 70

# కృష్ణదేవరాయ జననము

సీ. ఆమనిదొర సోకునంతనె క్రొమ్మావి
కొమ్మకు నొదవు ఫలమ్ము వోలె
సు ప్రభాతమ్మంటిస్రుక్కఁ బ్రాచీదేవి
ప్రసవించు భాను బింబము వోలె
కలశాంబునిధివీచికామంగళాంగన
ప్రసవించు చంద్రబింబము వోలె
శుద్ధాంబుకణమొంది శుక్తికాంతాలలా
మం బీను ముక్తాఫలంబు వోలె.

గీ. దండనాథ నృసింహభూధవుని సాధ్వి
నాగమాంబిక పూర్వపుణ్య ప్రభూత
ఫలమనన్‌గృష్ణదేవరాయలు జనించి
ఆంధ్రకర్ణాట భూజనాహ్లాద మొసగె. 71

గీ. కృష్ణరాయలు భువి జనియించినట్టి
సమయ మది భద్రకరమయి చనుటఁజేసి
కవులు జ్యోతిష్కు లానందకలితులైరి
సరసకవి యొక్కఁడిటుసెప్పెఁజాటుధార. 72

ఉ. అందలి శాలివాహన శకాబ్దము లద్రివసుత్రిసోములన్
వందితమైన యవ్వికృతి వత్సరమందలి పుష్యమాసమం
దుం దగఁ గృష్ణపక్షమున నుండెడి ద్వాదశి శుక్రవాసర
మ్మం దుదయించెఁ గృష్ణుఁడు సుఖాన్వితుఁడౌ నరసింహమూర్తికిన్. 73

మ. జననంబందఁగఁ గృష్ణరాయ లఖిలక్ష్మాచక్ర భారాధివా
హన నమ్రాత్మశిరస్కముల్ కులగిరీశాశాసమంచత్ కరీం
ద్ర నికాయంబులు నిశ్వసించె గుణవద్భావాబ్జముల్ శోభిలెన్
వనటన్ గుందిరి వైరిభూపులు భయభ్రాంతుల్ విడంబింపగన్. 74

మ. గొనబుంబాపని మేని క్రొంబసిడి తళ్కుల్గాంచి యానంద సం
జనకామోదభర ప్రసూనలతికా సంచారి భృంగాళి కాం
చనపుష్ప భ్రమఁజెంది దవ్వులనె సంచారంబు గావింపఁగాఁ
బ్రణయారామ సువర్ణ భిన్న సుమవద్భావంబులన్ దార్కొనెన్. 75

మ. చతురాస్యుం డల మించుటద్దమున మించన్ బోలు స్నిగ్ధత్వముౕ
స్మిత నిత్యాసవ సౌరభాభ్యుదయ రాజీవైక శిల్పోన్నతిన్
బ్రతతోర్వీజన భావరంజన చణ ప్రాలేయరుగ్దీప్తి మి
శ్రితమున్ జేసి సృజించె రాయల ముఖశ్రీపూర్ణ సౌందర్యమున్. 76

ఉ. అంగజ రామణీయక సమన్విత నిర్మల కృష్ణదేవ రా
ట్సంగత మంజులాస్య జలజాత వినిస్సృత వాక్సుధారతిన్
జెంగటఁ దద్రసానుభవశీల బుధాళి కులంబు ఝుంక్రియా
సంగతి వీనులన్ గవిసి సమ్మతి నిమ్మని సందడించెడుౕ. 77

చ. ఇరువదినాళ్ళు హర్షమున నేగిన యంత సుమంగలీ సము
త్కర మరుదెంచి రాబుడుతఁగాంచన డోలికనుంచి యూపి యు
ర్వర సకలాంగ శోభమెయి రాజసమీక్షణ కర్షణస్ఫృతిన్
సరగునఁగృష్ణరాయలను నామమునౕ బలుకాడి రుబ్బునౕ. 78

చ. అవయవ దార్ఢ్యముౕ నవనవామల హేమసమాంగదీప్తి కై
రవదళ మంజులాక్షము, లురస్థల విస్తృతి, చాకచక్యమున్
గవిసిన వారిచిత్తముల గ్రన్నన నిగ్గుటఁజేసి కృష్ణ భూ
ధవుఁడని తల్లిదండ్రులును దజ్ఞులు బిల్చిరి తత్కుమారకున్. 79

మ. జననీ స్వాదుపయః ప్రపాన విధిఁబెల్చన్ బూతనాళీక సం
హననోత్తేజమెలర్ప, సూనమృదుశయ్యాశాయియై ప్రొద్దుల
ల్లనఁ బుచ్చెన్ గమనీయ హేమమయ డోలాన్యస్తగో పుత్తళీ
తను రక్షాదర కేళిఁ గృష్ణుఁడు యశోదానంద కృష్ణుంబలెన్. 80

మ. నెలఁ(క్రొందళ్కుల వెన్నెలల్ దిగిచి చూర్ణింపంగ నౌచూర్ణమో
కలశాంభోనిది వీచికాకణములో, కల్పద్రుమోద్భూత ని
ర్మల పుష్పంబొకొ, వేల్పుటావొసఁగు క్షీరవ్రాతమో యంచు రా
యల లేనవ్వులఁ గాంచి సంజనిత శంకాయత్తులై రెల్లరున్. 81

మ. స్థిరదోస్సత్త్వ సమార్జనోద్యమము నక్షీణక్షమాదార్ఢ్యముఁ
వరలక్ష్మీ సముపార్జనావ్యయవిధానజ్ఞాన మార్యోక్తబం
ధుర కార్యాచరణ బరిందమసముద్యోగవ్రతౌత్సుక్యమున్
పరగున్ బాలుని వర్తనంబున ననన్ వాక్రుచ్చి రార్యావళుల్. 82

మ. కరపద్మమ్మునఁ బాదపంకజము నాకర్షించి లాలాజల
స్ఫురదాస్యమ్మున నుంచి పాదమునఁదత్ శుద్ధాంబువుల్ జాఱ జూ
పఱకున్ బ్రాక్కమలాక్ష నిర్మల పదాబ్జస్యంది గంగా విని
స్సరణంబున్ స్మృతిగొల్పఁగా జనని కృష్ణాయంచు ముద్దాడెడిన్. 83

మ. చనుబాలీయక తల్లి జాగు సలుపన్ సైరింప కాలోననే
ఘన వీణాగత పంచమస్వర కనత్ కాంభోజికారాగని
స్స్వనమేపారఁగ రోదనంబు సలుపున్ బాలుండు సామంత త
ర్జన గర్జాయుత భావిభూమివిభుడై రాజిల్లునో నాన్ విధిన్. 84

మ. దినముల్ జాఱు కొలంది రాకొమరు డుద్దీప్తార్చ తేజస్వియై
తనవారీరని యన్యులీరని విభేదజ్ఞానముం జెంది య
మ్మను, నయ్యన్ గుఱితించి వారు గనిపింపన్ నేలపైఁ బ్రాకు నె
చ్చిన మోహంబునఁ దల్లిదండ్రు లొడిలోజేర్పించు పర్యంతమున్. 85

శా. కాలున్ జేతులు నేలమోపికొనుచున్ గందోయి కెందామరల్
మ్రోలన్ బిట్టు నిగిడ్చి దవ్వగు పదంబున్ జేర బారాడుచో
బాలీయన్ నెపమూని చేర్చుకొని నిల్పఁజూచు నయ్యారె? యె
వ్వేళం బిడ్డలతల్లి యుల్ల మకృత ప్రేమాలయంబేగదా? 86

సీ. కొమ్మలన్ జివురు జొంపమ్ము గన్పడువేళ
జిలుకమ్మవోలె భాషింపజూచు
ఆమనిదొరరాక నానందమున(బాడు
పరభృతాంగనవోలె( బాడ(దివురు
నవమేఘ నినదంబు చెవుల సోకిన వేళ
నెమ్మివోలిక నాట్య నియతి కడరు
మృగయావిహారులు మీద రానగువేళ
బెబ్బులివోలె నోర్విప్ప(జూచు.

గీ. దరికి(జేరిన యాప్త సుందరులచేత
లరసి యాలీల స్వయముగా ననుకరించు
పలుకరించినవారి వాక్కులన మరసి
కిలకిలారవ మలర నవ్వులకు దూగు.

గీ. అమ్మయును నయ్య రమ్ము రమ్మనుచు(జేయి
సన్నగావింప మందహాసమ్ము సేసి
చేతులాడించి యెగ(బ్రాకురీతి నమరు
శైశవమ్మున( గృష్ణరాడ్ జనవరుండు. 87

మ. మును బ్రా(బల్కుల సోమకాసురుడు గొంపోవంగ( దద్దర్ప సం
హననమ్ముౕ రచియింప మీనమగు వేదాంతశ్చరుం, డాగమా
వనమున్ నేడునుజేయరాయనయన ద్వంద్వమ్ముగానై తదీయాంగనూ
తన లావణ్యపయోధి వీచికలలో( దారాడు నశ్రాంతమున్. 88

మ. అనలాక్షాహవమందు నోటువడి సూనాస్త్రుండజున్ జేరి త
ద్ఘనవైద్యర్థ్యముజూప నిల్వనగు సత్స్థానంబు జూపింప(గో
రిన వాణీశుడు కృష్ణరాయల తనుశ్రీధామమున్ జూపె నం
తనె నేత్రాబ్జ శరంబులన్ గొని తదీయాంగంబునన్ నూల్కొనెన్. 89

మ. ధరణిన్ భారతభూమి పూజ్యమట నాంధ్రక్ష్మాతలం బందుశ్రీ
కర కృష్ణాతటినీ జలానుగత తుంగావాహినీ ప్రాంతమ
ద్దరి విద్యానగరంబు, నందు దుళువోద్యద్వంశ మద్దానశ్రీ
నరసింహాధిప కృష్ణరాయ మహమెన్నఁ స్తవ్యముత్కృష్టముఁ. 90

మ. మతికౌశల్యము కృష్ణరాయల కసామాన్యంబుగా నౌటఁద
త్పిత, శ్రీమన్నరసింహ భూమివిభు డా తిమ్మర్సు మంత్ర్యగ్రణిన్
హితమున్ విద్యయు నేర్ప నేర్పఱచె శ్రీకృష్ణుండు మంత్రీంద్ర బో
ధిత విద్యాచయమెల్ల నేర్చుకొనె నిర్దిష్టాల్ప కాలంబునన్. 91

క. తిమ్మరుసె గాక యాతని
తమ్ముడు గోవిందరాయ తజ్ఞుండును రాట్
సమ్మత మవశ్యమగు శా
స్త్రమ్మున్ జదివించెఁ గృష్ణరాయలచేతన్. 92

మ. తెలవార్జామున నిద్రలేచి హయమున్ దెప్పించి పైనెక్కి యు
జ్జ్వల తేజంబున దవ్వుగాఁబఱచు టభ్యాసంబు గావించె ని
శ్చలతన్ ఖడ్గము ద్రిప్పనేర్చుకొని యిచ్చన్ దండముఁ బూని శ
త్రులు డాయన్ దెరువీని బాతి దెసలందున్ ద్రిప్పె వేగోద్ధతిన్. 93

గీ. ప్రాజ్ఞ సన్నుతమగు బుద్ధి పటిమతోడ
ఆయుధాభావ ముష్టి యుద్ధాదులందు
ప్రకట విజయార్జనాభ్యర్హ మంగబలము
కృష్ణరాయలయందు వర్ధిల్లఁజొచ్చె. 94

చ. కరకమలమ్మునన్ ధనువుగైకొని లక్ష్య పదార్థమందునన్
గుఱియుడివోవకుండఁగఁ దగుల్కొను వైఖరి వేయనేరిచెన్
దురములయందు శాత్రవులతో వివిధాయుధ సాధనమ్ములన్
బరిపరి బోరు కౌశల మపారముగా గడియించె నుద్ధృతిన్. 95

మ. నవ తేజోనిధి నా గురుద్వయము కర్ణటాంధ్ర భాషాద్వయిన్
వివిధాంశజ్ఞుని సాహితీయుతుని సంవిద్యుక్తుఁ గావించి యం
దు విశేషజ్ఞునిఁజేయఁగా నయిరి హిందూస్థానివాక్ సాహితిన్
గవి గావించిరి వాక్త్రయాంతరలసత్కావ్యావళిన్ వ్రాయఁగన్. 96

మ. నరసక్ష్మాపతి దండనాయక కలా నైపుణ్యమందున్ సము
ద్ధురుడయ్యెన్ మఱి కృష్ణరాయలు రణోద్యోగ ప్రకారజ్ఞ భూ
వర విద్యావళియందు మేటి యనఁగన్ బ్రావీణ్యమున్ నేఱిచెన్
సరసానీకము మ్రోల జేయఁగలిగెన్ శాస్త్రార్థ సంవాదముల్. 97

గీ. తిమ్మరుసుమంత్రి సర్వాంశ ధీరుడగుట
రాజ్యహిత దండనీతిని రాజనీతి
రాజ్యతంత్ర ప్రయోగ సంరంభమందు
నర్హునింజేసెఁ గృష్ణరాయ క్షితీంద్రు. 98

గీ. ప్రాజ్ఞు తిమ్మర్సు గోవిందరాయ విబుధ
యుగ్మమునఁజేసి కృష్ణరాయోర్విజాని
సాహితీముఖ్య కళలకు సదృశములగు
రాజకీయ కళల్ నేర్చి ప్రథిమఁగాంచె. 99

సీ. పదియాఱుకళల నభ్యుదితు డీతండని
బిరుదుగా నిల్చి సేవించె రాజు
నయవాచిసుకవితా ప్రియుఁడని శుక్రుండు
వేఁగయి దినము సేవించుచుండె.
అధిక మేధారాశి యవతరించె నటంచు
గురుభావ మన్నిటన్ గూర్చె గురుఁడు
సంస్తవ్య విజ్ఞానశాలి పుట్టెనటంచు
నన్యాకృతుల బుధుం డనుసరించె.

గీ. రాయలను నాహ్వాయంబు సంగ్రహముసేసి
ప్రొద్దు పొడుపొడు చుక్కతో నిద్దురవిడి
బుధులు సేవింప దినదినాభ్యుదయమంది
రాయ లఖిలోర్వికిన్ మాననీయుఁడయ్యె. 100

శా. విద్యాభ్యాసము నాటినుండియును సంప్రీతిన్ నిజభ్రాతృ ని
త్యోద్యోగంబున కంటె నెక్కుడుగ నెంతో సేసి ధీరోక్తసం
వేద్యాంశంబులఁ గృష్ణరాయ లధికాభిజ్ఞుండుగానాయె భూ
భృద్యోగంబున కీతఁ డర్హుడనుచుఙ బ్రేమించి రుర్వీజనుల్. 101

గీ. తిమ్మరుసు మంత్రి శ్రీ కృష్ణదేవరాయ
ధీవిశేషమ్ము తండ్రికిన్ దెలుప నతఁడు
వీరనరసింహ విభునిపైఁ బ్రేమకంటె
నధికమగు ప్రేమఁగృష్ణునియందుఁజూపె. 102

మ. తుళువాఖ్యాన్వయమందు నెందరొ నరేంద్రుల్ పుట్టి రవ్వారిచే
గులసంవర్ధనమయ్యెగా, కసము జేకూర్పంగ శ్రీకృష్ణరా
య లొకండే గణనీయుడయ్యెఁ; గనరావా తార లేనూరు లు
జ్జ్వల శీతాంశుని మండలంబె నిశి భాస్వంతంబుగాఁ జేసెడిఙ. 103

మ. ధరణిన్ భారతఖండ మర్హమట నాంధ్రక్ష్మాతలంబందు; శ్రీ
కరకృష్ణాతటినీ జలానుగతతుంగావాహినీ ప్రాంతమ
ద్దరి విద్యానగరంబునందుఁ దుళువోద్యద్వంశ మద్దాన శ్రీ
నరసింహాధిప కృష్ణరాయ మహ మెన్నన్ స్తవ్య ముత్కృష్టమున్. 104

మ. జనసందోహము కృష్ణరాయ ధిషణా సత్వాదులన్ గాంచి య
త్యనురాగంబున జేచుటన్ జనకుడున్ దత్పుత్రుఁ బ్రేమించుటన్
గని తిప్పాంబిక యోర్పుమాలి తదసుగ్రామంబు దీయించుచో
తన పుత్త్రుండధికారి యౌనెనెడి చింతన్ జేసె స్వాంతంబునన్. 105

మ. తనయున్ వీర నృసింహదేవ విభునే ధాత్రీశుఁజేయన్ బ్రజల్
ప్రణతుల్ గూర్పగ రాజ మాత పదవీ లభ్యాధికారంబునన్
బడుపుల్ సేయుటగోరి కృష్ణ విభునిన్ బ్రాణాంతకృద్దుర్విషం
బును దిన్పింపగ దాసి బిల్చియిటు లొప్పుల్ తీర్చుచున్ వాకొనెన్. 106

మ. వినుమీ నెచ్చెలి? కృష్ణరాయలయెడన్ విద్యా వివేకాదులె
చ్చని రాజేంద్రుడు వానిపై నెపుడు ప్రేమాధిక్యమున్ జూపెడున్
మన భూపాలుఁడు వృద్ధుడయ్యెఁదుద సామ్రాజ్యాధికారంబు కృ
ష్ణునకే కూర్చు తెఱంగుదోఁచుమన హెచ్చుల్ సాగునే? యయ్యెడన్.107

మ. తనకున్ నాకు నృసింహరాయలగుగాదా జ్యేష్ఠుడౌ పుత్రుడా
తని మన్నింపక నాగమాంబపయి నుద్యత్ప్రేమచేఁ గృష్ణరా
యని రాజేంద్రుని చేయుజుమ్మియిక నాగాంబాధికారంబులో
మన దౌర్భాగ్యముపొందు నామనికికిన్ మర్యాద యొండుండునే. 108

మ. విస మన్నంబునఁ గల్పినాకిడుము సంప్రీతిన్ దివిన్ జేరెదన్
వెస నన్ వీడఁగలేవొ కృష్ణున కదే పెట్టించి నాయీ మనో
వ్యసనం బంతముసేయు మంబునిధి పర్యంతోర్వి సామ్రాజ్య భా
గ్య సుఖంబుండిన జీవి న్యూనగతిజన్యాయాస మెట్లోర్చెడిన్. 109

క. అను కంపా శూన్యంబుగ
జనపాలిని మడిన క్రూర చర్యకు దాసాం
గన చింతిలి, గృతి నామెకు
గనుకొలుకులజాఱు అశ్రుకణములు దుడిచెన్. 110

శా. అమ్మా! యస్థిరధాళధళ్యచపలావ్యాలోల తేజః ప్రసా
రమ్ముల్ భూరిదయాస్వరూపరస నిర్యత్ప్రా వృడంభోదరూ
పమ్ముల్ నీలసరోరుహో పమితముల్ త్వల్లోచనమ్ముల్ విషా
దమ్ముల్ దెల్పెఁడి నశ్రుబిందువులు చిందన్ గుందఁగా నేటికిన్. 111

చ. జననిరో యేటికీవనట? చారుతరాంబుదసీమనుండి చ
క్కని నునువెల్గులీనునుడు కాండము లుర్వికిఁవ్రాలులీల న
ల్లని చికురాళిమంజులవిలాసము డీల్వడ బొంతనేల రా
లిన యవి పూవుజొంపములు క్లేశమదేటికి నీ మనంబునన్. 112

చ. అరమరలేక కొల్చితి నహర్నిశమున్ దొలినుండి నిన్నె నీ
వర నిముసంబు గన్పడమి నాత్మకుఁదత్తఱపాటు దోచె; భీ
కరవిషమాని నే మడియగాఁగల నంచు వచింతువౌర నీ
వరిగినయంత నే నెవరియండ మనన్గలదాన నమ్మరో. 113

మ. విరిగుత్తుల్ తురుమన్ విభూషణమె? దేవీ! గంధసారం బలం
కరణంబే! కమనీయకాంచన కలాగారాచంలంబుల్ జరీ
పరిధానంబులు నాకలంకృతులె? త్వద్భద్రాకరాజ్ఞామయా
భరణం బొక్కతెచాలు నీదు పనుపుఁ భాషింపుమీ కొల్చెదన్. 114

ఉ. తెల్లము కృష్ణరాయుఁగడతేర్చుటయే భవదీప్సితంబు నీ
వెల్ల విధంబులఁ బ్రమదమేర్పడ గ్రుమ్మఱుచుండు మమ్మ నీ
యల్లము సంతసిల్లునటు లోదనమందు విషంబువెట్టి యే
యల్లరిలేక కృష్ణవిభు డంతమునొంద రచింతు నింతలోఁ. 115

మ. బలిమిన్ రాణికి నిట్లుసెప్పి మదిదన్పఁ జాలెనేగాని యా
చెలి, యాజ్ఞఁ గొనిపోయి బైటనిటుగా జింతించెఁ బ్రశ్నద్వయిఁ
బలుకున్దప్పి నృపాంగనాశిత కృథావహ్నిన్ బడుఁ నిల్తునా
ఖలవృత్తిన్ నరపాలపుత్రహననాఘంబూననౌనా? యనన్. 116

మ. అని చింతించి లతాంగి; యశ్రుతతి, కుల్యాతుల్యమైతూగి త
ద్ఘనవక్షోరుహలగ్నశాటిఁ దడుపంగా మోము నెత్తమ్మిపైఁ
దనకేలుంగవనొత్తి రోదనకటు ధ్వానంబుగావించె నా
ధ్వని యాలించి మరొక్కదాసి మదిలో దర్కించెనీ కైవడిఁ. 117

మ. అది కేళీవన చిత్రనర్తన మయూరారావమౌగాక; అ
యదికాదందుమొ తంత్రికాఘటిత వీణాలాప కాంభోజికా
భ్యుదయన్నాదమెయై తనర్చవలె నత్యుగ్రాపదావేగవ
ద్ధృదయాంభోజముఖీ ప్రరోదనముగాదే యోజ యోజించినన్. 118

చ. అని మది యూహసేసికొని యానవకోమలిఁజేరి యాపె మో
మున గయిదోయి నుంచుకొని భోరున నేడ్చుచునుంట నెచ్చెలీ!
అనయము మందహాసముదంచిత మంజుముఖారవింద వై
కొనకొని సంచరించుదువు గొల్లున నేడువ నేటికిట్లనెన్. 119

మ. అమృత శ్రీతుళువాన్వవాయభవు లుద్యత్కృష్ణరాయాది కో
త్తమ భూభృజ్జనకుల్ సుధౌదనముచేతన్ బెంచి రీమేను ని
య్యమృతప్రాయకరమ్మునందు విషమిశ్రాన్నోద్భవంబందు కా
లము పైకొన్నది యీ విరుద్ధవిధి యేలా గోర్తు నబ్జాననా! 120

గీ. అనుచుఁదిప్పాంబికాధిశాసననిబద్ధ
దాసభామిని నుడువఁదద్వాగ్రహస్య
భావమున్ గ్రహియించి యా పంకజాక్షి
వెలవెలంబడి యూరార్చి వెడలిపోయె. 121

క. సుదతీమణి యానుడి తన
ముదితకుననె నట్లె పోయిపోయి రహస్యం
బది గదిసెఁదిమ్మరుసు; నుడి
పెదవిన్ దాటంగఁ బృథ్వి వెదచిందుగదా? 122

సీ. పైడి తొట్టియడోలఁబండు ప్రాయమునుండి
ముద్దాడి ప్రేమించుపుణ్యమూర్తి
కూకటి ముడితోడి కొదమ ప్రాయమునుండి
పలుకాడ నేర్పిన ప్రాజ్ఞమౌళి
పఱువెత్తబలము పైబడు ప్రాయముననుండి

యాటాడనేర్పిన యార్య జనుడు
బాహు యుగ్మము గట్టిపడు ప్రాయముననుండి
కత్తిసాముల నేర్పు గణ్యబుద్ధి.

గీ. భూరి విద్యాప్రబోధక సూరివిభుడు
దిగ్విజయయాత్ర నేర్పిన ధీరమూర్తి
తిమ్మరుసుమంత్రి శ్రీకృష్ణదేవరాయ
విభున కాపద గ్రమ్మ నేవిధి సహించు? 123

సీ. సరస ప్రసంగమా! సత్సభనే గాని
ప్రౌఢకాంతారాజితోడగాదు
రాగమా? ధర్మసంరక్ష యందేగాని
విషయ సౌఖ్యంబులన్ వెలయబోదు
అర్జనానక్తియా? యశమునందే గాని
అధికార్థ సంచయమందుగాదు
విలసద్వినోదమా? కళలయందేగాని
జనులతోఁగేలికా సరణిగాఁదు.

గీ. సాంద్రభక్తియ? సుజనరక్షణ సమర్థ
రామరాజ పదాలనే గ్రాలుగాని
స్వల్పములలేదు తిమ్మర్సు సచివమణికి
అతని సుమనీష; ఆంధ్ర లోకైకభూష. 124

గీ. బాలవిభునకుఁదల్లి భావంబుసెప్పె
సుదతిసేసిన పూన్కి రాజునకుఁదెల్పె
మాత కీ రీతి తగదని నీతిఁజెప్పె
కృష్ణరాయల మృతి దొలగించె నతఁడు. 125

మ. నరసక్ష్మాపతి, తిప్పమాంబ, సుతు ప్రాణంబుల్ విషాన్నంబుచే
హరియింపఁబయి బూనెనంచు విని యవ్యగ్రాగ్రహోదగ్రుడై
దరికిన్‌బిల్చి యథార్థ మాడుమనుచుఁ దర్జింప నవ్వేళనా
సరసీజాక్షి యదెల్ల కల్లయని పెల్చన్‌జెప్పి, పై నిట్లనున్. 126

ఉ. దాసి యొకర్తు తప్పున నదల్చఁగ రోసముబూని నాకు నా
యాసముగూర్ప దబ్బరలనాడిన మాత్రన నీతికోవిదుల్
త్రాసము లూని యీ పలుకులన్ నిజమారయ కాగ్రహింతురే
నాసరివారు నీకుఁ బెరనాతులుగల్గరె యీసడింపఁగన్. 127

చ. అదియునుగాక నీవెరుఁగ వాతనిచర్యలు కత్తిసాములన్
మెదలి ధనుష్కళాసరణి మేటితనంబు గడించి మేందు
ర్మదము వహించి సేగికిని మంచికి భేదముజేయ కుద్ధతిన్
మది కెటు తోచునో యటులె మన్నన మానిచరించు నెల్లెడన్. 128

ఉ. ధారుణి కెల్ల నిత్తఱినె తానె విభుండయినట్లు క్రుమ్మఱున్
వీరనృసింహరాయుఁబృథివీపతిఁ జేయుదువంచు దుష్కరే
ర్ష్యారతినిన్ వధింపఁగ సహాయము సేయఁగ నన్నుఁజేరి సం
ప్రేరణ సేసె నీ వెనుకఁ బిల్లల నన్నెటు సేయ నెంచెనో! 129

గీ. వీరనరసింహుడే సింహపీఠమునకు
నర్హు డధికారి జ్యేష్ఠుడై, యతని వలన
నధికశోభ వహించు సింహాసనంబు
అత డధిక శోభగాంచు సింహాసనమున. 130

ఉ. ఊహ యొకింత చాలక తనూద్భవుడన్ మతిఁగృష్ణరాయు నీ
వాహవ శూరుఁచేసితి వహా రిపురాజుల నుక్కడంపఁగా;
మోహముచే నృషింహునకె; భూపరిపాలన మీ వొసంగుచో
ద్రోహముబూని నిన్నును సుతున్ వెసఁగృష్ణవిభుండు గూల్చఁడే! 131

చ. తుళువ మహాన్వయం బనభిదూష్యము సత్కరుణాలవాలమున్
తుళువ మహాన్వయాబ్ధిజనితుండవు నీదు కృపారసంబుని
ర్మలము భవత్స్వభావమును మార్దవపూరిత మట్టి సద్గుణం
బులు భవదీయ కృష్ణునెడఁ బుట్టనివయ్యె నిదేటి చిత్రమో. 132

గీ. ప్రస్తుతోదంత మెంతని పల్కుదాన;
చెఱకుతుద వెన్నుబుట్టిన సరణియయ్యె
తియ్య చెఱకున నలరారు తీయదనము
చెడునను భయంబు దోచు నా చిత్తమునకు. 133

చ. సరస వసంత సత్సమయ చారురసాల విశాల శాఖికాం
తరముల వాయసార్భకము తావొనరించి విదల్చి ఱెక్కలన్
బరభృతవల్ల భంబనని పాడినయంత వసంతభాగ్య రా
జ్యరమకు సింహపీఠము రసాల మలంకృతమౌనె దానిచేన్. 134

చ. విను తుదిమాట నీమదికి వేడుక తీఱగ నాత్మశాంతియున్
జనఁజరియింప నెంచుదువొ సాధుహితావన సేయనెంతొ త
త్తనయనివిష్టమోహమును ద్యాగము సేయుము కృష్ణరాయలన్
గొని వనసీమనిల్పి, తలగోయ, భటాళికి నానతీయుమీ. 135

చ. అనవుడు తన్నృసింహ వసుధాధిపుఁ డంగనమాట నమ్మి పు
త్త్రుని తలఁగోయ నానతిడఁ దూగఁగఁజాలక, చింతసేసితో
డనె తన మంత్రిందిమ్మరుసు డాయఁగఁబిల్చి దురాగ్రహానఁగృ
ష్ణుని కనుగ్రుడ్డులన్ దిగిచి చూపుమి నాకని యిచ్చెనానతిన్. 136

మ. అవురా? సాహసలక్ష్మి; ఘోర రణరంగాయాతవైర్యంత బా
హువులన్ దాండవముల్ రచించుట నిసర్గోద్యోగమే నీకు ని
న్నవ సామ్రాజ్యరమార్థ విక్రముని గృష్ణక్ష్మావరున్ మ్రింగఁగై
తవ వాక్కల్పన మేరమీరెడు భవత్సామర్థ్యమల్పీయమే? 137

ఉ. తల్లి విషంబు పెట్టుటకుం దార్కొనుచుండఁగఁ గన్నతండ్రి, తా
నుల్లముఁ గ్రూరకైతవ సముద్యమవద్వనితాళికీయఁగాఁ
గల్లరిదైవ మాపదలఁ గావఁగనేర కరణ్యసీమలన్
దల్లడమందఁ ద్రోయఁగనఁదక్కుట యెంత యదృష్టశాలికో. 138

చ. జనకుడు రోసి మృత్యుముఖసంగతికై పెడద్రోయ నర్భకున్
ఘనవిపదబ్ధి వీచికల గాయము నోడcగ నీక నౌకచా
డ్పునc గయి యూతనీయcగను పుణ్యసుధానిధి తారసిల్లు ధో
రణిగన రక్ష్యరక్షకపురాకృత బాంధవలభ్యమేగదా? 139

చ. అమిత గభీరభావమున నాసచివాగ్రణి మాఱువల్కక
క్రమమని తిప్పమాంబికయె కారణమింతకనన్ గ్రహించి శీ
ర్షముcదగనూపి, చిత్తమని సత్వరమేగి కుమారకృష్ణు సం
భ్రమమునc బిల్వనంపి, ప్రభువర్యుని యానతిcదెల్పి చింతిలెన్. 140

చ. జనకునికంటె నత్యధిక సాంద్రసమాదర దృష్టితోడc బెం
చినకరుణానిధిన్ గదిసి చేతులుమోడిచి కృష్ణరాయ లి
ట్లనె వినయంబు పెంపున, ధరాధిపుడియ్యెడcగామ మోహ బం
ధనమున నిట్టి శాసనము నాకిడె నావల నేద్వకుండునే? 141

శా. ఆశ్చర్యంబొక యింతలేదుసుమి, జాయాప్రేరిత స్వాంతుcడై
దుశ్చేష్టారహిత ప్రవర్తనునియందున్ నేరముల్ మోపుచున్
నిశ్చింతామతి ఘోరశాసనము నందించెన్ ననున్ వీడుమా
పశ్చాత్తాపము నొందుతన్ జనకుడీ పాపంబు శాంతించుతన్. 142

గీ. అనcగ విని ధైర్య గంభీరతాంబురాశి
శాంతిశీలుcడు నగ్రవంశజుడు మంత్రి
సుప్రసన్నాత్ముcడాగామి శుభవిదుండు
కనులcగ్రమ్మిన కన్నీరు గార్ప కడcచె. 143

గీ. అవనమార్గమ్ముc నరసి రాయలకు ధైర్య
సరణి వాక్రుచ్చి యభయహస్తం బొసంగె
దన రహస్యాలయంబునc దావొసంగి
యుచిత సమయంబుదన్కc నం దుండుమనియె. 144

మ. తలఁపన్ సాళువరాజ్య ఖండమున నంతర్వైర బద్ధోగ్రదో
ర్బలులన్ ద్రుంపఁగఁ, గృష్ణరాయ లొకఁడే పర్యాప్త సత్వుండనన్
దెలియున్ మంత్రికి, దాన, నా యువకు నిస్తేజస్కుఁగావింపఁగా
వలదంచున్ సచివుండు పూనె నుచితోపాయంబు ధైర్యంబునన్. 145

మ. ఒక నవ్యాజము జేర్చి, మంత్రి,కనుగ్రుడ్లూడన్ బెకల్పించి న
మ్మక మేపాఱఁగఁ జేయ వానిఁగొనుచున్ క్ష్మాజాని దర్శించి కృ
ష్ణ కుమారున్ విగతాక్షుఁ జేసితి నివే యీక్షించుమీ గ్రుడ్లనన్
బ్రకటించెన్; విభుడున్ గుమార నిశితాపత్ప్రాప్తికిన్ జింతిలెన్. 146

ఉ. అంతిపురంబునందుఁ తన యంగనలెల్లరు కృష్ణరాయ దృ
ష్ట్యంతము చింతసేసి సుగుణాఢ్యుడు కృష్ణకుమారుఁ డక్కటా!
ఎంత విపత్తు పాలఁబడె, నెంతటి హృత్కఠినత్వ మీ మహీ
కాంతుడు పూనినాఁడనుచు గర్హణసేసిరి మాటిమాటికిన్. 147

సీ. కత్తిసాములతావు కర్రత్రిప్పులతావు
కృష్ణరాయల జాడ కెదురుచూచె
అహరహంబును విహారార్థ మేతెంచెడి
హయము ఘాసముమేయ కట్టె నిలిచె
మన రాచకొమరుని కనుచూపు చనెనని
నిఖిల ప్రియాళి కన్నీరువిడిచె
గుణశాలి కిక్కట్టు గూర్పవచ్చునె యంచు
నగరీ ప్రజావళి నలువఁదెగడె.

గీ. సకల జనములు నిటు పలుచందములుగ
గృష్ణరాయల శిక్షా నికృష్టగతికి
వగచిరేకాని కనరైరి వాస్తవంబు
సచివకృత కార్య మతిరహస్యముగ నుండె. 148

మాలిని. నవనళిన దళశ్రీ నర్తితాపాంగధుర్యా
అవగత శమలీలాహారిహృన్నిత్యచర్యా
కవిగణ గణనీయా ఖండవాణీ సపర్యా
అవిరతభిషగీహాభ్యాసి నారాయణార్యా. 149

ఇది
శ్రీమదుభయ భాషాకవితాప్రవీణ, సహస్రావధాన చతురానన, సహస్రావధాన పంచానన, పంచ సహస్రావధానీత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ పయఃపారావార రాకాసుధాకర సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రణీతంబైన సాలంకార కృష్ణదేవరాయలను ప్రబంధంబున ప్రథమాశ్వాసము సంపూర్ణము.

# సాలంకార కృష్ణదేవరాయలు

## ద్వితీయాశ్వాసము

క. శ్రీరమ్య సరసకవితా
ధారాకృత బహుళ కృతికథా సముదాయా
ధీరవ్రాత విధేయా
నారాయణరాయ సద్గుణ స్తవనీయా! 150

మ. చనియెన్ గొన్నిదినంబు లుర్విపతి తత్సామ్రాజ్య సామంతరాడ్
జనముల్ ధిక్కృతి సేయఁబూనిరనుచున్ జారుల్ ప్రసంగింపఁద
ద్ఘనసామ్రాజ్య పదావనోచితతృటిన్ దా సంస్మరించెన్ సమ
స్తనరేంద్రస్తుత కృష్ణరాయల మహాసంగ్రామకౌశల్యమున్. 151

గీ. అన్యజనభాషితంబుల నాలకించి
యరయకే కార్యమేని జేయంగరాదు
దున్న యీనినదని యెక్కడన్న వెంట
వత్సమున్ గట్ట నరుఁడా త్రపడఁగరాదు. 152

క. అరసి, నృపాలుం డతిదు
ర్భరమగు వెతనొందె; కృష్ణరాట్ శూన్యంబౌ
పురమేల, రాజ్యలక్ష్మీ
పరిపాలన మేటికనుచుఁ బరితాప పడెన్. 153

గీ. ప్రకటతేజస్వి శ్రీ కృష్ణరాయ లొకఁడె
అరిజనానీకదర్పాపహరణచణుడు
అమృతకిరణునికంటె నే యన్యమూర్తి
అర్ధరాత్రాంధతమసమ్ము నడఁపనేర్చు? 154

గీ. రాజ్యమధ్యమ్మునన్ గృష్ణరాయలుండ
మాన్యగతినుండువారు సామంతనృపులు
ఎంతవఱకబ్జహితుఁడుదయింపకుండు
అబ్జషండంబు వెలబోవుటంతవఱకె. 155

మ. అని చింతించుచు సూనునంధునిగఁజేయన్ మౌఢ్యమేయంచు శౌ
ర్య నిధానంబగు పుత్త్రు వ్యర్థునిగఁజేయన్ భూమికిన్ ద్రోహమా
యె నటంచున్ బరితాపమందె రిపుభూమీశాళి శాసింప నె
వ్వనిఁబంపన్వలె నేమి యండయని సంభావించె ఱేడయ్యెడన్. 156

గీ. ధీరమతి మంత్రి తిమ్మర్సుఁ జేరఁబిలువ
భటుని బంపించె నంత సర్వజ్ఞుడయిన
యాత డతిసంభ్రమంబున నరుగుదెంచి
యేమియానతియంచు భూమీశు నడిగె. 157

గీ. తొలుత నరిగాపులైనట్టి వలతిరాజు
లిపుడుకొందఱు మనయాజ్ఞ కెదురునుడిరి
అర్థ్వవిక్రముఁ గృష్ణరాయలఁ దనూజు
నంధుఁజేసితి నేమిసేయంగవలయు? 158

శా. నాకావించిన వ్యర్థశాసనమునున్ గాదంచు నీవైన నా
కే కాంతంబునఁ జెప్పవైతివి గదా యీనాఁడు పుత్రాంధతా
శోకంబొక్కటిగాక వైరిధరణీశుల్ మీఱిస్వాతంత్ర్య లీ
లాకాంక్షన్ దలయెత్తుటింకొకటి వైక్లబ్యంబు గూర్చెన్ గదా? 159

చ. అని పరితాప నిర్గతములైన వచస్సుల హెచ్చరింపన
య్యనుపమ ధీవిశాలుఁడగు నార్యుడు తిమ్మరుసిట్లనున్, నృపా!
వనటఁదొఱంగు నాదు సచివత్వముగాదు నిరంకుశంబు నీ
వొనరుచు శాసనంబునకు నొల్లమి సెప్పఁగ రామి నొప్పితిన్. 160

చ. అయినను భావి కార్యకరణార్థ విచారము సేసి యట్టి దు
ర్ణయ మొనరించు టొప్పదని నమ్మి భవత్సుతుఁ గృష్ణరాయలన్
నయన విహీనుఁ జేయకటె నాకడనుంచితిఁ గల్ల బల్కితిన్
దయగలదేని యానతిడు త్వత్ప్రియనందనుఁడిందె వచ్చెడిన్. 161

మ. అని యాజ్ఞన్ గొని కృష్ణరాయల నృసింహాస్థానమున్ జేర్పఁగాఁ
బనిచెన్ సేవకు నార్య, డాక్షణమునన్ వచ్చెన్ గుమారుండటన్
జనకున్ జూచి కరంబు మోడ్చె నరసక్ష్మాజాని సానందుఁడై
తనయున్ గౌఁగిటఁజేర్చి మేలనియె భద్రంబయ్యె సర్వస్వమున్. 162

మ. తుళువక్ష్మాపతి వృద్ధుఁడయ్యెనని యెందున్ మించి సామంత భూ
పులు ధిక్కారము సేయఁదత్ప్రహరణ ప్రోద్యోగ దక్షోగ్రదో
ర్బలుడౌ రాయలు దృశ్యుడయ్యెనని హర్షంబొంది రార్యావళుల్
బలితంపుందమినొంది పట్టమహిషీ భావాబ్జ మోడెన్ ద్యుతిన్. 163

సీ. మదమత్తశత్రు సీమంతినీ శుద్ధాంత
మందిరమ్ములకు సంభ్రమము బుట్టె
దౌర్మత్య బాధిత తద్జ్ఞ చిత్తాంభోజ
షండంబు లర్కతేజమ్ముఁబట్టె
ఆహవకేళీ విహారాభిలష దశ్వ
శాలలు హేషలన్ జదలుగట్టె
ఆలానమూలద్విపాళి బృంహితములు
దిక్కరీంద్రములకు దిగులుపెట్టె.

గీ. చటుల శాత్రవభంజన సమరయోధ
రాజి కరవాలధారలఁ దేజుపెట్టె
ఆయుధాగార పృథు కవాటార్గళముల
నిస్స్వనమ్ముల దుర్గమ్ము నింగిముట్టె. 164

చ. కనుగవలేక లోకమును గాంచఁగనేరక తాను ఘోర కా
ననముల నుండువేళల జనంబులకున్ దనతండ్రి కేవిధిన్
బెను పరితాపమో; యెటు తపింతురొ మిత్రులు, వైరులేగతిన్
జనవరు ధిక్కరించుదురొ సర్వము కృష్ణుడెఱింగె నత్తఱిన్. 165

చ. తన కనుదృష్టి దీయుటకుఁ దండ్రి విధించినయాజ్ఞ విస్మరిం
చిన సుగభీరబుద్ధి, యధిసేవ్య దయానిధి, సంతతావిక
త్థన సుకృతి ప్రసిద్ధి, ధృతిదార్ఢ్య సమార్జితవృద్ధి విస్తరద్
వినయసమృద్ధి, కృష్ణ సమభిఖ్య గుణోదధి, పల్కె నీ విధిన్. 166

చ. గురుతర వీరభోజ్య మవికుంఠితరాజ్యము యౌవనంబునన్
దిరుగని బాహుసత్వమునఁ దేలిననాఁడు గడించిపెట్టె నీ
నరపతి నేడు వృద్ధుడు రణంబుల నిల్వడటంచు ధిక్క్రియా
పరులగువారి గెల్చుటకు బంపుడి నన్ను విచారమేటికిన్. 167

గీ. అయిన సామ్రాజ్యలక్ష్మికి నదనులందు
విజయ యాత్రావసరములు వెలయుచుండు
అరిజయంబున కరిగెద నాజ్ఞయిడుఁడి
దిగ్విజయ మాచరించి యేతెంచువాఁడ. 168

మ. అని భాషించిన కృష్ణరాయవిభు, ధీరాలాప మాలించుచున్
దనివిన్ జెందిన మంత్రిపుంగవుడు చెంతన్ నారసింహావనీ
శుని నానందవిశేష సంచలితదృక్శోభన్ విలోకించి రాడ్
జన సాన్నిధ్య సమర్హశుద్ధ వినయౌజ్జ్వల్యంబుతో నిట్లనెన్. 169

గీ. దిగ్విజయయాత్రకై కృష్ణదేవరాయు
ననుపు మీతఁడు వైరుల నడఁచివచ్చు
దీర్ఘయాత్రార్థిపేరున దిశలఁదిరుగ
ననుపుమీ వీరనరసింహ జనవరేణ్య. 170

గీ. నరసభూపతి మదికి నానందమయ్యె
తిమ్మరుసు తన స్వామిభక్తి ప్రభావ
మిట్టిదని తెల్పి తా రాజుఁదృప్తిపఱచె
నాగమాంబిక యనుపమానందమందె. 171

మ. అరిరాజుల్ తమలోనఁదాము నిరతైక్యస్ఫార భావంబులన్
పరఁగన్ జాలిరయేని బల్వు రొకటై పైవత్తు; రవ్వేళ దు
ర్భర సత్త్వప్రతిభావిభాసిత మహీపాలుండె పోరాడు; నొం
టరియై పోరుత; కృష్ణరాయ విజయాడంబం బశక్యంబగున్. 172

సీ. శత్రుకుంతాఘాతజనిత రక్తస్పర్శ
మలయజ చర్చగా దలఁచునేని
చండకృపాణాగ్ర సంఘట్టనంబుల
సుమశరాహతులుగాఁ జూచునేని
అతిభయంకర కాహళానకస్వనముల
పరభృతోక్తులుగాగ నరయునేని
ఆహవశూర యాతాయాతరీతుల
శిఖినాట్యములుగ వీక్షించునేవి
భయద మదమత్త శుండాల హయశతాంగ
రాజ విహరణ సంగ్రామరంగములనె
యుపవనములంచుగనునేని యోధుడట్టి
వీరపురుషుని వరియించు విజయలక్ష్మి. 173

ము. వలపున్ గొల్పెడు ప్రౌఢభామినులతోఁ బల్కాడుచున్ నవ్యకో
మల పుష్పాసవ సౌరభోపవన ధామవ్యాప్తకుంజాంతరం
బుల శృంగారవికార చేష్టల మనంబున్ బెట్టువాఁడెట్టు ల
ర్మిలి నార్జించు, సమీకరంగ జయలక్ష్మీ భోగసౌభాగ్యమున్. 174

శా. బాలుం డంచని భిన్నభిన్న ధరణీప్రాంతస్థ సామంత భూ
పాలవ్రాతము లేకమై యెదురసైపం జిహ్నామర్ధింతువా?
బాలప్రాయమునందె పొందె జయముల్ ప్రాభీలరంగాల నా
ర్యా? లోకశ్రుత విప్రవంశజున కేలా యజ్ఞసూత్రంబుతోన్. 175

గీ. కడఁగి సామంత భూవరుల్ కలియుమున్న
యున్నవారల నున్నట్టు లుక్కడంచి
సైన్యవిత్త బలంబుల సంగ్రహింప
దనయు ననిసేత కనుపఁ గర్తవ్య మధిప. 176

గీ. అనఁగ విని రాజ్యతంత్ర రహస్య మెఱిఁగి
తీర్థయాత్రకు శ్రీవీరదేవు నంప
కృష్ణరాయని దిగ్జయ క్రీడకనుప
నిశ్చయము సేసె నరసింహ నృపవరుండు. 177

మ. ధరణీనాథ కుమారు లిర్వురును యాత్రాసిద్ధులై యుండ నె
వ్వరి కేపాటి శతాంగముల్ వలయునో, భద్రేభరాజంబులున్
దురగవ్రాతములేరి కెన్నివలెనో దుర్ధర్షయోధాళి యె
వ్వరకై యెందఱొ నిర్ణయించిరటు సల్పంబూనిరారంభముల్. 178

మ. ధరణీ నిర్మల పుణ్యతీర్థముల సందర్శించుచోఁదన్మహీ
శ్వర సంచారము లెట్టివో యచట సంభాసించు సేనాసము
త్కరమేపాటిదొ మున్నుగాఁగల యుదంతం బుర్వికిన్ దెల్పుచున్
దరలన్ వీరనృసింహదేవవిభు డుత్సాహంబుతో నూల్కొనెన్. 179

మ. ఇలపైఁ బుట్టుకతోడనే యెనసె శ్రీకృష్ణక్షమాధీశుఁడు
జ్జ్వల శౌర్యంబు రణాంగణభ్రమణవాంఛన్ వానికిన్ దోడ్పడన్
బలవత్సైన్యము సక్రమాహవము సల్పన్ రాజనిర్దేశమున్
గలుగన్ బ్రాగుపలబ్ధ తేజము సముత్కర్షాస్థితిన్ జెందదే? 180

మ. సకలాశాంతపరీత సాళువ మహాసామ్రాజ్య సైన్యాధినా
యక బీజాభ్యుదితుండు, నాకపద నిర్యత్ ప్రాంశుతేజఃప్రభా
వకనజ్జన్మ సమూఢ శౌర్యనిధి, పూర్వంబే యగున్;నేడు వా
నికి శౌర్య ద్విగుణీక్రియాక్షమ బలానీకం బిడన్ జయ్యుడే? 181

మ. తనకేకైక సుతుండు ప్రేమకలనాధామంబు శ్రీకృష్ణరా
యని ఘోరారి రణాంగణోన్ముఖునిఁ జేయన్ శాసనంబౌ నెడన్
విను నాగాంబకు సుంతయేనియు భయావేశంబుగా లేదుగా
కని వార్యాహవభూజయంబు గొనుమం చాశీస్సులన్ వాకొనెన్. 182

మ. పలునాళ్ళేగకమున్న తేని తనువస్వస్థంబుగాన్ మంత్రిరా
వలనుం గూరిచి సర్వరాజ్యపదవీ పట్టాభిషేకోత్సవం
బలరింపన్‌వలె బుత్రులందెవని రాజ్యాధీశ పీఠంబునన్
నిలుపం గావలెఁ దెల్పుమీయనుచుఁ బ్రశ్నించెన్ బ్రసన్నోక్తులన్. 183

మ. ధరణీ భగము భిన్నభిన్నమతులన్ దర్పావృతంబై పర
స్పర వైరంబులఁ బెంపు సేసికొనియెన్ సంగ్రామ సంసిద్ధమై
పరగెన్ గృష్ణుడె యట్టివేళ నరిదర్పం బార్పనౌగాని త
త్సరణిన్ వీరనృసింహుడల్గి రిపుపక్షంబైన నెల్లన్ జెడున్. 184

గీ. తత్‌స్థితి నెరింగి రాజ్యతంత్రజ్ఞమూర్తి
తిమ్మరుసు వీరనరసింహ దేవరాయు
గద్దెపై నుంచి, రాయలు కైసహాయ
మిచ్చునటు సేయ తేనికి నచ్చఁజెప్పె. 185

ఉ. వీరనృసింహదేవుఁ బృథివీపతిగా నొనరించి కృష్ణరాడ్
భూరమణుండు సాయపడుపోలిక సేయుట శ్రేయమౌనన
ధీరుడు మంత్రిసత్తముడు తెల్పిన యప్పుడె తిప్పమాంబ సొం
పారఁదలంచె రాజ్యరమ, హస్తగతామలకంబు కైవడిన్. 186

ఉ. వీరనృసింహరాజు పృథివీపతియౌటయు బుణ్యతీర్థ సం
చారము సేయనుంట; యసుసంకటశాత్రవ యుద్ధరంగ సం
చారము కృష్ణపాల్వడుట సమ్మతిఁగూర్చె, నయత్నసంగతిౝ
గోరికతీరె దిప్పమకుఁగూడె నపారమనః ప్రహర్షముౝ. 187

సీ. భద్రసింహద్వార బంధపార్శ్వమ్ముల
నసటికంబము లాకులల్లలాడ
ఎల్లద్వారములందు హృద్యగారుడమణీ
జాలతోరణము లుయ్యాలలూగ
ప్రాంగణగత మంటపాంతర వేదికల్
ముత్యాలముగ్గుల మురువుగూర్ప
అతిసంభ్రమమ్మున నరుగుచోఁ దిరుగుచో
దాస భామినులు గీతములఁబాడ.

గీ. రాజదుర్గమ్మునకు నాల్గుప్రక్కలందు
జెలఁగు సౌధములఁ సుఖాసీనులైన
వాద్యకాంధ్ర శుభాలాప ఫణితిమీఱ
నొప్పెఁబట్టాభిషేకమహోత్సవంబు. 188

మ. కలుషౌఘాంతక తుంగభంగకుల రంగత్తుంగభద్రానదీ
జలముల్ గైకొని మంత్రపూతములుగా జల్పించి, సంపూతత
జ్జలధారాద్యభిషేకలీల నరసక్ష్మాజాని యుత్సాహియై
చలిపెఁ వీరనృసింహరాయవిభుఁ దత్సామ్రాజ్య లక్ష్మీశ్వరుఁ. 189

గీ. జ్యేష్ఠసుతునకె పట్టాభిషేకమగుట
స్తవ్యతుళువ మహాన్వయాచారమగుట
జ్యేష్ఠపుత్రుండు వీరనృసింహదేవు
డధిపు డౌటనె; నిఖిలోర్వి హర్షమందె. 190

గీ. దేశదేశసమాగతాతిథులు వినఁగ
వీరనరసింహ సమభిఖ్య భూరమణుని
మేనుపొంగఁగఁ దద్రాజధాని విజయ
నగరి ప్రాగ్గాథ సచివు డొప్పుగఁ బఠించె. 191

మ. శతసంఖ్యాక కలాప్రదర్శకతతుల్ సంస్తవ్య సత్కార సం
గతి హర్షించిరి, భద్రసింహపదవిఁ గైసేయు వీరక్ష్మా
పతి కాశీర్వచనంబు లాడిరి బుధవ్రాతంబు పుణ్యాంగనా
తతి నీరాజనమెత్తిపాడె శుభవాగ్ధాటీనటద్గేయముల్. 192

మ. నరసక్ష్మాపతిసింహపీఠి, సుతునానందంబు పెంపారగా
నరసెౘ వీరనృసింహరాయ ధృతరాజ్యాధ్యక్షతాశోభ ని
బ్బరమై నిల్చెను వందిమాగధులు కైవారంబులౘ జేయ సా
గిరి, కీర్తించిరి భద్రవాచిరసవత్కృత్యుక్తులౘ సత్కవుల్. 193

సీ. తుంగాతరంగిణీ రంగత్తరంగ భం
గ ప్రభంగ మృదంగ కలనఁదేలి
జయజయ ధ్వానానుసారి సభాజన
కరతాళమయ తాళసరణి నెగడి
పవనాంకురోచ్చల ద్బహుళపతాకికా
చలనైక నాట్యప్రసక్తి నలరి
ఆనంద నిస్సరదార్యరాణ్మందహా
సమహిత ధవళాంశుకమున మీఱి.

గీ. ప్రముదిత విజయనగర సామ్రాజ్యలక్ష్మి
ప్రథిత తుళువాన్వవాయ వీరప్రకాండ
బంధురాశ్లేష సౌఖ్యవైభవము గాంచి
యుత్సవోచిత నాట్యాల నూగులాడె. 194

గీ. ఉత్సవానంతరమున వైర్యుర్విపాల
భంజనము సేసి సామ్రాజ్యపదమునందు
శాంతి నెలకొల్పుటే మంత్రిసత్తమునకు
ధరణిపతికినిఁ బ్రథమకర్తవ్యమయ్యె. 195

క. తిమ్మరుసు నన్యసచివౌ
ఘమ్మును సైన్యాధి నాయక ప్రకరమ్మున్
నెమ్మది నాలోచన నిల
యమ్మున సభచేసి, చేసి రాలోచనముల్. 196

గీ. దిగ్జయమ్మునకున్ గృష్ణదేవ విభుఁడు
తీర్థయాత్రకు వీర పృథ్వీవరుండు
నరుగ నొడివిన తిమ్మర్సు నాశయములె
సమ్మతింగాంచెఁ దత్సభాసదుల మ్రోల. 197

గీ. కృష్ణరాయలతో రణకేళి కరుగ
సైన్యమునఁ బెద్దభాగమ్ము సమ్మతించె
తక్కుగలదండు తీర్థయాత్రా ప్రసక్తు
వీర నరసింహ విభుగొల్వ వేడ్కపడిరి 198

శా. నానా పుణ్యనదీ ప్రపూతములు నానా దేవతాగార శో
భానిస్తంద్రములుఁ నిరంతర కృతాభ్యాసార్జితానల్ప వి
ద్యా నైపుణ్య విధాన బంధురములుఁ సానందముల్ దక్షిణ
స్థానంబుల్ గననేగె వీరవిభుడంచత్ సైన్య సంయుక్తుఁడై. 199

శా. ఆలోలాగ్రపతాకికాభరణమై యంభ్రంకషోత్తుంగమై
క్రాలుఁ గన్నడ రాజ్యసంస్థగిత దుర్గశ్రేణి, యందున్న భూ
పాలుర్ గొందఱనమ్రులైరి; రిపురాడ్వర్గమ్ము నిర్జించి సం
బాళింపన్ వడిఁ గృష్ణరాయలరిగెన్ బ్రాభీల సైన్యాళితోన్. 200

సీ. సామ్రాజ్య చిహ్నముల్ ఛత్రచామరముల
 నిరుపార్శ్వముల వెలయించువారు
అనుదినంబును నుద్యమారంభములయందు
 కైవారములు సేయగల్గువారు
హస్తవిన్యస్త సిద్ధాసిధారలతోడ
 నంగరక్షాయత్తులై నవారు
అనుతృటిన్దను సమ్మతారోగ్య రక్షణ
 కగు భిషగ్వల్లభులై నవారు.

గీ. అహరహమ్ము విరామవేళాంతరముల
కళలఁదనియించు నటవిట గానవిదులు
భద్ర నీరాజనములెత్తి పాడువారు
జనవరుని వెంటఁబయనంబు సలుపువారు. 201

శా. సంతోషంబున, దుర్గరక్షణ విధాశ్రద్ధాయుతుండై, చమూ
కాంతన్యస్తపదానుపాతపద నిక్వాణక్రమోద్దాముడై
దంతీంద్రాశ్వరధావళీ భ్రమణ దుర్ధర్ష ప్రకారాఢ్యుడై
వంతన్‌బాసి నృసింహభూపు డలరెన్ భద్రాశయ స్వాంతుఁడై. 202

శా. అందందున్ నిజరాజ్యమండల పురవ్యాలోకనన్ జేయుచున్
మందీభూత వినమ్రతాది గుణసంపత్సాంద్రమున్ వైరిరాడ్
బృందంబున్ బిలిపించి లోబడెడు వానిన్ బోధగావించుచున్
సందర్భంబులదెల్ప జేరిరి నృపాస్థానంబు వార్తాహరుల్. 203

మ. మఱుగుల్ చారులు దెల్పఁగా ఁదుళువసామ్రాజ్యంబుగాపాడుఁదెం
పఱులౌయోధులసంఖ్య, హెచ్చెను గజాశ్వశ్రేణులున్ వేలకున్
బెఱిగెన్ యుద్ధశతాంగసంఖ్య; రిపుభూభృద్దుర్గముల్ గూల్పనౌ
తెఱగుల్ నేర్చిన దండనాథతతి పొందెన్ శిక్షణాధిక్యమున్. 204

గీ. దండనాయక నరసింహధాత్రివిభు తృ
తీయ పుత్త్రుకు డచ్యుత దేవరాయ
విభుడు రాజాజ్ఞగొని దండువెడలి గెలిచె
బటుబలంబునఁ గోంకణ ప్రాంతమెల్ల. 205

శాం. ఉమ్మత్తూర్దెసఁ గృష్ణరాయ లధికప్రోత్సాహియై యేగుచో
నమ్మార్గానఁ బురాంతికస్థలి విరామార్థంబుగా నిల్వ; దు
ర్గమ్ముల్ దద్బలసంపదన్ గనిన చారశ్రేణి యేతెంచుచున్
నమ్మన్ పల్కిరి భూమిపాల భుజదండప్రౌఢి యుప్పొంగఁగన్. 206

మ. తన యారంభమునన్ బరాజయమె లబ్ధంబైనచో సద్యశో
ఘన భాగ్యంబు కొఱంతపాలగుననంగా నూహగావించి గొ
బ్బునఁగ ర్తవ్యము నూహసేసి తన తమ్మున్ దొల్తగానంపఁగా
బనిబూనెన్ రిపుసైన్యధాటి సడలింపన్ జేసె సంకల్పమున్. 207

మ. అపుడే యచ్యుత దేవరాయలకు స్వీయాలోచనన్ దెల్పి శ
త్రుపదోత్పాటన కార్యసిద్ధికయి, తద్దుర్గావనోద్యోగ, వ
ర్తి పదాతి ప్రతిభంజనోత్కట విధిన్ దేజంబు జూపన్ ధరా
ధిప శౌర్యోన్నతు నచ్యుతున్ బనిచె నుద్వేల్లచ్ఛమూధాటితోన్. 208

మ. అటులే యచ్యుత దేవరాయ ఘనసైన్యంబుమ్మతూర్దుర్గమున్
బటుతేజంబున ముట్టడించె నయినన్ బాహుబలాఢ్యుల్ సము
త్కట సంగ్రామ సమర్థులా ప్రబలదుర్గద్వారమున్ గాచి ని
ల్చుట బల్నాళ్లయి వెన్కకేగె మఱలఁ జూపింప శౌర్యోన్నతిఁ. 209

క. ఉమ్మత్తూరు జయింపక
క్రమ్మఱు నచ్యుతుని ముఖ వికాసము తీరుఁ
దిమ్మరుసుఁ గ్రహియించెను
గ్రమ్మెఁ రోసమ్ము కృష్ణరాయని మదికిఁ. 210

మ. వరమేధానిధి కృష్ణరాయ లనుజ ప్రావీణ్యమయ్యుమ్మతూర్
పురముఁ గైకొనఁజాలదంచు నది యస్వాధీనమైయుంట పె
న్గొరయంచుఁ బరికించెఁ దిమ్మరుసుమాన్యుఁ బిల్చి కర్తవ్యమే
సరణిఁగావలె వైరిదుర్గమది యే చందాన సాధ్యంబనెన్. 211

మ. అతి బుద్ధి ప్రతిభాధురంధరుడు ధీరామాత్యుడే కార్య సం
గతి కేతంత్రము సెప్పినఁ విజయభాగ్యం బబ్బుటే సత్యమా
మతిమంతుం డుమతూరు దుర్గ జయ సంపల్లాభమౌ త్రోవ భూ
పతికిఁ వాకొనెఁ గృష్ణరాయ లటుసల్పఁ దెల్పె నంగీకృతిఁ. 212

గీ. సకల విభుగణ మాయుక్తి శ్లాఘ్యమనిరి
తక్కుగల మంత్రు లదియె కర్తవ్యమనిరి
దండనాయకు లదె యుచితంబ యనిరి
కృష్ణరాయల కుత్సాహ మినుమడించె. 213

మ. తుళువ శ్రీమహితాన్వయోద్భవుల యందుఁ బ్రేమ పెంపారఁగా
దలలో నాలుకవోలె వర్తిలెడు తంత్రజ్ఞుండు తిమ్మర్సు ము
ద్దలరఁ జూడఁగ విజ్ఞుఁడై యసమకార్య శ్రీకుఁడౌ కృష్ణరా
యలకుఁ గీర్తిఘటింప వాకొనె నసాధ్యారంభ సంరంభముఁ. 214

మ. ధరణీ చక్రము క్రింది మీదయిననుఁ దారల్ భువిఁ వ్రాలినఁ
వరుసఁ వారిధులింకినన్ గులగిరుల్ భగ్నంబులై క్రుంగినఁ
సరసీజాత మనోహరుండు దివి సంచారంబునఁ దప్పినఁ
గరణీయార్థముఁ కృష్ణరాయ లడుగంగాఁబోఁడు ముమ్మాటికిఁ. 215

గీ. అనుచుఁబ్రోత్సాహకారి వాక్యమ్ము బలికి
తిమ్మరుసు కృష్ణరాయల నుమ్మతూరు
రాజ దుర్గైక జయసమార్జనము సేసి
స్థిరయశంబొందుమంచు నాశీర్వదించె. 216

మ. అనుమోదమ్మునఁ గృష్ణరాయ లనఘా! ఆలోచనంబేల? త్వ
ద్ఘనబుద్ధి ప్రతిబోధితాఖిల కలాతంత్రజ్ఞుఁడీ కృష్ణరా
యని మైప్రాణములున్న యందనుక సత్యం బాహవం బుమ్మతూర్
గొనలేకుండిన లేఁడనఁ దెలియుఁడీ క్షోణీశుఁడీ ధాత్రికిన్. 217

శా. ఉమ్మత్తూరని యేమి తెల్పెదవు నీ యుద్దేశమే యైనచో
నెమ్మిన్ జెప్పుము, నూత్నరాజ్య పదవీ నిర్మాణముఁ జేసి భా
రమ్ముఁ దాల్చి ధ్వజమ్ము నెత్తెదను గర్ణాటాంధ్ర భూమండలిఁ
దిమ్మర్సు ప్రియశిష్యు నన్ను గెలువఁ ధీరుండొకండుండునే? 218

గీ. అని మనోధైర్యసూచివాక్యమ్ములాడి
అరిజనంబులపై దండయాత్రకేగ
నాజ్ఞగైకొని వందనం బాచరించి
యాన మొనరింప సైన్యాళి కాజ్ఞ యొసఁగె. 219

సీ. అతిశాత శస్త్రహస్తారూఢ హయరాజి
ఆవలీవల హేల నడుగులిడగ
వైరిదుర్గద్వాః కవాటపాటనదక్ష
గంధసింధురము లగ్రమున నడువ
సాహాయ్యకారక సామంత కలితమ్ము
లరదముల్ తనమ్రోల నవఘళింప
నాయకపాద విన్యాసానుపదగామి
సైనికుల్ సోత్సాహ సరణి నడువ.

గీ. సమర సమయాభిమండన స్ఫారదేహి
భద్రసామజరాజంబుపై వసించి
శూరసేనా పరివృతోమ్మతూరు కోట
డాయఁజనువాఁడు శ్రీకృష్ణరాయవిఁభుడు. 220

శా. అమ్మాన్యుం డతిదూరమందరసెఁ గాంస్యాంశుచ్ఛటా దీప్తసా
లమ్ముꣳ, సుందర చంద్రకాంత మణిజాల స్థాపితోత్తుంగ శృం
గమ్ముꣳ శృంగతటీగతధ్వజ విలగ్న ప్రోచ్చలచ్చేల ధా
మమ్మున్ సైనికభావరంజకము నుమ్మత్తూర్ మహాదుర్గముꣳ. 221

మ. అది యన్మత్త పురంబె కాంస్యరజతాద్యచ్చాచ్ఛ లోహాంతరా
స్పదరత్నద్యుతిచేత సంతత నిశాభావంబుగా నౌటఁద
త్పద సంభాసిత దీర్ఘికాకువలయోద్యద్దీప్తి చేతꣳ దినాం
తదశꣳ గన్గొని పౌరులూనుదురు సంధ్యావందనాది క్రియల్. 222

మ. వరకాంస్య ప్రతిబద్ధ సాలపద ధావళ్యంబునꣳ వెల్లనై
యురుభద్రాశ్వకరిప్రకాండములు దివ్యోచ్చైశ్రవైరావతో
ద్ధురరూపంబులతోడ గన్పడుటచే దూరస్థయోధావళుల్
త్వరచేఁదత్పురి నెంచసాగిరి సుపర్వాణాధివాసంబుగన్. 223

సీ. ప్రతత చూడాకలాప విహారి జాహ్నవిꣳ
పరిఖా స్వరూపాన వరలఁజేసి

రమ్యాంగ భూషణప్రాయ భుజంగాళి
రక్షక వీర శస్త్రములఁజేసి
వ్యోమప్రదేశ వాతోద్ధూత పృథుజటా
భరము దుర్గధ్వజ వ్రజముజేసి
సంతత వాహదీక్షాభాసు, నందీశు
రాజవాహన హస్తిరాజుఁజేసి.

గీ. భవుని బహువిధ లింగరూపముల దుర్గ
గోపురంబుల గాపుంచి గోమునెఱపి
యవని వెలసిన హరనివాసాద్రియనఁగ
నొప్పఁగాఁజేయు బెనుసౌరు నుమ్మతూరు. 224

గీ. వైరిదుర్గమ్మునకుఁ దగు దూరమందు
సంగరోచిత శిబిర సంస్థాపనంబు
జలిపి సంజ్ఞాభి విజ్ఞాన చతుర భటుల
రక్షకుల నిల్పె శ్రీకృష్ణరాయ విభుడు. 225

మ. తగఁగావించిరి దూరబద్ధ శిబిరాంతర్వర్తి సైన్యావళుల్
గగన శ్రీరమణీ ప్రశాంత సుఖభంగ వ్యాపనోద్వేగముల్
దిగధీశాత్మ సుఖాంతనైజములు పృథ్వీభారవాహక్రియా
విగళద్దిగ్గజ విభ్రమంబులు సమిద్ భేరీమహా ఘోషముల్. 226

గీ. పదను బెట్టిరి భటులు కృపాణములకు
నతిశితమ్ములుగాగఁజంద్రాయుధముల
భల్లముల గుంతముల సిద్ధపఱుపనైరి
సమర సిద్ధమ్ముగా నాయె సైన్యమెల్ల. 227

మ. అతి దూరంబుననుండి చూచి యది శైవాహార్య సత్వాఢ్యమౌ
మతిగావించి యధీశు డీశబలసంపద్రాశి యౌౌతౌ భటా
యత చక్రావృతి ముట్టడింతునను ధైర్యస్ఫూర్తినేపారెవి
స్ఫుత శౌర్యాకృతి కృష్ణనామమునకుౌ దేనెంచె సార్థక్యముౌ. 228

క. భేరీకాహళ ఢంకా
ద్యారావము ఆలకించి యయ్యుమ్మత్తూర్
భూరమణుడు దుర్గాగ్ర త
టారోహణసేసి వైరియార్భటి నరసెఁ. 229

మ. జనతావాస పదంబులందక ప్రజా సంచారముల్ లేక యెం
దుననో కోమలఘాస పల్లవ చరద్గోవత్స సంఘాత లం
ఘనముల్ మీఱఁగ నిర్జనంబయి భయక్రాంతిఁ విడంబించు తా
వున నీనాడు జనించె భూవర చమూభోగ్యార్థ వై భోగముల్. 230

సీ. శిశువైనఁ బశువైనఁ జేరి మీఱఁగరాని
కంటకావరణంబు ఘటితమయ్యె
నలుప్రక్కలఁ ద్రావు జలముల నలరారు
దిగుడు బావులు దప్పి దివులుదీర్చె
పాదపచ్ఛాయలు బలుగుడారమ్ములు
దినకరాతపచండ దీప్తి నిలిపె
రమణీయ పట కుటీర క్రమ స్థాపనఁ
వీథికా శృంగార విభవమయ్యె.

గీ. ప్రతత శృంగాటకమ్ముల పార్శ్వతటుల
కుసుమలతికాంకురమ్ముల కుదురులైన
సురుచిర హసంతికావళుల్ శోభగూర్చె
శిబిరమున రాచనగరంపుసిరి వసించె. 231

మ. శిబిర న్యాసవిభూషితక్షితితలా క్షీణోర్వీరుట్ శాఖికా
నిబిడాలోల కులాయ సంధిత సమున్మేషాసనాసీనముల్
సొబగుంబుల్గులు కృష్ణరాయ లుమతూర్ క్షోణీశ దుర్గస్థలీ
ప్రబలాధ్యక్షత నొందునంచుఁ దెలిపెఁ భద్రాత్మగీతావళిఁ. 232

శా. నానావర్ణ కుటీర శిల్పరచనా నవ్యప్రకారంబు, సే
నానీక ప్రతిచాలితధ్వజ పతాకాత్యంత దైర్ఘ్యంబునుఌ
దానాలోకన జేసి చేసి యుమతూర్ ధాత్రీశు డాత్మీయ సే
నానాథుఌ బిలిపించి హెచ్చరిక నుండఌ దెల్పె రక్షావిధిఌ. 233

మ. "అది సామ్రాజ్యము దేవతాంశభవ విద్యారణ్యమౌనీంద్ర ది
వ్య దయాపాదిత హేమవర్ష కలనావ్యాలబ్ధ సౌభాగ్య మా
పదముఌ రక్షణ సేయుఁగృష్ణధరణీపాలుండు దోస్సార సం
పద నన్యూను డతండె వచ్చె నెటు సంబాళింతువో దుర్గముఌ. 234

మ. అని నే నిల్చినఁ గృష్ణరాయనృప బాహాపాటవంబెట్టిదో
కనుగొందుఌ మదనల్ప శౌర్య విభవక్రాంతి ప్రయోగంబునఌ
మనుచోఁజూచెద దుర్గరక్షణ విధానం బీవ యోజింపు తు
త్తునియల్ సేసెదగాక వైరిబలముఌ దోర్దర్ప సంరంభముఌ". 235

గీ. అనుచు భాషించెనే గాని యరి సమూఢ
సైన్య మంబోధివలె సముచ్చలన మంది
వీరభటరాజికా వీచికారవముల
నరసినకొలంది యతఁడు విహ్వలత నొందె. 236

ఉ. వారక, రాజ శౌర్య విభవంబునకున్ నిజ సత్వ మొండె యా
ధారముగా రహించెను బ్రతాప నభోమణి కృష్ణరాయ లా
చేరువనిల్వ. సంశయముచేటున కిప్పుడు తత్ప్రవృత్తి కా
ధారము లయ్యమాత్యుమతి దార్ఢ్యము దుర్గపదాతిసత్వముల్. 237

మ. సమరారంభమునందె రాయలు దయాసంపూరిత స్వాంతుఁడై
యుమతూర్దుర్గ పదాధినాయకున కాత్మోద్దేశమున్ దెల్పఁగా
నమలాంధ్రాక్షర పంక్తులం దిటుల వ్రాయంజేసి దౌత్యక్రియా
క్షమ ధీరాగ్రణి కిచ్చి లేఖ ననిపెన్ క్ష్మాపాల మర్యాదతోన్. 238

మ. ధరణీబంధుర రాజ్యవైభవము ప్రోద్యద్వీర భోజ్యంబనన్
"గురువాక్యంబగు నుమ్మతూర్నగరి మాకున్ బ్రాంతదుర్గంబు త్వ
త్పరిపుష్టాలఘురాజ్యసంపద సురేంద్ర ప్రాజ్య సామ్రాజ్య సుం
దరమై యొప్పు భవత్సముద్యమము సంస్తవ్యంబు భావింపఁగన్. 239

మ. భవదీయాఖిల దిగ్విభాసిత యశోవైశద్య భాగ్యం బన
ల్ప విధిన్ వర్ధిలి క్షీరవారినిధి లీలాదర్పణంబందు న
ధ్యవలోక్యంబగుగాత; నీ యెడ ననుయావృత్తిచేగాదు నిన్
గవియన్ వచ్చుట; వీరలక్షణ లసత్కార్యంబుగా నెంచుమీ! 240

మ. అమితాక్రాంత మదప్రసారిత కటవ్యాలగ్న పుష్పంధయ
క్రమ సంచాలనలోల కర్ణయుగ శృంగారానుషంగేభ కుం
భము లేమిన్; మృగరాజు, సర్వమృగ దర్పక్షాళన ప్రక్రియా
సముదీర్ణోగ్రనఖైక పాండితి యెటన్ సాగించి శోభిల్లెడిన్. 241

మ. మహిఁదుళ్వాన్వయజాత శూరకృత సామ్రాజ్యంబు నానా దిశా
మహితోర్వీ విజయోత్సుకం బగుట సామంత క్షమాజానివై
సహనం బూని కరంబు గట్టుటకు నిచ్చున్ జూపుమీ; కాదొ దు
స్సహ సంగ్రామ విహారసాధనతతిన్ సంసిద్ధమున్ జేయుమా. 242

మ. దినమొక్కం డవకాశ మిచ్చితి సుబుద్ధిన్ సుంత యోజింపుమీ
జనసౌఖ్యప్రద సంధిమార్గమునకే సంకల్పమున్ జేయుదో
ఘన సైన్యోత్థిత ధూళిధూసరిత దుర్గస్థుండవై శస్త్ర వా
హనముల్ గాంచఁగలేక బెగ్గిలు నుదగ్రావస్థ నాసింతువో? 243

మ. బలవత్తౌళువ దండనాథ నిశిత ప్రాశస్త్య శస్త్రాహతిఁ
నిలువఁ జాలక సంగరాంగణమునందే క్రుంగు నీకై కడుఁ
విలపింపంగల రాజభామినుల కన్నీరే నివాపోదకం
బులుగా గైకొను దుర్దశన్ గొనకు మామోదించి సంగ్రామమున్. 244

మ. ఘనతేజః ఫలముఁ విసర్గ బలవత్ కాయుండు నీవైరి; యా
తని తేజంబును దైవదత్తమగుటఁ దైవంబె యా నేతకుఁ
బెను సాహాయ్యము జేయు తూలసమదోర్వీర్యుండ వుగ్రప్రభం
జనతుల్యారి విమర్దనంబుల సహించఁ లేవు సంధింపుమా. 245

చ. కరి తురగ ప్రచార పరికల్పిత సత్త్వుడవై ప్రచండ సం
గర కుశలుండవై బలి జగన్నుత మానధనుండవైన నీ
పరికరచండిమఁ భవదపార సమీకవిహారధీరవై
ఖరిఁజవిచూచు దుర్గపరిఖాజల తుంగతరంగ భంగముల్. 246

చ. అరిజన మారణార్థము ప్రయత్నము సేయఁగ నెంచునీవు త్వ
త్పరిజన మారణార్థము కృతప్రతియత్నఫలాదివౌదు వీ
తరుణమునందె తత్తుళువధాత్రికి నీ వరిగాపువైనచో
బెరిఁగిన నీదు భాగ్య మతివేగముగా ద్విగుణీకృతంబగుఁ. 247

మ. జనపాలాగ్రణి! సర్వసాళువ మహాసామ్రాజ్య సేనాధి శా
సనుఁడై నూతన రాజ్యపీఠమును సంస్థాపించు నా తండ్రి మ్రో
లను శైలమ్ములనున్న తమ్ము లుదధుల్ గంభీరముల్గానివా
యనిలుండుఁ జలియింపలేడు; జయలాభాసక్తి నీకేటికిఁ. 248

గీ. అనుచు లిఖియించి కృష్ణరాయావనీశు
డుమ్మతూర్దుర్గ విభునకుఁ గమ్మనంపె
అతడది పఠించి; జయము సాధ్యంబుగామి
సరియటు లిఖించెనని శంకితాత్ముడయ్యె. 249

సీ. చెరలాడు సమయాన శితదండతాడనఁ
బుసకొట్టియాడెడి భుజగివోలె
అతిశిత గ్రీష్మవియన్మండలిన్ వెల్గు
మధ్యందినార్క బింబంబువోలె
ఆఖేట కేళీవిహారంబునన్ శరో

చ్ఛలితమై యెగయు బెబ్బులి విధాన
ఆకలివేళ మదాయత్తకరిపైకి
లంఘించు సింహ వల్లభమువోలె.

గీ. స్థగిత కోపానలారుణిత ప్రచండ
నేత్రదృష్టుల నుమ్మతూర్ నృపవరుండు
ముందువెనుకల యోజనమ్ముం దొఱంగి
కృష్ణరాయల కిటు లిఖియించి యంపె. 250

మ. "సరసాస్వాదన భాగ్యయోగ్య రసవత్సంచారి వేలావతీ
స్ఫుర దాస్యంబుల, సత్సుదామలరసంబుఁ బొంది క్షారస్థితిఁ
బరగించుఁ బడబాగ్ని పాల్సలిపెడుఁ బాతాళ దుర్గాహ గ
హ్వర మందించును వార్థి యెట్లు సరసుండంచుఁ వచింపఁదగుఁ.251

సీ. పరిణత ఫలరసాస్వాదన ప్రియుఁడైన
శుకరాజు నీవల్ల వికలుఁడయ్యె
లలితకషాయ పల్లవ తత్పరుండైన
పికరాజు నినుగొల్చి విసువుజెందె
కమనీయ సౌరభగ్రహణ తత్పరుఁడైన
భ్రమర వల్లభుడు నిఁ బాసి పాఱె
అధ్వసంజనిత శ్రమాంతమ్ము గనలేక
పాంథుండు నీ దండఁ బాసి పోయె.

గీ. అమిషాహార నిరతంబు లైనయట్టి
కాక గృధ్రాది విహగసంఘమ్ము లెల్ల
యెఱుఁగక భజించి, ఫలమంద కెగిరి చనియె
శాల్మలీ? యింక నేమని సందడింతు? 252

గీ. సద్రసాస్వాదనోద్యోగ చతురుడైన
భ్రమరవల్లభు నెట్లైన వద్దఁజేర్చి,
వాని పరిచర్యఁ గోరు చంపకసుమంబ!
చేరువారల కిడుమి నీ సౌరభంబు. 253

ఉ. కోటమదన్య భూవరునకుఀ వశపుచ్చుట వీరయోధరా
ట్కోటి నొసంగినట్లె; రిపుకోటికిఁ గైవస మౌటయేచుమా?
యేటి జలంబునఀ మకర మెందనుకఀ జనునంత దన్కఁబో
రాటమునందు మత్తగజరాజము నైనను లెక్కసేయునే? 254

శా. మా తాతల్ ప్రపితామహాదు లెవ రుమ్మత్తూరు నిర్మించిరో
నేతల్ వారలు; వారికీర్తి నిలుపఀ మేనైన నర్పించుదుఀ
నీతుల్ వేయి వచింప నేటికి నృపానీకంబు మెచ్చఀ సమిద్
భాతిఀ ధర్మముపాటి సేసికొని నీ ప్రావీణ్యముఀ జూపుమా. 255

సీ. చెట్టుకొమ్మలజేరి పుట్టిపుట్టకమున్న
కసుగాయలం ద్రుంప గడఁగువారు
అపకార మరయక యాదరంబుం జూపు
నాప్తవర్గము దూఱనాడువారు
ఎల్లవిద్దెలను సంతృప్తిగా బోధించు
దేశికు నిందింపఁదివురువారు
పోరాటములఁ జేయు తీరెల్లనేరిచి
భండనంబున వెన్కఁబాఱువారు.

గీ. ఐమికాముష్మికార్థ సౌఖ్యములఁ గొనక
అపయశస్సంతమసమున నడఁగఁగలరు
పిరికితనమేల కోటపై వెడలివచ్చి
తడయఁగానేల ననికి సిద్ధుడవు గమ్ము. 256

మ. జనతా రంజక సౌరభోపగతిచే, సంపుల్ల పుష్పంబు, త
ద్ఘన పుష్పంబులచే, లతాతతియు సౌందర్యానుకూలోల్లన
త్తను లావణ్యముచే లతాంగియు; భుజాదండ ప్రభావంబుచే
జనపాలుండు వెలుంగు నేసరణినేఁ జాలింతు శూరక్రియఀ. 257

గీ. ఘోర సంగ్రామ మందున వీరయోధ
జాలమే గాక బహుళ ప్రజాళి యడఁగు
నింత క్రూరతయేటికం చెచ్చరింతొ
ఆలకింపుమి మరొక వాక్యంబు నుడుదు. 258

ఉ. మేకొని సత్కృపాకృత సమీహిత దానము, జీవహింస య
ఙ్ఞాకలచే ధనార్జనము, గ్రాహ్య ధనవ్యయ ముగ్రభాషల
స్తోకమృదుప్రసంగములు తూగరహించుట సాధితార్థ స
త్యాకృతి; రాజనీతి; రసికార్య సమాదృత రీతి, భూపతీ? 259

గీ. ఉమ్మతూర్ దుర్గవిభు డంపు నుత్తరమ్ము
నంతరార్థంబు యుద్ధసమాచరణమె
యనుచు రాయలు దండనాథునకుఁ దెలిపి
యనికి నేతేర సైన్యాళి కానతిచ్చె. 260

మ. భట వర్గమ్ములు ముట్టడించి రుమతూర్ వైర్యుగ్ర దుర్గమ్ము; ముం
దటఁ బార్శ్వమ్ములయందు వెన్దటమునన్ ధైర్యక్షమాధాములు
త్కట నానాయుధమస్త వైరిజనముల్ గాపాడుటన్ దచ్చమూ
పటలీ యుగ్మమునన్ జెలంగె నతి దుర్వారాహవారంభముల్. 261

మ. కడుఘోరమ్ముగ మూడు మాసముల దన్కన్ సాగెసంగ్రామ మ
య్యెడ దుర్గాధినివాసి వీరులకు నాయెన్ భోజ్య దారిద్ర్యమున్
కడపట్టెన్ బల, మందుఁగొందఱికి, ముక్తప్రాణులై యెందరో
పుడమిన్ వ్రాలిరి, కాని దుర్గ విభుడప్డున్ బోరె నుత్కర్షచే. 262

సీ. రాజభామినులు సోరణగండ్ల నాస్యముల్
 జొన్పి, రణార్భటిన్ జూచి యడల
దుర్గరక్షక భటోద్యోగమ్ము నిస్సార
 మాయెనం చారావమత్తమిల్ల
విజయాశవిడి రాచవెలఁదులు దీర్ఘికాం
 తరములం దుఱుక యత్నములు సేయ
జలనిధానములసృక్సమ్మిశ్రితమ్ములై
 వారిపై క్షామదేవత నటింప.

గీ. అఖిల దిశల హాహాకార మవఘళింప
గోడలఁ ద్రాళ్ళుదిగిచి వ్రేలాడి దుమికి
కొందఱరిపాలికేగి మ్రొక్కులు రచింప
దుర్గజానందరమ దూరదూర మేగె. 263

మ. చలమేపార విజృంభణార్వ సమయేక్షాతత్పరుండైన రా
యలు దోస్సార పరాక్రమంబలర సింహద్వాఃకవాటంబు బ్ర
ద్దలు సేయన్ జటుల ప్రఘాతముల నొత్తన్ రోషమందించి డీ
కొలిపెన్ గాంశ్యకవాట పాటన పటుక్రూరోగ్ర మత్తేభమున్. 264

గీ. కంచుగుబ్బల తలుపు మర్దించునపుడు
రాచయేనుగు ఘీంకార మాచరించె
కోటతలుపులు తునియలై త్రోవజూపె
ప్రజల చిత్తంబు లతిభయాస్పదములయ్యె. 265

ఉ. శీతమరుత్ప్రసారముల చెట్ల సుఖించు ఖగాళి పాఱె వా
స్యశ్రిత జలాశయంబులకుఁజేరె జలార్థ్య సుమచ్ఛయంబు శు
చ్యాతపతప్త దుర్గకమలాలయమున్ విడి రాజమీన మెం
దేతటినీ తటంబుల వసింపగ నేగఁగ శక్యమక్కటా. 266

మ. కరవాలంబులు వీరరాట్తతి కలంకారంబులై యుమ్మ తూ
ర్పుర నిర్మాణము సేసి రక్షణ కలాపూర్ణంబులై యొప్పెఁద
త్కరవాలంబులె రాయయోధుల కలంకారంబులై యుమ్మతూ
ర్పుర నాశంబొనరించి శిక్షణ కలాపూర్ణంబులై రాజిలెఁ. 267

ఉ. వీరుడు కృష్ణరాయపృథివీపతి యెత్తరుణాననైన హిం
సారతి నొల్లడన్ బలు కసాధ్యము తద్రిపురాజి స్వర్గ సం
చారముగోరి వాయుపథశాంతిని జీలిచి మిత్రగర్భమున్
జేరి విదారణంబు విరచించి పయింబడుచుండిరేగదా? 268

ఉ. ఆహవభూమిఁగృష్ణవసుధాధిపు డక్రమపక్షపాతిః యు
త్సాహముసేయు సత్సమయ సాహసధర్మము; దీర్ఘికాస్య దు
ర్గాహపథంబులన్ బలిజగత్ప్రతియానము సేసి యందు ని
స్స్నేహ సుఖాధివాసినులఁజేసెగదా! యరిరాజకాంతలన్. 269

చ. అతులిత ధైర్యగర్వ సముదంచిత తామరసేక్షణామనో
ధృతిహర కృష్ణరాయ ధరణీశు ననిఁ గనుచో నిజేశ్వర
వ్రతము తొరంగి రంగనలు బాపురె యయ్యుమతూరుదుర్గభూ
పతి నవరాజ్యలక్ష్మి యెటు పాయకయుండు బతివ్రతాత్వముఁ. 270

క. బలవదరిరాజయోధులు
విలవిల దుర్గాంతర ప్రవేశము సేయఁ
వెలదులు కోనల డాగిరి
చలముఁ విడి కోటతేడు శరణము వేడెన్. 271

క. శరణాగత రక్షకుడును
కరుణారస భరిత భావకంజజుఁడగుటన్
పరువున్ గౌరవ మడపక
పరదుర్గోపరిపదాన ధ్వజమున్ నాటెన్. 272

మ. పరభాగ్యానుభవైక తత్పరత సుస్వాంతోమ్మతూర్ శ్రీధురం
ధరు చెంతన్ గుమికూడి దుర్ణయము బోధన్ జేయు దుష్టావనీ
శ్వర దుర్బోధల భూవరుండు వినియెన్ సన్మార్గ వైముఖ్య ని
ర్భరుడై తత్ఫలమైన రాజ్యవిభవ భ్రంశంబు నొందెన్ దుదిన్. 273

మ. పరభోగీశ్వరభాగ్యసంధిత పయఃపానంబునఁ మించు దు
ష్కర హింసాకర దుర్విషానలవమత్ కాకోదరాధీశ భీ
కర నాట్యంబులు రూపడంగెను బతంగ ప్రాజ్య బింబాంతర
స్థిర సేవాపర కృష్ణరాయ ఖగరాట్తేజః ప్రసారంబునఁ. 274

ఉ. వీరవిపక్ష భూమివర భీకరసత్త్వుడు కృష్ణరాయ భూ
మీ రమణుండె యుమ్మతురు మేదిని గైకొనునంతమాత్ర నా
శూరుని మార్కొనఁ జడిసి, క్షోభిలి తత్సమ శూరసింహ సం
హారము సేయ ఘోరవిపినావని జేరిరి వైరిరాట్సుఖుల్. 275

గీ. శరణుపొందిన యుమ్మతూర్జనవరేణ్యు
ప్రాజ్య సామ్రాజ్య సామంతరాజుజేసి
కరము నర్పింప నొడబడు కరణిఁదేల్చి
చెలిమి, నడఁకువనందె వసింప నిలిపె. 276

చ. నగరము కృష్ణరాయ నరనాథునకుఁ వశమైన తోడనే
నగరనివాసి ధీయుత జనంబులఁ బెద్దలనెల్ల సాదర
మ్ముగఁ బిలిపించి యొక్కయెడ భూరి సభాభవనంబునందు నొ
ప్పుగ వెలయించి చెప్పె జనముఖ్య సమాచరణీయ కృత్యముల్. 277

చ. జనములు రాజ్యమూలములు సజ్జనసంపద రాజ్యభాగ్య సం
జనకము, సత్ప్రజావనము క్ష్మావరసంతత కృత్యమైచనున్
జనపతికిన్ వినమ్రులయి సాగుట సజ్జన కృత్యమట్టి స
జ్జన జనపాల సఖ్యము పొసంగుట శాంతియు స్వర్గసౌఖ్యమున్. 278

చ. మునుభవదీయధాత్రి వరపుంగవుడే విధిపాలనంబునన్
దనిపెనొ మిమ్ము నాసరణి భూరి మనస్సుఖ మేర్పడంగ భూ
జన పరిపాలనక్రమము సాగఁజేయుటెకాక మీకు నే
యనువున నేమికావలెనొ యంతయు నేర్పడునంచు నెంచుడీ. 279

గీ. సకలపౌరులకీ రీతి శాంతిబోధ
సలిపి నమ్మికగల్గ భాషణముసేసి
విభుడు రాయలు సహృదయ వితతిఁదన్పి
సుజన సఖ్యామృతరసంబుఁ జూఱగొనియె. 280

చ. ప్రతినిధి నుమ్మతూరు పరిపాలనమున్ రచియింపనిల్పి య
ప్రతిహత శక్తిశాలి పరివారములో సగమందునిల్పి; యా
యత నిజబాహు శౌర్య సముపార్జిత దుర్గజయప్రకార మం
చిత విధి చెప్పనంపె నరసింహనృపాలునియొద్ద కొక్కనిన్. 281

చ. దిన మొక యేడుగా గడిపి తేపకు ద్రోవలఁ జూచుచున్న స
జ్జనుడగు మంత్రి తిమ్మరుసు స్వాంత మనంత వికాసమందె హె
చ్చిన ప్రమదంబుతోడ నరసింహనృపాలుఁడు భూరి మంగళ
స్వనములతోడఁ దమ్మునకు స్వాగతమిచ్చె మహోత్సవ క్రియన్. 282

సీ. విద్యానగరరాజ్య విశ్రుతధ్వజ మురు
దుర్గ శృంగమ్మునఁ దూగులాడ
కృష్ణరాడ్విజయ చారిత్రాక్షర శ్రేణి
శాసనఫలక భూషణము గాగ
ఉమ్మతూర్దుర్గ పూర్వోర్వీశ్వరుం డరి
గాఁపుగాఁ గైదండ మోపు సేయ
గణనీయ విజయనగర మహాసామ్రాజ్య
లక్ష్మీ విహారస్థలంబు పెఱుగ.

గీ. ఆంధ్ర కర్ణాట మండలాభ్యంతర ప్ర
దేశ నృపతుల గుండియల్ దిగ్గురనఁగ
గృష్ణరాయల కీర్తి లక్ష్మీలతాంగి
దేశదేశంబు లెగఁబ్రాకి తేజరిల్లె. 283

## శివసముద్ర విజయయాత్ర

మ. జయ యాత్రాధిగత ప్రహర్షణమునన్ సల్లాప లీలన్ దిన
ద్వయ పర్యంతము ప్రొద్దుపుచ్చబడె నంతన్ రాజ్య సంవర్ధన
ప్రియ సంభాషణ వేళఁదిమ్మరుసు పృథ్వీజానితోఁజెప్పె ని
ర్దయతన్ జేకొనగావలెన్ శివసముద్ర ప్రాజ్య దుర్గంబనన్. 284

గీ. అనుచు(దిమ్మర్సు రాజేచ్ఛ ననుసరించి
శివసముద్రాఖ్య దుర్గ విశేషములను
దెలిసిరా( జారుల౯ బంపె( దీవ్రగతిని
జారులది చూచివచ్చి యీ సరణి ననిరి. 285

సీ. ఉత్తుంగ భూమీధరోపమానంబురు
వేదండకాండ మొప్పిదము గూర్ప
ఘోర ప్రరావసంకుల తరంగాభముల్
భయదహేషాభ్రమద్ధయములలర
చంద్రసూర్య ప్రభా సంభాసమానంబు
గర్భస్థరత్న సంఘంబు మెఱయ
నవశస్త్ర కరభర నౌకావికాసముల్
సమర శతాంగముల్ చౌకళింప.

గీ. జీవనాధార వైభవ భావుకంబు
అఖిల భువనోపజీవుల కాలయంబు
నవుచు లక్ష్మీనివాసమౌ శివసముద్ర
మరసిచూడ సముద్ర శోభాలయంబు. 286

మ. ప్రసరత్కాంచనన వప్రశృంగ ఘనశోభావ్యాప్త దుర్గంబు నా
రసి మేరూర్విధరంబుగాగని విహార ప్రక్రియాసక్త దే
వ సతీమండలి దుర్గసాలమునకు౯ భ్రాంతాత్మలైడిగ్గి న
ల్దెస లన్వేషణ సేయువారు నిజవల్లీ సంధితావాసముల్. 287

మ. అరిరాజన్య భుజప్రతాప జయశూరా గ్రేస రావాసమున్
వరరౌప్య ప్రతిభా ప్రసాదిత మహాప్రాసాద కుడ్యవ్రజో
పరివిన్యస్త మణిప్రభాహతతమో వ్యాపార సంచారమున్
బురరాజంబగు జారచోర భయసంభూత్య ప్రతివ్యాప్తమున్. 288

మ. పురహర్మ్యాగ్రతటీ విహార విసరత్పుణ్యాంగనా సుందరాం
బర భర్మాంచల చాలనోదిత సమీరాంకూర సంవీజనో
త్స్ఫురితాకాశ తరంగిణీ ప్రచలితాంభోవీచికావ్యగ్ర శీ
కరజాలంబుల నప్రయత్నకృత శృంగారంబు లారామముల్. 289

మ. సురకల్లోలవతీ సుధామయ పయశ్చూర్ణ ప్రపూతానిలాం
కురమైత్రీ పరివృద్ధ ఖేలనవనీ క్షోణీజ సంతానముల్
వర సంతాన తరుప్రభావములుగా భాసిల్లుటఀ దత్పురీ
సరదారామవిహారి సాధ్వులుదయత్సంతానల శ్రాంతమున్. 290

మ. శివపాదాంబుజ చింతనారత సతీశృంగార భూయిష్ఠమై
శివనిర్మూలిత సర్వసజ్జన మనశ్చింతా ప్రకారంబునై
అవినీత ప్రతిశాసక ప్రళయకాలాగ్ని ప్రచండక్షమా
ధవ సంరక్షితమై చనున్ శివసముద్రఖ్యాత దుర్గంబిలఀ. 291

మ. సరసీజాత మనోహరాసవధునీ సంచార చంచత్పయో
భరమై నిమ్నతతాంతరాళ గమనవ్యాలోల నక్రాది భీ
కర జంతూత్కరమై విపక్ష నృపహృత్కాండ ప్రభేద క్రియా
కర నిధ్వాన తరంగమైన పరిఖాగర్తంబగున్ గోటకున్. 292

మ. అది తత్ప్రాంత నృపాల దుర్గములలో నగ్రేసరంబై, ధనా
స్పదమై, సుస్థిర భోగభాగ్య విచలత్ సామ్రాజ్య ధామంబుగా
బొదలన్ బోలెడువేళ రాగలదికన్; భూపా; ప్రతాపానఁ ద
త్పదమున్ గెల్వుమి నిల్వుమీ శివసముద్ర స్వామివై వెల్గుమీ. 293

గీ. అనుచుఁజారులు వచియింప నాలకించి
వీరనరసింహు డుత్సాహపూరితుఁడయి
తిమ్మరుసువంకఁ జూచె నా ధీరమంత్రి
కృష్ణరాయలదెస విలోకించె నపుడు. 294

చ. అలఘుతర ప్రతాప సముదంచిత సాహసమూర్తి, కృష్ణరా
యల మృదుగండ భాగములయందు నసృగ్ద్యుతి చెంగలింపఁగా
బులకలు నంకురింపఁ బొలుపుం గనుదోయి విశాలమై తగుం
దళుకుల నుల్లసిల్లె రణతత్పర భావము వెల్వరింపఁగన్. 295

క. తిమ్మరుసు భావగతధై
ర్యమ్మున శ్రీకృష్ణదేవరాయల కనియెన్
నమ్ముదు నీ వొకడవె దు
ర్గమ్మును వెస ముట్టడింపఁ గలవని కృష్ణా. 296

క. అని పల్కఁగృష్ణరాయలు
ననికిన్ ముంగాలు దువ్వి యవునవు ననియెన్
జనపతి యాజ్ఞం గైకొని
ఘనసైన్యము సిద్ధపఱుపఁగా భటు ననిచెన్. 297

శా. ఆలోఁగాహళ భేరికా వనజ ఢంకారావముల్ రేగె శ
స్త్రాళిప్రాంశు ధగద్ధగద్ద్యుతి విషంగాలోకముల్ మీఱె హే
షాలోలాశ్వ శతాంగ గంధగజరాట్సంచాలనంబొప్పె సై
న్యాలుఙ బంక్తులు దిరిచెఙ శివసముద్రాటోపముఙ మాపగఙ. 298

మ. ఘన సేనానివహంబుగైకొని యువక్ష్మాజాని కావేరి కా
ఖ్య నదీరాజ దుపాంతభూమిధర మధ్యస్థ ప్రదేశంబునఙ
జనుచో వైరి నృపాళి మార్కొనియె గృష్ణక్షోణిభృత్పేన నం
దని గావించెఁ గుమార కృష్ణు డురుధైర్య స్థైర్య శౌర్యోద్ధతిఙ. 299

మ. ప్రతిపక్షాంగ పతత్కృపాణ లతికా ధ్వానంబులా కొండలఙ
బ్రతినిక్వాణ మొనర్పఁగఙ దశదిశా వ్రాతంబు ఘూర్ణిల్లెఁబ
ర్వత సందోహ గుహాంతరాళ పదసుప్తవ్యాఘ్రు ఘోరారవ
ప్రతతుల్మీఱె నుపాంతసీమలఁ బ్రజావర్గంబునుఙ భీతిలెఙ. 300

మ. అరిసంఘాతము కృష్ణరాయ భుజ సత్వాటోప మత్యంత భీ
కరమైమీఱఁ బలాయనంబులఁ బెనంగఁబట్టి సామంత భూ
వరులఁ జేసె నతండుభూపతికిఁగప్పం బంపుచుఁ వీర భూ
వర సామ్రాజ్య రమానుకూల సరణిఁ బైబూని వర్తిల్లగన్. 301

ఉ. అంతియకాక పర్వతపదాహవరంగ పరాజిత క్షమా
కాంతులు స్వీయసైనిక నికాయములన్ దన యుద్యమాల న
త్యంతముఁ దోడుపాటొసఁగునట్టు లొడంబడఁజేసె స్వీయ సా
మంతులఁబెంచి యవ్విధి సమార్జనజేసె ననంత సత్వమున్. 302

మ. ధరణీనాథుల నూత్నయూథము స్వయూథశ్రేణితోఁ గూర్చి సా
ధ్వరయ ప్రోద్ధతి మీఱఁగన్ శివసముద్రాభిఖ్య దుర్గమ్ముపై
కరిగెన్ రాయలు ముట్టడించె; నట; దుర్గాధీశ సంరక్షణో
త్కరముల్ పోరొనరింపసాగిరి వియత్ క్ష్మా చక్రముల్ కంపిలన్. 303

మ. అహముల్ వారములేగె మాసములు పోనాయెన్ ధరిత్రీభయా
వహ సంగ్రామమునన్ బరస్పర చమూపంక్త్యుగ్ర శస్త్రచ్ఛటా
నిహతి ప్రోద్గత విస్ఫులింగములు పూనెన్ దారకామైత్రి ని
ట్లిహమున్ నాకమునేకమైచన రణంబేపారె నొక్కబ్దమున్. 304

శా. కృష్ణక్ష్మావర సైన్య బాహుబల మక్షీణంబుగానిల్చె భీ
నిష్ణాతంబయి వైరి సైన్యము ధృతిన్ వీడెన్ బలంబోడెఁ జం
దోష్ణాంశు ప్రతిభుండు రాయలటుపై నుద్దండ దండాహతిన్
గృష్ణాహీంద్రుని తీవ్రరూపమున దూగెన్ దుర్గరాజంబుపై. 305

శా. సేనానీక సముద్ధృతాసితతి యుజ్జృంభింప వీక్షించి సం
స్థానాధీశుఁడు తత్కవేర తనయా శైవాలినీ వీచి కా
ధీనుండై నిజజీవితార్పణ విధిన్ దీపించె శుద్ధాంత కాం
తానీకంబు శితాగ్ని కుండమునఁ ద్రోయంబోలి రాత్మాంగముల్. 306

సీ. విద్యానగర భూరి విక్రమప్రోద్ధతి
యరి దుర్గలక్ష్మి కే లందుకొనియె
అభిజితదుర్గ, సాలాగ్ర సంస్థాపిత
కేతన వ్రాతంబు క్షితికి వ్రాలె
రాజాన్వవాయజ ప్రకటరోషావేశ
భాగులు చీకట్ల దాగుటాయె
సంస్థానపతి వంశసంవృద్ధి తత్పరా
భ్యుదితాశ్రు పూరముల్ గదలిపాఱె.

గీ. తుళువ సామ్రాజ్య సైనికోద్ధూతపాద
ధూళి దుర్గ పదంబెల్ల ధూసరించె
జగదభిజ్ఞాత కృష్ణరాడ్ జయపతాక
శివసముద్రంబు తలపైనఁ జిందులాడె. 307

సీ. తనవశ మ్మొనరించుకొనె నెవా డగణిత
ప్రాభవోపేతారి పత్తనముల
పాదుకొల్పె నెవాడు భవనీయ కర్ణాట
రంగ మధ్యమ్మున రాజ్యలక్ష్మి
నియమించె నెవ్వాడు నిజ రాజధానిగా
ప్రచిత వైభవము శ్రీరంగపురము
స్థాపించె నెవ్వాడు సత్వసంగతిఁ జేసి
యఖిల కర్ణాట జయధ్వజమ్ము.

గీ. కైవసము సేసికొనియె నేక్షాత్త్రకులుడు
కప్ప మొకకోటి రూప్యముల్ గట్టు విభుల
నాతఁడలఘు ప్రతాప సాహసధురీణు
డనఁగ యశమొందెఁ గృష్ణరాయాంధ్ర విభుఁడు. 308

మ. అతులైశ్వర్య సమంచితోమ్మతురు దుర్గాక్రాంతితో భూరి ప
ర్వత దేశాంతర భాస్వరత్ శివసముద్ర శ్రీ సమాక్రాంతితో
నతశీర్ష ప్రతిపక్ష రాజతతితో నానా దిశాంతర్వ్విరా
జిత తేజోవిధి కృష్ణరాయ లెలమిఁ జేరెఁ నిజావాసముఁ. 309

మానిని. గేయ మహాంధ్ర జగజ్జనపాలక, కృష్ణనృపాల మనోజ్ఞచరి
త్రాయత కావ్యరస గ్రహణోత్సుక! అర్థసుధీ మహితాంధ్ర నలం
దా యురభీష్ట శుభప్రదవర్తన; అచ్యుతభక్తి సమన్విత నా
రాయణ రాయమహాశయ, సత్కవిరాజ యశోవృత సర్వదిశా. 310

ఇది

శ్రీమదుభయ భాషాకవితాప్రవీణ, సహస్రావధాన చతురాసవ, సహస్రా వధాన పంచానన, పంచ సహస్రావధానీత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ పయఃపారావార రాకాసుధాకర సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రణీతంబైన సాలంకార కృష్ణదేవరాయలను ప్రబంధంబున ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

# సాలంకార కృష్ణదేవరాయలు

## తృతీయాశ్వాసము

క. శ్రీరంజిత సప్తాద్రి వి
హారి రమేశాంఘ్రి సేవనార్జిత పుణ్యా!
ధారిత ధీనైపుణ్యా
నారాయణ రాడ్వరేణ్యః నయగుణగణ్యా! 311

మ. పటిమన్ వీరనృసింహదేవవిభుడున్ వైవస్వతాశారి రా
ట్పటలిఃన్ నమ్రశిరస్కులన్ జలిపి వేడ్కన్ స్వీయ సామ్రాజ్యపుం
దటమున్ జేరెను బాపభంజన సముద్యత్తీర్థయాత్రోదిత
స్ఫుట విద్యానగర ప్రతాపయశమున్ బొందించె సర్వాశలన్. 312

గీ. పదియు నేనూఱు తొమ్మిది వత్సరములు
క్రీస్తు వెనుక గతింప నక్షీణబలుడు
వీర నరసింహరాయ పృథ్వీవరుండు
వ్యాధివశమున మిగులః గృశాంగుడయ్యె. 313

చ. పరనృపయత్నముల్ తిరుగుబాటులు బీదరునుండి యా బిజా
పురివఱకున్ గనంబడియె భూరి బిజాపురసీమవాసులౌ
నరుల కశాంతియౌట శరణంబిడః దౌళువ దేవరాయ భూ
వరులనుగోర వారు శ్రితపాలన సేయఃగ నొప్పి రాదృతిన్. 314

చ. తురకలలోనః గ్రూరమతి ధూర్తుడునైన కమాలుఖాను బీ
దరుపయి కేఃగి రాయల హితంబున రాజ్యము నేలుచున్న న్యా
యరతుడు సౌమ్యమూర్తిని మహమ్మదుషాః వెఱబెట్టి యేర్చ ము
ష్కరుడగు వానినిన్ జదుపఃగా బని పైఃబడె రాజమౌళికిన్. 315

గీ. తాను గన్నట్టి ప్రేమ సంతతినినైన
జేర్పి యాకటమ్రింగు నాశీవిషంబు
స్వీయమతభవ సుజను హింసింపఁ దివురు
ప్రబల దర్పాంధకారాధి బాధితుండు. 316

ఉ. నిబ్బరముండనీయక జనించిన వల్లరు లెల్లచోట్ల మై
నుబ్బస ముద్భవింప బలమోడి మహిన్ దన జీవితస్థితిన్
దబ్బరగాఁదలంచి యుచితజ్ఞుడు వీరనృసింహరాయలే
గొబ్బున రాజ్యపీఠమును గొమ్మని కోరెను గృష్ణరాయలన్. 317

గీ. రాజ నరసింహరాయ దౌర్బల్య మరసి
తిమ్మరుసు మంత్రి యాలోచనమ్ముసేసి
ప్రథిత విద్యానగరరాజ్య పట్టపీఠి
నిలువవలెనని కృష్ణరాయలకుఁబలికె. 318

గీ. ఆర్య సమ్మతరీతిఁ బట్టాభిషేక
బంధుర మహోత్సవమున కేర్పాటు జరిగె
రాజ్యవాసులు సామంతరాట్చయంబు
నాత్మబంధుజనంబులు హర్షమంద. 319

సీ. భద్రసింహద్వారబంధమ్మునన్ ముద్దు
టనఁటికంబపుటాకు లల్లలాడ
ఎల్లద్వారములందు హృద్యగారుడమణి
జాల తోరణము లుయ్యాలలూగ
ప్రాంగణగత మంటపాంతరవేదులన్
ముత్యాలముగ్గులు మురువు గూర్ప
అతి సంభ్రమంబున నరుగుచో మఱలుచో
ననుచరఖండగాయనము లెగయ.

గీ. రాజదుర్గమ్మునకు నాల్గు ప్రక్కలందు
జెలఁగు సౌధమ్ములన్ సుఖాసీనులైన
వాద్యపరుల శుభాలాప ఫణితి మీఱఁ
గ్రాలె నుత్సవ లసదలంకార గరిమ. 320

సీ. ఒక వంక బహుళ వైదిక కళావిజ్ఞులు
వేదార్థభాషణ విధుల నెఱప
ఒక వంక భద్రకాలోచిత శాస్త్రార్థ
భాతి వేదాంగ విజ్ఞాతలనఁగ
ఒకవంక నవరస ప్రకట వాక్పూరిత
కవితా ప్రసంగముల్ కవులు జరుప
ఒక వంక మధురస్వరోదంచితాహీ గా
యనములఁజతుర గాయకులుపాడ.

గీ. భూరి మౌక్తికమణి రత్నపుంజ పూరి
తాంజలులతోడ సామంతులైన నృపులు
వినయ వినమిత శీర్షులై వెలయ నొకట
రాట్సభామంటపంబు హర్షంబుగూర్చె. 321

గీ. ధీర రాచూరివంశజుల్ శూరసాని
వారు నంద్యాల వంశజ ప్రథిత యశులు
బూదహాలివారు నార్వీటి బుక్కరాజు
నాది గాగల సామంతు లలరి రందు. 322

మ. తుళువక్ష్మాపతివంశసంజనితు లత్యుగ్రాహవోద్దండు లు
జ్జ్వల తేజోవిధులున్ రథాశ్వగజ శిక్షాదక్ష సేనాపతుల్
బలవన్మండల పాలకోత్తములు తత్పట్టాభిషేకక్రియా
కలనన్ జూడఁగవచ్చి రుల్లసదలంకార ప్రకారంబులన్. 323

సీ. రాయసం రామచంద్రయ బొక్కసము భాస్క
రయ్య లక్ష్మీపతి త్ర్యంబకయ్య
అవసరం వెంకయ్య అప్పరు పిళ్ళయు
లక్కణశూరు డెల్లన బుధుండు
దళవాయిలింగర్సు దళవాయి మన్నారు
పిళ్ళయున్ దిమ్మన వీరమూర్తి
అసమాన ధీశాలి యప్పాజి సాళువ
మేక రాజాదులు నౌకువారు.

గీ. సంగరాజును వెలుగోటి శౌర్య నిధులు
వీరుడు ప్రధాని తిప్పన్న పెద్దసాని
యక్క పార్యుడు మున్నుగా నధిపవరులు
పలువు రరుదెంచి రయ్యుత్సవంబుఁజూడ. 324

క. శ్రుతివేత్తలు భూమీసురు
లతులిత బలశాలి భట సమన్వితులగుచుఁ
చతురంభోధి జలంబులఁ
జతురతఁగొని దెచ్చి రర్ఘ సమయమునందుఁ. 325

మ. దురితౌఘాంతసరస్వతీ ప్రవిసరత్తోయంబు గోదావరీ
వరగంగాయమునాది దివ్యతటినీ భద్రాంబుధారా సము
త్కరముల్ బ్రాహ్మణమంత్రపూతములు తత్పట్టాభిషేకక్రియా
చరణార్ఘంబులు తేబడెన్ విజయ నిస్స్వా నానుయానంబునఁ. 326

మ. ధరణీజానికిఁ జందనాగరులసత్కస్తూరికా గంధ బం
ధురనీరంబులతోడ నిత్యవిజయద్యోతత్ స్వరాలాప సుం
దర గీతీమయ హృద్యవాద్యముల మధ్యన్ గణ్య పుణ్యాంగనా
కరనీరాజన దీప్తులన్ బొలిచె రంగన్మంగళస్నానముల్. 327

మ. కలధౌతాంబరముల్ ధరించి నుదుటన్ గాలార్ఘ కస్తూరికా
తిలకంబున్ బొసఁగించి స్వర్ణమణి సందీప్తాంశు హారంబులన్
గళసీమన్ వెలయించి స్వీయగురువున్ గౌరవ్యుఁ దిమ్మర్సుని
ర్మల చిత్తంబున సంస్మరించి కదిసెన్ రాణ్మౌళి శ్రీవేదికఁ. 328

మ. యశమార్జించిన ధీమణిప్రతతి నాహ్వానించి కేలారగా
దశదానంబు లొనర్చి షోడశ మహాదానంబులన్ గూర్చె; ధే
ను శతంబున్ నవరత్న భూషణములన్ భూఖండముల్ ధీర వి
ప్రశతశ్రేణి కొసంగెఁ గైకొనియెఁ దద్భద్రంకరాశీస్సులన్. 329

మ. సరసీజోదరవంశసంభవులు నాచారజ్ఞులు౯ శాస్త్రవిత్
సరసవ్రాతము తజ్జలంబు నృపశీర్షంబందుఁ బ్రోక్షింప నొ
ప్పిరి చంచత్సమయజ్ఞభాషితతృటి౯ వేడ్కల్ బిసాళించె శ్రీ
ధరణీజానికిఁ గృష్ణరాయలకు దత్పట్టాభిషేకక్రియన్. 330

మ. ధరణీదేవ సమీరితాగమవచో ధారా పవిత్రీకృత
స్ఫురణోదప్రతిపాతనక్రమముతో శుద్ధవ్రతోదంత ధీ
వరమంత్రాక్షత లెంతయుంబడె జయధ్వానంబులున్ సప్రతి
స్వరవిద్యానగరైక రాజ్యపద భాస్వన్మూర్తి కింపై చనెన్. 331

శా. ఆ సూర్యుక్త ముహూ ర్తమందు బుధ విన్యస్తాక్షతల్ పూర్వికా
భ్యాసార్హంబుగఁ గృష్ణరాయల తలన్ వ్రాలెన్ దగన్ నాకసం
వాసిప్రేషిత పుష్పవర్ష విభవౌపమ్యాల్పవాశ్శీకర
న్యాసప్రక్రియతో, సభాజనకరోద్యత్తాళ నాదంబుతో. 332

క. ధరణీ వివర్ధనోహా
భరమున నత్యధిక భారవంతుండగు భూ
వరునకుఁ బసిండితులలో
జరిగెఁ దులాభార మఖిల సభ్యులు మెచ్చున్. 333

క. నరవరుని మేని యెత్తున
సరితూగిన దివ్యహేమ సంచయ మెల్లన్
గురులకు నిఋపేదలకున్
బరమామోదమున నపుడె పంచంబడియెన్. 334

గీ. బహుళ విక్రమ ధుర్యుడౌ పార్థివేంద్రు
నంతటన్ దుల నెసగించి యతని యెత్తు
రజతమున దూగఁజేసి యా రజతరాశిఁ
బంచి వెట్టిరి సజ్జన ప్రతతియందు. 335

మ. విమలార్హాశయభార ధైర్యగుణ గాంభీర్య ప్రకారంబులన్
సమతన్ జెందఁగ జాల వచ్ఛరజత స్వర్ణాచలేంద్రంబు లే
క్రమమేపారగఁ గృష్ణరాయతుళువ క్ష్మారాజ్యసంశాసితో
సమతన్ నిల్వగనేర్చువార లితర క్ష్మాపాల చూడామణుల్? 336

మ. అలఘు శ్రీపరిపూర్ణరాజ్యపద సర్వాధీశ్వరత్వంబుతో
విలసిల్లున్ దగఁ గృష్ణరాయలనఁగన్ విఖ్యాతి భూమండలిన్
గలకాలంబు రహింపఁదన్నృపతి విజ్ఞానాధినేతల్ గృహ
స్థలకున్ శాశ్వతవాసయోగ్య వసతుల్ జూపించె నుల్లాసియై. 337

చ. ప్రవినుత దాన తత్పరుడు రాయలు తత్సమయంబునందు తద్
జ్ఞవితతి కిచ్చినట్టి సదనంబుల సాలమణి ద్యుతిచ్ఛటన్
బ్రవిమతులై నిశాకర దివాకరు లత్యవమాన లగ్నులై
పవలొకరుండు నన్యుడగు వాడు నిశిన్ గనరారు భూమికిన్. 338

సీ. హయసమారోహ సమర్థులకై కూర్చె
తదనుకూల తురంగ తల్లజముల
కృషిమూల జీవన తృషితాత్ముల కొసంగె
పటు సత్వయుత బలీవర్దములను
గో పయఃపాన సక్తులకు నభీప్సిత
గోసంచయంబుల గూర్పనాయె
ఆయుధ వ్రాతకృతాయోధనుల కిచ్చె
చటుల ధారానల్ప శస్త్రరాజి.

గీ. అతిథులకొసంగె జాంబూనదాంబరముల
స్వచ్ఛమణి ఖచిత స్వర్ణభాజనముల
హైమ సదనాంగణంబుల నాటలాడు
నర్భకుల కిచ్చెఁ గలభంబు లాదరమున. 339

సీ. ప్రధిత చతుర్వేది రామదీక్షితసూరి
దహనదేవుని ప్రసాదంబువేడ
గణ్యశాబ్దికుడు వెంకటరామశాస్త్రి శ్రీ
దక్షిణామూర్తి యాదరముగోర
స్తవ్య సహస్రావధాని ప్రభాకర
శాస్త్రి విఘ్నేశ ప్రసాదమడుగ
అష్టభాషాకవితామోది కృష్ణావ
ధాని వాణి ప్రసాదంబువేడ.

గీ. బహువిధకళార్థ విజ్ఞానవంతులైన
వారు విద్యానగరవాసి భవ్యమతులు
వివిధ దైవకృపాదృష్టి వేడ నలరు
విబుధులకుఁ దావు కృష్ణరా డ్విభుని కొలువు. 340

సీ. సుమనోముఖంబుల సురుచిరార్థము నొంది
అధమాళి పాల్సేయ కలరువారు
భూభృద్వితతినైనఁ బొరలించు తీవ్ర ప్ర
భంజను సత్వమ్ముఁ బడయువారు
తనుదాహమందినన్ దదుపాశ్రితాళికిఁ
జందనమ్మటు మేలు సలుపువారు
పంచత్వ మెనసినన్ స్వగుణంబువిడని సం
తానంబు పటిమఁదనర్చువారు

గీ. చాపలావృతి దొఱఁగి పావనపదంబు
నంది చరియించు ఘనుల మహంబు గలిగి
సరసులకు రసపూరణ సలుపువారు
గ్రాల సుకృతుల నెలవు; రారాజు కొలువు. 341

మ. సరసశ్రేణికిఁ జందనాదుల మెయిన్ జర్చావిధిన్ గూర్చి పూ
సరులందించుచు వక్కలాకు లిడి శీర్షన్యస్తహస్తాంబుజ
స్ఫురణన్ బ్రెక్కు నమస్కృతుల్ సలిపి తద్భూజాని యంపించె నె
ల్లరఁదత్త న్నియతాలయంబులకు నుల్లాసంబు పెంపొందగన్. 342

మ. నిజబంధుప్రయంబుతో బ్రియహితానీకంబుతోఁ బంక్తిలో
భుజియించెన్ దపనీయపాత్రమున; సామోదాంబువుల్ సేవక
ప్రజయర్పింపఁగరాంఘ్రులన్ గడిగె నాపై గిల్కు పావాల, సా
మజయానంబున సాగె నూఱడుగు లా క్ష్మాజాని పార్శ్వస్థలిన్. 343

గీ. నాఁటి మధ్యాహ్న మందునన్ దగినవేళ
సచివు డప్పాజి, నితర ధీజనుల బిల్వ
నంపి యొక్కమహాసభ నమరజేసె
నవనిపాలన ధర్మంబు లాలకింప. 344

గీ. దండనాయకమణులు, ప్రధానిచయము
నన్యరాజకీయోద్యోగులైనవారు
ముఖ్యబంధు లజ్ఞులు మ్రోలనలర
వందనంబిడి యీరీతిఁబలికె ఱేడు. 345

ఉ. వీరనృసింహరాజు పృథివీతలమేల సహాయరీతిఁ బెం
పారఁగఁజంద్రమౌళియును నచ్యుతరాయలు మేము కూరుచు
న్నారము; మీరలీపయిన, నన్ ధరణీపరిపాలన క్రియా
భారము బూనఁజేసితిరి; బల్కుడి పెద్దలు రాజధర్మముల్. 346

మ. ఘనసామ్రాజ్యపు సింహపీఠమును శృంగారించు భూజాని వ
ర్తన మేలాటిదొ దుర్జనప్రముఖులన్ దండించుచందంబు మం
త్రినికాయోచితపోషణాధ్వమును దద్వృత్తి ప్రకారంబు స
జ్జనులన్ బంధుల నాదరించువిధమున్ భాషించు డీ ధీమణుల్. 347

మ. పరివారంబుల నెట్టిచందమున సంబాళింపఁగాఁ జెల్లునో
పరిచర్యావిధి నాత్మరక్షణకు నెవ్వానిన్ నియోగింపఁగాఁ
బరితాపంబు లడంగునో, ధనము నే భంగిన్ సమార్జింపఁగాఁ
సరసంబో వ్యయమెట్లు సేయవలెనో సర్వంబు వాక్రుచ్చుఁడీ. 348

గీ. ప్రాజ్ఞులగువారు బోధింపవలయు మాకు
పరమధర్మము లెఱిఁగి తద్భంగి నడచి
శశ్వత యశస్సమార్జన సలుపఁగలము
గురుజనాశీస్సె మంగళకరము మాకు. 349

మ. క్షమమై రాయలు కోరుకొన్నయది యోగ్యంబంచుఁ బ్రేమస్వభా
వముతో వృద్ధ్యభిలాషి యమ్మరుసునున్ బాచర్సు నప్పాజికొం
డమరుస్నాయకుఁడున్ ముదంపడిరి రాడ్వాంఛావిధిన్జేయ భ
వ్యమనన్ బల్కిరి రాజనీతులను సంభాషించె బాచర్సిటుల్. 350

గీ. భూవరున కర్థమంత్రి విభూషణంబు
అర్థమంత్రికి భూషణం బధిపమౌళి
కంకణమునకు మణియలంకార మొసఁగు
మణికలంకార మొసఁగుఁ గంకణము దలఁప. 351

గీ. ప్రభువునకు హితవాక్యంబు పలుకకుండు
మంత్రి దుష్టుడు విహితధర్మంబు వినని
ప్రభువు దుష్టుడు; మంత్రియుఁ ప్రభువు నొకరి
కొకరు మన్నన గూర్చుట యొప్పు గూర్చు. 352

మ. అభిమానంబు ధనంబుగాఁ దలఁచి మర్యాదాభి రక్షార్థమై
ప్రభువర్యుం డగువాఁడు శత్రువిజయ వ్యాప్తిన్ విజృంభించుఁ బ్రా
ణభయంబున్ విడి కొన్న కీర్తి ధనమెన్నన్ శాశ్వతం బస్థిర
ప్రభమౌ సంపద యప్రధానమని సంభావించు ధీరుండిలన్. 353

గీ. అనుచు నప్పాజి వాక్రుచ్చె నంతలోన
బాచరుసులేచి జనరంజనాచరణము
బూనుకొనువాని రాజనంబోలు ననుచు
రాజశబ్దార్థమున్ దెల్పె రాజసభకు. 354

చ. జలధరమబ్ధినుండి జలసారము గైకొని యాత్మరూపమున్
దొలిగొని వర్షకాలమున దోయములిచ్చి పయోధి నింపి భూ
తలమున సస్యముల్ బెనుచు ధాత్రినిమౌళి ప్రజాళినుండి, ని
చ్చలు కరముల్ గ్రహించి ధనసంపదల౯ ఘటియించు నుర్వికిన్. 355

ఉ. కూరిమితోడ సజ్జనులకున్ శరణాగత మానవాళికిన్
వారక మేలు సేయవలెఁ బ్రస్ఫుట దుర్ణయ కర్మకారులౌ
వారల శిక్ష సేయవలెఁ బార్థివుడా విధిఁ జేయఁ డేని యె
వ్వారికి నేనిఁ జుల్కనగుఁ బ్రాభవముల్ చెడునట్టివానికిన్. 356

చ. జనములయందు రాజునకు సమ్మతి; రాజునకున్ జనంబులం
దునఁజననోపు, రాజునకు దోర్బల ముర్విజనంబు, వారికిన్
ఘనతరశక్తి, పాలకుని గాటపుగారవ మట్లుగాక, త
జ్జనపతికిన్ జనంబులకు సమ్మతియుండదొ సర్వమున్ జెడున్. 357

గీ. ప్రజలయం దనురక్తిచేఁ బార్థివునకు
బలము, బలమున నరిజయ వ్యాప్తిగలుగు
శత్రుజయమున నాత్మరాజ్య ప్రవృద్ధి
వృద్ధివలననె పురుషార్థసిద్ధి గలుగు. 358

క. అని మఱియుఁ బెక్కురీతుల
ననినన్ బాచర్సువాణి హర్షద మయ్యెన్
జనవరునకు సభ్యుల కా
దినమునకున్ సభ జయప్రదీప్తిన్ ముగిసెన్. 359

మ. "ధనలాభంబును బీదసాదలకు నే ధాత్రీశుఁ డందించు నే
జనపాలుం డిడు నర్థిసంతతికిఁ జంచద్ధాన్యమున్ విత్త మిం
దనయం బెవ్వఁడు వస్తువాహనము లీయన్ నేర్చు నార్యాళి కె
చ్చిన సౌఖ్యంబు నెవాడు కూర్చు బ్రజకున్ 'శ్రీకృష్ణ భూజానియే'. 360

మ. అని పౌరుల్ పురివాడవాడలను నన్యోన్యంబు ప్రశ్నోత్తర
ప్రణయాలాపములన్ రచించుచు మహీపాలానుకంపార్ద్ర భా
వనశీలాదుల నుగ్గడించిరి సుధీవర్యావళి ప్రార్థితా
రనికాయ ప్రతిదాన సాహసముఁ బ్రస్తావించి రత్యంతమున్. 361

శా. సంపద్రాజిత రాజధానికడఁ దత్సామ్రాజ్య పట్టాభిషే
కంపుం బండుగయైనవెంట విచలత్కల్లోల భద్రాతటీ
హంపీ జానపదాంతరస్థమయి పాపాంతంబు గావించు శ్రీ
పంపాపత్యధివాసమైన గుడిఁ దత్ప్రాకార ముఖ్యాధ్వమున్
సొంపొందింపఁగ గోపురంబు నిలిపెన్ శోభామయాకారమున్. 362

క. ధర్మాధర్మ విచారణ
మర్మిలి రచియించువేళ నవసరమగుటన్
భర్మసభాభవనంబున్
నిర్మింపఁగఁ జేసెఁ గృష్ణనృపు డా చెంతన్. 363

శా. ఆ పంపాపతి దేవళంబునకు నత్యంతాంతికక్ష్మోణిలో
బాపాంతక్షమమున్ సరోవరముఁ ద్రవ్వన్ జేసి నల్వొక్కలన్
సోపానంబులఁ గట్టఁజేసె; సరసీశుద్ధాంబులన్ మున్గి పం
పాపత్యంచితదర్శనంబు సలుపన్ బాయున్ సమస్తాఘముల్. 364

శా. నానాధర్మ చయజ్ఞుడై జనము లానందింప భద్రాసనా
సీనుండై తొలి నాత్మరక్షణవిధిన్ జింతింపగా నయ్యె; నీ
ర్ష్యానై జంబున సోదరద్వయి నిజ ప్రాణాంతమున్ జేయఁగా
బూనన్ వచ్చునటంచు బంధనియమంబున్ గూర్చె నవ్వారికిన్. 365

ఉ. ద్వారముఖంబునందు భటవల్లభులన్ నియమించి యుంచి య
వ్వారి గతాగతంబుల స్వభావ మెఱుంగుచు రాజకీయ సం
చారము మాన్పియుంచె నొక సౌధమునన్; బరిపాలన క్రియా
చారము లా ప్తులందయిన జాలివహింపఁగనీయ వక్కటా! 366

ఉ. ఆ విధిఁగొన్ని నాళ్ళరుగ నబ్ధి చతుష్కపరీవృతాంధ్ర ధా
త్రీవలయాధినాథు డయి తేజము నొందిన కృష్ణరాయ భూ
మీవరమౌళి కట్లు బలిమిన్ నిజ సోదరబంధనంబు స్వా
భావికదృగ్విరుద్ధమని భావన సేసిరి మిత్రు లా ప్తులున్. 367

చ. గుసగుస లెక్కువయ్యెఁ బ్రజకున్ నృపసోదర బంధనంబు తా
మస ముదయింపఁజేసె మతిమంతుఁడు తిమ్మరుసీ క్రమంబు మా
నసమునఁ జింతసేసి యొకనాఁడు నరేంద్రునిఁజేరి యాత్మలో
మసలుచునున్న బాధ పయి మాటలఁజెప్పక నొప్పె భిన్నతన్. 368

ఉ. తిమ్మరు సట్టు నిల్వ కతిదీర్ఘపు సూత్రము చేగట్టి భ
ద్రమ్ముగఁ దెచ్చుపత్రములఁ దన్మయుడై కరణీయమైన కా
ర్యమ్మున నున్నయట్టులు త్వరన్ విడఁదీయగ సాగె; నట్టి య
త్న మ్మతిదీర్ఘ మౌట నరనాథున కయ్యెను సందియ మ్మెదన్. 369

గీ. ఆ విధానంబునందు సూక్ష్మాశయంబు
గలదటంచు దదర్థంబు దెలిసికొనఁగ
నూహగావింప నది గొల్పె నుల్లమునకు
భ్రాతృనిర్బంధమోచనావశ్యకంబు. 370

చ. అనుభవశాలి తిమ్మరుసు స్వార్జితకీర్తిధనైక నిత్యర
క్షణమునకెల్ల బాధ్యు డవిచారితవాక్యముఁ బల్కడంచు నె
మ్మనమున విశ్వసించి మది మాటికి యోజన సేసి వారికై
యనువగు తావు సెప్పుమని యా నరనాథుడు గోరె నాతనిన్. 371

చ. జనముల గోడు తిమ్మరుసు స్వాతంమునన్ దిలకించి సుంత ద
వ్వునగలయట్టి చంద్రగిరి భూమినిఁ గొండొక ప్రాంతమేలఁగా
ననుజుల కిచ్చి స్వేచ్ఛమెయి నం దధికార సమన్వితంబుగా
మనుట కనుజ్ఞ నీఁదగుఁజుమా యని యొప్పగఁ జెప్పె ఱేనికిన్. 372

ఉ. తిమ్మరుసన్న! మాన్య సుమతి ప్రవరు ండులభించినట్టి రా
జ్యమ్మున కాధిపత్యమున కర్హునిఁజేసినవాఁడు జీవితాం
తమ్మును గ్రుడ్డిగా నగు వితాకును మాన్పినవాఁడు తొల్తఁ బ్రా
ణమ్ములె కాచినట్టి కరుణామతి పల్కులమీఱ సేమమా? 373

గీ. అనుచుఁజింతించి కృష్ణరాయప్రభుండు
అర్థతంత్రజ్ఞుడయి యపాయమ్ము భీతి
వదలి యపరాధరహిత ప్రవర్తనులగు
తనదు తమ్ముల మేలు భావనము సేసె. 374

చ. పరులను దూఱువాడు,పని పైకొన కూఱక యుండువాఁడు ము
ష్కరుడు నికృష్టుడున్ మదికి శాంతి యెఱుంగని దీర్ఘకోప వి
స్తరు డురుగౌరవంబు చెడి ధన్యఫలప్రద కర్మదూరుడై
పొరయఁడిహోపభోగ్య సుఖమున్ బరసౌఖ్యము యుక్తవైఖరిన్. 375

చ. అని మరి చింతసేసి తన యాగ్రహవృత్తి నడంచి మంత్రిభా
వనమున కియ్యకోలునుడి భ్రాతలఁజంద్రగిరి క్షమాంతికం
బున నలరారు ధాత్రిపదమున్ సకలాధికృతుల్ యథేచ్ఛగా
జనఁబరిపాలన మ్మెలమిఁ జల్పుకొనంగ వచించె సమ్మతిన్. 376

చ. అనుగుణశీలముల్ గలిగినట్టి సహెూదరు లొప్ప నీ విధిన్
దన ఘనరాజ్యసీమ నుచితంబగు ప్రాంతము గొంత యిచ్చి తా
ననితరవైభవోపమము, నార్యహితం బరిభంజనోద్యమా
తను సహకార కారణము తమ్ముల గౌరవదృష్టి గైకొనెన్. 377

మ. నవధాత్రీ పరిపాలనక్రమము సంస్థాపించి కాపాడఁగా
నవు సైన్యంబు సహెూదరద్వయికి నీయంజాలి; కృష్ణక్షమా
ధవుఁడీరీతి స్వతంత్రతానియతిఁ బ్రోత్సాహంబు గావించె; వా
రవనీనాథు స్తుతించి రిట్లెసఁగె నన్యోన్యానురాగం బొగిన్. 378

చ. అనలము జ్ఞాతివర్గ మటు లార్జిత సంపదలందు భాగముల్
గొనుదురు సోదరాళి ప్రతికూలురె తాదృశదృష్టి నై న న
య్యనుజుల నమ్రతాది సుగుణాఢ్యత కాతఁడు దృప్తిజెంది గొ
బ్బున నధికారులన్ జలిపి; పొందఁగఁ గోరెను దత్సహాయతన్. 379

చ. అనుజులు చంద్రమౌళియును నచ్యుత రాయలు వీరకృష్ణరా
యని సువిశాలమానసము నారసి తత్ప్రతికల్పితార్థ భా
జనులయి వానిభూరి గుణసంపద దామును బొంది యుజ్జ్వల
ద్వినయకృతజ్ఞతాది గుణవృత్తిగడించి చరించి రొప్పుగ౯ 380

చ. తనయుని దృష్టిమాపుటకు దారుణశాసన మిచ్చినట్టి త
జ్జనకుని దారుణప్రకృతి సాగి తనూజులనంట నైజమై
తనరినఁ గృష్ణరాయ వసుధావరు, నచ్యుతరాయుఁ జంద్రమౌ
ళినృపతి నొక్కయప్పుడును లేశము నంటగలేదు రూఢిగన్. 381

గీ. చంద్రమౌళియు నచ్యుతజనవరుండు,
చంద్రగిరిసీమ కేగి రక్షణసమర్థ
దుర్గనిర్మితిఁజేసి యందున వసించి
పాలనము సేయసాగి రా ప్రాంత మెల్ల. 382

మ. జనమాన్యంబుగ గృష్ణరాయలు భువిన్ శాసించుచో ధిక్కరిం
చిన వైరి ప్రచయంబు శీర్షముల వ్రాల్చెన్ శుక్లపక్షైందవా
తనురేఖాసదృశమ్ముగా దినదినోద్యద్ వృద్ధి నేపొంది తద్
ఘన కృష్ణాధిప చంద్రకీర్తికళ శృంగారించె సామ్రాజ్యము౯. 383

మ. తన పూర్వక్షితిపాలు రేసరణిఁదద్రాజ్యంబు పాలించిరో
జనరక్షావిధి నెట్టి శాసనముల౯ శాసించిరో తద్విధి౯
గను భావంబున తేడు పత్రముల యాగారంబు శోధించుచో
గనియె౯ సాళ్వ నృసింహరాయ లిఖిత స్వచ్ఛాక్షరి౯ బత్రిక౯. 384

శా. శ్రీ విద్యానగరాధిపీఠమున నాసీనుండుగానైన ధా
త్రీవర్యుం డలముద్గలోర్విపతిశక్తిఁ గెల్చి రాచోలు ధా
త్రీవీరాధిపు నుక్కడంచి నిజధాత్రిఁ జేర్పఁగఁజెల్లునఁ
భావంబున్ బ్రకటంబుగాఁ జదివెఁ దత్పత్రాక్షర శ్రేణులఁ. 385

మ. వరరాచోలు నృపాలదుర్గ మరిభూపాలాశ్రితంబై భయం
కరమై యుండఁగ ముట్టడింప మొదలేకాంక్షించు భూజానికిన్
బొరిఁ బత్రాలయ దృష్టలేఖన విధంబుల్ జిత్తమున్ రేపి స
త్వరదుర్గ ప్రతిభంజనంబు సలుపఁ బర్వించె నుత్సాహముఁ. 386

మ. తనరాజ్యంబున కంటకంబు సలుపఁ దత్కాంక్షయే హేతువై
చన నీర్ష్యాళువు ముద్గలోర్విపతి దుష్టత్వంబు శత్రుత్వముఁ
బెనుపఁ సాళ్వనృసింహుపత్రము ప్రకల్పింపఁ రణారంభ; మెం
తని సామ్రాజ్య ధురంధరుండు సహనవ్యాపారమున్ బైకొనున్? 387

మ. అది సాళ్వాధిప దండనాథ లిఖితంబై యాత్మసామ్రజ్య సం
పదభివ్యాప్తికి గారణంబునగుటన్ భావించి దుర్గద్వయీ
కదనాభ్యర్హ మహాయుధాదుల సమీకప్రోగ్రశూరావళిన్
గుదిరింపఁ ధరణీంద్రు డుద్యమవిలగ్నుండయ్యె దీవ్రాజికిఁ. 388

మ. సదయప్రాఙ్నృప సూచితాశయవిధిన్ శత్రుక్షమానాథదు
ర్మదమున్ మాపగ రాచవోలు జయయాత్రాసిద్ధతఁ దెల్పఁగా
గదనారంభ సముత్సుకానుచర సంఘాతం బయత్నంబుగా
హృదయోత్కంఠిత కార్యసిద్ధి యగుటఁ హృష్టాత్ములై రెంతయున్. 389

మ. పలునాళ్ళేగకమున్న ముద్గలమహీపాలుండు దుర్గంబు సే
నల సంవృద్ధి రచింతు సంగరకలా నైపుణ్య సంశిక్షణం
బుల నొందింతును రాజ్యమండలము పెంపుంగూర్తు నానెంచ; రా
యలసామ్రాజ్యములో మునింగె నకటా! ఆత్మోర్విసర్వస్వముఁ. 390

శా. ఆశాబంధము సాధ్యలక్ష్యమున గ్రాహ్యంబై సమున్మీలిత
క్లేశంబై యసురక్షకంబు నగుచుఁ గ్రీడించు నాయాశయే
దేశంబుల్ విడిపించు హృద్వికలతాధిప్రేరకంబైదురా
వేశంబుఁ గలిగించి యాత్మ ఘనతావిక్రాంతి మాపుఁ గదా. 391

ఉ. చారుల నంపి దేశమున శాంతిపరిస్థితిఁ గృష్ణరాయ ధా
త్రీరమణుం డెఱింగెను సుధీరులు విజ్ఞులుఁదన్నుఁజూడఁగా
జేరెడువారు సన్నిధి వచించు నెడన్ విని దేశవార్తలఁ
నేరిచె; ఁజేలు చారజననేత్రులనఁ విబుధోక్తి రూఢిగాఁ. 392

మ. క్షణమాత్రం బుడివోక, భూజన నమస్కారాది మర్యాదలఁ
బ్రణయాలాప గృతజ్ఞతా ప్రకటనఁ వ్యాసక్తమై వైభవో
ల్బణమై మీఱెడు రాజ్యలక్ష్మిఁ జిరమొల్లఁ జెల్లునా? చారభా
షణ విశ్వాసముచేత నజ్ఞులకు శిక్షల్ సెప్పఁగాఁదప్పమిన్. 393

ఉ. రాతిరివేళ రాజనగరంబున వీథులవెంట భిన్నవే
షాతతమూర్తియై తిరిగి, యాత్మధరాపరిపాలన క్రియా
రీతుల, నెవ్విధంబునఁ బురీజనతాశయ మొప్పెనో నిజ
ఖ్యాతికి నేమి లోపములు గల్గెనొ తానె యెఱింగె నిచ్చలుఁ. 394

ఉ. ధారుణి నేలు భూవిభులు తత్తదిశాంతర సంభవత్ సమా
చారములఁ గ్రహించుటకుఁ జారుల నంపుదు రట్టిచారు లా
చారముగాఁ బరాకృతుల సంగతి గాంతురు రాయలుర్విపా
చారము మాని, చారగుణచాతురిఁ బూనుట నబ్రమయ్యెడిఁ. 395

చ. తన పరిపాలనస్థితి కెదఁ బరితృప్తిగడింప కన్యధా
త్రిని మనఁబోయి శత్రువితతిఁ గలగూడినవారిఁ బట్టి శి
క్షణ మొనరించి యాత్మపురి గ్రమ్మఱ వాసము సేయ నచ్చపుం
బ్రణయముఁ బూనఁజేసి సుకరంబుగ నేలుచునుండె భూప్రజఁ. 396

చ. తన ధరణిఁ ద్యజించుటను దద్దయు దద్రిపుధాత్రి కేగి యా
జనవరరాజితోడఁ బెనుసఖ్యము సేసి వసించుచుండుటన్
దనకయి వారు శత్రులెగదా యని వారల జేడు వైరమున్
గొనఁడు నిజాదరేక్షణము గొల్లగఁజూపు నతద్గుణైషియై. 397

సీ. నిడుకేలు సారించి యడిగిన యర్థిజ
నావళి కెపుడు లేదనఁగ లేదు
తెలిసి తప్పొనరించు దృప్తమానవుని నె
న్నడు శిక్షసేయక విడువలేదు
వాక్యార్థ మొనరించు పండితు నేనాఁడు
నర్హ సత్కృతి సేయ కంపలేదు
శ్రుతి హితోక్తులు బల్కు యతివల్లభులు జేర
బదపూజ సేయక పంపలేదు.

గీ. దినదినమ్మును దేవదర్శనము సేసి
మూర్తికై మ్రొక్కి తదుదంతకీర్తనమ్ము
సేయకేనాఁడు బ్రొద్దు దర్శింపలేదు
రాయలూనని రాజధర్మంబుగలదె? 398

గీ. పక్షపాతంబు ధర్మంబు వంకఁదిరిగె
కుటిలగతిఁజేరె నంగనాకుంతలముల
చలనమది హరిణేక్షణాక్షములఁ జేరె
గృష్ణరాయలు భూతలమ్మేలు వేళ. 399

సీ. శాంతిసంస్థాపనాచారముఖ్యమ్ముగా
జగమున నెగడు సంజయుని నీతి
ధర్మాభిమాన ప్రధాన మూలమ్ముగ
విఖ్యాతివడసిన విదురనీతి
శత్రుసంతతినైన సాకి స్వీయులఁజేసి
సుకృతంబు జేయించు శుక్రనీతి
క్షణమాత్రమున మహాసామ్రాజ్యపతినేని
నమితుఁగావించు చాణక్యనీతి

గీ. శత్రువిజయ సమార్జన చతురతంత్ర
రచన నేపారు తిమ్మర్సు రాజనీతి
దీప్తిచెడితేటి శ్రీకృష్ణదేవరాయ
ధాత్రిపాలునిపైన నాధారపడియె. 400

సీ. తనదుపారావార తత్వము సంశ్రిత
సుజనకారుణ్య విస్ఫూర్తి నెఱపి
సంతత నిజవారిశైత్యప్రకారంబు
దీనజనావనదృష్టి నిలిపి
తనదు గాంభీర్యవిధానంబు నసదృశ
ప్రతిపదోత్పన్నభావమున జొన్పి
ఖండిత వీచికా డిండీర పాండిమ
స్తవనీయ మందహాసమున నిలిపి

గీ. తనదు నిత్యప్రఘోష శాత్రవ సమీక
పదసముద్భూత జయజయక్వణము జేసి
సాగరుఁడు కృష్ణరాయాంధ్ర జనవరునకు
సముచితాత్మార్పణముజేసి సౌరుబెంచె. 401

సీ. రక్తపాతమ్ము శాత్రవ శీర్షముల డాసె
కన్నీరు రిపుకులాంగనల గదిసె
కఠినత్వ మంగనాగణ కుచమ్ములఁజేరె
కరపీడనము విటాగ్రణుల నందె
మందిమ రతికాలమహిళ సిగ్గున వ్రాలె
లేమి కాంతామధ్యసీమఁ గ్రమ్మె
సంకర్షమ్ము కర్షకజాతి దరిపట్టె
వక్రవర్తనము శైవలినిఁ జెలగె

గీ. పటుతరానీతి సస్య సంపత్తిఁ గవిసె
సతత నిర్ఘోష మపరాధి జనులఁ బ్రామె
స్తవ్య విద్యానగర రాజధామ పీఠి
రాయ లలరార దుర్గుణ ప్రతతి సడలె. 402

చ. కలిమికిఁ దావలంబయిన గణ్యపరాక్రమ సాహసంబు ల
గ్గలముగగొన్న నార్యజన గౌరవపాత్రత కిక్కయైన ను
జ్జ్వల మతిసాంద్రమంత్రి బలసంపదకాకరమైనఁ గృష్ణరా
యలు విడకుండె గ్రంథపఠనాలయ వాఙ్మయసేవ నెన్నడున్. 403

క. విలిఖితపత్రమ్ములుగల
నిలయమ్మునఁ గృష్ణరాయనృపు డీక్షించెన్
నలుపాదమ్ముల నలరెడు
తెలుగుం బద్దెము బొకండు దిగువ విధానన్. 404

క. "కలితాయుధ బలవర్గము
బలమున కగ్గలముగా నృపాలున కొదవున్
బలిమి పెర నృపతి కాజ్ఞా
బలసంపద కెంతదవ్వు బద్దె నరేంద్రా?" 405

క. ఇందలి భావము రాయలు
డెందమ్మునఁ దెలియఁగాఁ బఠించిన యంతన్
గొందలపడి దుర్గమ్మున
యందుంగల బలము తెలియ నాలోచించెన్. 406

క. తొలుదొల్తఁ దనదుకోటన్
గల గణకుని బిలచి తగుప్రకారము ధనవ
న్నిలయమునన్ గల నిధికిన్
మెలకువతో లెక్కసెప్పుమీ యని యడిగెన్. 407

గీ. అనఘమూర్తి విద్యారణ్య యతివరుండు
రాజ్య సంస్థాపనో ద్యమారంభమందు
జనవరునకుంచె నేకోనశతముకోట్లు
పైన నేబదియార్లక్షలైన ధనము. 408

మ. వరరాజన్యకులైక భూషణుల సౌభాగ్యార్థ మందుంచె సుం
దర భూషాకృతి నాల్గుకోట్లనిధి రత్నవ్యాప్తి షట్కోటిఁద
ద్గురు రూపార్థమునుండి కైకొనకయే క్షోణీధవుల్ రాజ్యమున్
బరిపాలించినవారు ద్రవ్యమున లోపంబంద కొక్కింతయున్. 409

గీ. పదియుఁదొమ్మిదికోటు లేబదియు నాఱు
లక్షలగు పైడి నాణెముల్ గణనచేసి
విలువచేసిరి సామ్రాజ్య నృపతి మణులు
ముట్టలే దే విభుండు నీమూలధనము. 410

గీ. కూడెఁగర్ణాటనిధి పదికోట్లపైన
నెనుబదియు నాల్గు లక్షల ధనముదాన
నర్థబలమున నాఁటి విద్యానగరపు
ఖండ మగ్రేసరమ్మని గణుతి కెక్కె. 411

మ. అలరారెన్ దపనీయ ముద్రికలు దేవాదాయ విత్తంబుగా;
నలరెన్ దానికిఁదోడుగాఁ గలసి బ్రహ్మాదాయమున్ సర్వ మా
న్యలసద్విత్తము లెక్కసేయ దశకోట్యంతంబు మొత్తంబు రా
జిలె విద్యానగరీ సమార్జిత ధనశ్రీ పొల్చె నిస్సామ్యమై. 412

చ. ఇరువదినాల్గు వేలవఱ కెన్నఁగ వచ్చిన యశ్వరాజముల్
కరితతి యొక్క వేయిపయిగా ద్విశతంబును రెండులక్షలై
పరగిన కాల్బలంబులును వర్తిలెనంచు నెఱింగెఁ గృష్ణ భూ
వరు డటు లన్నిగల్గినను వ్యర్థముగాఁగని యిట్లు చింతిలెన్. 413

గీ. అఖిలరాజన్యజన్య క్రమావలంబ్య
తంత్రవిజ్ఞాత తిమ్మర్సు తాళఫలము
పడయఁగా బాహుయుగ్మమ్ము పైకినెత్తి
ఎరుగులాడెడు నీమాడ్కి కేమి ఫలము? 414

మ. తన యాజ్ఞం దలదాల్చి సంగరము సిద్ధంబైనచో నెందఱీ
ఘన విద్యానగరాభిరక్షణకు దూగన్ నేర్తురో? కృష్ణరా
డ్జననాథుం డరయంగరామి; జనరక్షారీతి యీ రీతిగా
జనుభావిన్ గరణీయ మేమని మదిన్ జర్చించెఁ దీవ్రంబుగన్. 415

మ. తనకై జీతముక్రింద నున్న బలమే, ధాత్రీశు సత్వం బదే
క్షణమందైనను గార్యనిర్వహణమున్ గావింపగా వచ్చు; న
న్యనృపాధీనబలంబు తన్నిగదితాజ్ఞాబద్ధమైయుంట త
జ్జనపాలానుమతి ప్రకారముగదా సంసిద్ధమౌటాజికిన్. 416

గీ. కరగతంబైన యామలకంబుగాదు
చొక్కపుం దొడ్డి తంగెటి జున్నుగాదు
అంగిలిన్ గల బెల్లంబునైన గాదు
అధిపుకై జీతమున గాక యలరు బలము. 417

కా. ఈ రీతిన్ బరిపాలనానియమముల్ సృష్టించెఁ దిమ్మర్సు; త
ద్ధీరుండే పృథివీశ సత్వమును నిర్దేశించుతన్; భిన్న మా
ర్గారంభంబునఁ దన్మనః ప్రకృతి మార్పంజాలు యత్నంబు నేఁ
బ్రారంభించెదగాక; యంచు నుచితోపాయంబు నూహించుచున్. 418

మ. ఒకనాఁడద్దమరేయి ఱేడు తన యుద్యోగమ్ము నెవ్వాడు గా
నక యుండన్ జని పత్తనంబున కుపాంతబందు రెండామడన్
వికలంబైన పురాతనాలయమునన్ విశ్రాంతిమైఁ బండెఁబా
లకు డెందేగెనొ యేరెఱుంగమిని గోలల్ పుట్టె దుర్గంబునన్. 419

మ. నరనాథుం డెటొ పోయెనం చెఱిఁగి వంతన్ మంత్రి తిమ్మర్సు "భూ
వరు డెవ్వారికిఁ జెప్పకేగఁగత మెబ్భంగిన్ బిసాళించె; ని
త్తరుణంబందున నెందునుండును స్వతంత్రప్రాజ్య సామ్రాజ్య సుం
దర వైభోగములొందు భూపతికి యుక్తంబౌనె యిట్లేగఁగన్. 420

మ. తన కృత్యంబులు పెక్కులున్నయవి తత్సక్తిఁ విసర్జించి నూ
తనమార్గం బవలంబనీయమని చింతల్ సేయు టివ్వేళనా?
పెను మాత్సర్యము బూని వైరిగణముల్ వేవేగ నిర్జింపఁగా
గనువారియ్యెడఁ దానదృశ్యుఁడగుచో క్ష్మారాజ్య మెట్లొగెడిఁ. 421

మ. తన వాంఛించిన దేమికాదనుటకున్ దక్షుల్ ప్రజావర్గముల్
తన యాజ్ఞన్ నిరసించువార లెవరీ ధాత్రీ మహామండలిన్
ఘన కార్యంబులు సాధనీయము లెసంగ స్థానమే వీడుచున్
గనరాకుండగబోవు భూపు డఖిల క్ష్మామండలిన్ గల్గునే? 422

మ. చతురంబోధి పరీతభూరితర రాజ్యశ్రీరమాశాసియై
నతలోకావన దక్షతానిలయుడై నాకైన సూచింప కీ
గతి నజ్ఞాతనివాసమున్ జలుప నే కర్మంబున్ బోయె నా
జతనంబెల్ల నిరర్థకంబె గద యీ క్ష్మాభర్త రాకుండినన్. 423

ఉ. ఊనికి గోర్కెయొుండ వతరించిన దీర్చికొనంగనైన యే
దేనొక యత్నమున్ జలుపుటే కరణీయము, కోరునంతమా
త్రాన మనోరథం బుపగతం బగునా? నిదురించు సింహి యా
స్యాన మృగాళి వచ్చిపడునా ? యది సంభవమౌన ? యెందునన్. 424

గీ. అనుచు జింతించి తిమ్మరు సవధిగొనక
చారులన్ బిలిపించి విచార మొనయ
నన్నిదెసలకుబోయి రాయలను వెదుక
చార వితతికి నపుడె శాసన మొసంగె. 425

క. తిమ్మరుసు నాజ్ఞభటవ
ర్గమ్ములు పురిదొరగి దీవ్రగమనముతో పా
ర్శ్వమ్ముల కేతెంచిరి దీ
పమ్మున నగు కాంతికిరణపటలము వోలెన్. 426

చ. నగరవరంబునుండి యిరునాలుగుక్రోసుల దూరమందు జీ
ర్ణగతి దనర్చు దేవళమునన్ ముఖమంటప పార్శ్వమందునన్
నెగడు శిలానివాసమున నెత్తి మునుంగముసుంగు వెట్టి దృ
గ్యుగమర మోడ్చి యందలరు నుంకువలన్ గనుచుండె నొంటిగన్. 427

ఉ. అదియొక వేంకటేశ్వరుని యాలయమౌట బ్రఘాణ ఘంటికా
నదముల మాధురీగరిమ నవ్య నృపాలక భక్తిభావ సం
పదజన నిట్లుగన్ హృదయపద్మమునన్ స్తుతి సేసె సద్దయా
స్పద చరిత ప్రకారు, శ్రితజనాదరు, వెంకటేశ్వరున్. 428

చ. చండతరాసి ఘాతముల సంగరముల్ రచియింప నేర్చు ను
ద్దండుల బాహుదండ గురుదార్ఢ్యమున్ భవదీయ తీవ్ర దృ
క్కాండము జేసి యెండబడి క్రాగి కరంగెడు మంచుగడ్డగా
గండుతనంబు గోల్పడు నఖండబలాకరా వేంకటేశ్వరా. 429

చ. కరమున వాలుగైకొని ప్రఘాతము లేసి యరిప్రతాపమున్
గడఁగగఁ జేయువారు దృఢకాయులు నీ వసిశూన్యపాణివై
పరిగి విలోకమాత్రమున వైరులగుండియ లార్పనేర్తు వీ
ధరపయి నీకు సాటి విదితంబుగ నీవె సుమా పరాత్పరా. 430

చ. వలమురి చుట్టుకైదువయి బద్మగదాయుగళంబు నే క్రియన్
జలుపునొ తత్క్రియాసరణి శాతదృగుల్లసనంబె సల్పుదు
ష్టుల సుజనప్రబాధకుల జూచి వధించు భవత్సమీక్షణో
జ్జ్వలత కదే సమం బసమసార పరాత్పర వేంకటేశ్వరా. 431

చ. శ్రితఘన భక్తరక్షణము సేయగ నీవరుదేరునాడు స
మ్మతి బరివారమంతయును మార్గమునన్ బడి వెంబడింపదే
యతుల కృపారసంబున ధరావనసేయ నిమిత్తకారణా
కృతినను నాప్తసైనిక పరీవృతు జేయవదేల శ్రీహరీ. 432

చ. జగదవనప్రకారమున సాగెడు నీ చరణారవింద మొ
ప్పగ భజియింతు దేవ! నిజభూజన నిర్భయవాసరక్షకై
పగతురదాడి దప్పకొన ఖండన దక్షుల సైనికాళిని
మ్మగ స్వవశంబునన్ మెలగు పోల్కి బిరాన ననుగ్రహింపవా. 433

గీ. అనుచుఁ బ్రార్థించి కృష్ణరాయావనీశు
డలుక నుపవాస దీక్షచే నలఁతఁ జెంది
యావలన్ సైన్య కోలాహలాతిశయము
నాలకించియుఁ గ్రమ్మఱ నట్టె పండె. 434

గీ. వెదుకఁబోయిన చారులు విభునిజాడ
దెలియఁగ్రమ్మఱి శ్రీ కృష్ణదేవరాయ
లధివసించిన ప్రాత దేవాలయంబు
జాడ దిమ్మర్సు ప్రెగ్గడతోడ ననిరి. 435

చ. పలుచని యాకుపచ్చ వలువల్ పొసఁగించు పతాకికావళిన్
బొలుచు సమీకరంగ పరిపూర్ణ కలావిదులైన వీరయో
ధుల నొకవేయిమంది వనిఁద్రోవనిలంబడి రామనిన్ మరు
చ్చలిత నవప్రవాళపరిసారిత ధాత్రిజరాజియోజగన్. 436

ఉ. రాయలు నిల్చు తానెఱిఁగి రాజహితోచిత కార్యమంత్ర సం
ధాయకు డిచ్చమై సమరనాయక సంగతినున్న సైన్యమున్
డాయఁగఁబిల్చి దుర్జయభటప్రకరంబులు వెంటనంట దే
వాయతనాంతికోర్వి విడియన్ నుడి రాయలఁ జేరె నొంటిగన్. 437

మ. మణిమయభూష లేక గళమౌక్తిక హారములైన లేక, సద్
ఘృణి నవరత్నతల్లజ వికీర్ణసువర్ణకరాభిరూప కం
కణములు లేక రాజకులగౌరవపాత్ర సువర్ణవస్త్రధా
రణములు లేక వంతఁ జనురాయలఁ బ్రెగ్గడ గాంచె నయ్యెడన్. 438

ఉ. దవ్వులనుండి మంత్రి తన తావునకుం జను టీక్షసేయుచుఁ
మవ్వపుఁబచ్చడంబు తనమై మునుగన్ బిగఁదట్టి పండెనం
దవ్విధి నిద్దురన్ గొనినయట్లగు రాయల నించుకేనియుఁ
నొవ్వఁగనీక మంత్రి, విధి నూల్కొన నిల్చె వినమ్రశీర్షుడై. 439

క. పెనునిద్రనుండి లేచిన
జనునివలెన్ నటనజేసి చక్షుర్యుగమున్
దనకేల నులిపి రాయలు
గనియెన్ దీనాననమున గదిసిన సచివున్. 440

ఉ. చేతులు మోడ్చి యంజలి రచించి వినమ్రత నిల్చియున్న వి
ఖ్యాత మనీషిఁ దిమ్మరుసునారసి రాయ లిటేల వచ్చితం
చాతురచిత్తుఁడై యడిగె; నాతఁడు త్వద్రచితాజ్ఞఁ జేసి సే
నాతతిఁ దెచ్చితిన్ నిలిపినాఁడ నదే కనుమంచు వాకొనెఁ. 441

ఉ. "భూతలనాథునాజ్ఞ బరిపూర్తిరచింప దినద్వయంబుగా
హేతు వెఱింగితే యిపుడు నేనియు సేనల నన్యభూపతి
వ్రాతమునొద్ద నుంచునెడ భండనముఁ బయిఁబూనుకొన్న నే
భాతి సకాలమందు బలవర్గము రాదొ? యదెంత మోసమో". 442

చ. సరియని యన్యభూపతులు సైన్యము మాకడ కంపుదన్క సం
గరములఁ గేలు గట్టికొనఁగావలె గాదె; త్వదుక్త పద్ధతిఁ
తరుణము సెప్పవచ్చునె; స్వతంత్రబలంబులులేక యాజికిన్
నరపతి యస్వతంత్రు డయినన్ బ్రతిపక్ష జయంబు సాధ్యమే. 443

ఉ. నీతు లుపన్యసించి విధివిర్ణయముల్ రచియించు మాత్రనన్
లాతి నృపాలవర్గము లలంతిబలంబుల వేళ కర్పణన్
జేతు రనన్ నుడిన్ సరకు సేయుట రాజనయంబుగాదుకై
జీతమునొందు యోధులను జేయుమి మద్వశవర్తులై చనన్. 444

గీ. రాయ లిటులన మంత్రి శీర్షంబు నూపె
బలములను జేరి నరనాథు తలఁపు నొడివె
ప్రభునకు స్వతంత్ర బలము నేర్పాటు సేసె
సమ్మతించి విభుండు దుర్గమ్ముఁ జేరె. 445

చ. నరపతినామమున్ గొని రనల్పపదాతివితానశిక్షకుల్
నరవరులొంది రశ్వపతినామము, నశ్వదళప్రశస్తి, నం
దిరి నరనాయకుల్ గజపతి ప్రథితాంకము నుగ్రసామజో
త్కర పరిపుష్టి లిట్లు వసుధావరరాజికి నొప్పె నంకముల్. 446

సీ. స్థాపించె నేశక్తి శత్రుగూలిచి జయ
ధ్వజము నా శ్రీరంగపత్తనమున
మ్రోయించె నేశక్తి పొరిపొరి జయభేరి
చెలువంపు మళయాళసీమలోన
వినిపించె నేశక్తి భీకరార్యంత ఢ
క్కా మహాధ్వని కూర్గుసీమలోన
విదళించె నేశక్తి విజయప్ప నంపించి
శితవిపక్షజనాళిఁ జేరసీమ.

గీ. ఏ భయదశక్తి యాతంక మెడముసేసి
చోళసామ్రాజ్యలక్ష్మిని జూరగొనియె
అట్టి శ్రీకృష్ణరాయ చండాసిశక్తి
వేలురిం గప్పముల నిగ్గి విలువఁబెంచె. 447

శా. వేలూరన్ నిజరాజ్యశాసన మహాపీఠంబు స్థాపించి యు
ద్వేలక్ష్మావరరాజి కప్పముల నర్పింపంగ శాసించె నె
వ్వేళన్ జన్యవిహార మూనినను వేవేలన్ శతాంగాశ్వ సే
నాళిన్ బంపఁగ రాయ లేర్పఱచె నిత్య శ్రీ యశః కాంక్షియై. 448

సీ. పృథునమ్రశీర్ష కిరీటరత్నప్రభా
శ్రీభృతాంజలుల నర్పించువారు
వరదయాభ్యర్థన ప్రఘటిత నవరత్న
విస్ఫుటాంజలుల నర్పించువారు
నిజభావమార్దవ నియమసూచి కుసుమ
శ్రీభరాంజలుల నర్పించువారు
విమల భక్తి సమూఢ విధివత్ప్రణామ స
విభ్రమాంజలులు నర్పించువారు.

గీ. దేవరాయాంక సముపేత ధీరరాజ
సంప్రదర్శిత శౌర్య ప్రచారకీర్తి
వినుతి వాక్సుమాంజలుల నర్పించువారు
అధిపరాయల సామంతులైన వారు. 449

మ. వరతేజోనిధి కృష్ణరాయజిత సత్వప్రౌఢ వైర్యంగనల్
శరణంబందఁగఁ గానకేగ నయినన్ క్ష్మారుడ్ లతామంజరీ
పరిఖేలద్భ్రమరాళి భ్రాంతిఁ గుచకుంభశ్రేణిఁ గోరాడు సుం
దర బింబాధరరాజి, భ్రాంతశుక సంతానంబు పీడించెడున్. 450

మ. బలవద్భూభరణార్హ దుర్గపుర శోభన్‌జెల్లు నెల్లూరు మం
డల మాద్యంబుగఁ గొల్లడంవఱకు నుండఁబోలు ధాన్యోదయో
జ్జ్వల సస్యప్రతివర్థితార్థ ఘటితైశ్వర్యోర్వి శాసింపఁగా
నిలిపెఁ గృష్ణపనాయకున్ నిజబలానీకంబు కేలూతగాన్. 451

గీ. దాని దవిలి తంజావూరు దనుకనైన
నేలఁదనయాజ్ఞ నడుపఁగా నిలిపె విభుడు
వీరారాఘవనాయక వీరవరుని
స్వీయసామ్రాజ్యరమ యశస్స్మితగాగ. 452

మ. ఘనవైశాల్యము తంజవూర్మొదలుగాఁ గన్యాకుమార్యగ్రగా
వనిపర్యంత మహామహీతలమునున్ బాలింప వెంకప్పనా
యనినేమించె సమస్త దక్షిణదిశావ్యాప్తావనీ మండలం
బనుశాసించెడు భాగ్యమిచ్చె నిజశౌర్య శ్రీ మహాలక్ష్మికిన్. 453

శా. నానాలంకరణ ప్రధాన రసమాన్యగ్రంథ సంధాయకా!
ధీనిస్తంద్ర బహూక్రియాభ్యుదిత సత్కీర్త్యావృతాశాముఖా!
దీనార్థ్యగ్ర దరిద్రతాప్రశమనోద్దీప్తార్థ దానోత్సుకా!
శ్రీ నారాయణరాయనామక కృతిస్వీకార నిర్వాహకా! 454

ఇది

శ్రీమదుభయ భాషాకవితాప్రవీణ, సహస్రావధాన చతురాసవ, సహస్రావధాన పంచానన, పంచ సహస్రావధానీత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ పయఃపారావార రాకాసుధాకర సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రణీతంబైన సాలంకార కృష్ణదేవరాయలను ప్రబంధంబున తృతీయాశ్వాసము సంపూర్ణము.

# సాలంకార కృష్ణదేవరాయలు

## చతుర్థాశ్వాసము

క. శ్రీయమనియమాభ్యాసా
ఆయుఃప్రద వైద్యవిలసదసివిన్యాసా!
న్యాయాశ్రితమానస; నా
రాయణరాయా! పరిస్ఫురద్దరహాసా! 455

గీ. ఏసుశకము పదేను నూఱేండ్లపైన
పదియు మూడబ్దములు వెన్కబడినయపుడు
విజయనగరక్ష్మాజాని గజపతీంద్రు
శౌర్యలక్ష్మిని వీక్షింప సమయమయ్యె. 456

మ. ఉదయాద్రీశ్వరు నెయ్యమున్ జలుపు భూర్యోఢ్రక్షమారాజ్య సం
పద, దేవేశ్వరవాంఛనీయమగు సౌభాగ్యంబుతో నిండి య
య్యుదగాశాధిప విత్తవైభవముతో నొప్పారుటన్ జూడగా
నెదఁదత్ శ్రీ విజయాభిలాష వొడమెన్ గృష్ణక్షమాజానికిన్. 457

మ. అది యోఢ్రావని, భాసిలున్ గజపతీంద్రాధీనమై దాని సం
పద విద్యానగరోరుసంపదకు సామ్యంబూను; రాజ్యాంధతా
మదమత్త ప్రభుదోర్బలంబు నిజ సామ్రాజ్యాంచితౌన్నత్యమె
ట్లదుమఙ జాలెడినంచు రాయలు సమర్థాలోచనల్ సేసెడున్. 458

మ. కటకంబాభువి రాజధాని తదనీకం బర్ణవప్రాయము
త్కట వంగాంగ కళింగ రాష్ట్రబలయూధంబెల్ల జృంభించి యొ
క్కటియై తద్బల వారిరాశి నిలువంగన్ గోణభాగంబునున్
దిట వేపారఁగ నింపజాలదు సముత్కీర్ణాహవ ప్రోద్ధతిన్. 459

క. జనపాలుని సన్నిధి కొక
దినమునఁ జనుదెంచి మంత్రి తిమ్మరు సరయన్
జనపతివదనమ్మాలో
చనమగ్నంబగుట నిటు ప్రసంగము సేసెన్. 460

గీ. రాజు జగదభివృద్ధికారకుడు రాజ
దర్శనము మనోరంజనోత్పాదకమ్ము
కువలయేశునకు న్మహోత్సవముఁజేసి
జలధివలె జనసందోహ మలరు గూర్చు. 461

మ. ప్రతిపాలించును శుద్ధమార్గములఁ సౌరభ్యంబుబొందించు సం
హతమున్ వర్ధనఁజేయు మ్లానము జలాధ్యాసి క్తముఁ జేయు నా
నతులన్ బ్రోన్నతులఁ సమీకృతులుగన్ గావించు దుష్కంటకి
ప్రతతిన్ ద్రోయును భూమిపాలు డ వనీరక్షాపరప్రక్రియన్. 462

చ. ధరణి సమస్తధర్మముల తత్వమెఱింగి, సమర్థనీతిమ
త్సరణిఁ బ్రజాధిపాలనము సల్పుచు శత్రుకృతాపకారముల్
పొరిపొరి దూరమున్ జలుపు భూవరునిఁ బ్రజలెల్లఁ బ్రేమసం
భరిత మనస్కులై యరసి భావన సేసెడివారు ప్రేముడిన్. 463

గీ. ఘనుడు కర్షకతతికి జీవన మొసంగు
కర్షకావను డగుటయేగాక ఱేడు
నఖిల ధాత్రిజనాళికి హర్షదాయి
జీవనమొసంగి యధిక ప్రసిద్ధిగాంచు. 464

మ. ప్రజకావశ్యకమైన యంశమునఁ దోడ్పాటిచ్చుచున్ దుర్విపద్
వ్రజముల్ పైకొనువేళ ధైర్యమును నుత్సాహంబు జేకూర్చి ని
త్యజయంబుఁ సమకూర్చుచుఁ నుతనయాధ్వంబూని పాలించుచో
విజయంబున్గొని ఱేడు భాసిలు నిజాభీష్టంబు లీడేఱఁగన్. 465

గీ. సర్వదేవాత్మకుండగున్ జనవరుండు
క్షోణిపతిఁ గొల్వఁగా శుభాశుభఫలంబు
లపుడు చేకూరు, దేవతాభ్యర్చనంబు
లందు ఫలమొనగూడుఁగాలాంతరమున. 466

చ. అని వచియింపఁ దిమ్మరుసు నాశయముల్ గ్రహియించి వెండి యా
జనవరుఁ డార్యమంత్రిఁ గని సద్వినయప్రవినమ్ర శీర్షుడై
జననుతధీమణీ, సచివ సత్తమ! రాజగుణప్రకార మె
వ్వనివలనన్ ఘటించునది పల్కుమనన్ మతిమంతుఁ డిట్లనున్. 467

మి. సురనాథుండు ప్రభుత్వశక్తి గరిమన్ శుద్ధాగ్నిహోత్రుండు సం
గరరంగ ప్రథమాన తేజము నుదగ్రంబైన క్రోధంబు భీ
కర వైవస్వతమూర్తి వైశ్రవణుడున్ గాంక్షించు చిత్తంబునున్
హరుడిచ్చున్ భుజ విక్రమంబిటు ప్రభుత్వాంగంబు లేపారెడున్. 468

మ. జనవర్యాభ్యుచిత ప్రసాదమున నైశ్వర్యంబు వాటిల్లు త
ద్ఘనదోర్విక్రమభ్యాతియే జయము నాకర్షించుఁ గ్రోధంబునన్
జను దుర్భృత్యువు సర్వతేజమునకున్ స్థానంబుగా నొప్పు నా
జనపాలాగ్రణి మ్రోల వర్తిలనగున్ సత్కాల విజ్ఞాతయై. 469

గీ. పాత్రుల కొసంగు దాత; సంభావ్య సుగుణ
రాగశీలి సపరివారభోగి యొరుల
యింగిత మెఱుంగువాడును సంగర ప్ర
చండుఁడగువాఁడు సముచిత జనవరుండు. 470

మ. రణమధ్యంబున వైరియుగ్మమున నే రాజేంద్రుడైనన్ బ్రజా
గణముల్ పెక్కుఱు నాశమొంద నరయంగాలేక తద్వైరికిన్
బ్రణతుండై శరణంబు వేడునెడ గర్వ ప్రోద్ధతిన్ బోక కా
రుణికత్వంబున సమ్మతింపవలె శూరుల్ శాత్రువుల్ మెచ్చఁగన్. 471

సీ. కొనకొండపైనెక్కి క్షోణికిన్ దుముకుచు
స్వశరీర ముడుగుట సముచితంబు
తీండ్రించి గాండ్రించి తెఱచిన పులినోట
తల బెట్టి మలయుట తగువిధంబు
పదనుకోఱలతోడ భయదమౌ సర్పంబు
నాస్యానఁ గేలుంచు టంచితంబు
అనివార్య హుతభుజ్ మహాజ్వాలలందున
బడి బూదియై మేనువిడుట పాడి.

గీ. శాత్రవాసికి బలియౌట సౌఖ్యకరము
శస్త్రముఁ బట్టి సామ్రాజ్య శాసనమ్ము
సలుపు రారాజు తనదు భూతలమునందు
విమత దుర్గంబు నొకదాని విడుటకంటె. 472

గీ. అనుచుఁదిమ్మర్సు రాజనయ ప్రబోధ
జలుపఁగా విని శ్రీకృష్ణజనవరేణ్యుఁ
డార్యుఁ తమ నీతి రాజమాన్య మ్మటంచు
హస్తముల మోడ్చి వందనం బాచరించె. 473

క. ఘనమగు సామ్రాజ్యము పా
లన సేయఁగ నిశ్చితాభిలాషఁ జనునే
నొనరింపఁగ నగు కార్యము
వినుచు మనన్ మంత్రతంత్రవిదు డిట్లనియెన్. 474

మ. వితతాభ్రంకష తుంగశృంగతటసంవిష్ట ధ్వజశ్రీ సము
త్పతనం బుగ్రశతఘ్నికాహతి నిరోధప్రాంశు కుడ్య ప్రజా
వృతమై యొప్పెడు కొండవీటిపుర ముర్విఁ గర్తపుర్యాహ్వాయాం
చిత భూమండలమందు నుండు సకలశ్రీ భాసురావాసమై. 475

మ. నిరతాంతః పరికీర్యమాణ విజయోన్ని ద్రస్వనానంద వి
స్తర దుర్గమ్మును జుట్టి నిత్య విచలద్ భంగ ప్రభంగాంబు సం
భరణంబౌ పరిఖాప్రకాండ మలరున్ బ్రస్ఫీత మత్తేభదు.
స్తర గాంభీర్య భరంబునై యరిచమూసందోహ దుర్గాహమై 476

మ. తగరౌప్యాచల ధాళధళ్య పరిదీప్తప్రాంశు దుర్గచ్ఛవుల్
నగరీరక్షక సంభృతాంబర సితానల్పద్యుతుల్ గ్రమ్మటన్
నగరీ కాంస్యకవాటబంధపదమున్ గన్పట్టమిన్ వైరి యో
ధగణంబుల్ చొర బాట గన్గొనక చింతఁ జేసి రన్వేషణన్. 477

గీ. కన దఖండ శిలోచ్చయ ఘటితమైన
ప్రముఖ రాజాధ్వబంధ కవాటమునకు
కుంభి కుంభ విదారణ కుశలములగు
కుటిల సూచ్యగ్రముఖ ములు గుబ్బ లమరు. 478

గీ. దుర్గసాలంబు పైననున్ దుర్గమునకు
జుట్టునున్ విచ్చుకత్తుల శూరభటులు
ప్రతినృపాల నిరోధ సంరంభ మెనయ
దినము రాత్రియుఁగాపాడఁ దిరుచుండ్రు. 479

మ. వరవప్రోపరివేదికాగ్రతట సంబద్ధంబునై కాంస్య బం
ధుర ఘంటాతిలకంబొకండలరుఁ బ్రొద్దుం బ్రొద్దు ఘంటా పరి
స్ఫుర నాదంబునఁ గాలమున్ దెలుపు దత్సుస్వాన మాలించి స
త్వరులై భృత్యులు పూనుచుందురు ధరాపాలోక్తకృత్యంబులన్. 480

సీ. వివిధాగమాంతర విజ్ఞాని విబుధుల
వాదానువాద నిస్స్వనములెగయ
అసమాన శౌర్య శూరావళి శస్త్ర వి
ద్యాభ్యాస నినదమ్ము లవఘళింప
విపణి వీథిన్యస్త వివిధ రత్నాంతర
వ్యాపారముల వైశ్యులత్తమిల్ల
అతులిత ధాన్యపూరిత శకటాగమ
వ్యాప్తి నా పణవీధి కాళిమ్రోవ.

గీ. రాజవీధులఁ బధిక సంరక్షణోద్య
మమున భృత్యులు శాంతి క్రమమ్ము నెఱప
రాజదర్శన భవ జయారావధామ;
విపుల సుఖభూమ; యా కొండవీటిసీమ. 481

క. ఆ కొండవీటి సంపద
జేకొని తత్పౌర శూరశేఖర శస్త్రా
నీక బలంబున నోఢ్ర
క్ష్మాకాంతుడు రుద్రవిభుడు గర్వించు నెదన్. 482

గీ. సమయము నెఱింగి తద్దుర్గ జయముజేసి
దాని సామ్రాజ్యమునఁ జేర్పఁ బూనవలయు
తత్ప్రతాపాంక రుద్రభూధవుని మనలఁ
గొలుచు సామంతునిగఁ జేయవలయు నధిప. 483

మ. అని తిమ్మర్సు వచింప జండతర కోపావేశ రక్తావలో
కనుఁడై శీర్షము కొండవీటి దెసగాగన్ ద్రిప్పి యోఢ్రావనీం
ద్రుని బాహాబలమంత దుర్జయముగా దూగాడునా యంచు, హె
చ్చునఁ బంకించుచు మంత్రి నేత్రయుగళిన్ చొప్పించె దృగ్జాలమున్. 484

మ. వరముక్తాఫల కంఠహార విసరత్ స్వచ్ఛాంశుమాలా సము
త్కర సంపూరిత భూమిపాల వదనాఖర్వ ప్రదేశాన భీ
కరరోష ప్రతిపన్న రక్తిమ మెయిన్ గల్హార సంభూతితో
విరిసెఁ గన్నులు తెల్పునం దరుణదీప్తిస్ఫూర్తి యెట్లయ్యెనో. 485

గీ. ముఖ్యసేనాని బిలిపించి భూవరుండు
కాంక్షమెయిఁ గొండవీటి దుర్గమ్ముపైన
దండువిడియంగ నెంతు నుద్ధండసేన
సిద్ధపఱపు మటంచు శాసించె నపుడు. 486

మ. దినమాత్రమ్మునఁ గొండవీడు నగరీ దిగ్యాత్రకై కృష్ణరాడ్
జనపాలుం డలఘుప్రయత్నపరుడై సైన్యావళిన్ గూర్చుటా
యెనటం చోఢ్రనృపాలమౌళి విని తత్పృథ్వీశు వారింపఁగా
బనిచెన్ దుర్గపదాభిరక్షణ కలాపారీణ యోధావళిన్. 487

గీ. ఇరువది సహస్రముల దన్కఁ దురగదళము
నటఁ ద్రయోదశ శతక సంఖ్యాకకరులు
నైదులక్షల కాల్బలం బలర నిల్చె
నోఢ్రభూపతి కృష్ణకు నుత్తరమున. 488

సీ. శ్లాఘ్య రాచూరు మల్లాఖానుడు ప్రమత్త
సామజయూధ శాసనము సేయ
నుద్దండ తేజస్వి యుద్దండఖానుండు
నశ్వదళాధిపత్యము వహింప
అల బాలచంద్ర మహాపాత్ర శూరుండు
అరదంపు బంక్తుల తెరువుజూప
వరపూసపాట్యన్వవాయజుం డగు రాచి
రాజు పదాతివర్గంబు నడుప.

గీ. ప్రాజ్ఞచిన్యామలక సవాపాత్ర విభుడు
నల్ల శ్రీనాథరాజును నాహవైక
తంత్రమున్ బోధసేయఁ బ్రతాపరుద్ర
నృపతి రాయల మార్కొన నెదురు చూచె. 489

మ. రణరంగంబులు రెండుగా నగుట, సంగ్రామ ప్రకారాజ్ఞ ధీ
మణి తిమ్మర్సును జూచి రాయలు రిపుక్ష్మానాథయాధంబు మా
రణముఁ జేయఁగ నేమితంత్ర మనఁ దంత్రజ్ఞానియేగాక, దా
రుణ జన్య ప్రతిఘట్టన క్రమకలారూఢుం డతం డిట్టనున్. 490

మ. అరిదుర్గమ్మను జుట్టుముట్టి తదుపాంతానల్ప సైన్యంబిలన్
దొరలన్ గొట్టెద నేనుఁ గృష్ణకవల దూగాడు సేనానము
త్కరముఁ భీకర సైన్యనాయకు లండగఁ నీవు పోరాడు మీ
సరణిన్ సైన్య మడంగ దుర్గమది సంసాధ్యంబు గాకుండునే ! 491

గీ. తటినీ తుంగ తరంగ బంగికల నిధ్వానంబులో మున్గి దోః
పటిమ\equiv జూవుట దుర్లభంబనుచు దర్వాది ప్రవాహంబు దా
టుటకు\equiv బాల్పడువేళ దూరమున నొడ్డు\equiv జేరి చంచచ్చమూ
పటలి\equiv గొట్టెడువారినెల్ల నడఁప\equiv భారంబు నీదే సుమా. 492

గీ. కాల్బలంబును రెండు భాగములు సేసి
రెండు రేవులనుండి ఝరీమతల్లి
వేగముగ దాటి యావలి కేగఁ జూడు
మదియె శాత్రవ తంత్ర రహస్యహరము. 493

మ. మును గృష్ణాతరణంబున\equiv విజయమున్ బొందంగనౌ సేన వా
హిని దాటంగఁ గడంగువారికయి తోడీయబ బ్రయత్నించుచో
మన సైన్యంబు సమస్త మావలికి సేమంబొప్పఁగా జేరు; నం
త నితాంత ప్రసరత్ప్రతాప గరిమ\equiv దట్టింపనౌ శాత్రవున్. 494

మ. ధృతిఁ బూనన్వలెఁ దద్గుణోపగత సాదృశ్యంబు నుత్సాహ మా
గతి కర్తవ్యంబగు సాహసంబువలె సంగ్రామోర్వి నెందే నధో
గతుడై కీలి చరింప నైర్ధ్యగతముల్ గాకున్నె కీలావళుల్
ధృతి యుత్సాహము సాహసమ్ము విజయ శ్రీదేవి నార్జింపవే. 495

మ. తనువున్ బాసినదస్క దుర్గ జయ యత్నంబేను గావింతుఁ ద
ద్ఘన కృష్ణాఝుర తీరవాసి రిపు సంఘాతంబు కేల్మోడ్చు ద
న్కను వెన్కాడక పోరుమీవు మనలన్ సామ్రాజ్య లక్ష్మీమత
ల్లిని. లోకైక యశోలతాంగి ప్రణయాశ్లేషంబు గావించెడున్. 496

గీ. నృపమణికి లబ్ధభాగ్య సంతృప్తినొంది
మిన్నకుండెడు చందంబు మేలుగాదు
తృప్తినొందని ద్విజుడు సంతృప్తిపడయు
నుర్విపుడు చెడు ననెడు లోకోక్తి వినవె! 497

మ. మన సామ్రాజ్య నిరంకుశాతిశయ సంపద్ వృద్ధికిన్ మూల మీ
ఘనదుర్గమ్మ గడించి సర్వవిజయాక్రాంతిన్ యశంబొంద కీ
తను మొహంబున జంక నేమిటికి నుద్యద్వార్ధి రత్నావళి\equiv
గొని జేజేల్ తనివొందిరే; సుధగొనన్ గోర్కిన్ బ్రయత్నింపరే! 498

సీ. ప్రళయ కాలానల ప్రజ్వలత్కీలాళి
సాంద్రశీతల హిమజలము గాదె !
వ్యాత్తాననాత్యుద గ్రాకృతి మృగరాజు
మృదుఘాస జీవనమృగము గాదె !
ఘోర మృత్యుప్రదాకుంత హాలాహల
రాశి పీయూష వర్షంబుగాదె !
ఏకరాశీకృత పృథులాబ్ధి సప్తకం
బల్ప కుల్యాతుల్య మగును గాదె !

గీ. లేలిహానంబు మేలిపూమాల గాదె !
జనున కాతఁడు సాహసోత్సాహ ధైర్య
బుద్ధి శక్తి పరాక్రమంబులను బొంది
దైవహితుఁడయి చరియింప దనరునేని. 499

మ. అని ప్రోత్సాహ కరోక్తులన్ బలుకు ధీరామాత్య శౌర్యోష్ణిమన్
గని యానందము నొంది, ప్రోక్తనయవాగ్భావానుకూలంబుగా
బొనరింపన్ దలపోసి, శత్రునగరంబున్ గెల్వఁగాఁజాలు యో
ధనికాయంబులతోడ మంత్రి ననిచెన్ దద్దుర్గమున్ మార్కొనన్. 500

ఉ. తా నపుడర్వసైన్య సముదగ్ర భటాదులు వెంట నంటఁ గృ
ష్ణానది కీవలన్ నిలిచి, శత్రుమహీపతి కంపె వార్త "యిం
దే నిలయంబునన్ నిలిచి యీవు రణం బొనరింప నేర్తువో
ఆ నిలయంబుఁ జేరుదు భుజార్గళసత్వముఁ జూప ర"మ్మనన్. 501

గీ. కృష్ణరాయల వార్త గ్రమింపనయ్యు
గజపతీంద్రుండు ధర్మమార్గమ్ము వదలి
సంగర స్థలనియమంబు సలుపలేక
తరుణము కొలంది పోరాడఁ దలఁపు సేసె. 502

గీ. అరులు కృష్ణాతరంగిణి తరగలందు
నుఱికి తరియింప యత్నంబు జరుపునపుడు
తటమునం దుండి గజపతి ధాత్రివిభుడు
మారణము సేయఁగా నెంచి మౌనమూనె. 503

ఉ. ఆ నృపు మౌనభావము రహస్యము నాత్మ నెరింగి యోఢ్ర భూ
జాని, యధర్మ తత్పరత, స్వాంతగతాశయమున్ గ్రహించి సే
నానివహంబునన్ సగము నైపుణిమీఱఁగ నేఱుదాటగా
నానతియిచ్చె రాయలు భటాళి జలంబుల జొచ్చి రవ్విధిన్. 504

చ. కరముల శస్త్రముల్ గొని యఖండ ధృతిప్రథిమంబుతోడ ని
ర్ఝరజలవీచికాచటుల సంహతులన్ జలియించు నావలఁ
బరగుచు నూయెలఁ దనరుభాతిని నట్టిటు లూగులాడుచున్
సరగున యోధపుంగవులు సాగిరి శైవలినిన్ దరింపఁగన్. 505

గీ. సైనికచయంబు కొంత కృష్ణాస్రవంతి
నడిప్రదేశంబు జేరు క్షణంబ పొంచి
గజపతీంద్రుని సైన్యనికాయ మెదురఁ
గడు వడిన్ జేరె; భయదసంగ్రామ మయ్యె. 506

గీ. వాహినీమధ్య కృతశస్త్రభండనమున
మూలముట్టుగఁ బావకజ్వాల నార్పు
అంబువుల నగ్ని విస్ఫులింగంబు లెగసె
ప్రకృతియందు విరుద్ధకార్యంబు పుట్టె. 507

మ. తన సైన్యంబును ఱేడు రెండుగ విభక్తం బౌనటుల్ సేసి వా
హిని మధ్యంబునఁ జండ భండనము సేయించెన్ రిపుశ్రేణి మా
ర్కొన నొక్కండు తదన్యు డోరిమిమెయిఁ గూలంకషఁ దీవ్రశ
క్తిని దాటెన్; జెలరేగె నాలము కడుఁ దీవ్ర ప్రకారంబునన్. 508

మ. ప్రళయాభీల కృతాంత కింకరుల చేవన్ ఘోర సంగ్రామముఁ
జలుపన్ రాయలధాకకోర్వక రిపుక్ష్మాపాలు డార్తిఁ సము
జ్జ్వల వేగంబునఁ గానలన్ బడగఁ ద్రోవన్ దద్ విరూపాకృతిన్
గలఁతన్ గన్గొని జాలి నిచ్చెఁ దరుశాఖల్ నిల్వఁగా నీడలన్. 509

మ. భయలోల ద్గజపత్యధీశుడు వనప్రాంతాధ్వగాలోకియై
నయన ద్వంద్వము కంపిలన్ బ్రతి నరున్ దత్కృష్ణరాడ్వీరు డ
వ్యయ తేజోనిధి యిందు వచ్చెనని దైన్యంబార భావించె ని
ర్దయతన్ దుర్గము గూలెనాయనుచు చింతన్ జేసె స్వాంతంబునన్. 510

ఉ. వీర వరేణ్యులౌ భటులు బెక్కురు నాశ్విక సైనికాళి యా
ధారముగాగ రాజిలిన తద్గజపత్యధినాథు ధైర్య లీ
లా రమ సైనికాశ్విక విలాసము దవ్వున మున్గిపో నిరా
ధార మనస్వితా గరిమ తాలిమి దూలియు నున్కి గోల్పడెన్. 511

ఉ. ఎక్కడి దక్కడే వదలి యెట్లొ యను వ్రజమున్నఁ జాలునం
చిక్క దొరంగు నా గజపతీంద్రు మహా శిబిరంబు జొచ్చినల్
దిక్కులఁ ద్రవ్విచూడఁగఁ బదింబది లక్షల విత్తమబ్బెఁ బే
రెక్కిన యశ్వసామజము లెన్నొ లభించెను రాయమౌళికిన్. 512

శా. పోరాటంబునయం దమేయవిజయంబున్ గాంచి యుత్సాహ వి
స్ఫారోత్తేజముతోడఁ దిమ్మరుసుకున్ సాయంబు గావింపఁగా
జేరెఁ రాయలు, గొండవీటి విమతశ్రేణుల్ స్వదుర్గావనో
గ్రారంభంబుల రెండుమాసములదన్కన్ జేయ నైరుద్ధ్యతిఁ. 513

మ. తుదకున్ వేసరి కొండవీటినగరీ దుర్దండయోధాళి య
క్కదనోద్వేగము నోర్వ కోటుపడి, దుర్గప్రాజ్యవైభోగ మా
పదపాలయ్యె నటంచు భీతిపడి రప్పట్లన్ క్షుధాశాంతి సం
ప్రద భోజ్యార్హ పదార్థజాల ముడిగెఁ వ్యాపించె సంక్షోభమున్. 514

ఉ. కోటకు నొక్కప్రక్కగల గోడకుఁ గ్రిందుగ రాతిచట్ట మే
ర్పా టొనరించి రాయ లురుబాహుబలాఢ్యుల వీరయోధులన్
మేటులఁ గోటలో దిగి సమీకము సేయఁగ నంపెఁదచ్చమూ
ధాటికి నాగలే, కరివితానము చేతులు మోడ్చె ఠేనికిన్. 515

గీ. దివ్యతర కృష్ణవేణికా తీరమందు
తుళువరాయ ప్రతాపరుద్రులకు నైన
సంగరంబున రాయలు జయముగాంచె
కొండవీటి చమూధాటి గుండె లదరె. 516

మ. తొలికాలమ్మునఁ గొండవీడు నగరీదుర్గమ్ము రెడ్డ్యన్వవా
యులు పాలించిననాఁరు శాత్రవ చమూవ్యూహ ప్రభేద్యమ్ముగా
జెలఁగన్ దీరిచి రెంత దిట్టమయినన్ శ్రీకృష్ణరాట్ శిక్షితో
జ్జ్వల సైన్య ప్రతిఘట్టనాపజితమై వ్రాలెన్ బటాపంచలై. 517

గీ. పట్టుబడినట్టి వారిలోఁ బ్రభువు, రాణి
ముఖ్య సేనానియున్ జిన్ని పుత్త్రకుండు
మున్ను గాఁగల వారలాపన్నులైరి
అధిప జన్మంబు విపదాలయం బయారె? 518

ఉ. సాళువ మంత్రివర్యునకు శాత్రవదుర్గ మధీనమయ్యె భూ
పాలుడు మంత్రిసత్తముని ప్రజ్ఞకు నెంతయు సంతసించె న
వ్వేళలఁ జిక్కువడ్డ యరివీర నృపాలురనెల్లఁ బట్టి బం
దీలుగఁ బంపె మంత్రి యతి తీవ్రముగాఁ దన రాజధానికిన్. 519

సీ. వినుత విక్రమశాలి వీరభద్ర గజప
తీంద్రుండు నిర్బంధ మెనయనాయె
వర వీరభద్ర భూపాలుని ముఖ్య నా
యకు లుర్వి నిడిరి నిజాయుధముల
గజపతి క్ష్మాపాల విజయ పతాకాళి
నిశ్చలత్వమునొంది నేల కొరిగె
భద్ర సింహద్వార భాసుర ప్రాసాద
మంగళ వాద్యముల్ మాటుమణగె.

గీ. నిఖిల కలుషాంత కృష్ణవేణీ స్రవంతి
కా యమాశాక్షమాఖండ గజపతీంద్ర
కోటిపరిపాలనము మాసెఁగొండవీట
రాయల ధరాధిపత్య మారంభమయ్యె. 520

మ. అరిరా డ్దుర్గము మంత్రిపుంగవునకుఁ స్వాధీనమున్ జేసి త
ద్ధరణీ రక్షణకై సమర్థ భటయూథం బచ్చటన్ నిల్పి తి
మ్మరుసున్ దత్పరిపాలనంబు రచియింపఁ నిల్పి శ్రీ కృష్ణరా
డ్ధరణీనాథుడు భూరి సైన్యతతితోడన్ జేరె విద్యాపురిన్. 521

చ. ధృతిమెయిఁ గొండవీటి నగరీ ఘనదుర్గము గెల్చుదన్క న
ప్రతిహతశ క్తి జూపిన ప్రభాకరదుర్జయ సత్వసైనిక
ప్రతతిని జేరఁబిల్చి స్తుతివాక్య సముద్ధతిఁ బ్రోత్సహించి యం
చిత బహుమానముల్ పొసఁగఁజేసి నృపాలుడు దన్పె నెల్లరఁ. 522

క. తుళువాన్వయాబ్ధి నొదవెన్
సులలిత కల్పద్రుమంబు సుజనావళి వాం
ఛలు దీరు గొల్లగా నని
యలరిరి సైనికులు హితులు నఖిలా ప్తజనుల్. 523

సీ. ప్రథిత విద్యానగర ప్రాజసామ్రాజ్య
శౌర్యలక్ష్మికి జిత్తశాంతి గాగ
సకలార్తపోషణోత్సుక విరూపాక్షుని
ధన్యకీర్తికి దోహదంబుగాగ
మజ్జనమాత్ర సమస్తాఘభంజక
భద్రాంబుచయము సాఫల్యమంద
గజపతీంద్రోగ్ర సంగర జయోపార్జిత
ధనమహాలక్ష్మి సార్థక్యమంద.

గీ. ఘటిత విత్తము రాజ్యోపకారి తనువు
సమతఁ దాల్పఁగ శ్రీకృష్ణజనవరుండు
తగఁ దులామానమున నంచితమ్ము సేసి
జనుల కిప్పించె సతుల హస్తముల చేత. 524

సీ. కోరునంతటి పైడిఁ గూర్చు హేమాద్రియా?
కదలివచ్చి యొసంగుఁ గాంచనంబు
అడిగినదెల్లఁ గాదన కిచ్చు సురభియా ?
నెమ్మెయిఁ శిరమునఁ గొమ్ములేదు
తలపుల దీర్చుఁ జింతారత్నమే యౌన ?
మనుజు నాస్యముతోడ మాటలాడు
ధన్యేప్సితార్థ సంధాయి సంతానమా ?
శాఖలన్ బడయ కొసంగు నీడ

గీ. హరుడ? కాలిమయేయంగ మందులేదు
అహిశయానుడ? నిదురమాంద్యమ్ముగాన
మగుత తుళువాన్వయాబ్ధి సుధాకరుండె
యనిరి సుజనాళి కృష్ణరాయావనీశు. 525

ఉ. ధీరకులాంగనామణులు తిర్మలదేవియుఁ జిన్నమాంబ వి
స్ఫార నయప్రకారమునఁ బార్థివ సత్తము వెంట నుండుటే
కోరుచుఁ జేరిరా ధరణికోటను నయ్యమరావతీపురిన్
నారికి హృత్ప్రియానుగమనంబునకంటెను శ్రేయమున్నదే? 526

గీ. అతడు పదియాఱవదగు శతాబ్దమందు
నేఁబదియు నొక్క వత్సరంబేగ! బదవ
నెలను నిర్వది నాల్గహంబులు గతింప
తిరుపతికిఁబోయి వేంకటేశ్వరున కెఱఁగె. 527

మ. తన యీ దిగ్విజయ ప్రయాణపటు వృత్తం బుర్వికిన్ దెల్లమౌ
టనుకూలంబని పూర్వ పశ్చిమ సముద్రాధీశుడఁ శూర రా
ట్జన దత్తాంకము దానితో యవనరాజ్య స్థాపనాచార్యుడం
చనుభద్రాంకము శాసనార్హ శిల వ్రాయంజేసె నుత్కంఠచే. 528

శా. ఆనాఁడబ్బిన పూర్వ పశ్చిమ సముద్రాధీశ్వరాంకంబు పృ
థ్వీనాథాన్వయ జాతగుప్త మహిశూర్ విఖ్యాత రాజ్యేశ్వరా
స్థానం బందున నేఁటికిన్ జనవరాచారైక కైవారవాక్
శ్రేణిన్ విశ్రుతమై స్మృతిన్ గొలుపు శ్రీకృష్ణావనీశోన్నతిఁ. 529

సీ. పావనకృష్ణా స్రవంతికోపాంతస్థ
పర్వతపుర దుర్గపదము నంటి
ధరణికోటాభిఖ్య పురశూరుల౯ దాకి
భయజన్య శైత్యంబు పాఱదోలి
అమరావతీ పురాధ్యావాసి జనుల సం
తాపంబురేపి యుద్ధతి వహించి
తిరుపతి వేంకటేశ్వర పదాబ్జములకు
భక్తి తత్పరత నివాళి నెత్తి.

గీ. గిరిపురీదుర్గ తల్లజోత్తర విభాసి
గజపతీశ్వర నామకాక్రాంత ములగు
ప్రోగ్ర దుర్గోపవనముల బూదిసేసి
అలముకొనె డంబు రాయ శౌర్యానలంబు. 530

శా. యాత్రాసంగతి గందనూలు నగరోపాంతాన దర్శించె దృ
జ్మాత్ర ధ్వస్త సమస్త శాత్రవచమూ మాయా విధానమ్ము స్వ
ర్ధాత్రీ నాగజగత్త్రయ ప్రసరణాధార ప్రఖాతమ్ము నా
ర్యత్రాసాంత నృసింహ రూపము తదీయాహోబిల క్షేత్రమున్. 531

మ. నరసింహేంద్రున కిచ్చె రాయలెలమిన్ నానావిధామూల్య సుం
దరరత్న ప్రతిభాసి మాల్యముల నానాచిత్ర శిల్పక్రియా
భరసౌవర్ణమయాంబర ప్రకరముల్ ప్రాంతస్థకేళీవనాం
తర సంపాదిత సౌరభాంచితలతాంత వ్రాతముల్ కానుకల్. 532

సీ. వాసవాశావధి భాస్వరాభ్రంకష
ప్రోత్తుంగ భూమిభృద్భూషితంబు
దక్షిణ దిక్తటీస్థగిత సేతు విరాజ
మానశైవాలినీ మానితంబు
ప్రాగుదగ్దిక్పరివ్యాప్త రత్న వితర్ధి
కాంచిత భర్మహర్మ్యాంగణమ్ము
ఉభయ పార్శ్వస్థ భూజోత్కరచ్ఛాయాభి
శోభిత శీతాధ్వ సుఖపదమ్ము.

గీ. దూరగమన సమాగమోద్యోగ జనిత
ఘర్మ జలకణ హరసుమ కాయమాన
బంధురారామము విజయవాడ పురము
నరసె భూజాని యాంధ్ర దేశాభిమాని. 533

మ. అటఁగొన్నాళ్ళు నివాసముండి శివదేవాగార మీక్షించి యు
ద్భట విద్యా పరిశోభితార్యులకు సత్కారంబు లందించి య
చ్చొట నిల్పెన్ స్థిర శాసనంబు కటక క్షోణీజయోత్సాహియై
పటువేగంబునఁ గొండవీట సమకూర్పఁ బోయె సైన్యావళిన్. 534

మ. కటకక్ష్మావర నిర్జయాశయము తూగఁ బల్కు భూపాలునా
రటముఁ గాంచిన మంత్రితిమ్మరుసు దుర్వారారి దోర్దర్పము
త్కటమౌటఁ గని రాజరాజునకుఁ దత్సంగ్రామ సంరంభ సం
ఘటనం బుగ్రవిపత్ప్రదాయక మనంగఁ బల్కె నీ వైఖరిఁ. 535

క. అరి బల దర్పాధిక్యము
నరయక యనిసేత దలఁప హానిఘటించుఁ
గరుడుం డమృతపుభాండము
బొరయఁగఁ బడుపాట్లు దలచుకొమ్ము నరేంద్రా! 536

క. అరిచేఁజిక్కిన ధరణీ
శ్వరునకు సముపార్జితార్థ వైభవమడగుఁ
దరలున్ నిజబలపాటవ
మరిపోవుఁ బుద్ధికుశలతాదిక మెల్లన్. 537

క. చిరకాలస్థాపిత ము
ర్వరపై నీ గజపతీంద్ర పటుసామ్రాజ్య
మ్మరయమి నాసించెడు నీ
పరువమ్మెయి సందియమ్ము పాలగుఁజుమ్మీ. 538

మ. అరి సైన్యంబునఁదూగి యుగ్రతర బాహాసత్త్వమున్ జూపి సం
గరరంగాన జయంబుగాంచి రిపుదుర్గంబున్ సమార్జించి య
య్యరిహృత్సీమ భయంబు గొల్పితివి, శ్రేయంబయ్యెఁ తత్కీర్తి ను
ర్వరపై నుస్థిరమున్ రచించు మది కర్తవ్యంబు రాడ్వల్లభా. 539

మ. పెరచోటన్ గల పాలు ద్రావుటకు సంప్రీతిన్ విడంబించి పె
న్బరువుల్ పెట్టి ప్రయాసమంది కల ప్రాబల్యంబు గోల్పోవు వై
ఖరి కంటెన్ ఘటికాంబుపానమున సౌఖ్యంబంది హర్షించి దు
స్తర సామర్థ్య సమార్జనన్ జలుపుటే సంపత్ప్రదం బుర్విపై. 540

మ. జనపాలాగ్రణి! గాదలచితో? స్తవ్యప్రతాపాంక రు
ద్ర నరాధీశ్వర రాజ్యసత్వ గరిమన్ ద్వద్రాజ్య సైన్యాధి నా
ధనికాయైకబలంబునున్ దులనిడన్ దత్సత్త్వమే భారమై
కనుపట్టున్ జుమి, తన్నృపాలసము డేక్ష్మాపాలుడున్ గాడిలన్. 541

మ. అని వారించుచు నెంత సెప్పినను నార్యామాత్య వాక్యంబులన్
ఘన గర్వావృతచిత్తుడై గజపతిక్ష్మాభృజ్జయాశానుధా
వనుఁడై మంత్రి భయాపకర్షితమతిన్ భాషించెనట్లంచుఁద
జ్జనపాలాగ్రణి నిశ్చయించెఁదుదకున్ సంగ్రామసన్నాహమున్. 542

గీ. ప్రభుల సన్నిధిన్ విహిత సంభాషణంబె
క్షేమమను నీతి యెఱిఁగిన ధీమహితుడు
తిమ్మరుసు పార్థివేచ్ఛావిధమ్ముమీఱ
నొల్లదని తలపంకించి వల్లె యనియె. 543

మ. రణసంరంభసమున్ముఖుండయి భటవ్రాతంబురప్పించి రా
ణ్మణి యాజ్ఞావిధి నిర్ణయంబు తెలిపెన్ నవ్యాహవారంభకా
రణముల్ దెల్పెను సైనికుల్ జయజయారావప్రరావంబులన్
రణభేరీక్వణనంబు సేసిరి దిశావ్రాతంబు మార్మోయఁగన్. 544

చ. “ఎవనికివాఁడు రాజగుటయే శశశీర్షవిషాణలీల మా
నవునసహాయజీవన మనన్ మృగతృష్ణ నెసంగు నీరమే
యవని ననాయకత్వమున నైక్యబలంబు వియల్లతాంత మి
య్యవిలభియింపజెల్లు సికతాంతరతైలము దీయ నేర్చినన్. 545

చ. జనపతిమంత్రిసత్తములు సమ్మతియోచన సేసి యుక్తముఁ
జనహితమైన కార్యము ప్రజాతతి కెల్లరకున్ వచింపఁగా
జనముల కైకమత్య మనుసంధితమైన జయంబు వాటిలున్
జనవర సంఖ్య హెచ్చయిన సాగవు సర్వహితప్రయత్నముల్. 546

చ. నరులకు నొక్కరుండు జననాథుడుగాఁ జనునేని వారిలో
నరుడొక యాపదన్ బడిననాఁడు మహీశుని చెంతకేగి దు
ర్భరపరితాపమున్ దెలియఁబల్క విపన్నునిఁ గంటఁజూచు భూ
వరమణి జాలిగైకొని విపత్పరిహారము సేయు నయ్యెడన్. 547

చ. తనువును నీడ నుంచుకొన ధామము జూపును ఱేఁడు కుక్షి పో
షణకయి త్రోవఁజూపు హితుచందమునన్ సుమనోనురంజనం
బొనరుచు క్షామబాధలను నుగ్రవిపత్తుల శాంతిసేయు జీ
వునకు విముక్తిమార్గ పరిబోధకవాక్కుల మేలుసేసెడున్. 548

ఉ. కావున సర్వరక్షకుని కైవడి మేలొనరించునట్టి సద్
భూవరు నిష్టదైవమని తోరపుబత్తిని గొల్వనోపు నా
జ్ఞావిధులెఁ దీర్పనగు శత్రుసమాగమమైన వేళఁద
క్ష్మావరదేహరక్షణము సల్ప జనమ్ములు పైకొనన్ వలెన్”. 549

గీ. అనుచు సైనికతతికి నయంబుసెప్పి
సాళ్వ తిమర్సు రాయల శాసనంబు
నౌదలం దాల్చి కటక రాజ్యప్రధాన
ధామమున కెల్ల యోధులఁ దరలఁజేసె. 550

సీ. భేరికాకాహళావిర్భూత నినదముల్
దిగ్గజశ్రేణి భీతిల్లఁజేయ
ప్రస్ఫీత దోస్సార భట సదోద్ధతరజః
పటలంబు భానుబింబంబు గ్రమ్మ
సమరాశ్వరచిత హేషా ధీరనాదమ్ము
లమరవల్లభుల కాహ్వానమీయ
భీకర మత్తేభ బృంహిత నిధ్వాన
మైరావతము పట్ల హాస్యమాడ.

గీ. కదనమున దేవ రాక్షస గణమునైన
బట్టి పల్లార్పగల భట ప్రతతితోడ
కటకరాజేంద్ర మండ లాక్రమణ సేయ
నరిగె రాయలు మంత్రి తిమ్మరుసుతోడ. 551

క. స్ఫుర దాహవాయుధ శ్రీ
భరితము లరదముల ద్విరదవర్గము లీడ్వఁ
బిరబిర ముందడుగిడ నరి
ధరణీంద్రుల బుద్ధి శక్తి తడబడసాగెఁ. 552

సీ. నిశితకంటకముల నేల రాల్పించెడు
తరులున్న దుర్గ మార్గమునకైన
నిట్టనిల్వుగ నింగి ముట్టునట్లుగ నిల్చు
పర్వతావళి యడ్డు పడఁగనైన
ఇరువంకలన్ భయంకరరూప శార్దూల
రావముల్ శృతి దుర్భరంబులైన
బలి సముత్ప్రేరిత పాతాళవాహినుల్
త్రోవ కడ్డంబుగాఁ దొరలనైన.

గీ. వికటకాలానలోదగ్రవిపుల ధూమ
రేఖ లెల్లెడఁ దమముఁ బర్వింపనైన
నసదృశాహవ కౌశలావ్యగ్ర కృష్ణ
రాయ బలధాటి తరలు సర్వంబు దాటి. 553

మ. పరగన్ సైన్యము కొండపైన, శిఖరి ప్రఖ్యాతవీరుండు స
త్వరమే నిద్దుర మేలుకాంచి తనమీదన్ బాదరక్షా పరి
స్ఫురదంఘ్రి క్రమతాడనో గ్రవిధికిన్ బ్రోద్దీపితక్రోధుడై
ఖరసూచ్యగ్రశిలానఖంబుల భటుల్ గాసిల్ల ధట్టించెడున్. 554

మ. గిరిభూమీరుహపక్వ శుష్కితదళోద్దీర్ణ స్వనవ్యాకృతిన్
వరసాన్వంతర నిస్సరత్ గురురుఝరీధ్వానాకృతిన్ జేసిభీ
కర సంగ్రామ నినాదమే యనుచు గృష్ణక్షోణిభృత్సైన్యముల్
వరలెన్ శత్రునృపాల సైన్యములు పైపైవచ్చు వేళన్ బలెన్. 555

మ. వనమార్గమ్మున నేగు జోదులను పార్శ్వస్థద్రుమోద్యత్ప్రభం
జనుడొక్కుమ్మడి వీచి మార్కొనఁగ శీర్ష వ్రాతముల్ వృక్షముల్
ఘనదర్పమ్మున నిక్కి యొర్పుమెయి ముంగాల్ వైవఁగాఁజేసి సై
న్యనికాయంబుల సాగఁజేసె నవరోధాయాస శూన్యస్థితిన్. 556

మ. ఝరణీమంజుతరంగికాంగనలు తత్సైన్యస్థ వీరాళి డం
బరయౕ వీరరసాపకృష్ట నిజభావా జ్ఞాతలై యొక్కరొ
క్కరినిన్ గాంచుచు నాకునాకనుచు వేడ్కౕ ముద్దులిమ్మంచుడ
గ్గఱు సర్దార్ల గ్రహింపరైరి నుఱుగుంగ న్నాకు చిర్నవ్వులౕ. 557

గీ. దగ్గిరకుఁబోక మున్న సిద్ధముగ నున్న
చటుల గజపతి సామంత సైన్యరాజి
శత్రువర్గమ్ము రాజరాట్స్థాన సమభి
యానమొనరింప నీక పోరాడ నిల్చె. 558

మ. పటిమన్ రాయలు తత్ప్రదేశ పుర సంభాస్యర్ఘ్య సామంతరాట్
పటలిౕ దాకుచు గోటలౕ జెనకి సౌభాగ్యంబడంగించుచున్
గటకాధీశ్వర ధామమున్ గదిసి సంగ్రామంబు గావింప ను
త్కట దర్పంబున సాగివచ్చె నను వార్తల్ సేరె రుద్రప్రభున్. 559

సీ. మించి కృష్ణాగౌతమీమధ్యదేశాల
నరివీరులకు గుండెలవియఁ దాకె
జమ్మిలోయఁ౽ సముజ్జ్వల తేజమున్ జూపె
కొణ్డామునీమలోఁ గొంత మెరసె
తత వేగిదేశరాడ్ధామ రాజమహేంద్ర
వరమున జయరీతిఁ గఱుకుపాఱె
తీంద్రించి మన్యప్రదేశ మధ్యస్థాయి
రహితాపురీవిహారంబు సలిపె.

గీ. స్తవ్యబాహుబలేంద్రవంశస్థరాట్ ప
దంబు పొట్నూరునన్ జయ స్తంభమెత్తి
సాటిలేనియశంబు నార్జనము సేసె
అప్రతిమసార, కృష్ణరాయాసిధార. 560

మ. జలధిప్రాంత విశాఖపట్టణ సమంచన్మధ్యదేశంబునన్
గల శ్రీవాసము మాడుగోలును సమాక్రాంతంబుగాఁ జేసె ను
జ్జ్వల మత్స్యాన్వయ శూరసంకలితమౌ వడ్డాది నిర్జించెనా
వల సింహాచల దేవులన్ గనియె సద్భక్త్యంచితస్వాంతుఁడై. 561

మ. స్థిరభక్తి ప్రణిబద్ధ చిత్తకుల సాధ్వీయుగ్మమున్ వెంటరాఁ
గరుణావార్ధికి నారసింహున కలంకారంబుగాఁ గాంచనా
భరణంబుల్ కనకాంబరంబులు మహీపాలుం డొగిన్ గూర్చె గ్ర
చ్ఛుఱనచ్చో నిలిపించెఁ గీర్తి కరనైజంబున్ జయ స్తంభమున్. 562

క. జనపాలుఁడు రాయలు తన
ఘనతర సాహసము సత్వగరిమమ్మును భూ
జనములకుఁ దేటపడ నం
దున నిల్చెన్ గొన్నినాళ్ళు తూగిన వేడ్కన్. 563

క. అలఘుబలాన్వితుఁడై రా
యలు నిజరాష్ట్ర ప్రజాళికాయాసమిడన్
నిలిచెన్ సింహాద్రి నన్
దెలియన్ గజపతివిభుండు తీవ్రతఁదాల్చెన్. 564

మ. అనిమి త్తంబుగఁ గాలుదువ్వి తతరాజ్యశ్రీ సమాక్రాంతిఁ బెం
పొనరింపన్ గనుచున్ గ్రమక్రమముగాఁ బ్రోద్దండదర్పాన మిం
చిన ధైర్యంబున డాయుచున్న విమతున్ శిక్షింప నేమార్గమౌ
నని సామంతుల మంత్రులన్ బిలచి ఱేఁడాలోచనల్ పైకొనెన్. 565

సీ. బలసముద్ధతిఁ జేసి పాఱదోలు డటంచు
బలభద్రపాత్రుండు పలుకనాయె
వ్యూహమ్ముననన్ బట్టి నుంకించుడని
ధుర్యుండు భీమపాత్రుడు వచించె
ప్రియవచస్సులఁ బల్కి వెడలింపుఁ డంచు ము
కుందపాత్రుండుయుక్తులను జెప్పె
దుర్గమారణ్య జంతుశ్రేణి పాల్సేయ
దెల్పె దుర్గాపాత్ర ధీరమూర్తి.

గీ పల్లె యొండిచ్చి వెనుకకుఁ బంపుఁడంచు
బ్రతతవిభవు డాఖండల పాత్రుడనియె
స్వభుజ శౌర్యప్రదర్శన సముపయాత
కృష్ణరాయల నిశ్చయం బెఱుఁగలేక. 566

సీ. రణరంగ పాత్ర తురంగ రేవండ పా
త్రులు రేగిపోరాడఁ దూగుడనిరి
వజ్రముష్టి మురారి పాత్రులు నసహాయ
పాత్రుడు నని కంజవైచుడనిరి
అశని మృగేంద్ర గజాంకుశ పాత్రులు
విద్వేషిఁబట్టక విడువమనిరి
భైరవభీకర పాత్ర ఖడ్గాపాత్ర
ముఖ్యులు దురమాడ ముఖ్యమనిరి.

గీ. ఇట్లు షోడశసామంత పృథ్విపతులు
చండభండన విహర ణోత్సాహమతులు
గజపతి క్ష్మాతలేంద్రు పక్షమున నిల్చి
రాయలన్ మార్కొనఁగ నభిప్రాయమిడిరి. 567

క. అణుమాత్రము వెనుకాడక
రణరంగోత్సాహ విభవ రంజితమతులు
ల్బణధృతి సామంతోర్విప
మణులాభాషించి రరివిమర్దనవిధముల్. 568

సీ. విద్యానగర రాజ విత్తాలయముదోచి
విత్తమ్ము మీకు నర్పింపఁగలము
హయరాజముల గొట్టి యధినాయకుల బట్టి
వంచించి మీ మ్రోల నుంచగలము
మదగజదంతాళి విదళించి తుండాల
ద్రుంచి మీ నెమ్మ్రోల నుంచగలము
అరిపదాతి వ్రాతహస్త పాదచయమ్ము
నిక్షుతుల్యముగఁ గోయించఁగలము.

గీ. అనుచు వినయవినమ్ర శీర్షాంచితాంజ
లుల ఘటించి వచించు వాక్కులకు నుబ్బి
దర్పితస్వాంతుడగుచుఁ బ్రతాపరుద్ర
గజపతీంద్రుండు సంగ్రామ కాంక్షియయ్యె. 569

క. మరుదినమున సైన్యసము
త్కరమున కానతి యొసంగె గజపతి విభుడా
సరణిన్ దమపై వచ్చెడు
నరి గెలువన్ సర్వసిద్ధులై వర్ధిల్లన్. 570

మ. వర సామంతనృప ప్రసంగముల, భూపాలాజ్ఞలన్ శత్రు సం
హరణోత్సాహ మెఱుంగుడున్ గమలనాభయ్యార్యుడన్ గృష్ణరాడ్
ధరణీనాథ నియుక్తసైన్యపతి తద్వార్తావళిన్ బత్రికా
సరణిన్ గూరిచి చారమూలమున దెల్పన్ గల్గె స్వస్వామికిన్. 571

ఉ. పంతముమీఱ రుద్రజనపాలుని చెంగటనాడినట్టి సా
మంతుల బీరముల్ వినినమాత్రన రాయలు స్వీయమంత్రి యే
కాంతమునందుఁజేసిన నయప్రియబోధము లెక్క సేయమిఁ
జింత యొనర్చి మంత్రి నివసించు గుడారముఁ జేరె నానిశన్. 572

గీ. ఎన్నఁ డెఱుగని యాతురవృత్తిదోప
నగుమొగముమాఱి విన్నదనంబెలర్ప
కమలనాభార్య లిఖిత పత్రమును జూపి
ఱేడు కర్తవ్యముఁ వివరింపుమనియె. 573

మ. మునుగా దెల్పక యర్ధరాత్రసమయంబున్ జీకటిన్ బాటిసే
యని చందంబున నొంటివచ్చు విభునాస్యాంభోజమున్ గాంచి యం
దనివార్యంబగు నార్తి సూచనము దృశ్యంబౌట నూహించి త
త్క్షణమే మంత్రివచించె భూవరున కాశ్వాసప్రదాలాపమున్. 574

మ. చటులాభీల భుజప్రతాప విసరత్సామంత తేజస్సము
త్కటమై యప్రతిజేయమౌ గజపతీంద్రప్రాజ్యరాజ్యంబు త
త్కటకక్షోణిఁ జయింపఁబో ఁజనదనంగా దెల్పితిన్ మున్నెయి
చ్చటికిఁ జేరిన వెన్కఁజేయనగునా? శంకామయాలోచనల్. 575

శా. దండోపాయము శత్రు మారణవిధా దక్షంబు గాకున్నచో
శుండాలాశ్వ శతాంగ సైన్యమనికిఁ జొప్పింపఁగాఁబోక ధీ
రుండప్పట్టు న దానభేదగమన ప్రోద్యోగముఁ జేయ ను
ద్దండంబైన రిపువ్రజంబు ప్రచితాంత ర్వైరమై కోల్పడున్. 576

గీ. అనుచు భాషించి తన సేయనైన యుక్తి
యంత వివరింపఁ గృష్ణరాయ ప్రభుండు
స్వధన నిలయమ్ముఁ సచివుని వశముఁజేసి
యరిగె; బ్రెగ్గడ కరణీయ మరయ నరిగె. 577

మ. వెనువెంటఁ సచివుండు దాఁబిలువ నంపెఁ గొండమ ర్సయ్యమ
ర్సను ధీమద్యుగళంబు రాయసము వీరాభిఖ్యు లక్ష్మీ పతిఁ
మనపై రానగు నాపదఁ గడువఁగా మార్గంబు యోజింపుడం
చనుచున్ గోరినఁ జర్చలఁ జరపి రార్యాభాషితాధ్వంబునన్. 578

ఉ. దానము శత్రుభూవరు నుదార సుహృద్వరుఁగా రచించు స
న్మానము మిత్రమండలిని మానక భృత్యులగా రచించు రం
గాన శ్రమైక సాధ్యమగు కార్యము భేదము చేత నేశ్రమం
బేనియు లేక సాధ్యమని యెల్ల సుధీమణు లొప్పి రాసభన్. 579

మ. తరుణోపాయము నూహసేసి సచివో త్తంసుండు వైరిక్షితీ
శ్వర సామంతులకున్ బదారుగురకున్ బంపన్ సువర్ణాంబరా
భరణవ్రాతముఁ బెట్టెలం దిమిడిచెఁ బ్రత్యేకమొండొండుగా
నరయన్ గైతవపత్రరాజినిటు వ్రాయంజేసి యందుంచెడున్. 580

సీ. "శ్రీయుతాంధ్రక్షమాసింహాసనాధ్యక్షు
డగు కృష్ణదేవరాయప్రభుండు
పదియారుగురు శూర పాత్రసామంతుల
కంపుచున్నట్టి లేఖార్థములివి
గజపతిరాష్ట్ర దుర్గస్థులు మీకు మా
యనిన పల్కులు వ్రాసి యంపినారు
అడిగినట్టుల సువర్ణాంబరాభరణముల్
నింపి మందసముల నంపినాము.

గీ. అనికివచ్చిన యట్ల రేపరుగుదెంచి
ప్రభువరుని మాకు స్వాధీనపఱతురేని
కొదువలేకుండ మిమ్మేలుకొందు మేము
పలుకునిలుపుడు పాత్రభూపాలులార". 581

గీ. మంత్రివర్యుండు లేఖాసమంచితమ్ము
లయిన మందసములను జారాళికొసఁగి
ఉర్విపుల కందఁజేసి ప్రత్యుత్తరముల
బడసి రాఁజెప్పి వారలఁ బంపివైచె. 582

మ. తపనీయాంబరపూర్ణమందస సముద్యత్ప్రోత్తమాంగాళితో
రిపురాడ్ధామము జేరఁగా గజపతి శ్రీమన్మహీనాయకుం
డపుడా చారుల సంశయించి తన భద్రాస్థానముఁ జేర్చి త
ద్విపరీతాశయ లేఖ లందుకొనియెన్ బేటీ నిగు ప్తంబులఁ. 583

మ. ధరణీనాథుఁడు లేఖలన్ జదివి హృత్కంపానఁ బాత్రక్షమా
వర విద్రోహమయ ప్రవర్తనమె యీ భాతిన్ జనుఁవారు న
న్నరిభూపాలున కప్పగించుటయె సత్యంబంచు భావించి య
త్తరి నాజిన్ విడి తన్ను గాచుకొనుటే ధర్మంబుగా నెంచెడున్. 584

గీ. మానవేంద్రుని బలము సామంత నృపతి
వల్లభులపైన నాధారపడి రమించు
కాని విభుభావబల మరిగాపులందు
లేమి నాధారసూక్ష్మతఁ గ్లేశ పడియె. 585

మ. బహు తేజంబునఁ జేసి, భీకరమదేభ శ్రేణికాంచత్ శతాం
గహయానీక పదాతివర్గముల ఢాకన్ దివ్యదుర్గావళి
ప్రహతిన్ జేయుచు వచ్చు రాయలకె విశ్వాసార్హ్మ లీపాత్ర దు
ర్మహినాథుల్ నను బట్టియిచ్చునెడ నా రాజ్యం బికన్ దక్కునే. 586

శా. సామంతక్షితిపాలదోర్బలమె యీ సమ్రాడ్బలాధిక్యమా
సామంతుల్ రిపు పక్షమం దుఱికి తత్సామ్రాజ్య విద్రోహ చ
ర్యా మౌఢ్యావృత చిత్తులైనయెడ సామ్రాజ్యం బెటుల్ నిల్చు రా
డ్ధామాధీశుని ప్రాణమాన మెటు భద్రంబంచుఁబల్కన్ దగున్. 587

చ. అదియునుగాక కుట్రమెయి నయ్యరిగాపులు క్రూర వంచనా
స్పద గమనంబు బూనినను శత్రుకరంబులఁ ద్రోసిరేని దు
ర్మదగతవైరి నాకు నవమానము గూర్పఁడె తత్పరాభవా
పదఁబడు రీతి కంటె వనవాసము శ్రేయమనంగఁ జెల్లదే? 588

మ. అరిగాపై మనుమంచు బల్కునొ కరం బర్పింపఁగాఁగోరునో
పరిచర్యాగతి గూర్చునో నిశిత నిర్బంధంబు పాల్సేయునో!
అరి యింకేవిధిపాలు సేయఁగనునో అంతఃపుర స్త్రీలకే
దురవస్థఁ గలిగించునో శ్రితులకే దుఃఖంబు వాటిల్లునో. 589

చ. అని యిటు చింతసేసి హృదయంబు భయ వ్యథితంబుగాగ నె
వ్వనికి వచింపఁబోక హిత బంధు సతీ తనయా సమేతుఁడై
యనవధి కాంధకార నిబిడాటవికిఁ బయనించెఁ దన్నిశిఁ
జనపతినై నఁ బ్రాక్కృత వశ ప్రతిభోగ్య ఫలంబు వీడునే! 590

క. మఱియిఁక నేనాఁటికి భూ
వరయోగ్యంబయిన సింహపదపీఠమునఁ
వరలుదునో, ఎపుడగునో
స్థిరభోగ మటంచు ఱేడుచింతిలఁ జొచ్చెఁ. 591

మ. మఱునాఁ డాహవసిద్ధులై సబల సామంత క్షమానాయకుల్
వరసమ్రాట్ నియతాహవస్థలికి బోవఁ రాజు లేఁడయ్యె నా
కరణిన్ గొల్పిన హేతువుల్ చెవిఁబడంగా బాత్రవర్గంబు ని
వ్వెరపాటుంబడి పెల్లుగన్ బొగిలి రుర్వీనాథ నిష్క్రాంతిచేఁ. 592

మ. అవనీనాథు డదృశ్యుఁడౌటరసి, రాజాజ్ఞా విహీనంబుగా
బవరంబున్ రచియింపరాదని భయభ్రాంతిన్ దనూరక్షకై
యవివేకంబునఁ గానకేగు ధృతి శూన్యస్వామికై భీకరా
హవమేలా? యని పాత్రభూపతులు డాయంబోయి రావాసముల్. 593

మ. అభిమానంబున శూరుడుత్తమనరుం డంచత్ కలావ్యాప్తిచే
సభవిద్వాంసులచేత సాధువు దయాస్వాంతమ్మునఁ జేసి భూ
విభు డెన్నఁ స్వభుజాసమర్థతమెయిఁ వెల్గొందు, నఁ సూక్తినిఁ
ప్రభు డూహింపక కాన కేగె నకటా! ప్రత్యుత్క్రమాశాచ్యుతిఁ. 594

మ. పటుధైర్యంబున మంత్రి రాడ్విరచితోపాయం బదేరీతి సం
కటముఁ గూర్చునొ, వైరిరాజుల కనంగాఁ బొంచి వీక్షింప నూ
ఱటమై నిల్చిన కృష్ణరాయ లట సర్వస్వంబు మేలౌటఁద
త్కటకాంతర్వినివేశముఁ జలిపె భృత్యశ్రేణితో మంత్రితో. 595

సీ. దవ్వు దవ్వుల దుర్గధామాల విభులతో
సయ్యాటలాడిన సరసురాలు
అతి సహస్ర గజ వ్రజారోహ సముచితో
త్సవములం దేలు రసజ్ఞురాలు
కృత్తారి మస్తకోద్గిర దసృగ్వాహినీ
వీచులం దీదిన వీరురాలు
అబ్ధి పర్యంత విహారాధిగత యశః
పటము బయ్యెదజేయు వన్నెలాడి.

గీ. మాన్య గజపతి వీర సామ్రాజ్య లక్ష్మి
రేయి నభిసారికా గతిఁ డాయఁబోయి
సరసరాయ గళాశ్లేష సౌఖ్యమడిగె
కృష్ణరాయలు కైసాచి కేలుపట్టె 596

గీ. ప్రాగ్గజపతీంద్ర వీర భూవరుల బలిమి
స్థాపితంబయి యధిక రసజ్ఞమైత్రి
నర్మభోగానుభోగ లాభాభిలాషఁ
గటకపురి కృష్ణరాయ సంగతి గడించె. 597

క. జనముల మది విశ్వాసము
జననముగాఁ బ్రేమభావ జనకములగు భా
షణముల గావించి సుహృ
జ్జనములగాఁ జేసెఁగృష్ణజనవరుఁ డెలమిఁ. 598

మ. అతివేగంబున నాత్మబాహుబల సారావిష్క్రియార్థంబుగా
నతభూమీజనరక్షణానుగమనానందంబు తెల్లంబుగా
దతవిద్యానగరోరురాజ్యరమ యుత్సాహం పడఁ జేడు శా
శ్వత కీర్తిస్ఫుట ధాటినాటె విజయ స్తంభంబు నత్తావునఁ. 599

మ. జితముఁ రంజితముఁ బ్రసాధితము సుశ్రీయుక్తముఁ జేయఁగా
మతిచాతుర్య మెలర్ప సైన్యతతితో మంత్ర్యగ్రణిశ్రేణితో
హితబంధుప్రకరంబుతో ( గటకమందే కొన్ని నాళ్ళుండియం
దతిమాత్రవ్యవహార నిర్వహణ లీలారంభముల్ పైకొనెఁ. 600

శా. భేదోపాయవిభిన్న మానసులు తద్వృత్తాంతయాథార్థ్యమీ
మీదన్ నేరిచిరేని పాత్రతతి స్వామింగూడుచోసేగి యా
పాదింపంగలదంచుఁ దిమ్మరుసటన్ స్వస్వామికిం దెల్పె మ
ర్యాదార్హంబుగ రుద్రరాజునిట కాహ్వానింప యుక్తంబనెన్. 601

చ. అది గ్రహియించి ఱేడు కటకేంద్రుని పేరిట సద్వినమ్రతా
స్పదమగుచందమొప్ప శుభపత్రము నివ్విధి వ్రాసె "రాజ! నిన్
గదియుట రాజ్య కాంక్షమెయి గాదుసుమీ సముపాత్త శౌర్య సం
పదఁ బ్రకటింప వచ్చితిని పార్థివ ధర్మముగా నెఱుంగుటన్. 602

చ. అరి ననిన్ దలంచి గహనాంతర సీమల కేగుదెంచి దు
ర్భర పరితాపమున్గొను టపారము తాపకరమ్ము మాకగున్
హరుసముతోడవచ్చి భవదార్జిత రాజ్యరమా విభోగ వి
స్ఫురణము దొంటివోలె గొని, పూనుమి నాయెడ మిత్రభావమున్. 603

చ. అని లిఖియించి యయ్యది రహస్య కృతంబని తోచునట్లుగాఁ
దన కయిువ్రాలుగూర్చి వసుధాతల శాసన ముద్రికాంక మొ
ప్పె నయఁగఁగూర్చి తద్గజపతీశ్వర విశ్వసనీయ చారము
ఖ్యునకిడి మీనరేంద్రు కడకున్ గొనిపొమ్మని యంపె నాతనిన్. 604

సీ. పదముల నమరించెఁ బ్రశిత కంటకభేద
  చతురమ్ముఁ బాదరక్షాద్వయమ్ము
ఊనె హస్తమున భానూష్ణిమప్రణిరోధ
  దక్షనైజము ఛత్ర తల్లజమ్ము
శీర్షమ్మునందుంచెఁ జిత్ర విచిత్రాంశు
  విస్ఫార మృదుదీర్ఘ వేష్టనమ్ము
ఒకకేల నొప్పించె నుగ్రజంతూత్కరా
  హననార్హ నిశిత ముఖాయుధమ్ము.

గీ. ధాత్రినాయక దత్త పత్రమ్ము నతఁడు
బంధురాంశుకమునఁ జుట్టి పదిలవఱచె
రాయ గజపతిబాంధవారంభసంధి
రూపనాటక సూత్రధారుండు వెడలె. 605

ఉ. చారుడు భావసంస్థిత విచారుడు రాడ్విషయార్ధ దేశసం
చారుడు దూరవర్తిజన సౌఖ్యవిచారకథా నివేదనా
చారుడు లేఖతో సరభసంబుగ యానము సేసి రాట్పదం
బారసి రాజవల్లభున కంజలిసేయుచు నిల్చె సన్నిధిన్. 606

మ. సొరిదిన్ జారుడు గన్గొనెన్ దినరమాశూన్యాంబుజాతంబు స
త్వరితోపాగత రాహుదృష్టి వికృతప్రాలేయరుగ్ బింబమా
దర లీలాయతకామినీ విరహిసంధ్యాకోకధామంబు రా
జ్యరమానీతకళాగళత్కటక రాజ్యాధీశ ఖిన్నాస్యమున్. 607

మ. చిరకాలమ్ము జగత్ప్రదక్షిణమతిన్ జెల్వొందు నానామహా
శరధిప్రస్థితుడై తుపానులను, ఝంఝూవాతమున్ మీఱుచున్
దరణిన్ దవ్వునఁడాయవచ్చు నెడఁదత్సంకేతమాలోక్యమౌ
కరణిన్ జారకరస్థపత్రము సమీక్ష్యంబయ్యె భూజానికిన్. 608

క. చారునిలేఖ౯ గజపతి
భూరమణుండరసి శీర్షము౯ గంపించె౯
దూరస్థునిఁ దన్నుంగొని
కాఱించుట రాయవాంఛగాఁ బరికించె౯. 609

ఉ. చారసముక్తవాక్యముల సంశయపూరిత చిత్తుడై నిరా
ధారములంచు దొల్త వసుధావరు డెంచెనుగాని ముద్రికా
ధారణము౯ గరాక్షర వితానము సందియమెల్ల దీర్ప నా
చారుని ప్రశ్న సేసెఁబలుచందముల౯ దనశంక దీరఁగ౯. 610

క. కొంతవడిఁ జింతసేసియు
నంతంబున గజపతీంద్రు డార్జిత ధృతియై
స్వాంతము శాంతిపడ౯ భూ
కాంతు౯ రాయలను జేరఁగాఁదలపోసె౯. 611

ఉ. చారునితోడ స్వాగమన సంగతిఁజెప్పి యొకింత ముందుగాఁ
జేరఁగఁబంపె నాతనిఁ బ్రసిద్ధ సువర్ణమయాంబరంబులన్
భూరి రుచిప్రసాంద్ర మణిపుంజ నిగుంభిత హారరాజి నిం
డారగ గానుకల్ గొని ప్రయాణముసేసె సబంధుమిత్రుఁడై. 612

మ. ఉరుతేజస్వి. ప్రతాపరుద్ర గజపత్యుర్వీశ్వరుం డర్మిలిన్
బఱతేరంగలఁడంచు స్వాగతముదెల్పన్ శాంతిసైన్యాద్యలం
కరణుండై యెదురేగి తేడుచితసత్కారంబిడెన్ గాంచ నాం
బరభూషాంచదుపాయనంబుగొని ప్రేమన్ జేసె నాశ్లేషమున్. 613

మ. జనపాలాగ్రణి రాయలా గజపతిక్ష్మాపాలు నాలింగనం
బొనరింపన్ విహితోక్తు లాడునెడఁ బార్శ్వోపాంత నేపథ్యమం
దనుకూలాసనయై ప్రతాపనృప కన్యారత్న ముత్కంఠఁ జూ
చెను దేజోవిభవ ప్రభాకరనిభున్ శ్రీకృష్ణరాడ్వల్లభున్. 614

మ. దినమున్ సామొనరించి మంజు గ మనోద్దీప్తాశ్వరాజంబునన్
బెనువేగంబున స్వారిసేయుచు దనూవృద్ధిన్ బలోత్తేజమున్
బెనుపన్జాలి, వినూత్న మన్మథ కలావిర్భూతి రాణించు నా
తని సౌరూప్య గభీరతాదిగుణముల్ తన్పెన్ దదబ్జాననన్. 615

గీ. అట్టులన్యోన్య మిత్ర భావానురాగ
మలవడఁగఁ దత్తదధి వాసములకుఁబోయి
గజపతీంద్రుండు రాయలన్ గలిసి మెలసి
పాటుబడఁజొచ్చె నొక యొడంబడిక కొఱకు. 616

మ. తన రాజ్యమ్మును దుర్గమాంధ్ర విభుదోర్దర్పంబు పాలౌటఁబె
న్వనటన్ జేసి ప్రతాపరుద్రుఁ డెటులైనన్ సంధి గావించి; పో
యిన కల్మింగొన రాజధాని కటకం బిచ్ఛావిధిన్ జేరి నూ
తన సంధ్యుద్యమమున్ రచింపఁ దొడగెన్ దంత్రప్రయోగంబునన్. 617

మ. కటకక్షోణిఁ జరించువేళఁ గనియెన్ క్ష్మాజాని శ్రీరాయల
చ్చొట భాసిల్లు మనోజ్ఞసౌరభ సుమస్తోమాభిరామంబు వి
స్ఫుట మందానిల సంప్రచాలిత సరశ్శుద్ధోర్మిమాలాభవ
త్పటు డోలాంతరసంభ్రమద్విహగరాడ్ధామంబు నారామమున్. 618

ఉ. ఆ సమయంబునన్ జనవరాత్మజ తుక్కమ యొక్కనాఁడు నా
నాసురభిప్రసారి సుమనః పరిపూరిత కేళికావనీ
భాసురయై వినోదమయభాషణ లొప్పెసఁగన్ విపంచికా
భ్యాస నిమగ్నయై మధురిమాతిశయంబునఁబాడె నీనుడుల్. 619

మ. చలమారన్ మహిళాలకాచలన కౌశల్యంబు తోడన్ లతా
విలయాగ్రస్థల పక్వపత్ర పతనోన్మేష ప్రభావంబుతో
లలితాంగీ పరిఖేలనాభ్యుచిత డోలాబద్ధశాఖావళీ
వలనంబేర్పడ దక్షిణానిలమ! భావ్యంబౌనె నన్నేర్పఁగన్. 620

చ. బళిబళి చందమామ, మినుబాటఁ జరించెడి బాటసారివే
వెలుగు విరామమున్ గొనెడు వేడుక వేఱొకచోటికేగ, నీ
యిల కమృతంపు జేతులిడి యెల్లెడఁ జీకటిఁ ద్రోసిపుచ్చు నె
చ్చెలి! విరహార్తులన్  జలువచేయవు నీ గమనంబు న్యాయమా? 621

చ. ప్రవిమల సౌధవాసివి ధరాపరిపూజిత తారకాక్షర
ప్రవణుడవున్ మనోజ్ఞ బుధరంజిత నిత్యవిహార నేతవున్
గువలయ రాగభాగ్యవినిగుంభనశీలి వి లోకరంజనో
త్సవ నియతానువర్తన విధాయివి, పాంథుల నేర్చఁజెల్లునే? 622

మ. హృదయాకార నికుంజమందునఁ బ్రియప్రేమ ప్రసూనంబగుౘ
బొదకు న్నీరముపోయు పోషకుని సత్ప్రోత్సాహముల్ లేక దో
హదముౘ గాంచెడి తెన్నుగానక తదీయాశాదళంబోడగా
మొదలోడుౘగద? అట్టివేళ భువి కామోదంబు సంభోగ్యమా. 623

మ. బ్రతుకుంగాలము పోవ బోవ నటుపై రానైన రంగంబులం
చిత ధైర్యంబును గోలుపోయి కడు సంక్షిప్తంబులై తోచు సం
గతికిఁ నెయ్యములైన యీదినము లాగంజాల వామార్పులోఁ
జతురత్వం బెటుపోవునో యిఁక భవిష్యత్కాల మెట్లుండునో! 624

మ. లలితా మోద లతాంతజాలము ప్రవాళ వ్రాతముల్ పండుటా
కులు పూవుంబొడి చిందుతేనియల చిన్కుల్ కాయమానంబులుఁ
గల యుద్యానము నీదు చల్లదనముఁ గల్గింపఁగా లేదు పె
ద్దలకుఁ ధర్మము, సంశ్రితావళికి సంతాపంబిడఁజాబిలీ. 625

శా. పోవున్ యౌవనకాలవాహిని మహామోద స్వరశ్రేణిఁదీ
వ్రావేశమ్ముల, నక్రమ ప్రగతులన్ హత్తించి యాలోల లీ
లా వీచీకర రాజితో నిజతటీలాస్యల్లతాంకూర ల
క్ష్మీ వాత్సల్య కృతాభియానయయి యాశ్లేషించి రంజిల్లుచున్. 626

మ. పువుదోటల్ భ్రమరీ మనోజ్ఞ నినదంబుల్ నిర్ఝరీయానముల్
నవఘాసాంకుర భాసురమ్ములగు కోనల్జేరి సయ్యాటలన్
యువతీ మానస రంజకంబులననేమో పల్కు వారట్టి సౌ
ఖ్య విధానమ్ములు స్వప్నభావనములో అత్యుక్తులో, యూహలో. 627

సీ. పుడమి తల్లి మనోజ్ఞముగ వారి పాదమ్ము
నవనీరుహమ్ముల కందఁజేయ
వరుణుండు మొగ్గల సరణి నిద్రించెడు
కుసుమరాజికి మేలుకొలుపు సేయ
మలయగంధవ హమ్ము మంజు సౌరభముల
పఱపి జీవులకు మైమఱపు గొలుప
తరుణ వసంతు డుద్యాన భూజములకు
గైయూతనిడి జీవకళ నొసంగ.

గీ. చిలుకతేరున మారు డగ్గలపు గఱకు
టమ్ములైదింటి నిక్షుశరాసనమున
నెక్కువెట్టి జగమ్ముల స్రుక్కఁజేయు
సృష్టిమూలరహస్యంబు జెప్పనగునె? 628

ఉ. ప్రేమరస మ్మమూల్యము విరించికినైన నగమ్యమైన దే
సీమకుఁబోయి యేనరుని చెంగటఁ జూచిన స్వస్వరూపవద్
ధామముతోడఁగన్పడ దుదారులకైన లభింపదే మహా
శేముషికేని సాధ్యమనఁ జెల్లదు చిత్రవిచిత్రనైజమై. 629

మ. జలధారల్ ప్రవహించి శైవలినితో సంగాతమున్‌జేయు శై
వలినీభామిని సాగరోపగమన వ్యాపారమున్ జేయు గా
డ్పులు వీచ్యంతర మేళనంబుగొను నొండున్ నిల్వదేకాకియై
కలియన్ ధర్మముగాదె నీదు ననురాగస్ఫూర్తినారక్తిలో. 630

మ. జనసౌహార్దము సంతరించి ధరణీ సౌభాగ్యసంపత్ప్రవ
ర్ధన చిత్తుండగు కృష్ణరాయ రసికోత్తంసుడు కేళీవనీ
ఘనతన్ జూడఁగబోయి యందు నిలువంగన్ వీనులన్‌సోకెనొ
య్యనఁ గాంతాలపనంబు గానరస ధారాసారసంపూర్ణమై. 631

మ. ఇది యారామము బంధురాతపస మావృత్తోష్ణతావారక
చ్ఛద శృంగారము నిర్ఝ రీజలము లీస్థానంబు భూషించు నీ
రదకల్పంబులు శాఖి శాఖలు పయిౙగ్రమ్ముౙగదా! యైన నా
యెదకుౙ దాపమెగూర్చు నీ వనపదం బిందేమి గుట్టున్నదో. 632

మ. అదిగో! వీనుల సోకెడిౙ మధుకరీ హారి స్వరాలాపమో
మదనోజ్జృంభణ కారణప్రియ పికీ మంజు స్వరాలాపమో
ఉదయద్ యౌవన మోహినీ చతుర వాద్యోద్యోగవద్వల్లకీ
మృదునిధ్వానమొ గుండె తల్లడమొనర్చెన్ మాధురీధుర్యమై. 633

మ. గిరిశృంగాళి, వియద్రమామణిని రక్తిన్ జుంబనంబాడెడున్
గెరటంపుంజవరాంధ్ర సంగతికి నై కేల్సాచు జాబిల్లి భా
స్కరు డాలింగనజేయు భూమి రమణీ సర్వాంగ మీ యోజ నీ
సరసన్ జవ్వనియున్న నింద్యముల? తత్సాంగత్యసల్లాపముల్. 634

మ. అవురా! యీ విపరీత నైజ మదినన్నాసింపలే దెన్నడున్
బవనాంకూరములోని శైత్య మతితాపంబున్ మెయిన్ గూఱిచెన్
బువులింగాలములయ్యె మంజువిహగంబుల్ వజ్రరూపంబులై
నవియంజేయుఁ దదీయదర్పమెటు శాంతంబౌట సిద్ధించునో. 635

చ. ఇటువలెఁ గొంత తాపపడి యీప్సితమేదియొ పుట్టి తీవ్రమై
యటమటఁ జెందఁజేసెనని యాత్మ నెఱుంగక, నింగిఁజూడ న
ప్పటి మునిమాపుచుక్క ప్రతిభన్గని తత్తఱపాటుఁ జెంది య
క్కటికములేని యీ ప్రకృతి కల్లయనెన్ వగజెందె నీవిధిన్. 636

శా. నానాసౌరభ సారభోగ పరయై నర్తించు సారంగి స్వ
స్థానంబందఁగఁ జేయనేర్తువు శ్రమ శ్రాంతిన్ విరామస్థితిన్
బూనన్జేయుదు, సాంధ్యరాగ సరణిన్ బోనాడి మిన్నంటి ని
త్యానందంబున వెల్గు సంజతఱితిక్కా నాయెడన్ వైరమా? 637

చ. పొలముల బచ్చికల్ మెసవి భోరున లేగలనెంచి యార్చు జం
తుల మొఱలాలకించి, యిలుత్రోవలఁజూపు దయాబ్ధివీవు కొం
దలమునఁ జెట్టునీడఁబడి తల్లడమందెడి నాకు భావ ని
శ్చలత ననుగ్రహింపవిది సన్నుత మార్గమ? సాంధ్యతారకా? 638

మ. వనిఁబాఱాడెడు కాల్వలన్ జలజల ధ్వానంబునన్జేసి దా
పున సంశ్రావ్య కలాగ్ర రంగమునఁ దావున్ జేయఁగాలేక స్వాం
గనకై కొమ్మల దేవులాడెడు విహంగస్వామినై కుందు నా
కనుకూలింపవ? గంధవాహ? ప్రియలోకాహ్వాన వార్తాహరా? 639

మ. వనటన్ జెందకు చందమామ! నికట ప్రాంతస్థ గీతాలయా
నన నిష్యంద్యసమానగాయనకలా నవ్యామృత శ్రీజిత
స్వనిధానుండనటంచు నొంటరిగఁ ద్రోవన్ బాఱఁగానేల నా
పనుపుంజేయుము నీదు షోడశ కలాభాగ్యంబు భోగ్యంబగున్ 640

చ. ఇటువలెఁ గొంతప్రొద్దు విరహి ప్రతిభాషల నాలపించి య
చ్చోటువిడి నాదపుందెసకు క్షోణివిభుం డరుదేరఁగాఁబరి
స్ఫుటమని శిల్పసంస్థగితశుద్ధ సువర్ణనిబద్ధ వేదిపై
గటక నరేంద్రు నాత్మభవ గన్పడ భావనసేయు నీ విధిఁ. 641

చ. చెలువల రామణీయకము జీవముఁబోయు, మనోజ శౌర్య సం
కలనకుఁగోరికన్ బొదలు గణ్యుల చిత్తసరోజముల్ లతాం
గుల మహదాభిరూప్యమునకున్ బెను ప్రేముడిఁజూప నేర్చునా
యలరులు జీవదాయి నిశితాంశు మహంబునఁజూపుఁ బ్రేముడిన్. 642

మ. ఇది వాసంతిక వాసరంబు, ఖగముల్ హృద్యంబుగాఁబాడు నిం
పొదవంగన్ దుముకాడు లేడికదుపుల్, వృక్షాగ్రశాఖావళుల్
గదలున్ మందసమీర వీజనల; సౌఖ్యంబొప్పు భూతాళి; కీ
యదనే, నామదికింగలంబు, స్మరబాహాశక్తి సామాన్యమే. 643

చ. పరపురుషాగమంబున నృపాలకుమారిక తద్విపంచికఁ
ధరణికివాంచి గద్దె దిగి తన్నృపు రాయలుగా నెఱింగి భూ
వరవరకన్యకాభ్యుచితభంగిని సిగ్గున సోయగంబునఁ
శిరమరవాంచి యిందు దయసేయుమనఁ నుడి చూపెగద్దియఁ. 644

సీ. వీణెక్రిందికి డించువేళ ఝణంఝణత్
క్వణిత కంకణముల కరములరసి
పొలగాలి కెగసి యల్లలనాడి మోమున
గ్రమ్ము ముంగురుల యందమ్ము నరసి
స్వర్గవేదిక డిగ్గ సడలు పైట చెఱంగు

పయికొత్తు నెలనాగ హొయలుఁజూచి
వ్రీడమై వెనుకంజ వేయుచో విలసిల్లు
రాయంచ నడల హెుఱంగు నరసి

గీ. మేలి ముసుగు తొలంగించి యా లతాంగి
పఱచు క్రీగంటి చూపుల వాడికోడి
ధీరచిత్తుండు దన మనోధృతిఁ దొఱంగె
నతని చిఱునవ్వు చెలువ కింగితము దెల్పె. 645

మ. తతమై రాజకుమారలక్షణ సమేతంబైన ఫాలమ్ము నా
యతమై నిర్మలకాంతి సంకలితమౌ నక్షిద్వయంబుఁ సుదీ
ర్ఘతరంబై బలితంపు జానువుల పర్యంతంబు నేపారు దో
ర్ద్వితయంబున్ బృధువక్షమున్ గలిసి యింతిన్ ముంచెఁబ్రేమాంబుధిన్. 646

మ. తనులావణ్యము నోరచూపు గొనబున్ దన్మధ్య దారిద్ర్యమున్
గనదిందీవర పత్రసామ్య రచనాకౌశల్యవన్నేత్రముల్
ప్రణయాకర్షక చారువర్తనము భూఁపాలాత్మజాభ్యర్థ్వల
క్షణసౌభాగ్యము నంతకంత కధికేచ్ఛన్ గూర్చె భూజానికిన్. 647

గీ. మరుని ఢాకకు నెఱయైన ధరణిజాని
స్వీయ సహజగుణంబు గాంభీర్యగరిమ
కొక్కసారిగ నాహ్వాన మొసఁగనయ్యె
సత్యమగు ప్రేమ నిటు విమర్శనము సేసె. 648

గీ. కనుగొనిన యంతమాత్రానఁ గారణాంత
రమున జనియించు ప్రేమ తిరమ్ముగాదు
స్థిరతమప్రేమ నొందని చెలువమిన్న
నందఁగారాదు శాంతి సౌఖ్యాభిలాషి. 649

మ. విరహావేదన కారణంబులగు నివ్వేళల్ వసంతోదయ
స్ఫురణంబుల్ జలదాగమాది తరుణంబుల్ గ్రమ్మ వెన్కాడు; న
త్తఱినైనన్ మఱియెన్నడైనను నిజాంతర్భావబాంధవ్య బం
ధురమౌ ప్రేమమె సత్యమయ్యదియె, యెందున్ గూర్చునానందమున్ 650

మ. అకలంకంబయి నిత్యదీపిత మయూఖాదిత్య బింబంబుగా
వికసత్తేజమునంది సౌరభభరావిర్భావ మల్లీలతా
ప్రకరోద్భూత లతాంత మార్దవముతో రంజిల్లు ప్రేమంబె, భో
గ్య కలాపంబున కాలవాలమగు లేదా? అంతయున్ వంతయే? 651

గీ. బడలి ప్రియుడొక్కచో నధః పతనమంది
ఆర్తుడై యున్నయపుడు ప్రేమానుబద్ధ
చిత్తయై వాని దేల్పంగఁ జింతసేయు
నతివ ప్రేమయె పరిశుద్ధమై తనర్చు. 652

మ. చెలి చక్కందనమెల్లఁ బ్రేమరసమున్ జిందింపఁగాఁజేసె నీ
లలి ధర్మానుమతంబుగాదు హృదయోల్లాసం బవశ్యంబుగాఁ
దలఁపన్ రాదని రాయ లెంచెఁజెలి తద్భావానుకూలంబుగా
వలపున్ నిల్పెను ధర్మ నిర్ణయ రతుల్ వర్తిల్లె స్వాంతంబులన్. 653

మ. మనముల్ రెండు పరస్పర ప్రణయ సంబద్ధంబులైనన్ విశు
ద్ధ నయాధ్వానుగతంబులై వెలయ నంతర్వాంఛనం దొక్కరై
నను భాషింపక కేవలాత్మ కుశలానంద ప్రసంగంబులం
దున, నొక్కించుక ప్రొద్దుపుచ్చిరి మరున్ దూరంబుగాఁ దోలుచున్. 654

గీ. రాజు తిమ్మర్సు నడుగ నిర్ణయముసేసె
తండ్రితోనని తూగఁగాఁ దలఁచెఁ దరుణి
సమ్మతుల నంది తమతమ స్థానములకు
నిరువురుం జని రారేయి జరిగిపోయె. 655

మ. నిగమాంతర్భణితాచ్ఛ ధర్మనియమానీకానుగామ్యాశయా!
స్థగిత ప్రస్తర విగ్రహోక్తజనకా స్వల్పానురాగోదయా!
ఖగరాడ్దర్శిత మాతృభక్తి వినయాక్రాంత స్వభావావ్యయా!
నగధారిప్రతివర్ధితాభ్యుదయ! శ్రీనారాయణార్యాహ్వయా! 656

ఇది

శ్రీమదుభయ భాషాకవితాప్రవీణ, సహస్రావధాన చతురాసవ, సహస్రా వధాన పంచానన, పంచ సహస్రావధానీత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ పయఃపారావార రాకాసుధాకర సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రణీతంబైన సాలంకార కృష్ణదేవరాయలను ప్రబంధంబున చతుర్థాశ్వాసము సంపూర్ణము.

# సాలంకార కృష్ణదేవరాయలు

## పంచమాశ్వాసము

క. సారవివేకామందా
ఆరాధిత వివిధ వాఙ్మయాంధ్ర నలందా
ధారణ నిహితానందా
నారాయణరాయ, మృదుల నైజాస్పందా! 657

మ. తనరాజ్యంబునకున్ బలంబయిన పాత్రక్షోణిపశ్రేణికిన్
మనముల్ త్రిప్పి మహీశవంచకులుగాన్ మాయామయోపాయముల్
పెనఁగన్ బన్ని జయంబు గైకొనిన భూభృద్వల్లభున్ మైత్రిచే
తనె సాధింపఁగ నోపునం, చరసె రుద్రక్ష్మావరుండయ్యెడన్. 658

మ. నిజకన్యామణి బుద్ధికౌశల సమున్నిద్రన్ జగన్మోహినిన్
గజపత్యుర్విధవుండు తన్ను గదియంగన్ బిల్చి వాక్రుచ్చె నా
త్మజః పాత్ర క్షితిపాలవంచనమునన్ ధాత్రీతలంబెల్ల ది
గ్విజయార్థాగత కృష్ణరాయలకెసంగెన్ గాదెనాన్ ఖిన్నుఁడై. 659

గీ. ప్రభువు నోదార్ప దలపోసి రాచపట్టి
“జనక! కొందలమందుట యనుచితంబు
కాలచక్రంబు దిరుగుచో గతులుమాఱి
బండ్లు నోడలు, నోడలు బండ్లుగావె? 660

మ. అతఁడత్యంత మనోజ్ఞమూర్తి సుగుణవ్యాలబ్ధ సత్కీర్తి సం
గత రాజన్య కులానురూప విజయాంకస్ఫూర్తి సర్వ క్షమా
పతి సమ్మాన్య పరాక్రమోన్నతి కలావన్మాన్య ధీవర్తినే
నతనిన్ గైకొనఁ గ్రమ్మఱన్ మనదు రాజ్యంబౌర్జితం బౌ” ననెన్. 661

గీ. “ఏను శుద్ధాంత కాంతావమాన భీతి
నాహవోద్యమమే సేయనైతిఁ దనయ
అపహృతైశ్వర్యమీ యుపాయంబు కతన
మఱలు; బాంధవ్యముననింత మహిమలేదె. 662

గీ. ఆత్మజుఁడు రాజ్య పరిపాలనాధికారి
దైవవశమున నటుగాక; తనర గలదు
పుత్త్రికా పాలనమ్ము నీ మూలముననె;
చింతలు దొలంగు” నంచు వచించె నృపుడు. 663

గీ. రాయల వరించి పెండ్లి యేర్పఱుపఁ దండ్రి
నడుగనుండిన కన్యకు నాడబోయి
నట్టి తీర్థమె యెదురైనయట్లు తండ్రి
తానె రాయల గొమ్మని తలపు సెప్పె. 664

శా. ఆతన్వంగి జగత్ప్రశంస్యభుజ శౌర్యారంభమున్ జేసి లో
కాతీత ప్రతిభా వినిర్జిత దిగంతానల్ప రాజన్య సం
జాతుండై నరపాలలక్షణ కలాసంపన్నుడౌటన్ మనః
ప్రీతిన్ మున్నె వరించియుంటఁ బ్రమదంబేచూపెఁ దత్ప్రోక్తికిన్. 665

శా. ఆనందించెఁ బ్రతాపరుద్రుడు సుతాహర్షాన్వితాంగీకృతిన్
దానప్పోలిక రాట్పదచ్యుతికి జింతామగ్నుడైయున్నఁగ
న్యానిర్దిష్ట శుభప్రకారమున ఱేడల్లుండుగానై నఁబూ
ర్ణానందంబును భాగ్యమున్ దనకు సాధ్యంబంచు నెంచెన్ మదిన్. 666

మ. ఒక రాజ్యంబు మహాప్రయత్నముఁ గృఛ్రోపాయమున్ బన్ని జం
కక స్వాధీనము సేసికోఁ బఱగెఁదత్కష్టంబు లెక్కింప కొ
క్క కుమారీమణి కేలుపట్టుటకునై కాంక్షించితన్ మోహ దృ
ష్టికి లోనై నరపాలుడా విభవ మొడ్డెన్ దాన నేమున్నదో. 667

మ. సకలోర్ధ్ర క్షితిమండల ప్రఘటితైశ్వర్యంబు శ్రీకృష్ణభూ
ప కృపావారిధి రుద్రభూపతికిడఁ భాషించెఁ గన్యార్పణ
ప్రకటౌదార్యము నెంతొ మెచ్చుకొని తద్రాజీవనేత్రన్ శుభో
త్సుకచి త్తన్ గ్రహియింపఁగా ననుమతిన్ సూచించె మంత్ర్యుక్తిపైన్.668

గీ. ఆ జగన్మోహినీ వివాహంబు జరుగ
ఉచితలగ్నంబు విబుధ సముక్తమయ్యె
సర్వహిత బాంధవామాత్య సమ్మతముగ
నొప్పె శాస్త్రీయ వైవాహికోత్సవంబు. 669

చ. పరిణయవేళఁ గృష్ణనరపాల ముఖాబ్జము భామినీమనో
హర కనకాంగుళీయక సమంచిత రత్నమునందుఁ దోపఁగ్ర
చ్చుఱఁ బ్రతిబింబమందె సతిస్వాంతము లగ్నముఁజేసి యింద్రియో
త్కర పరిపూర్ణ నిర్వృతి విధంబునఁ దాఁబరితృప్తిగైకొనెన్. 670

ఉ. పెండిలివేళ రాయలకుఁ బ్రీతి జనింపఁగఁ బ్రేమపుత్త్రియౌ
నండజయానకున్ బ్రమదమారగఁ గృష్ణకు దక్షిణాశగా
నుండిన తన్నరేంద్ర వితతోర్వితలంబరణంబిడెన్ ధరా
ఖండలమూర్తి రుద్ర నృపగణ్యుడు కాంచెను కీర్తిసంపదన్. 671

మ. అసమానర్గళ శేముషీ విభవ సాధ్యస్తవ్య భేదాద్యుపా
య సమాలంబవిదుండు తిమ్మరుసు ధీ వ్యాపారవిక్రాంతి కా
ర్యసభన్ రుద్రవిభుండు సర్వజనమాన్యంబైన సత్కారమున్
బొసఁగెన్ దొలవ కృష్ణరాయలకు నామోదంబు నిండారఁగన్. 672

గీ. సకలరాష్ట్ర ప్రజావినాశనము నాపి
అనవధికమైన విత్తవ్యయంబడంచి
భండనము నిల్పి సఖ్య మేర్పఱచుమంత్రి
తల్లజులకెల్ల నుచిత సత్కారమయ్యె. 673

సీ. సహజసౌందర్య భూషా సత్కృతులగొన్న
ధీరు లీ నృపుడు రాధేయుడనిరి
వర్షాశనములుగా బహుమతుల్ వడసిన
వారెల్ల శిబిచక్రవర్తి యనిరి
అభ్యర్థులై యగ్రహారమ్ములన్ గొన్న
ప్రాజ్ఞులు బలిచక్రవర్తి యనిరి
ఉద్యోగములఁ దదభ్యున్నతత్వముగొన్న
పురుషులెల్లరు ధర్మమూర్తి యనిరి.

గీ. అది యిది యటంచుగోరక యన్నిగొన్న
బుధజనము లీతఁడే కల్ప భూజ మనిరి
సముచిత బహూకృతులు సేయు సమయమందు
విపుల ధర్మాభిమాని? యా పృథ్వీజాని. 674

మ. మన కృష్ణ క్షితిపాల శీలమది సామాన్యంబె? కావ్యాంగనా
భ్యనురాగంబున మార్దవ ప్రచితమై భాసిల్లు దీనార్థులం
దను కంపామయమై తనర్చు రిపుతర్కాలాప సంరంభమం
దునఁగార్కశ్య మయంబటంచు జగమందున్ బొందెఁ బెన్గీరితిన్. 675

ఉ. భీముడు పౌరులందు రిపువీరుల పాలిట నుగ్రుడుఁ గుణ
గ్రామముపట్ల భాస్వదభిరాముడు భార్గవరాముడే సము
ద్ధామ విపక్ష వర్గముల దర్పమడంపఁగఁ గృష్ణరాయ ధీ
ధాముడటంచుఁబల్కె వసుధాస్థలి దిగ్విజయి క్రమంబునన్. 676

మ. నవసాధ్వీమణీతోడ రాయలు సుఖానందంబులన్ దేలి రా
జ్య విశేషంబులనెల్లఁ జూచి ప్రజకత్యావశ్యకాభీష్టముల్
స్తవనీయంబుగఁ గూర్చి శ్రీ కటకరాజ్యంబున్ సమస్తంబు నా
త్మవశంబై చనురీతిఁ జేయుచు విరామంబందెఁ గొన్నాళ్ళటన్. 677

మ. మునుదేవేంద్రుడు కామినీత్రయముతో భోగ్యానుభోగంబుగై
కొనెనో లేదొ వినూత్నదుర్గమునె తక్కుల్ లేని నాకంబుగాఁ
జనఁ జిన్నమ్మను దిర్మలాంబను సమంచత్ శ్రీజగన్మోహినిౘ
బెను సౌఖ్యంబుల దన్పి సర్వసుఖదీప్తిౘ ఔడు మోదంపడెౘ. 678

మ. తన యోష్ఠాసఁ బ్రతాపరూపగుణ సిద్ధంబైన రాగంబు రు
ద్రుని ధావళ్యము నవ్వులౘ గజపతి ప్రోద్దామ గంభీరతౘ
దన యానంబున గూర్చి మూర్ధజతతిౘ దత్కృష్ణతౘ దాల్చి మో
హిని పిత్రాత్మధవాభిధామహిమ స్థాయిౘజేసె స్వాంగంబునౘ. 679

మ. తగుకాలం బటనుండి కృష్ణవిభు డా ష్తక్ష్మావరాజ్ఞావచోఽ
ధిగతుండై కటకావనిౘవిడె శుభోద్దీప్తుౘ జగన్మోహినిౘ
మగువల్ చిన్నమ దిర్మలాంబికను బ్రేమన్ గొంచు హర్షంబు మీ
ఱగ విద్యానగరాభిధాన నిజసామ్రాజ్యంబు త్రోవన్ గొనెన్. 680

గీ. కుంకుమారుణ తిలక శోభాంచితలును
సురుచిరలతాంత సంజాత శోభితలయి
రమ్యపల్ల వలతికలున్ రాజసతులు
అరుగునరదాల భూషింప నమరుటయ్యె. 681

మ. అతితీవ్రంబున యానముల్ సలుపుచో నధ్వానఁ బార్శ్వద్వయాం
చిత సంపుల్ల సుమప్రభూషిత లతా సీమంతినీ శ్రేణి, భూ
పతి శీర్షంబున బూల సేసలనువైవౘ సాగిరాశీర్వచో
గతి భాషించిరి స్వోపరిస్థిత విహంగ వ్రాత వాగ్ధోరణిన్. 682

మ. పరగన్ రాయలు కొంత దవ్వరుగఁ గన్పట్టెన్ నభశ్చుంబన
స్ఫురదుత్తుంగ సువర్ణసౌధ శిఖరంబుల్, కుడ్యసంజాతముల్
వరమాణిక్య నిగుంభిత ద్యుతివిభాస్వద్దుర్గ వప్రంబులున్
దరికిన్ జేరఁగ రాణ్మహేంద్ర పురసంస్తవ్యోరు సౌభాగ్యమున్. 683

మ. పరమాప్తుండగు వారి రాశి బొడమెన్ బ్రాలేయరుజ్ మూర్తి, త
ద్గురు వంశాగత భద్రతుర్వసుకులోద్భూతుండు విద్యాపురీ
శ్వరుడౌ రాయల రాక గుర్తెఱిగి శశ్వద్గౌతమాపత్య ని
ర్ఝరిణీసాధ్వి నిజోర్మికాకరములన్ సంధించెనాహ్వానమున్. 684

శా. నానాఘ ప్రతిభంజనాత్మక పయోనాట్యోర్మి గోదావరీ
స్నానంబుల్ రచియించి రాయలు సుధీ సంతృప్తిపెంపార గో
దానంబుల్ నవరత్న దానములు వస్త్రశ్రేణికా దానముల్
తానుంజేసె, నొనర్పజేసె నిజకాంతాహస్త పద్మంబులఁ. 685

మ. తుళువోర్వీశకులాంగనాస్యలసదిందుశ్రేణి నీక్షించి సం
కులతన్ నల్వురు చంద్రు లెట్లొ తెలియన్ గోదావరీ సాధ్వి చం
చల కల్లోల కరాభిగమ్య రసవత్సంశ్లేష లీలారతిన్
గులనాథన్ గలియంగఁ దీవ్రగతిదోగున్ ఫేనమానంబునన్. 686

ఉ. ఆ నగరంబునన్ గలుగునట్టి పురాతన పూత దేవతా
స్థానము లీక్షసేసి జనసమ్మత వైఖరి నందునందు ని
ర్మాణనిమిత్త కాఙ్క్షలను రాజు సతీప్రణయానుకూల భా
వానుమతిన్ బొసంగి జయయాత్ర రచింపఁగసాగెఁ దూకువన్. 687

గీ. విజయనగరంబునకుఁ జేరి వీక్షసేసి
వివిధ పౌర ప్రజాభావ వృత్తినెఱిఁగి
శాంతి సంవాస సరణికి సంతసించి
చనియె రాయులు తిరుపతి స్వామినరయ. 688

మ. నవరత్నాంచిత హేమశృంఖలమనంత ప్రీతి శ్రీవేంకటే
శవిభూత్తంసుని యంగభూషణముగా సంధానముంజేసె సం
స్తవనీయంబులఁ బెక్కు దానముల సద్భక్తిన్ రచింపించె న
య్యవలోక్యాంశము దీర్చె శాసనశిలాన్యస్తాక్షర శ్రేణితో. 689

సీ. వీక్షించె నా దేవ విభునిపై వెలసెడు
 నానందనిలయ విమానగరిమ
పూయించె నా లోహపూర విమానంబు
 పైఁ బదార్వన్నెల పసిడిపూత
అర్పించె వివిధ పదార్థార్పణోచిత
 తపనీయ ఘటిత పాత్రవ్రజంబు
వ్రాయించె దానపత్రమ్ములన్ స్వకళింగ
 దిగ్జయ యాత్రాప్రదీ ప్తరీతి.

గీ. పదియు నేనూర్లు పదియేడవదియ యైన
హాయనంబున జనవరి యాదియందె
యా కళింగోర్వి దిగ్జయయాత్ర ముగియఁ
దనరెనన వ్రాయఁజేసెఁ దత్పత్రతతుల. 690

చ. తిరుపతికొండ నెక్కఁ జనుదేర ముఖస్థ కవాటమందు న
య్యిరుదెసలందు నాంధ్ర పృథివీశ శిలామయ విగ్రహంబు సు
స్థిరవిధి గానవచ్చు బరిదృశ్యము లయ్యెడుఁ జిన్నమాంబికా
తిరుమల సంజ్ఞికాంబికల దివ్య కలామయ విగ్రహంబులుꣳ. 691

గీ. మున్నె తిరుపతికొండ తద్భూభృదగ్ర
పదము భూషించు వెంకటేశ్వరుడు నతని
ప్రక్కరాయలు నాతని పజ్జసతులు
నలరనదియేరి కీక్షణీయంబుగాదు? 692

చ. ఎఱుగము కృష్ణరాయలను నెన్నడు కన్నులఁ జూడలేదు త
చ్చరితము కర్ణపర్వముగ సత్కవి కావ్యచయంబు సెప్ప నీ
సరణి దృగింద్రియప్రమద సంగతిఁ దక్కులు గూర్చుధార బె
న్గొఱతను వెంకటేశ్వరుడె కూడఁగఁ దీసెడి శిల్ప నిర్మితిన్. 693

ఉ. మాతృవసుంధరాభ్యుదయ మండన తత్పర కృష్ణరాయ ధీ
నేతృడు సత్కళత్ర మహనీయ మనఃసుఖవారిరాశి జై
వాతృకు డంత దక్షిణ శుభప్రద పావనతీర్థయాన సం
ధాతృడుగాగ ముందరిగెఁ దద్బలధామ తృణీకృతారియై. 694

ఉ. విశ్వసనీయ భృత్య పరివేష్టితుఁడై జలరాశ్యుపాంత రా
మేశ్వర లింగదర్శన సమీప్సితమున్ నెఱవేఱ వైరి భూ
మీశ్వర కృంతనప్రభవ భూర్యఘభంజన హేతుక ప్రవం
తీశ్వరవారి మజ్జనము లిచ్చుటఁ జేసె శుభాభిలాషియై. 695

శా. రామస్థాపిత సైకతప్రకటిత ప్రఖ్యాత లింగార్చన
స్తోమాపాదిత ధైర్యధాముఁడయి సంశుద్ధాత్ముఁడై దోర్బలో
ద్దామ ప్రౌఢిమ నేగి కాంచె శుభ నిధ్యానోదయావ్యగ్రమున్
గామారీక్షణ భద్రతాకరముఁ దత్కన్యాకుమార్యగ్రమున్. 696

మ. గ్రహరాజాధిక బాహువిక్రముడు గోకర్ణావనీభృత్తటిన్
విహరించెన్ గరిమన్ ప్రదక్షిణ విధా ప్రీతాత్ముఁడై తద్గుహా
బహురత్నగ్రథిత స్వరూప బృహదంబాయుక్త గోకర్ణ వి
గ్రహ మీక్షించెఁ బ్రణామముల్ సలిపె సంకల్పంబు లీడేఱఁగన్. 697

శా. పూర్ణోత్సాహముతోడ దక్షిణదిశా భూయాత్రఁ బూరించి గో
కర్ణాధీశు ననుజ్ఞనొంది క్షణమున్ గాలవ్యయం బోపకా
కర్ణాటాంధ్ర మహీతలేంద్రుడు నిజాగారంబు జేరన్ శుభో
దీర్ణామోఘ ముహూర్తమున్ గని బయల్దేరెన్ బ్రమోదంబుగన్. 698

మ. శుభలగ్నంబున రాజధామనగరీ శోభన్ విలోకించె న
య్యభవున్ శ్రీ విఠలేశ్వరున్ గని విరూపాక్షున్ సమీపించి సౌ
రభసంశోభి లతాంత మాల్యవదనర్ఘ స్వర్ణరత్నావళిన్
విభుఁడర్పించెను గాన్కగాఁగ హృదయప్రేమ ప్రబద్ధాంజలిన్. 699

మ. తన కావించిన సర్వదిగ్విజయయాత్రా సంగతోదంతముల్
జనసామాన్య మెఱుంగఁజెప్పుచుఁ బ్రజాసత్వంబె సామ్రాజ్యపా
లుని సత్వంబని బోధసేయుచుఁ బ్రజాలోకంబు రాడ్భక్తిపెం
పున బోజాలినచో సమస్త విజయంబున్ శోభితంబౌననెన్. 700

మ. పెలుచన్ శాస్త్రవిచారముల్ సలుపు సద్విద్వత్తతిన్ విజ్ఞతా
విలసత్కావ్య విలేఖనాచతురులన్ విద్వత్కవిశ్రేణులన్
లలితస్వానమనోజ్ఞగాయన కలాలాపానులాపజ్ఞులన్
గలియన్ జేసి సభాప్రదర్శనములన్ గల్పించె నానందమున్. 701

సీ. తత్తత్పురాంతర స్థానంబులందున
పటు కళాశాల లేర్పఱుపఁబడియె
స్థాపిత సత్కళాశాలాంతరంబుల
వలన షడ్దర్శనీ ప్రజ్ఞపర్వె
షడ్దర్శనీ పరిజ్ఞాన సంవ్యాప్తిచే
సాహితీ ప్రతిభాప్రసక్తిమించె
సాహితీ ప్రతిభా ప్రసారాభివద్ధిచే
కావ్యవిలేఖన గరిమ దనరె.

గీ. పటు కవీశ్వర లిఖిత కావ్యములవలన
శౌర్య సాహసలీలా ప్రచారమయ్యె
శౌర్య సాధిత సత్కార్య సరణివలన
ఆంధ్రవైభవ మద్వితీయముగఁ బెఱిగె. 702

మ. పలునాళ్ళీవిధి సాహితీభవరసప్రస్ఫార గోష్ఠీరతిఁ
లలితోదంత రసానుభోగ్య కవితాంలకార గోష్ఠీరతిన్
గలగాన శ్రవణానుమోదమున సౌఖ్యంబుండి సంఖ్యావదా
వళికిన్ సత్కృతులిచ్చుచుఁ గడపె భూపాలుండు విద్యాదృతిఁ. 703

మ. బహుసంఖ్యాక కవిప్రకాండులును సత్ ప్రజ్ఞానిధుల్ శేముషీ
మహితానల్ప సుధారసోపమవచోమాధుర్యవత్కావ్యముల్
మహిపాలాగ్రణి పేరిటన్ బొసఁగి తత్క్ష్మానాథ ద త్తంబులౌ
బహుమానంబులు మాన్యముల్ గొనిరి శశ్వత్కీర్తిసంధాతలై. 704

మ. కరముల్ వ్యక్తి గతానుకూల్యసరణిఁ గైకొంచు సర్వప్రజో
త్కర సౌఖ్యమ్మె ప్రధానలక్ష్యముగఁజింతఁ జేయుచున్ రాజ్యముఁ
బరిపాలించెను గృష్ణరాయలు జనవ్రాతంబు లానందవి
స్తర చిత్తంబుల శాసనోక్త విధులఁ సాగించి మానింపఁగఁ. 705

గీ. జనులనుండి కరంబుల సంతరించి
క్ష్మావరుడు ప్రజ కుపయోగకరములైన
బాటల సరోపరములఁ గూపముల నమరఁ
జేసి ప్రత్యుపకారియై సిరులొసంగె. 706

గీ. ఆంధ్ర కర్ణాటరాజ్య సింహాసనమున
వైనతేయ పరాక్రమ ప్రతిభతోడ
మించి రాయలు ధరణి బాలించువేళ
శత్రు సర్పాళి తలయెత్తఁ జాలకుండె. 707

క. సదనంబులఁ గలహంబులె
యుదయింపఁగరానివయ్యె; నొదవినచోట్లఁ
సదసద్విచారచతురులు
పదిలముగా శాంతిసేయు వారై రెలమిఁ. 708

మ. పలునాళ్ళీవిధి శాంతి నివ్వటిలగన్ బంచాదశాబ్దాలకున్
దొలివర్తించిన భేదకారణము లందుఁ దృష్టి సాగించుచున్
గలిమిన్ బల్మిని గొన్న దక్షిణ దిశార్కాట్ ప్రాంత కాటూరు భూ
తల నాథుండు వివాదముల్ మొదలిడెఁ దర్పాంధతామగ్నుడై. 709

గీ. ఏమి హేతువులున్నను నేబదేండ్లు
మౌనమునఁ బుచ్చి యీనాఁడు మరలనేమొ
శమితకారణముం బురస్సరము సేయఁ
బాడిగాదని రాయలు వార్తనంపె. 710

మ. నయపారీణులు మధ్యవర్తులు తదంతర్భేదముల్ మాప శాం
తియుతోక్తుల్ పలుభంగులన్ నొడివినన్ ధిక్కారముఁజేసి ని
ర్భయతన్ సంగరసిద్ధుడై యవినయ ప్రత్యుత్తరంబిచ్చు దు
ర్ణయుఁగాటూరు విభున్ జయింపఁజనెఁ గృష్ణక్ష్మావరుండాపయిన్. 711

గీ. ఏబదేండ్లకు ముందుఁ బృథ్వీశుఁడైన
ధీర నరసింహరాయు సాధింపలేక
నేడు తద్రాజ్యపీఠస్థ నృపునితోడ
బోరటముపెట్టి కొనుటెంత బుద్ధిగరిమ? 712

శా. ఆకాటూర్ఘ నదుర్గరాజము రిపుక్ష్మాధీశ దుర్గమ్య సా
లాకారోన్నత కుడ్యసంవృతము కుడ్యంబెల్ల దుస్తార్య కు
ల్యాకల్లోల పయస్సమావృతము కాలాకాలముల్ లేక య
బ్ధాకీర్ణోపరిభాగమై పెనుతమిన్ బ్రాభీలమై తోచెడిన్. 713

ఉ. కాలువపొంగి పొర్లునటుగా జలమెల్లెడ నిండియుండుటన్
గాలిడఁగా నసాధ్యమయి కాల్బల మిద్దరి నిల్చియుండె న
వ్వేళ నరేంద్రదుర్గ పరివృత్త మహోన్నత సాలరక్షకుల్
మేలిఁక వెన్కకేగుడని మేలము సేసిరి రాయవీరులన్. 714

చ. అదిగని కృష్ణరాయ లెద నాగ్రహవహ్ని దహింప గాల్వలో
నుదకము వెల్వరింపదగు యోగము భావనసేసి దానికిఁ
బదియగు తావులందు గునపమ్ములపాటునఁ బిల్లకాలువల్
గుదురఁగఁజేసె సత్వరమె కోల్పడెఁగాలువ యెల్లనీరముఁ. 715

ఉ. తోడనె లక్ష సైనికులతోఁ ద్రిసహస్ర దృఢాశ్వికాళితో
బోడిమితోడ నిత్యపరిపోషణఁ జెందెడి దుర్గరాజ మ
ల్లాడఁగఁ గృష్ణరాట్పటుభటావళి కాలువదాటి దుర్గపుం
గోడల ద్వారముల్ పగులగొట్టిరి నెట్టిరి వైరివీరులన్. 716

మ. కరవాలంబ! కరంబ! దీర్ఘసమయాక్రాంతాది దుర్గచ్ఛటా
పరిపాతమ్మున రాటుదేలితివి గర్వప్రౌఢి సంధ్యాశయా
క్షర పత్రమ్మును ద్రోసిపుచ్చి యిటు సంగ్రామంబు నాసించుము
ష్కరుఁగాఱింపు మటంచు రాయలసివంకన్ జూచెఁ గ్రోధోద్ధతిన్. 717

ఉ. దుర్గ కవాట బంధముల దుత్తునియల్ రచియించి రాట్ చమూ
వర్గములోనఁ జొచ్చిరి విపక్షులు బాఱఁగజొచ్చిరంత నే
మార్గమునైన శత్రుభటమండలి యడ్డుట రాట్సుతుల్ బహిర్
నిర్గమనంబుసేయుగతి నేరక వ్రాల్చిరి మేనులగ్నులన్. 718

మ. గడియన్ గోట యధీనమయ్యె నునుబంగారపు సింగారపుం
దొడవుల్ జిక్కెను రాజముద్రికల పొందుం బొందు ద్రవ్యంబు బె
న్గడవల్ బానలు పైడి దాపుడుల గంగాళంబులున్ జిక్కెఁబా
ల్పడె నశ్వంబులు నాగముల్ తుళువ భూపాలోగ్రయోధాళికిన్. 719

గీ. సాంధ్యరాగంబు పైకొను సమయమునకె
కాటురునృపాల శుద్ధాంత గణ్యదీర్ఘ
కాజలంబుల ఖడ్గముల్ గడుగనైరి
ప్రోగ్ర కృష్ణమహీపాల యోధగణము. 720

ఉ. పోరునఁగృష్ణరాయ పరిపోషితయోధవరుం డెవాడొ కా
టూరు నృపామయాయి యెవడో తెలియ౯; తగుగుర్తులయ్యెఁగా
టూరు భటాళిమేనులఁగడు౯ బ్రసరించిన కత్తిగాయముల్
వారకపారు రక్తపుఁ బ్రవాహములు౯ ద్రుటితాంగకంబులు౯. 721

శా. మూలన్ డాగిన శత్రువీరునికరమ్ముల్ పాదముల్గట్టి మో
సాలఁ యోధులు డింప రాయ లతనిఁ శంకించి; విధ్వస్త శీ
ర్షాలంకారము రాజదండ ముఖచిహ్నాంబుల్ నమన్మస్తకం
బాలోకించుచు నాత్మ తుష్టిగొని దుర్గాధీశ్వరుండే యనెన్. 722

గీ. తనకుదానయి దుర్మదాంధత కతాన
దురము కొనితెచ్చుకొన్న యా దుర్గరాజు
యుద్ధమున నోడి శృంఖలాబద్ధుడగుచుఁ
గృష్ణరాడ్రాజధానికి నిగ్గఁబడియె. 723

ఉ. కాటురు దుర్గరాజమునఁ గైవసమైన గజేంద్ర సంఘముల్
ఘోటకరత్నముల్ నృపునకున్ గల సైన్యము పెంపు సేసెద
ద్ధాటక రత్నరాజత పదార్థములెల్లను గృష్ణరాట్చమూ
కోటికి బంచఁగాఁ బడియెఁగూడె బహూకృతు లెల్లవారికిన్. 724

మ. అకటా! దుస్తరవార్ధితుల్య గురుకుల్యా సంవృతోద్దండ దు
ర్గ కవాటాంతర వీరరక్షక కరాగ్రన్యస్త ఖడ్గాల ని
శ్చకిత ప్రక్రియ రక్షితుండయిన తేజశ్శాలి లక్షార్వయో
ధకులాఢ్యున్ విధి బద్ధుజేసెడి ననిత్యంబుల్ గదా! సంపదల్. 725

గీ. దక్షిణార్కాటు కాటూరు ధరణిజాని
వైరి రచితావమానంబు కారణమున
నడలి రాయల కారాగృహంబునందె
నవిసి యమరపదారోహణంబుసేసె. 726

గీ. ఆ విజయయాత్ర సంపూర్ణమైనవెనుక
గొండవీడ్ దుర్గమునఁ బ్రజాతండములకు
భీకరాంతః కలహము లావిర్భవింప
శాంతిఁ జేకూర్ప రాయలు సచివునంపె. 727

మ. కల(తల్వారణ సేసి తిమ్మరుసు దుర్గప్రాంతవాసి ప్రజా
వళియొద్దన్ లభియింపనైన ద్విరదాశ్వవ్రాత మర్ధంబుల
క్షల విద్యానగరంబు(జేర ననిపెన్ క్ష్మాజాని మంత్రీంద్రున
ర్మిలి(బిల్పించి సమాదరించె నొనగూర్చెన్ భూరిసత్కారముల్. 728

## రాయచూరుదండయాత్ర

మ. అటులానందరసప్రమగ్నుడయి రాజ్యశ్రీ పరిష్వంగ వి
స్ఫుట సౌఖ్యస్థితి( గొన్నినాళ్లు జరిపెఁ భూజాని; యాఁతేని కొ
క్కట( బత్రాలయమంగు( బ్రాగ్లిఖితలేఖల్ జూచుచో విక్రమో
ద్భటహృత్ సాళ్వనృసింహరాడ్లిఖిత పత్రంబొండు గానంబడెఁ. 729

మ. విలిఖించెన్ నరసింహరాజు నిజపృథ్వీశాంతి సంరక్షణన్
జలుపఁ దప్పక దక్షిణాపథ మహీశవ్యాప్తమౌ రాయచూర్
బలవద్దుర్గ ముపార్జనీయమని తద్భావంబు( బాటించి రా
యలు భావించె, మఱొక్కసారి నిజశౌర్యస్ఫూర్తి సారింప(గన్. 730

మ. అరిభూపాలక దుష్ప్రతార్యపరిఘా వ్యాలోల కల్లోల భా
స్వర ఘోషాపరికీర్ణమై విమల కృష్ణాతుంగభద్రామహా
సరిదుత్తుంగ తరంగ భంగకలనాంచత్ ప్రాంతమధ్యస్థమై
వరలున్దుర్గము రాయచూరు గిరిపై ప్రాభీలసాలావృతిన్. 731

మ. స్థిరసంభాసి సహస్రశిల్పములతో( జెన్నొందు నీ దుర్గమె
వ్వరు నిర్మించిరొ, సాల, రత్నవిలసత్ప్రాసాద సౌందర్యముల్
బరికింపంగ సహస్రనేత్రుడు, లిఖింపన్ హైహయాధీశుడున్
మరలన్ రావలెగాక; యట్టి పదమీ క్ష్మామండలిన్ మృగ్యమే! 732

మ. తొలిభూపాలురు రాయచూరునగరీ దుర్గంబుపై దండయా
త్రలు పల్మాఱులు సేయనైన సఫలత్వం బొందమిన్ జేసి రా
యల కా దుర్గజయంబు పౌరుషకర వ్యాపారమాయెన్ రణ
స్థలి(గోరెఁ నృపు డాగ్రహద్విగుణితోత్సాహాతిరేకంబునఁ. 733

మ. విజయశ్రీ శుభదర్శనోత్సవ విధుల్ పెంపఁ బ్రతాపంబు వం
శజ సంసూచిత రాయచూరునగరీ సంశాసనప్రక్రియఁ
నిజచిత్తంబిడి నూఱునేండ్లకయినఁ జీవిఁ మహారాజ్య సం
సృజనానందము చెందు నా నరసివేచెఁ యుక్తకాలార్థియై. 734

శా. ఆదుర్గంబు బిజాపురాధీకృతి మాద్యన్లేచ్ఛజాతీయుఁడౌ
నాదిల్‌షా సులతాను సంధికృత సౌహార్దంబునందుంట బ
ద్ధారి స్నేహవిభంగముఁ జలుపఁగానై నిర్నిమిత్తాహవా
ర్థాదేశంబులు సేయుటెట్లనుచుఁ జేయఁజొచ్చె నాలోచనల్. 735

చ. ధనము హరించిగాని వసుధాపతి పట్టున ద్రోహచింతనం
బొనరిచిగాని వచ్చు నరునొప్పుట పోలదటంచు నట్టి దు
ర్జనునకు నెట్టి యాశ్రయ మొసంగుటయుఁ దగదంచు వర్తిలెన్
మునుదమకున్ బిజాపురపు భూపులకొప్పిన సంధిరీతిలోన్. 736

మ. అది యట్లుండఁగఁ గృష్ణరాయలకు యుద్ధాశ్వంబులఁ దెచ్చి యి
చ్చెద నంచున్ బలువేలుగాఁగ ధనమున్ జేపట్టె నమ్మించె స
య్యదు మర్కారను వర్తకుండు తురగవ్యాపారి యాద్రోహి న
ల్వదివేల్బంగరు నాణెముల్ వడసి తాఁబాఱెన్ బరక్షోణికిఁ. 737

గీ. అల్లనల్లన మర్కార్ నిజా ప్తజనుల
మనికియైన పొమాడగ్రామంబు జేరె
తెగువమెయి నటనుండి యాదిల్‌షహాప్ర
దేశమున్ జేరి సుఖలీలఁ దిరుగుచుండె. 738

శా. ధీమంతుండగు కృష్ణరాయలపు డాదిల్షాకిటుల్ వ్రాసె నా
ర్యా! మర్కారను నశ్వవర్తకుడు మా రాష్ట్రంబునఁ జేరి సం
గ్రామాశ్వాళిగొనంగ నల్వది సహస్రాల్ నాణెముల్‌పొంది మా
యామార్గమ్మునఁ బాఱి నిఁ గదిసె నిందంపింపు మావంచకున్. 739

గీ. పెద్ద కాలంబు దన్క మీ విమతజనులు
మాకు శత్రువులం చెంచి మసలినాము
మనకు గలిగిన సంధి సంబంధమందు
మోసగాండ్రకు శరణంబు పుట్టరాదు. 740

మ. నను వంచించిన యత్తురంగ వణిజున్ మాయావిఁ దోడ్తోన నీ
వనుమానింపకయే వశం పఱచుటే యన్యోన్య సౌహార్ద వ
ర్ధన మూలంబగు సంధిపద్ధతుల యాథార్థ్యంబు చెల్లింపు మి
ట్లనుకూలింపవొ యా యొడంబడిక వమ్మైనట్లు భావించెదన్. 741

ఉ. ఆవిధిఁగృష్ణరాయలు యథార్థ నిరూపక పత్రమున్ సుహృత్
క్ష్మావరు పాలికంపెను బిజాపురభూపతి దానిఁజూచి తా
నేవిధిఁ జేయఁగావలెనొ యెల్ల వచింపుడటంచు మ్లేచ్ఛ మే
ధావులఁ జేర్చి పల్కె నుచితజ్ఞులు వాకొని రీవిధంబునన్. 742

చ. మతమది దైవసమ్మతము మానవసంస్మృతి సాధనం బుపా
ర్జితమగు విత్తమైహికము చింత యొనర్పఁగ రెంటియందు దై
వత హితకార్య నిర్వహణ భావ్యమ! ఐహిక దృక్సమూఢ సం
సృతి కృతదోషశిక్షణము సేయుట ధర్మహితప్రకారమా? 743

ఉ. చారు మహమ్మదీయమత సమ్మత ధర్మ పవిత్రమూర్తి “మ
ర్కారును హిందుధర్మ పరిరక్షణశీలుడు దోషి శాసనా
చారుఁడు కృష్ణరాయల వశంబొనరించుట పాడిగాదు వ్యా
పారము క్రిందుమీదయిన పట్టునఁ జేసెడిదేమి యేరికిన్”. 744

చ. అనినుడు మ్లేచ్ఛధర్మ విహితాలపనంబుల నాలకించి యౌ
ననుచు బిజాపురాధిపతి, యాతని “డాబులు” పత్తనంబులో
మనుగడకంపె వర్తకుఁడు నప్పురినుండి మఱేడకో పలా
యనమొనరించె నాదిలుషహా యిటు సంధిని మీఱివర్తిలెన్. 745

గీ. తెగి బిజాపూరుసులతాను ధృతివహించి
సయదు మర్కారు మా ప్రదేశంబువదలి
యెందుఁబొయెనొ యేమొ మేమెఱుఁగఁజాల
మనుచు రాయలకుఁ వార్త నంపనాయె. 746

క. అదిగని కృష్ణమహీపతి
ఎదనాగ్రహమూని పూర్వకృత సంధివిధిన్
బొదవెన్ భంగమ్మనుచున్
గదనమ్మున కదియె తగినకతమని తలఁచెన్. 747

మ. పనిమై మిత్రునితోడి పోరు తగదన్ భావంబిటన్ బూర్వరా
జనియుక్తాంశము కార్యమంచనెడు విశ్వాసంబు పోరాడ ని
ట్లనుకూల ప్రతికూలభావములు జోడై ఁతేనిబాధించె నిం
దనుకన్; మ్లేచ్ఛునివార్త యిప్పుడడచెన్ దద్ధర్మసందేహమున్. 748

శా. సేనాధీశుల వీరయోధులను నిస్సీమప్రభావాఢ్య మే
ధానిస్తంద్రుల మంత్రిసత్తముల నాస్థానంబునన్ జేర నా
హ్వానంబుల్ బొనరించి చేర్చి రిపు దుష్ప్రారంభముఁ దెల్పి రం
గానఁ జర్చ యొనర్చి, తెల్పుడనియెన్ గర్తవ్యతా వైఖరిన్. 749

గీ. సభ్యులొక యింత తడవు చర్చలు రచించి
సంధినియమాల నొక్కతొసంగె యగుట
నేమియున్ దెల్ప కుర్వీశు నిచ్చ యనిరి
నృపతి కతమున దురమె నిర్దిష్టమయ్యె. 750

సీ. వరవీరయోధుల కరపుటంబులయందు
తరవారులవిమించు తళుకులీన
అనికిఁగాల్దువ్వు వీరాశ్వాళిహేషలు
నింగి బీటలు వాఱ నివ్వటిల్ల
వైరి దుర్గద్వార్విదారి మత్తకరీంద్ర

ఘీంకారములకు దిక్ర్శేణి యదర
సమర సన్నాహ సంచలిత శతాంగాళి
నిస్స్వనార్భటులకు నేలగదల.

గీ. శంఖాకాహళపటహాది సాధనముల
యారవములకు జగమెల్ల మాఱుమ్రోయ
విజయనగరాంతర ప్రజావితతి యెల్ల
సంగరోత్సాహ చర్యల సందడించె. 751

చ. బిదరుబిరారుదేశ విభువీరులు శూర నిజాముషాహి యా
యదనున నంతరంగకలహ ప్రతిపీడితులై చెలంగుటన్
గదనమునందుఁ దోడుపడు క్ష్మావరులెవ్వరొ వైరిపక్షమున్
గదిసెడి వారెవారొ యెఱుఁగన్ దగుకాలమువచ్చె తేనికిన్. 752

మ. ఒక చందంబున మిత్రభావ సముపేతోద్దేశముంజేసి యో
పికమై బీదరుకున్ బిరారుకు నిజాం వీరక్ష్మాజానికిన్
"బ్రకట ప్రక్రియ రాయచూరుపయిఁ బోరంబోదు; మీసమ్మతిన్
బ్రకటింపుం" డనివ్రాసి శ్రీఘ్రముగఁబంపన్ జేసె, లేఖాత్రయిన్. 753

క. బీదరు బిరారు ప్రభువులు
క్ష్మాదయితుని యుద్యమమున సమ్మతినిడిరా
యా దిల్‌షహా లతాంగి స
హెూదరుడు నిజాము మిన్నకుండెన్ దాల్మిన్. 754

మ. సమభావంబున ధర్మరక్తిని నిజాంశాహి ప్రభుం డెంతొ యు
త్తమ మిత్రుండన నొప్పె నిందనుక నాంధ్ర శ్రీధరాజానికిన్
సమరారంభముసేసి ధర్మపరిరక్షారీతికై పిల్వనె
య్యము జూపింపక మిన్నకుండెను నిజాంశాహి ప్రకారంబునన్. 755

మ. అరిదుర్గస్థ రహస్యముఁ దెలియ సేనాధీశు నంపించె నే
డ్తెఱ జూపఁ బదివేలయోధులఁబదార్ దృప్తేభరాజంబులన్

మఱియుఁ ముప్పదివేల సైనికులంగా మానాయకుఁ వేయిగన్
దురగానీకము నంపె నందుగలిసెన్ నూఱుల్ శతఘ్నీతతుల్. 756

మ. మతిమంతుండగు కృష్ణరాయలటపై మాన్యావనీదేవ పం
డితవాగ్రీతి ముహూర్తనిశ్చయసమున్మేషం బధిష్ఠాన దై
వత పూజావిధిదీర్చి భద్రశకునప్రాప్తిఁ సమీక్షించి ప్ర
స్థితుఁడయ్యెఁ స్వవశంబు జేసికొనఁగఁ శ్రీ రాయచూర్ దుర్గముఁ. 757

సీ. ప్రబల ధనుష్కళా వ్యాపారి విరచిత
టాంకారముల కెల్ల వంకలదర
పిఱుద నేఁబదివేల కఱకు కత్తులజోదు
లవని యీనినయట్టు లదటుగొల్వ
శిక్షితక్రమమునఁ జెలరేగు ద్విసహస్ర
కదనతురంగముల్ గంతులిడఁగ
దుర్గకవాటముల్ దూటాడనేర్చిన
యిర్వదేనుగులు ఘీంకృతులుసేయ.

గీ. దరలెఁదిర్మలనాయక దండనాథుఁ
డఖిల సైనికవర్గ మాహ్లాదమెనసి
సమధికోత్సాహపూరిత స్వాంతమగుచు
విమత దుర్గాక్రమణ సేయ వెంబడించె. 758

చ. ఇరువదివేల కాల్బలము లింకను ముప్పదియైదునూఱులౌ
తురగదళంబుముప్పదరి దుర్గవిదారణ శిక్షణక్రియా
విరతమదేభరాజములు వెంబడిసాగెను దిమ్మనాయకుం
డరిగెడివేళఁ జూపఱ హృదంబుజముల్ చలనంబు జెందగన్. 759

చ. అకలుషి పెమ్మసాని విమలాన్వయ జాతుఁడు రామలింగ నా
యకుఁడొకవంకగానరిగె నాతఁడు స్వామి సమీరితక్రియా
నికర సముజ్జ్వలద్విజయ నిర్వహణ ప్రతిభాధురుండు సై
నికచయ నాయకత్వమున నేర్పఱి, రాట్కుల పౌరుషాఢ్యుఁడున్. 760

గీ. మొత్తమున నేడు లక్షల మూడువేల
చండయోధులు ముప్పదిరెండువేల
యాఱువందల యశ్వమ్ములైదునూర్ల
యేబది యొకండు గజములు నెదురఁబోయె. 761

సీ. అరి నెదుర్కొనబోదునందునా? యేడు ల
క్షల సంఖ్యకున్ మించె శత్రుబలము
సంధినర్థింతునా? జనపాలు ధిక్కృతి
సేసి క్రమ్మఱ నర్థి సేయుటెట్లు
బీదరు బీరారు విభుల బ్రార్థింతునా!
వైరులైవారుపై వచ్చువారు
అధికసేన నిజాము నడుగుదునా! నిజ
క్ష్మారక్షణం బెట్లు మానఁగలఁడు.

గీ. శరణమందున? జాతి లక్షణమెగాదు
పాఱఁజూతున? యేకోన బ్రదుకవలయు
భావచపలత నిటు బాధపడుచు నెట్లొ
స్థానమున నిల్చె నా దిలుషావిభుండు. 762

ఉ. అంతట సైన్య మన్నిదెసలందున దుర్గమ రాయచూరు దు
ర్గాంతము సేయఁజుట్టుకొనునట్టుల రాయలు ప్రోత్సహించె; దు
ర్గాంతికవర్తి సైనికులయందున దుర్గచమూశతఘ్నికా
సంతతి ప్రేల్చఁగాఁబడియె సైన్యము బాయఁగఁజొచ్చె ధైర్యమున్. 763

మ. అరి రాజన్య శతఘ్ని కానలకణ వ్యాఘాతముల్ మీఱ ముం
దఱికిఁ బోవక నిల్చు సైనికుల కుత్సాహంబు గల్పింప భూ
వరుఁడుఁ సాహసమూని నిల్చి "తను సౌభాగ్యంబ నిత్యంబుదు
స్తర సంగ్రామ జయంబె శ్రేయ"మని యుద్ఘాటించెఁ దీవ్రోక్తులఁ. 764

గీ. సైన్యమధ్యంబునకుఁ బోయి శత్రుదుర్గ
పాల కుడ్యోపలంబుల జార్చుఁడనియె
బ్రస్తరమునకు ముప్పది పణములిత్తు
ననుచు వాగ్దానమొనరించి యాసగొల్పె. 765

గీ. ప్రస్తరము పెద్దదైన నల్వదిపణాలు
నంతకుఁ బెద్దదైనచో నరసిమెచ్చి
యేబది పణాల బహుమతి నిడుదుననియె
కడఁగి రెల్లరు దుర్గమార్గంబు సేయ. 766

శా. ఆదిల్‌షా తన ముఖ్యసైన్యము శతఘ్న్యాద్యాయుధశ్రేణితో
నాదుర్గంబున కంపెఁజెచ్చెఱ రహస్యాధ్వంబునన్ దుర్గర
క్షా దీక్షానియతుల్ బలంబులును దుర్గంబందునన్ జేరి యు
ద్ధాదిన్ మూసిరరిప్రరోధకర సింహద్వాః కవాటద్వయిఁ. 767

శా. మార్గంబేర్పడ రాయసైనిక లసామాన్యశ్రమన్ జేసిరా
మార్గంబున్ స్వవశంబు సేసికొని క్షేమస్థైర్య ధైర్యాఢ్యులై
దుర్గాంతర్నగరంబు జొచ్చి యరులన్ దున్మాడఁగాసాగి; రే
వర్గంబున్ వెనుదీయమిన్ కదనముల్ వర్తిల్లె ముమ్మాసముల్. 768

సీ. పటుసత్వమున దాట భటులు వేల్గూడిన
నేనాఁడగడ్త చోటీయలేదు
తురగరాజమ్ముల దుమికించు వైరుల
భంగికి సాలమ్ము లొంగలేదు
ఘనకుంభికుంభ ఘట్టనలదుర్గద్వారా
బంధకవాటంబు పగులలేదు
కాంస్యకుడ్యమ్ముల కంటెన్ దృఢమ్ములౌ
గోడలెత్తావునన్ గూలలేదు.

గీ. దీర్ఘకాలంబునుండి యుదీర్ణవప్ర
శిఖరలగ్నధ్వజమ్ములు చెదురలేదు
అట్టి దుర్గమ్ము వైరిపాలగునొ యేమొ
అనుచుఁజింతించె దుర్గరక్షాధికారి. 769

మ. వర దుర్గాంతర సౌధమందిరచరత్ ప్రౌఢాంగనారూప బం
ధుర లావణ్యము లీక్షసేయ యువభృత్యుల్ డాయ; లోలాక్షు లా
భరణంబుల్ తొలగించి కొప్పులు దిగఁ బర్వించి మానావన
స్థిరలై శస్త్రములెత్తి రాయువజనుల్ దిగ్భ్రాంతులైరాక్రియఁ. 770

శా. భృంగోత్తంసములార పుల్ల సుమనోవిఖ్యాత సద్వాసనా
భంగీమంజుల మల్లికాలతలనన్ భ్రాంతిఁ విలోకించి వ్రా
లంగఁ జూచెదరేల? యివ్వి భ్రమరోల్లాస ప్రచారక్రియా
భంగారంభ సువర్ణపుష్పములనఁ భాషించి రా యంగనల్. 771

మ. యువయోధుల్ రిపుదుర్గ సౌధతతులం దొప్పారు కుడ్యంబులఁ
నవశిల్పుల్ లిఖియించు చిత్రముల కాంతారూపముల్ జూచి భో
గ్యవిలాసాంచిత నైజ భామినులనంగాఁ జేరి కైఁదట్టఁ బ్రా
ప్యవిధిఁ వంచితులైరి ప్రస్తరకటు స్పర్శాహతాభీష్టులై. 772

మ. కరవాలంబులఁ గోశగర్భముల డాగఁజేసి విశ్రాంత త
త్పరతఁ గ్రుమ్మఱు నూత్నయౌవన భవోత్సాహుల్ భటశ్రేణి సుం
దరులఁ వామలజేరి స్వైరసుఖ చింతాభావముల్ దెల్ప నా
తరుణుల్ బల్కిరి దుర్గ నిర్జయముమీదఁ గూర్ప నిష్టార్థముల్. 773

సీ. ప్రోత్తుంగ శృంగాఢ్య భూధరంబులొనర్ప
దక్షిణోత్తర దిశా రక్షణంబు
మహిత సైన్యంబులు మైదానములొనర్ప
ప్రాక్పశ్చిమా శాభిరక్షణంబు
శాతశిలామయ సాలకుడ్యమడంప
నాసన్నవైరి ధైర్యాతిశయము

దుర్గప్రజాళికిఁ దోయమ్ము నొనగూర్ప
నంతఃప్రదేశ జలాశయమ్ము.

గీ. అంతరుర్వీ విభాసి భాండాలయస్థ
పంచవత్సర పర్యాప్త బహుళభోజ్య
వస్తుసామగ్రి నిండార విస్తరింప
దూగెనవ్వేళ రాయచూర్ దుర్గపదము. 774

గీ. రాయచూర్దుర్గమున కుదక్ ప్రాంతమందు
ప్రభువురాయలు తనదు స్థావరము సేసి
శిబిరములగూర్చి యాక్రాంత సీమచుట్టు
ప్రశితకంటకి శాఖలన్ బలిమినాటె. 775

గీ. రాయల గుడారమందు నేర్పుఱుపఁబడియె
దేవతామందిరములు పూజావిధాన
పరులు బ్రాహ్మణులకు మంత్రి వల్లభులకు
తగినవసతులు సమయోచితముగ నెగడె. 776

మ. భటవర్గంబుల కాశ్వికావళికి నావాసంబు లొప్పెఁ సము
త్కట సంగ్రామతలంబు రాజనగరీ కల్పంబుగానాయె నె
చ్చటనై నఁ గనవచ్చె నాపణము లంచద్వస్తుజాలంబు వి
స్ఫుట నీలంబులు పుష్యరాగములు కెంపులు మాన్యమాణిక్యముల్. 777

మ. యవనాధీశుడు లక్ష యిర్వదగు వేలౌ యోధులఁ దంతిరా
ణ్ణివహం బొక్కశతంబు నేఁబది శితానీకాయుధశ్రేణి న
శ్వవితానంబు నొగిఁ బదెన్మిది సహస్రంబుల్ శతఘ్నీతతిఁ
బవరంబాడఁగ దోడుసేయుటకు గూర్పఁజాలె నుత్సాహియై. 778

గీ. అర్భకుల గాజుగోలీల యాటగాదు
కలహశీలల వాగ్వాద కలనగాదు
కైతవద్యూత ఖేలన క్రమముగాదు
ఆంధ్రరాయలమ్రోల బోరాడు లీల. 779

మ. మునుముందాదిలుషా నృపాలుడదనంపుందండుఁగృష్ణాతటం
బున నిల్పించెను రాయలే తనపయిఁ బోరాడనేతేర సై
న్యనికాయంబును రెండు భాగములు సేయఁ బోర సౌలభ్యమౌ
నని యెంచెఁ; రణతంత్రవిజ్ఞు డెటు మాయారీతికిన్ లోఁబడున్? 780

శా. కొన్నాళ్ళచ్చటనుండి యాదిలుషహా క్షోణీశ సైన్యేశుడా
పన్నాగంబు వృథాప్రయాసమని సంభావించి యుద్ధక్రియా
సన్నాహంబుఁద్యజించి,యేర్గడచి కృష్ణక్ష్మాప సైన్యాళి మా
ర్కొన్నన్ గల్గెఁబరాజయంబు బల ముఖ్యుల్ పాఱిరాశాచ్యుతిన్. 781

మ. వరవిద్యానగరాధినాథుడు బలవ్రాతంబు భాగించె ద
త్తరుణార్ధంబుగ నేడు భాగములుగాఁ దత్సర్వ సైన్యంబు సం
గరవిద్యాకుశలాత్ములైన బలవత్కాయుల్ సమర్థింపఁగాఁ
బరగించెన్ నియమంబు, దా, స్వయముగాఁబైబూనెఁ బోరాడఁగన్. 782

గీ. ప్రథిత విక్రమశాలి శ్రీరంగ పట్ట
ణాధిశాసికుమార వీరయ్యవిభుడు
రాయలకు మామ; యతని పుత్రప్రకరము
మూడుపదులగు వారలు పోరఁజనిరి. 783

క. మాన్యుడు కుమారవీరయ
జన్యాగ్రస్థలిఁ జరింప సమ్మతిసేసెఁ
సైన్యములన్ నడిపి రసా
మాన్యబలుల్ వీర రాట్కుమారకులాజిన్. 784

మ. తొలియామంబున మందవాసరమునన్ దుర్దాంత సంగ్రామ సం
కలనంబుల్ మొదలయ్యె రాయల మహాసైన్యంబు దొల్తన్ దురు
ష్కులఁ బల్మందినడంచె నంతటఁ దురుష్కుల్ తీవ్రతన్ బూని రా
యల సైన్యావళి వెన్కకుందఱిమి రుగ్రావేశసంవేశులై. 785

శా. ఆరీతిన్ వెనుకంజవైచు తనసైన్య శ్రేణిలో నిల్చి దో
స్సార స్ఫారుఁడు కృష్ణరాయలు మహోత్సాహైక వాక్యంబు లే
పార౯ బల్కఁగఁ జొచ్చె దా స్వయముగా నాయోధనాశ్వంబుపై
నారోహించి సమీపమం దలరు సైన్యశ్రేణు లాలింపగ౯. 786

మ. శితబాహాబలదారితారిజనతాశీర్ష స్రవన్నిర్మల
క్షతజాకారక గంధసార మృదుచర్చాప్రీత; శస్త్రాంచలా
మితతేజో నటనాభిజాత, జయలక్ష్మీకాంత; తద్రూపమే
ప్రతిబింబింపకయుండె నిట్లనుపలభ్యంబౌట కేహేతువో. 787

శా. అన్యస్థానములందుఁ బ్రేమమెయిఁ గంఠాశ్లేషము౯ జేసిన౯
ధన్యు౯ జేసితిగాదె; నా జయరమాతన్వంగి నే డేలొకో
మన్యు ప్రేరితవైతి; శత్రుగళసీమ౯ శస్త్రధారాబ్జమా
ల్యన్యాసంబు కొఱంతవోయెననియా? అర్పింతు; శాంతింపుమా! 788

చ. అలఘుమతి ప్రకాశ సముదంచిత వీరకుమారులార; శ
త్రులఁ బరిమార్చుచో హననదోషము మీకని యెంచబోకుఁడీ
కలనకు నేను గారకుఁడ గర్మఫలం బది మీకుగాదు స
ద్బలకృత సర్వకర్మ లకృతంబులుగా మను వుచ్చరింపఁడే. 789

శా. ఈ రాజ్యం బఖిలంబు సర్వజగముల్ సృష్టించె నీశుండె లో
కారాధ్యుండగు నీశ్వరుండె నను క్షాత్రాంశోద్భవున్ జేసె; దో
స్సారం బర్పణసేయ కే సరణి రాజత్వంబు సార్థంబు; "బా
హూరాజన్య" యనన్ శ్రుతీరితము వ్యర్థోక్తంబుగావచ్చునే? 790

గీ. స్వయముగా నేనె పోరెద సంగరమున
నరులచేతుల మృతుఁడనే యైతినేని
ఈ యమూల్య సువర్ణాంగుళీయకంబు
నాదు నర్థాంగులకుఁ జూపుఁదారమున. 791

గీ. అనుచు నొకనికి నంగుళీయకము నిచ్చె
ధీరయోధులు రాయల తెగువజూచి
బంధురోత్సాహముఁ జెంది పార్థివేంద్రు
వెంటఁజని పోరి రసమాన విక్రమమున. 792

మ. చటులాజిస్థలి, ఖాద్యవస్తుచయరాజత్ శాల గావించి యు
త్కట కృష్ణక్షితిపాలయోధతతి, దుర్దాంతారి రాజీశిరః
పటలిన్ గోసి యుపాశనమ్మిడి యసృక్ప్రస్రావముల్ దప్పి యా
రటమున్ దీర్పగనిచ్చి యారిపిరి వీరస్వర్గలక్ష్మీక్షుధన్. 793

ఉ. ఆ సమయంబునఁ బ్రచటు లాహవమై యవనేశు సేన సం
త్రాసముతోడ బాహుబల దర్పము లోడెను కృష్ణవేణిపాల్
సేసిరి మేనులెందఱొ బలిష్ఠకరీంద్రకరాభిఘాత వీ
తాసులు కొందఱద్రికుహరాంతర వాసులు నైరి కొందఱుఁ. 794

ఉ. చచ్చిరి పెక్కుభామినులు, చచ్చిరి బాలురు, వృద్ధులెందఱో
త్రచ్చిననంబురాశినటు రావము లుప్పతిలంగ నాయెఁ గా
ల్వచ్చిన యగ్నిపర్వతము లాగున రేగిన కృష్ణరాయు శ
స్త్రోచ్చలితప్రచండతకు నోటువడెఁ యవనేంద్రుఁడుఁ ధృతిన్. 795

మ. బ్రదుకే చాలునటంచుఁ దత్సదృశ రూపప్రోగ్రయోధాగ్రణిన్
గదనోర్విన్ నృపుడంచు నమ్మసరణిఁ గల్పించి ద్విడ్వంచనా
స్పదవేషంబున, నప్రకాశముగఁ గృష్ణావాహినీ ప్రాంతమున్
గదిసెన్వైరి, తటాంతర స్థగిత రక్షాసద్మమందున్ బడెన్. 796

మ. తినుబండారము భూరివిత్తమును నాదిల్‌షా గుడారాలఁజి
క్కెను, నన్నూఱు ఫిరంగులున్ నవశత క్రీడాశతఘ్నీ రథా
ళిని నల్వేల హయంబులన్ శతగజాళిన్ బట్టి శ్రీకృష్ణరాడ్
జనపాలుండు వశంబు సేసికొనెఁ దజ్జన్యావసానంబునన్. 797

మ. తనచే జిక్కిరి బాలికామణులు కాంతారత్నముల్ గోవ్రజం
బును జేజిక్కె; దయామయుండయిన తద్భూజాని తజ్జీవులన్
బనిగావీడెఁ బదాఱువేల స్వభటవ్రాతంబు స్వర్గస్థమ
య్యెననన్ జింతయొనర్చెఁ బుణ్యరతిఁజేయించెన్ దదంత్యక్రియల్. 798

గీ. తనదుసైన్యాల కుత్సాహ మినుమడించె
లబ్ధ వస్తూత్కరమున బలంబుపెఱిగె
వైరిరాడ్దుర్గమును వశంపఱచుకొనుట
యందె రాయలదృష్టి విన్యస్తమయ్యె. 799

మ. పటు సేనానివహాధి నాయకుఁడు సల్బత్ఖాను రక్షాకరుం
డట నేనూఱుల పోర్చుగీసు రణవిద్యాశూరులన్ జేర్చి పో
రటమున్‌జేసెను గృష్ణరాయ రణచర్యన్ స్రుక్కి చేఁజిక్కి సం
కటము జెందె దృఢాంధకార విసరత్కారాగృహావాసియై. 800

మ. ఫిగరీడోయను పోర్చుగీస్ సుమతి యుద్వేలత్ శతఘ్నిప్రయో
గగరిష్ఠుండరుదెంచి రాయలకు సఖ్యం బేర్పడన్ బల్కుచున్
దగనాజ్ఞన్ గొని దుర్గభంజన విధానంబందు నుద్యుక్తుడై
మిగులన్ దీవ్రత నగ్నివర్షమును గ్రమ్మించెన్ ద్విషత్సేనపై. 801

గీ. ఉభయ పక్షాలవారు మహోగ్రతరశ
తఘ్నికాగ్నిప్రయోగ యుద్ధంబు నడుప
ఫిగరిడోతఱి నీక్షించి విమతపక్ష
సైన్యపతి నొక్క వ్రేటున సంహరించె. 802

క. ఇరువది దినమ్ములాలము
పరగిన నటువెన్కఁగోటవాకిటి తలుపుల్
తెఱువంబడె దుర్గాభ్యం
తరవీరులు నిలుపనైరి ధవళపతాకన్. 803

మ. కరజాలంబుల శ్వేతరుజ్ మయపతాకల్ సంధి సంప్రార్థనా
కరచిహ్నంబుల బట్టి రాయల జయాక్రాంతిఁ బ్రశంసించుచుఁ
శరణంబాడిరి వైరులత్తఱి దయాస్వాంతుండు కృష్ణక్షమా
వరుడుఁ మంత్రులనెల్లరన్ బిలిచి తెల్పఁగోరె గర్తవ్యమున్. 804

గీ. మంత్రివర్గమ్ము యోజించి క్ష్మావరునకు
నాహవంబున శరణాగతావనంబు
శాంతిమార్గము సహనంబు స్తవ్యమనిరి
ఫిగరిడోను నుతించిరి వివిధగతుల. 805

మ. అటుపై రాయల శూరసైనికులు రాజాజ్ఞానుసారంబుగా
స్ఫుటధైర్యంబునఁ గోటఁజొచ్చిరి జనంబుల్ నమ్రులైనిల్చి యం
తట శ్రీకృష్ణనృపాలు పాలనము నుత్సాహంబుతో నొప్పి, యా
దటతో స్వాగత మీయబూనిరి తదౌదార్యోచిత ప్రక్రియన్. 806

గీ. ''రాజశబ్ద భవమ్మైన రాయపదము
తావకాభిఖ్యయందుఁ బదంబుసేసె
దీని జనరంజనమున సార్థీకరించి
రక్షసేయుమి! మముఁగృష్ణరాయ భూప. 807

మ. మహదుచ్చండ భుజాద్భుతాయుధుడవై క్ష్మాభృత్కులోద్ధర్తవై
బహుమాన్యాశ్రిత రాజరాజదనుకంపాదృగ్ విలోలుండవై
అహితాప ప్రతిభాంతవిక్రమ సముద్యద్వైనతేయుండవై
బహుకీర్తింగొను, రాయ, స్వాగత''మనన్ భాషించిరాభూజనుల్. 808

మ. మదమాతంగ చయంబు ముందువెనుకన్ మందప్రసారంబునన్
గదలన్ మంజుల రత్నకంబళ సరత్ స్కంధేభరాజంబుపై
ముదమారన్ బయనించుచున్ విజయసంభూత ప్రరావంబులన్
బదమున్‌బెట్టెను గృష్ణరాయలు జగత్ప్రఖ్యాత దుర్గంబునన్. 809

ఉ. అందువసింప నిచ్చగల యందఱికిన్ సుఖరీతి నుండ నా
నందముతోడ నానతిడె; నాణెపు బ్రోవులతోడఁ గష్టమే
పొందగఁజేసి కూర్చుకొననోపిన వస్తుచయంబుతోడ, నే
గం దలపోయువారి కరుగన్ నరపాలుడొసంగె నానతిన్. 810

గీ. రాయచూర్దుర్గమందు నేర్పాట్లు తగిన
విధమునన్ జేసి రాయలు విజయనగర
రాజధానికి విజయ విభ్రమముతోడ
నరిగె జయనాదములు నింగి నావరింప. 811

మ. వరరత్నద్యుతి రమ్యహర్మ్య పదభాస్వద్ భద్రసింహాసనా
కరవిద్యానగరంబు విస్తృత మహాగంభీర శైవాలినీ
శ్వరతన్బైకొని లోకభీకర తమ స్సంహారి, రాజున్గనన్
బఱచెన్ స్వాగతసూచి హస్తచలనా వార్యోర్మికా నృత్యముల్. 812

మ. సులతానట్టి పరాజయమ్మున శితామాయాగ్ని సందగ్ధుడై
చెలిమిన్ మోసము సేయఁబోలుననుచున్ జింతించి శ్రీకృష్ణరా
యల నొప్పింపఁగ రాయబారమనిపెన్ స్వాధీనమైనట్టి త
ద్బలవద్దుర్గము గ్రమ్మఱఁ బొసఁగి మిత్రత్వంబు సాగింపఁగన్. 813

ఉ. రాయలు రాయబారి నరురాక నెఱింగియు నొక్కమాసమై
పోయిన వెన్కదర్శనము బొందఁగ నానతి యిచ్చెఁబిల్చి, త
ద్ధీయుతురాయబారమును దెల్లముగా విని యర్హగౌరవా
ధ్యాయత సత్కృతుల్ పఱచి యాదిలుషాకిటు పల్కుమంచనెఁ. 814

మ. "దురమందున్ గయిగొన్న తత్సకల వస్తువ్రాతముఁ రాయచూర్
వరదుర్గమ్ము నొసంగినీ వనువిధిన్ వాంఛావళిఁ దీర్తు; నీ
యరిభావమ్ముఁ దొఱంగి తొంటివలె నెయ్యంబుంచఁగా నెంచుచోఁ
ద్వరమై వచ్చి మదంఘ్రి చుంబనము సల్పఁ సమ్మతిన్ దెల్పుమా? 815

ఉ. ఈవిధివా ర్తనంప గ్రహియించి రయంబున రాయబారి త
ద్భూవిభు చెంతకేగి నుడిపోడిమి దెల్పఁగ మ్లేచ్ఛ భూపుఁడీ
ర్ష్యా విషయంబడంచుకొని యాహవనష్ట మనోజ్ఞదుర్గమే
దోవిధిఁగ్రమ్మఱన్ గొనుటె యుక్తమనంగని యంపె సమ్మతిన్. 816

గీ. చంచ దభిమానధనుడైన సజ్జనుండు
చంచలములైన యసువుల సరకుగొనక
స్థాపనము సేయదలచు శాశ్వతయశంబు
తాదృశున కెల్ల సిరి యప్రధానమనరె? 817

గీ. అట్టి యభిమాన మావంత నరయబోని
మ్లేంఛుఁడరిపాద చుంబనక్లేశలవము
బొరయఁగాలేదు పోయిన సిరి గడించి
రాయచూర్దుర్గ పునరుపార్జనమెకోరె. 818

గీ. రాజ్య మధ్యంబునన్ బ్రజారాజిమ్రోల
వైరి పదములముట్ట నభావ్యమనుచు
దెలుప రాయలు నిజధరాస్థలి కొనపురి
ముద్గలునఁ గూడి యటు సేయఁబోలుననియె. 819

చ. అట సులతాను వల్లె యనినట్లుగ బంపిన వార్తనంది యు
త్కట పరిపంథిఁ బట్టుకొని గ్రక్కున బంధితుఁ జేయనెంచి య
చ్చటి కరుదెంచె రాయ లది షావిభు డెట్టులో సంశయించి సం
కటపడి యందుఁ జేరుటకుఁగాతరముం గొనిపుచ్చెఁబ్రొద్దులన్. 820

మ. ఘనమాయావికరంబునన్ బడినచో గైపట్టి సామ్రాజ్యపా
లన నిర్వాహ మధర్మమం చనగనేలా? లోనికిన్ జొచ్చి మే
నునఁప్రాణంబులఁదీయఁ బాణవితతుల్ నొప్పింపవా? క్రూరదు
ర్జన బాధారహితంబుగా నెపుడు సామ్రాజ్యంబుపాలింతునో. 821

చ. అనుచు దెలుంగుతేడు రిపు వాడినమాటలు దప్పెనంచు సం
జనిత రుషావృతుండయి బిజాపురికిం జనుదెంచి షావిభుఁ
గనుగొ నఁబిల్వనంపె నది కైతవమంచుఁ దలంచి మ్లేంఛుడా
జనవరు జూడనొల్లక బిజాపురి జేరక నిల్చెదవ్వనఁ. 822

చ. జనగణ కష్టకారకు లసాధుచరిత్రు లధర్మమక్రమం
బనృతము వంచనప్రకృతి వ్యావృతియుఁ బెనుపొందు రాజ్యమం
దనుపమభోగభాగ్య మలరారిన, లక్ష్మియె నిత్యతాండవం
బొనరుచుచున్న నమ్మహి ప్రయోజనమున్నె? సుఖాభిలాషికిఁ. 823

చ. పటుతరకంటక ప్రచితపాదప ఘోరనికుంజ పుంజ సం
ఘటనల గల్గనేని మృదుగాథ మనోహర సౌరభాన్విత
స్ఫుటకుసుమాళి నీను పరిశుద్ధ లతానివహంబు లెందునే
నటమట లేని సౌఖ్యమిడునా? నిరపాయమ? నిత్యభోగ్యమా? 824

క. ఈరీతిఁ రాయలు సవి,
చారస్థితినుండ మ్లేంఛజను డనృతోక్తుల్
నేరమ్మని యది మాపఁగ
నారసి యొక రాయబారి నంపఁగ దలఁచెఁ. 825

ఉ. ఆ సులతాను యుక్తిమెయి నాసదుభానుని స్వాంగరక్షకా
గ్రేసరు నుక్తరీతిని జరింపమిఁదన్ను క్షమింపఁబోలునన్
బాసలఁదెల్పఁబార్థివుని వద్దకు బంపెనుగాని; రాకతో
నాసదుఖానునూహ పెరయయ్యె దదన్య కుతంత్ర సంగతిఁ. 826

గీ. ఆహవంబునఁ గృష్ణరాయక్షితీంద్రు
చేతఁబడి చెఱసాలఁగృశించు దనదు
శత్రువుఁ సలబతుఖానుఁ జంపఁజేయ
సమయమని యెంచె నతఁడు ద్వేషంబు కతన. 827

చ. అనువుగ బాసలఁ జలిపి యాదిలుషా పరిభాషితోక్తిగా
మునుకొని, కృష్ణరాయవిభు మ్రోల రహస్థ్సలి నిల్చి "రాజ! మా
జనపతి మీ సమక్షమున సమ్మతిఁ జేరమికిఁ క్షమాపణన్
బనివిని కోరె మీయెదుట వాకొని రమ్మనె నిర్విశేషముఁ. 828

చ. సలబతుభాను మానృపతి శత్రువ విశ్వసనీయుడౌట నా
ఖలమతి యంతరించు దనుకఁ యవనేశుఁడు మీదు నెయ్యమున్
జలుపఁగరాడు మానృపుని సఖ్యముగోరుదురేని క్రూరుఁడౌ
సలబతు రూపుమాపుఁడటఁ జయ్యన నాదిలుషాను దెచ్చెదన్. 829

చ. అతిశిత కృష్ణరాయ, సుభటాళి కృపాణఖరాగ్రధాటి స
ల్బతు వికటాంగ మందు బహుళ క్షతముల్ సలిపించి క్షుత్కృతో
ద్ధతిమెయిమ్లేచ్ఛుమై నసువితానము బీల్చగ మృత్యుశక్తి య
ద్భుతముగ నోరువిచ్చె ననభూతల గర్తముపుట్టె మ్రింగఁగన్. 830

చ. అదనున కృష్ణరాయనృపు డాదిలుషా విధుఁబట్టు నూహతోఁ
జదుపఁగఁజేసె బంధితుని సల్బతుఖానుఁడడంగెనన్ నుడుల్
విదితములైనఁ దత్కుటిలవృత్తగు డాసదుఖాను తద్భువిన్
వదలి పలాయితుండయి యపారముదంబునఁజేరె స్వాధిపున్. 831

చ. పదపడి రాయబారి నుడి భంగిని నాదిలుషా విభుం డెటన్
గదియమి, మ్లేచ్ఛభూవిభుడు కల్లల వంచనసేసెనంచుఁ దా
నెదఁ దలపోసి కృష్ణధరణీశుఁడు తాల్చె మహాగ్రహోగ్రతన్
వదలక వైరిగర్వమును భంగము సేయఁగ నెంచె నాత్మలో. 832

మ. అటుపై నాదిలుషా ధరావలయ దీవ్యద్ భామినీ రాజ్య గో
ద్భట గుల్బర్గ పురావతంస ముదయత్ సౌభాగ్యరాడ్ధామమున్
బటుతేజంబున ముట్టడించి జయ శోభాభూషితుండయ్యె నం
తటితో రాయల యాగ్రహానలము శాంతంబయ్యె నొక్కింతగన్. 833

చ. మునుసులతాను తన్నగరిపొంతఁ జెఱన్ బడవైవగుందు డ
క్కనునరపాల కాత్మజుల గౌరవమేర్పడఁ బంధముక్తులన్
బొనరిఁచి వారిలో సుగుణపుంజ నిధానుఁడు పెద్దవాని భా
మిని ఘనరాజ్యపీఠి నియమించెఁ బ్రజాపరిపాలనార్థమై. 834

గీ. తక్కుగల రాట్కుమారు లిద్దఱిని దనదు
రాజ్యధామంబునకుఁ జేర్చి పూజ్యపదవు
లందు నియమించి కృతకృత్యతానుషంగి
యయ్యె నొయ్యనఁ గృష్ణరాయప్రభుండు. 835

గీ. ఓరిమిన్ రాట్కుమారుల కొదవె ముదము
కష్టమగువేళ ధృతినోడి కనలకోర్మి
నలరువానికి నూఱేండ్లకైన ముదము
కలుగుననియెడి లోకోక్తి కల్లయగునె. 836

ఉ. ఆయత రుగ్విశేష విపదాపతితార్థినికాయవాస యో
గ్యాయతనాది సౌఖ్యరచనాభిమతా! గతజన్మవాసనా
నేయరుజావరోధ గణనీయ భిషగ్జనమాననీయ నా
రాయణరాయ ధీర కవిరాట్ స్తవనీయ యశస్స్థిరాశ్రయా! 837

ఇది

శ్రీమదుభయ భాషాకవితాప్రవీణ, సహస్రావధాన చతురానన, సహస్రా వధాన
పంచానన, పంచ సహస్రావధానీత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ
పయఃపారావార రాకాసుధాకర సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రణీతంబైన సాలంకార
కృష్ణదేవరాయలను ప్రబంధంబున పంచమాశ్వాసము సంపూర్ణము.

# సాలంకార కృష్ణదేవరాయలు

## షష్ఠాశ్వాసము

క. ధీరసభాభ్యర్పితసుమ
హారా; కృతికన్యకా సమాశ్లేషపరా
దూరీకృత గర్వభరా;
నారాయణరాయ! అర్థినవమందారా! 838

ఉ. భూవరవల్లభుండటులఁ బూర్వదిశాజయ యాత్రఁజేసి సం
భావిత సర్వవీరభటవర్గ చమూ ప్రచితప్రమోదుడై
క్ష్మావలయాంతరాళ పరిసర్పితకీర్తి విరాజమానుఁడై
యే వికృతాహవంబు ఘటియింపమి నెమ్మదిఁ బుచ్చెఁబ్రొద్దులన్. 839

క. ఆశాంతి సమయమున భూ
మీశుడు తన తెల్గుబాస నేలఁగఁగవితా
ధీశుల నెనమంద్రనుని
ర్దేశము గావించె నష్ట దిగ్గజములనన్. 840

సీ. స్తవ్యాంధ్ర కవితాపితామహ బిరుదాంకు
డలసాని వంశ పెద్దన మనీషి
మంజులశయ్యా సమంచిత కవితాభి
వినుతుండు నంది తిమ్మనవిభుండు
అతులిత మధురవాగ్ వ్యాపార ధీరతా
కలితుండు ధూర్జటి కవివరుండు
నవభావకల్పన స్తవనీయపింగళి
సూరనాభిఖ్య యశోధురుండు.

గీ. అంత మాదయగారి మల్లనయు రామ
రాజభూషణు డయ్యలరాజు రామ
భద్రుడున్ రామకృష్ణ ధీవరుడునైరి
రాయలకు నష్టదిగ్గజ ప్రథితకవులు. 841

సీ. మనుచరిత్రము వ్రాసి మాన్యతన్ నెలకొల్పె
నలసానిపెద్దనాహ్వాయబుధుండు
వరపారిజాతాపహరణంబు లిఖియించె
నందితిమ్మన రసజ్ఞ ప్రవరుడు
అల పాండురంగ మామాత్మ్యంబు లిఖియించి
రామకృష్ణుడు కృతార్థత గడించె
బహుళార్థరాఘవపాండవీయము వ్రాసి
పింగళి సూరన్న వినుతికెక్కె.

గీ. కవి నుతాముక్తమాల్యదా కావ్యరాజ
మాంధ్ర భోజాంకితుండు వ్రాయంగనయ్యె
సుమతి రాయలు బహుకావ్యసుమము లాంధ్ర
వాక్సుమంగలికై సమర్పణముసేసె. 842

చ. స్తుతమతులైన సత్కవుల సూక్తులకుం జెవి యొగ్గి ప్రౌఢ పం
డిత విసరత్సభాస్థలుల నిండు మనంబున నాలకించి సం
ధిత రచనావిలాసముల దీప్తికి సంతసమందుచున్ బహూ
కృతు లొనరించి సత్కవివరేణ్య దరిద్రతమాపె నీవిచే. 843

చ. జనవరు డల్లసాని కులజాతుఁడు పెద్దన వ్రాసినట్టి యా
మనుచరితాఖ్య కావ్యకుసుమమ్మును నొఁదలఁదాల్చి పెద్దలం
దిన శుభలీలఁదత్కృతిపతిత్వముగైకొని కైతతాత పె
ద్దనకుఁబురోత్సవాదుల విధానమునఙ్ బొసగెఙ్ బ్రమోదమున్. 844

చ. మదగజరాజుపైఁదనరి క్ష్మాదయితుండు విహారమున్ సుఖా
స్పద విధిఁజేసి క్రుమ్మరెడు పట్టునఁబెద్దన సత్కవీశ్వరుం
డెదురయినన్ ముదంబునఁ గరీంద్రము డిగ్గి గరంబుసాచి యా
మదకరి నెక్కఁజేసిఁ పెరిమమ్మున మన్ననచేసె నక్కవిఙ్. 845

ఉ. కోరినయంతమాత్రమునఁ గోకటముఖ్య తతాగ్రహారముల్
పేరిమితోడ నిచ్చె సుకవి ప్రవరుల్ కొనియాడ మేల్మి బం
గారపు గండపెండెరము గాలదగిల్చి గడించె ధన్యతన్
ధారుణి రాయలేలఁగవితాసతిగాంచె ననంత భోగముల్. 846

చ. అనుదినమందు రాయలు విహారము సేయఁగఁ బోయిరాగఁ బె
ద్దన యెదురైన నాంధ్రకవితార్వ పితామహ యల్లసాని పె
ద్దనకవిచంద్రయంచుఁ గరుణార్ద్రమనంబునఁ బిల్చి సేమమా
యని మునుబ్రశ్నసేసెఁగవియందు నృపాలున కెంతప్రేమయో. 847

చ. మనుచరితాఖ్య కావ్య కుసుమంబును దాగ్రహియించువేళఁ బె
ద్దన పురమేగగా జయజయధ్వను లుప్పతిలంగఁబల్లకిన్
దనకరపంకజంబున నుదారమతిన్ బయికెత్తి యాంధ్రవా
గ్ఘన కవితాలతాంగికగు గౌరవవైఖరిఁ జూపె భూమికిన్. 848

మ. పటుసాహిత్య విశారదుల్ ప్రవిమలవ్యాహార షడ్దర్శినీ
పటలాధార వివాదదక్షులు మహీపాలో త్తమాస్థాన సం
ఘటితానల్ప సభాంతరాళపదముల్ గైసేసి చర్చామయా
ర్భటులఙ్ జేయఁగ నాలకించి విభుడున్ రాజిల్లె విజ్ఞానియై. 849

సీ. శబ్ద సాధుత్వ విచారంబు బైకొన్నఁ
బ్రాజ్ఞప్రయోగాల ఫణితిఁజూపె
న్యాయశాస్త్ర ప్రసిద్ధాంశ వివాదాల
నుచితప్రమాణంబు లొసఁగనయ్యె

వేదాంత విద్యావివాదంబు లుదయింప
వ్యాసోక్త భావాల బయలుపెట్టె
సమయార్థ రసవత్ప్రసక్తి చర్చలురాగ
లౌకిక ప్రభల వెల్లడియొనర్చె.

గీ. సరసకావ్యార్థ సదసద్విచారమందు
వాదివిద్వాంసులఁ మధ్యవర్తియగుచు
స్వయముగాఁ దీర్పులఁ జెప్పి శాంతిగూర్చె
అవని నేఁడేడు కృష్ణరాయలకు నీడు! 850

గీ. సరసకవితాభివర్ధన సరణిగాక
చిత్రలేఖన విద్యా ప్రసిద్ధజనుల
కుచితరీతులఁ బ్రోత్సాహ మొసఁగనయ్యె
నాఁటి వృత్తంబు నిలువ, నీనాటివఱకు. 851

మ. సమయజ్ఞుండును రాజ్యతంత్ర విదుఁడౌ క్ష్మాపాలవర్యుండు శ
త్రుమహీనాథుల దండయాత్రలకు నెందుఁ సందుగానీక దు
ర్గము ప్రాకారము సత్వసంయుతము గాగఁజేసి, దూరస్థ దు
ర్గములన్ సర్వపురంబులన్ సుదృఢముల్ గావించె శ్రద్ధాళువై. 852

గీ. విజయయాత్రా విహారియై వెలయువేళ
నైన శిల్పకళాశక్తి నాత్మనుంచె
శిల్పులన్ దూరముననుండి చేరఁబిల్చి
చిత్ర శిల్పమ్ములఁ గూర్పఁజేసె నృపుడు. 853

సీ. విజయనగరమునఁ విఠ్ఠలాలయమునఁ
బ్రథిత శిల్పముఁ జక్కపఱుపఁ జేసె
మాన్య హజారు రామస్వామి కోవెలన్
దగు చెక్కడమ్ముల తావుఁ జేసె

దివ్య పంపావతీ దేవాలయమునకు
        స్థాపించె శిల్పాల గోపురమ్ము
ధీరోగ్ర నరసింహదేవు విగ్రహమును
        బ్రౌఢ శిల్పంబు తావలముఁజేసె.

గీ. మంజులారామముల సభామంటపముల
హర్మ్య రాజీవిరాజి రత్నాపణములఁ
జాలఁ దీర్పించి శిల్పకలాలయముగ
రాయలలరించెఁ దన దివ్యరాజధాని. 854

మ. పలుదేశంబులనుండి చిత్రరచనాపారీణులన్ జేర్చి మం
జుల చిత్రమ్ముల వ్రాయ నానతిడి తత్ శోభావిలాసమ్ముల
ర్మిలి వీక్షించియుఁ బారితోషికము లర్పింపన్ బయిన్ బూనె స్వ
స్థలమం దొప్పఁగఁ జేసె శిల్పరచనాసంవాస సౌధంబులన్. 855

మ. జనసందోహము పోషణార్థమునకై సంతాపమున్ జెందబో
వని చందమ్మున వృత్తికల్పనము సంభావించి దేశార్థ్వ రీ
తిని సేద్యాభ్యుచితావకాశములనుఁ దీర్పించె భద్రాప్రవా
హినికిఁ సేతు నిరూపణంబు సలిపెఁ సృష్టించెఁ గుల్యావళిఁ. 856

గీ. వారిలోపమ్మునఁ ఫలాభావమైన
పదము లేకుండ నీరంబు బాఱఁజేసె
ధరణి సస్యానుకూలమౌ సరణిఁజేసె
కొదువలేకొప్పె జనులకు బ్రదుకుతెరువు. 857

చ. పసుపు ఫలించు తోటలును బాయక యిక్షువు మించు క్షేత్రముల్
పెసలును నాఢకంబులును విస్తృతతూల వివర్ధిరంగముల్
కసరునఁబండఁ జేయుటకు గా సదుపాయము దీర్చెఁగర్షక
ప్రసరము భాగ్యభోగ్యముల వర్ధిలఁజేసెఁ గృపాంతరంగుడై. 858

మ. తన రాజ్యంబునఁ గృష్ణరాయలు పదార్థవ్రాతముఁ నౌకలన్
వనధిఁ యానముసేయు వర్తకులకున్ స్వాయత్తముం జేసి పెం
పున వాణిజ్యము సాగఁజేసె నటులఁ భూర్యర్థ సందోహ మొ
య్యన గావింప వణిక్చయంబుఁ నిజకోశాగారముల్ వర్ధిలెన్. 859

మ. ధిషణావారిధి కృష్ణరాయల మహాతేజంబు వీక్షించు పె
న్మిషచేతన్ బరదేశభాగ నిచయోన్మీల ద్రమాదేవి పెన్
గృషిచే రాయల కోశసద్మముల నంఘ్రిన్‌బెట్టి రాడ్వల్లభా
శిషముల్ బొందుచుఁ దద్రమాప్రకటిత స్నేహంబు గావించెడున్. 860

మ. నగరస్థాపణ వీథికాంచిత సువర్ణవ్రాత ముత్తుంగ మై
గగనారామ విహారలోల సురభోగ స్త్రీజనాహ్వాన మొ
ప్పగఁ గావింపఁగఁ గేళికావిహరణంబుల్ మావి యేతెంచి, కాం
చఁగ హేమాచల శంకపైఁగొనిరి పల్సారుల్ తదబ్జాననల్. 861

మ. పరికింపన్ నవ కృష్ణరాయ నగరీ ప్రాంతస్థ ముక్తాఫలో
త్కరముద్యత్కలధౌత భూధరమతిన్ గల్పింప సంభ్రాంత యై
హరనారీమణి డాసి క్రమ్మఱ విరూపాక్షాలయంబందు సం
స్మరణీయంబగు తేజముఁ నిలిపి యిచ్చఁ జేరెఁగైలాసముఁ. 862

మ. ఇరుపార్శ్వంబుల సౌధరాజములలో నేపారు నత్యంత సుం
దర రత్నాపణజాలమం దరుగు, కృష్ణక్షోణిభృద్వాహన
ద్విరదోత్తంసము సౌధభాసిత వణిగ్ ధీరాళి యందించు బం
ధురరత్నాళిఁ కరాగ్రమందుఁగొని తద్భూజాని కందించెడున్. 863

ఉ. క్షీరములేని గోవు, తిని సేద్యము సేయని యుక్షరాజు భ
ద్రారమణీయనీరముల ధన్యతఁదేలని పిల్లకాల్వలుఁ
ధీరతపస్వికిఁ శ్రమముదీర్పని ప్రస్తర గహ్వరంబు నె
వ్వారును గానరైరి గద! బాపురె రాయల రాజ్యసీమలోఁ. 864

మ. గిరిజానాథుడు జాహ్నవీ జనని రక్తిఁ శీర్షమందుంచి యి
ప్పురి కాహ్వానముసేయు ఁటేనికి వరంబున్ గూర్చు నూహన్ మనో
హర గంగాంబకుఁ దుంగభద్రయను నాఖ్యన్ గూర్చి శంభుండు పెన్
హరు వొప్పన్ బురిపజ్జ జేరెను విరూపాక్ష స్వరూపంబునన్. 865

మ. మదమత్తారి శిరోవికృంతనవిధామందప్రభావాఢ్యుఁబా
రద సంచార సమర్థబుద్ధి ఘనతారాజత్ ప్రభాభాసురున్
బదియైదబ్దశతంబు లర్వదియు నాపై నాలుగేండ్లేగంఁగా
ముది శార్దూలము రాయలన్ గదిసె నేపున్ మాపెఁదద్ధాటికిన్. 866

మ. తన యారేండ్ల కుమారవల్లభునిఁ దత్సామ్రాజ్య పట్టాభిషి
క్తుని గావించుచుఁదాఁ బ్రధాన సచివోద్యోగంబునన్ నిల్చి పా
లనభారంబును బైనఁబూనె సుజనాహ్లాదంబుగాన్ రాజ్యతం
త్ర నిధానుండగు సాళ్వతిమ్మరుసు తత్కర్తవ్యముల్ సెప్పఁగన్. 867

క. ఎనిమిది మాసంబుల ద
న్కను సామ్రాజ్యాభిషేక గణ్యోత్సవముల్
పొనరింపించెను జనపతి
యనుపమ విఖ్యాతిసుతున కలవడు లీలఁ. 868

క. తిమ్మరుసు కోడుపడు భా
వమ్మును వచియింప రాజ్యపదవిన్ సామో
దమ్ముగఁ దన సుతు నునిచెన్
సమ్మతిరాట్సుతున కతఁడు సాయమొనర్చెన్. 869

మ. చిరకాలం బిటు పోకముందె పెనుగాసిఁ జిన్నిఁటేఁడొందె భీ
కర జాడ్యంబు నతండు తద్భయదరోగస్ఫీత బాధోద్ధతిన్
దొఱఁగెన్ గాయముఁ గృష్ణరాయలకు దుర్దుఃఖంబు వాటిల్లె ను
ర్వర భూపాలురనేని వీడవుగదా ప్రాక్కర్మజాయాసముల్. 870

మ. అనిచేఁ గ్రమ్మఱ రాయచూరుగొన రా నాదిల్ షహాదోర్మదం
బునణంచెన్; యవనక్షమాక్రమణకై భూజానితాఁ బోర్చుగీస్
జనమైత్రిన్ గొని షట్ శతాశ్వములుగా సైన్యంబునుంబెంచె నం
తనె బెల్గామును నిన్ను గొందునని వార్తన్ బంపెఁద ద్వైరికిన్. 871

శా. ఆలోనన్ జలికాలమాగతముగా నాయోధనోద్యోగమం
దాలస్యంబు ఘటించె రాయల మెయిన్ వ్యాధ్యుద్భవంబయ్యె రా
ట్ఫాలవ్యాలిఖితాయువేకడచె సంప్రాప్యావసానంబు రాణ్
మౌళిన్ గొఁగిటఁ జేర్చె నవ్విజయసామ్రాజ్యంబు కన్నీరిడెన్. 872

ఉ. "భోరున యాచకప్రతతి భూరి విపద్దశనొందుచుండఁగా
నారయ శాలివాహన శకాబ్దము లద్రియుగాబ్ధి సోములన్
దారణ వత్సరంబున నిదాఘదినంబున జ్యేష్ఠ శుద్ధ ష
ష్ఠీ రవివాసరంబున నృసింహుని కృష్ణుడు జేరె స్వర్గమున్
ద్వారకనున్న కృష్ణ డవతారసమా ప్తిని జెందు కైవడిన్". 873

సీ. శిల్పవిస్ఫూర్తి వైచిత్ర్యంబుఁ జూపించు
ద్వారబంధముల వైభవముఁజూచి
ప్రస్తరఖండ శిల్ప న్యస్తసప్రాణ
సదృశుడౌ గురు గణేశ్వరునిఁజూచి
కంబకంబంబునన్ గణ్యశిల్పంబుతో
నమరు శిలా మంటపములఁజూచి
సత్కవీశాశీర్వచస్సుచే మాయని
రాట్సభాలయముల ఊాలజూచి.

గీ. పాడుబడియును నేడు జీవములగల్గి
నట్లు గనవచ్చు బలువిగ్రహములఁజూచి
పెద్దపెట్టునఁ గన్నీరు నిడని దేశ
భక్తుడగు నెందు? నాంధ్రప్రపంచమందు. 874

మ. అకటా దివ్య తపః ప్రభావ నిధి విద్యారణ్యు(డేమయ్యెనో
సకల ప్రాభవసార కారణ మహాసౌవర్ణ సంవృష్టి ధా
టికిని, మ్మ్రేపదమయ్యెనో ద్విరద ధాటీఘోటకోచ్చాలి తా
శ్విక సేనానముపార్జితార్థ్వ విజయ శ్రీధామ మెందేగెనో? 875

మ. చకితంబయ్యెడి( జిత్త మశ్రువులు పెల్చన్ గారు నానాటి రా
జ్యకలావైభవ శిష్ట చిహ్నముల పజ్జన్నిల్చి వీక్షించినన్
వికలంబైనటు లెల్ల(దోచునది దోర్వీర్యప్రదీ ప్తారివా
రక సామ్రాజ్యవిధాయి రాయల భుజారంభం బెటన్ దాగెనో? 876

గీ. సకలభాషానిలయముల సభలయందు
నూల్ల చారిత్రకారుల నోళ్ళయందు
సత్కవీశ్వర వదనాంబుజముల నే(డు
నర్తనముసేయు రాయల కీర్తిలక్ష్మి. 877

పృథ్వీ. హరిప్రియసతీవృతా! అడుసుమల్లి వంశోద్భవా!
నిరంతర, సరద్దయా నిబిడలక్ష్మమాంబాసుతా!
కరార్చిత రమేశ, వేంకటసుధీర ధన్యాత్మజా
స్మరప్రియసతీకలా మహిత భాస్కరాత్మేశ్వరా! 878

ఇది

శ్రీమదుభయ భాషాకవితాప్రవీణ, సహస్రావధాన చతురాసవ, సహస్రా వధాన పంచానన, పంచ సహస్రావధానీత్యాద్యనేక బిరుదాంకిత, జంధ్యాలవంశ పయఃపారావార రాకాసుధాకర సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రణీతంబైన సాలంకార కృష్ణదేవరాయలను ప్రబంధంబున షష్ఠాశ్వాసము సంపూర్ణము.

# అలంకార సూచిక


| పద్య సంఖ్య | అలంకారము |
|---|---|
| 9 | యథాసంఖ్యము |
| 12 | భావికాలంకారము |
| 26 | ప్రతివస్తూపమ |
| 27 | ఉపమే యోపమ |
| 48 | హేత్వలంకారము |
| 61 | రూపకము |
| 62 | ప్రతీపము |
| 63 | ఉత్ప్రేక్ష |
| 74 | సముచ్చయము |
| 75 | భ్రాంతిమదలంకారము |
| 77 | పరిణామము |
| 80 | స్మరణము |
| 81 | సందేహము |
| 85 | అర్థాంతరన్యాసము |
| 90 | సారాలంకారము |
| 94 | సహోక్తి |
| 99 | సమాలంకారము |
| 100 | దృష్టాంతము |
| 116 | వికల్పాలంకారము |
| 118 | అపహ్నుతి |
| 120 | విషమాలంకారము |
| 124 | పరిసంఖ్య |
| 130 | అన్యోన్యము |
| 132 | అతద్గుణము |
| 133 | ప్రస్తుతాంకురము |
| 134 | అప్రస్తుత ప్రశంస |
| 143 | ధీరశాంతత్వము |
| 152 | దృష్టాంతరము |
| 153 | వినోక్తి |
| 154 | ప్రతివస్తూపమ |
| 155 | దృష్టాంతరము |
| 163 | సముచ్ఛయము |
| 164 | పర్యాయోక్తము |
| 166 | ధీరాదాత్తత్వము |
| 180 | అనుగుణము |
| 181 | ప్రౌఢోక్తి |
| 187 | ప్రహర్షణము |
| 222 | అనుమానము |
| 237 | పర్యాయము |
| 240 | నిదర్శనము |
| 241 | అప్రస్తుత ప్రశంస |
| 242 | వికల్పాలంకారము |
| 243 | మీలన వికల్పసంకరము |
| 245 | ఆక్షేపము |
| 246 | పరికరము |
| 247 | విచిత్రము |
| 247 | సంభావన |
| 248 | అత్యుక్తి |
| 250 | ఉపమాలంకారము |
| 252 | గూఢోక్తి |
| 254 | అర్థాంతరన్యాసము |
| 256 | కారకదీపకము |

257 దీపకము
258 సమాసోక్తి
267 వ్యాఘాతము
268 వ్యాజస్తుతి
269 పర్యాయోక్తము
274 రూపకము
275 శ్లేషాంగ ప్రత్యనీకము
316 ప్రతివస్తూపమ
336 అర్థాపత్తి
339 ఉదాత్తము
341 శ్లేషాలంకారము
351 అన్యోన్యాలంకారము
351 ప్రతివస్తూపమ
358 కారణమాల
360 ఉత్తరాలంకారము
369 సూక్ష్మాలంకారము
377 పరివృత్త్యలంకారము
379 అనుజ్ఞ
380 ఉల్లాసము
381 అవజ్ఞాలంకారము
386 సమాధ్యలంకారము
387 ప్రౌఢోక్తి
389 ప్రహర్షము
390 విషాదము
391 లేశాలంకారము
393 తిరస్కృతి
395 తద్గుణము
397 అతద్గుణము
400 పర్యాయము
401 పరిణామము
414 లలితము
417 నిదర్శనము
424 అసంభవాలంకారము
426 ఉపమాలంకారము
429 ఉపమాలంకారము
430 అనన్వయము
432 స్మరణము
436 ఉపమ
459 అధికాలంకారము
461 శ్లేషాన్యోన్యసంకరము
462 సమాసోక్తి
464 వ్యతిరేకము
468 దీపకము
477 సామాన్యము
484 వ్యాజోక్తి
485 విషమాలంకారము
495 సమాలంకారము
497 లోకోక్తి
499 సంభావన
507 విషమము
509 విరూపఘటన
510 విశేషాలంకారము
510 ముద్ర
511 ఆధారరహితాధేయము
516 అసంగతి
518 అర్థాంతరన్యాసము
523 అతిశయోక్తి
525 సందేహాలంకారము
536 ఉదాహరణము
540 ఛేకోక్తి

541 అసమాలంకారము
545 మిథ్యాధ్యవసితము
555 అనుమానాలంకారము
585 అల్పాలంకారము
590 అర్థాంతరన్యాసము
591 ప్రేయోలంకారము
594 దీపకము
596 సమాసోక్తి
605 స్వభావోక్తి
608 ఉదాహరణము
622 అప్రకృతశ్లేష
623 గూఢోక్తి
630 కావ్యలింగము
634 హేత్వలంకారము
664 లోకోక్తి
674-676 ఉల్లేఖాలంకారము
678 వ్యతిరేకము
679 కావ్యలింగము
681 తుల్యయోగిత
682 రూపకము
683 అత్యుక్తి
684 ఉత్ప్రేక్ష
686 ఉత్ప్రేక్ష
692 సారాలంకారము
702 కారణమాల
706 పరివృత్తి
707 రూపకము
712 ప్రత్యనీకము
717 విధ్యలంకారము
720 పర్యాయోక్తము
721 ఉన్మీలితము
722 ఆత్మతుష్టిప్రమాణము
725 అర్థాంతరన్యాసము
732 పరికరాంకురము
734 ఐతిహ్యము
743 వికల్పము
748 భావసంధి
755 నిరుక్తి
759 సహోక్తి
762 భావశబలత
770 రసాభాసము
771 ప్రస్తుతాంకురము
772 ఊర్జస్వి
773 భావోదయాలంకారము
779 ప్రతిషేధము
787 అనుపలబ్ధి
788 సమాహితము
789 స్మృత్యలంకారము
790 శ్రుత్యలంకారము
793 అంగాంగీభావసంకరము
796 యుక్తి
807 శబ్దప్రమాణము
808 వివృతోక్తి
812 సంసృష్టి
820 సంభావనాసందేహాలంకారము
823 ఏకవాచకానుప్రవేశకము
824 సంభావనాప్రస్తుతాంకుర సంకరము
830 ఉత్ప్రేక్ష
836 లోకోక్తి